www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శాస్త్రోక్తంగా మహా కుంభాభిషేకం




3 శ్రీశైలం శివాజీ గోపురంపై శాస్త్రోక్తంగా సాగిన కలశ ప్రతిష్ఠ

గురువారం | 22-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 308 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి ఉ. 1.23 తదుపరి చతుర్దశి; నక్షత్రం: పుష్యమి సా. 4.44 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ. 10.34-11.20, మ. 3.11-3.57; అమృతఘడియలు: ఉ. 9.41-11.27; రాహుకాలం: మ. 1.30-3.00 వరకు; సూర్యోదయం: 6.43; సూర్యాస్తమయం: 6.16 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

డీఎస్సీ.. జగన్నాటకం!

అన్నీ తెలిసీ..

ఎస్జీటీ పోస్టుల అర్హతపై తికమక

బీఈడీకి అర్హత లేదని జనవరిలో జీవో

మళ్లీ అర్హత ఉందని ఈ నెలలో మార్పు



ఉపాధ్యాయ పోస్టుల(డీఎస్సీ) భర్తీలో వైసీపీ సర్కారు జగన్నాటకం బయటపడింది. ఇప్పటికే ఐదేళ్లపాటు ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం.. ఎన్నికల ముందు కూడా అయిష్టంగానే డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేసింది. అయితే.. డీఎస్సీని వీలైనంత మేర ఆలస్యం చేసేలా ప్రభుత్వం నెలకో నిర్ణయం మార్చుకుంటోంది. ఏకంగా సుప్రీంకోర్టు తీర్పుకే వక్రభాష్యం చెప్పడం విస్మయానికి గురిచేసింది.

సుప్రీంకోర్టు తీర్పునకు వక్రభాష్యం

కోర్టులో కేసు వేసిన డీఎడ్ అభ్యర్థులు

ఇప్పుడు మరోసారి సర్కారు యూటర్న్

డీఎస్సీ జాప్యానికే ఇలా చేస్తోందా?

ఏకాగ్రత కోల్పోతున్న అభ్యర్థులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులతో జగన్ సర్కారు ఆడుకుంటోంది. డీఎస్సీ పోస్టుల భర్తీలో కీలకమైన సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) పోస్టులకు బీఈడీ అభ్యర్థులను అర్హులుగా

మిగతా 3వ పేజీలో...

బీఈడీలను అనుమతించం!

హైకోర్టుకు సర్కారు వెల్లడి.. ఆ నిబంధనపై స్టే

టెట్, టీఆర్టీల మధ్య నెల రోజులైనా వ్యవధి అవసరం: హైకోర్టు

ఎన్నికలు వచ్చేస్తున్నాయి.. అలా ఇవ్వలేం

ప్రభుత్వ వాదన.. నేడు కోర్టు నిర్ణయం

కలెక్టర్ల 'మూకుమ్మడి' అబద్ధాలు!

ఒకే అబద్ధాన్ని అందరూ ఒకే విధంగా చెబితే? అది 'అబద్ధం' అని ఇట్టే తెలిసిపోతుంది. ఇసుక అక్రమ తవ్వకాల విషయంలో ఏకంగా 25 జిల్లాల కలెక్టర్లు మూకుమ్మడిగా ఒకే 'మాట'పై నిలబడ్డారు. 'మా జిల్లాలో ఎక్కడా ఇసుక అక్రమ తవ్వకాలు జరగడంలేదు' అని అందరూ ఒకే రకమైన నివేదిక సమర్పించారు. ఎన్జీటీ ఆదేశాల మేరకు ఇసుక రీచ్‌లను తనిఖీలు చేశామని, ఎక్కడా యంత్రాలు కానీ, తవ్వకాలు కానీ లేవని వారు తమ నివేదికలో చెప్పడం గమనార్హం. తమ నివేదికలతోపాటు క్షేత్ర పర్యటనకు సంబంధించిన ఫొటోలు కూడా సమర్పించారు. అయితే, అన్ని జిల్లాల కలెక్టర్లు ఒకే రకమైన (ఫార్మాట్) నివేదికలు ఎలా సమర్పిస్తారని ఎన్జీటీ ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కలెక్టర్లు ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్న రీచ్‌లకు కాకుండా, ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉత్తుత్తి తనిఖీలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

ఎన్జీటీ సాక్షిగా కఠోర వాస్తవాలు

నలభై రీచ్‌లలో యంత్రాలను ఉపయోగించకుండా మాత్రమే ఇసుక తవ్వాలి! కానీ... ఏకంగా 500 చోట్ల జేసీబీలు పెట్టి మరీ అడ్డగోలుగా, యథేచ్ఛగా ఇసుక తవ్వేశారు!

పర్యావరణ అనుమతులు లేకుండానే... 'మా రాజ్యం... మా ఇసుక' అన్నట్లుగా నదీ గర్భాలను సైతం గుల్ల చేసేస్తున్నారు.

... ఇవి ఎవరో చెప్పిన మాటలు కావు! జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాల మేరకు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖకు చెందిన కమిటీ రాష్ట్రంలో పర్యటించి, పరిశీలించి నిగ్గు తేల్చిన నిజాలు! ఈ నివేదికలోని అంశాలతో ఎన్జీటీ ఏకీభవించింది. ఇవే అంశాలను సుప్రీంకోర్టుకు నివేదించాలని ఆదేశించింది!



ఇసుకాసురుల ఇష్టారాజ్యం!

ఇప్పుడేమంటారు?

ఏపీలో భారీగా అక్రమ తవ్వకాలు నిజం

కేంద్ర కమిటీ నివేదిక.. ఎన్జీటీ నిర్ధారణ

40 రీచ్‌ల్లో యంత్రాల్లేకుండా తవ్వుకోవాలి

కానీ.. 500 రీచ్‌లలో జేసీబీలతో తవ్వకం

ఒక్కసారికి 2 టన్నులు తీసే బకెట్‌లు

రాత్రింబవళ్లు యథేచ్ఛగా తవ్వకాలు

రోజూ 2000 టన్నుల చొప్పున తరలింపు

టన్ను రూ.475 చొప్పున అమ్మి సొమ్ము

పర్యావరణ, కాలుష్య అనుమతుల్లేవు

ఎన్జీటీకి కేంద్ర కమిటీ సంచలన నివేదిక

సుప్రీంకోర్టుకు అందించాలన్న ట్రైబ్యునల్

(న్యూఢిల్లీ/అమరావతి - ఆంధ్రజ్యోతి)

నదులు, వాగులు, వంకలు తేడా లేదు! రాత్రైనా, పగలైనా ఆగేది లేదు. నిర్విరామంగా, నిరాటంకంగా రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి! ఇది... కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ కమిటీ తేల్చిచెప్పిన నిజం. జగన్ సర్కారు తమ అస్మదీయ కంపెనీలకు ఇసుకను అడ్డగోలుగా దోచిపెట్టిన వైనాన్ని ఈ నివేదిక కళ్లకు కట్టినట్లుగా వివరించింది. దీనిని పరిశీలించిన ఎన్జీటీ సదరన్ బెంచ్... ఏపీలో భారీ ఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయనే నిర్ధారణకు వచ్చింది. ఇదే విషయం సుప్రీం కోర్టుకు నివేదించనుంది. దీనిపై సుప్రీం కోర్టే తుది నిర్ణయం తీసుకుంటుందని

మిగతా 11వ పేజీలో...

'ఆంధ్రజ్యోతి' కథనాలు.. అక్షరాలా నిజం

అస్మదీయ కంపెనీలకు ఇసుక కట్టబెట్టడం, జిల్లాల వారీగా ఇసుకను సొంత నేతలకు కట్టబెట్టి 'కప్పం' వసూలు చేయడం, పర్యావరణ అనుమతులతో సంబంధం లేకుండా ఇసుకను తవ్వడం... ఇలాంటి అడ్డగోలు వ్యవహారాలపై 'ఆంధ్రజ్యోతి' అనేక కథనాలు ప్రచురించింది. కేంద్ర కమిటీ నివేదిక, ఎన్జీటీ నిర్ధారణతో... ఆ కథనాలన్నీ అక్షరసత్యాలుగా రుజువయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2021 నుంచే ఇసుక అక్రమ మైనింగ్ జరుగుతోందని జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) నిర్ధారించింది. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ పద్ధతి ప్రకారం ఇసుక తవ్వకాలు జరిపించేందుకు అనేక చట్టాలు, నియమ నిబంధనలున్నా వాటికి పాతరేసి మరీ నదులను కొల్లగొడుతున్నారని తేల్చింది.

రామ.. దోపిడీ చూడతరమా!

గ్రావెల్‌లో ఎమ్మెల్యే వందల కోట్ల దోపిడీ

నియోజకవర్గంలో కొండలు, గుట్టలు మాయం

రియల్ ఎస్టేట్‌లోనూ వందల కోట్లు కుమ్ముడు

జగనన్న ఇళ్ల స్థలాల కొనుగోలులో 40 కోట్లు

అడ్డుకునేందుకు ప్రయత్నించిన కలెక్టర్ బదిలీ

మద్యం, పోస్టింగ్‌లు.. అన్నింటా వాటాలు

అవినీతిని ప్రశ్నించిన ప్రతిపక్షాలపై కేసులు

దాడులు, దౌర్జన్యాలు.. ఇళ్లు, దుకాణాలు ధ్వంసం

ఎమ్మెల్యే అరాచకానికి ఓ దళితుడి ఆత్మహత్య



నెల్లూరు జిల్లా నడిబొడ్డున అరాచక 'ప్రతాపం'

నెల్లూరు జిల్లాలోని ఆ నియోజకవర్గం మత్స్యసంపదకు దేశంలోనే పేరెన్నికగన్నది. ఎమ్మెల్యే స్వతహాగా సంపన్నుడే అయినా డబ్బు మీద ఆశ చావలేదు. అవినీతిలోనే కాదు అరాచకాల్లోనూ 'ప్రతాపం' చూపించడంలో ఆయనే ఫస్ట్. ఎదురు ప్రశ్నించిన వారిని, ప్రతిపక్ష పార్టీల సానుభూతిపరులను వెంటాడి వేధించడంలో ఆయనకు ఆయనే సాటి. ఎమ్మెల్యే మామూళ్ల బాగోతం గురించి జిల్లాలో ఎవరినడిగినా కథలు కథలుగా చెబుతారు. ఇంతటి అవినీతిపరుడిని ఇదివరకు ఎక్కడా చూడలేదంటారు.

(నెల్లూరు-ఆంధ్రజ్యోతి)

నెల్లూరు జిల్లాలో నైసర్గికంగా నడిబొడ్డున ఉన్న ఆ నియోజకవర్గానికి గతంలో ఎందరో గొప్ప నాయకులు ప్రాతినిధ్యం వహించారు. వారందరూ చేసిన మేళ్లను మింగేసేలా తయారయ్యారు ప్రస్తుత

మిగతా 12వ పేజీలో...



బుధవారం హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను పరామర్శిస్తున్న 'ఆంధ్రజ్యోతి' ఎండీ రాధాకృష్ణ

'చలో అనంత'పై నిర్బంధం

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడికి నిరసనల వెల్లువ

నేడు 'చలో'కు జిల్లాల నుంచి కదులుతున్న జర్నలిస్టులు

ఎక్కడికక్కడ అణచివేత.. స్టేషన్లకు తరలింపు

అనంతకు వెళ్లకుండా ముందస్తు అరెస్టులు, నోటీసులు

వెళ్లొద్దని ఇళ్లకెళ్లి నోటీసులు.. ఫోన్లలో హెచ్చరికలు

కొందరి ఇళ్ల వద్ద రోజంతా తిష్ఠ.. గృహ నిర్బంధం

కర్నూలు జిల్లాలో 'ఆంధ్రజ్యోతి'పై ఉక్కుపాదం

పలు మండలాలకు చెందిన రిపోర్టర్లు అదుపులోకి..



విలేకరులపై దాడులు సరికాదు

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం: వెంకయ్య

12



వేమిరెడ్డిని అభినందిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

వైసీపీకి వేమిరెడ్డి రాజీనామా

రాజ్యసభ సభ్యత్వానికి కూడా..

త్వరగా ఆమోదించాలని సీఎం జగన్‌కు లేఖ

వైసీపీ నుంచి నలుగురు ఎంపీలు అవుట్

అదే దారిలో మరో ఇద్దరు!

నెల్లూరు/అమరావతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీకి మరో షాక్ తగిలింది. ఆ పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. దీంతో ఇప్పటికి ఆ పార్టీ నుంచి బయటకు వచ్చిన ఎంపీల సంఖ్య నాలుగుకు చేరుకుంది. మరో ఇద్దరు కూడా గుడ్‌బై చెబుతారని విశ్వసనీయంగా తెలిసింది. వేమిరెడ్డి

మిగతా 11వ పేజీలో...

యుద్ధానికి 'సిద్ధం'

పొత్తులతో వస్తున్నాం.. అడ్డొచ్చేదెవరు: పవన్

రాష్ట్ర భవిష్యత్ ప్రధానం

ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలనివ్వను

జనసేన ఓట్లు టీడీపీకి మళ్లాలి

కులచిచ్చుతో లబ్ధికి జగన్ కుట్ర

కాపులు, క్షత్రియులు, శెట్టి బలిజలు, దళితులు కొట్లాడుకునేలా ఎత్తులు

అందరూ అప్రమత్తంగా ఉండాలి

భీమవరంలో జనసైనికులతో సమీక్ష

పవన్‌ను కలిసిన టీడీపీ ఇన్‌చార్జ్‌లు

నేడు టీడీపీ-జనసేన సమన్వయ భేటీ

బటన్ నొక్కుడుతో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోతోంది. జగన్ ఆస్తులు పెరుగుతున్నాయి తప్ప సంపద సృష్టిలేదు. బంధువులనే పట్టించుకోని జగన్ బటన్ నొక్కుడు ద్వారా ప్రజలకు మేలు చేస్తున్నాడంటే ఎలా నమ్మేది?

- పవన్ కల్యాణ్



భీమవరంలో పవన్‌కు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

భీమవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 'నన్ను ఒంటరివాడిని చేశారంటూ సీఎం జగన్ ఇటీవల ఏడుస్తున్నారు. నువ్వు ఒంటరివాడివా..? సిద్ధం సిద్ధమంటూ చెవులు చిల్లులు పడేలా అరుస్తున్నావ్... నువ్వు సిద్ధం అంటే మేమూ యుద్ధానికి సిద్ధం' అని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు. బుధవారం భీమవరంలో పశ్చిమ గోదావరి జిల్లా జనసేన శ్రేణులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ కోసం పొత్తులతో కలసి వస్తున్నాం.. ఇక అడ్డొచ్చేదెవరని ప్రశ్నించారు. రాష్ట్రంలో టీడీపీ-జనసేన కూటమికి విజయం అంటూ బెట్టింగులు కూడా నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్ ఇప్పుడు ముఖ్యమని.. త్యాగాలకు జనసైనికులు సిద్ధంగా ఉండాలని

మిగతా 11వ పేజీలో...




అదానీ అంటే అంతే!

ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే 'సెకీ'కి ఏపీఈఆర్‌సీ గ్రీన్‌సిగ్నల్

ఏటా రూ.250 కోట్ల కమీషన్‌కు అంగీకారం

అదానీ నుంచి 7000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు గతంలో ప్రభుత్వం ఒప్పందం

యూనిట్ రూ.2.49 చొప్పున 25 ఏళ్ల పాటు అదనపు భారమని నిపుణుల హెచ్చరిక

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు సమీపిస్తున్నా అదానీకి ప్రభుత్వ నిధులను కట్టబెట్టే ప్రక్రియను ముఖ్యమంత్రి జగన్ ఆపడం లేదు. దీర్ఘకాల విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడం సరికాదని ప్రతిపక్షనేతగా అభ్యంతరం వ్యక్తం చేసిన

మిగతా 2వ పేజీలో...

పోలీసు కాల్పుల్లో రైతు మృతి!



బుల్లెట్ తగిలి 21 ఏళ్ల యువ రైతు దుర్మరణం

రబ్బరు బుల్లెటా? అసలు బుల్లెటా? అన్నదానిపై అస్పష్టత

పంజాబ్-హరియాణా సరిహద్దులో రైతులు, పోలీసుల మధ్య ఘర్షణ

ఇద్దరు రైతులకు, 12 మంది పోలీసులకు గాయాలు

ఉద్యమానికి రెండు రోజుల విరామం ప్రకటించిన రైతు నేతలు

చర్చలకు రావలసిందిగా మరోసారి కేంద్రం పిలుపు

2



న్యాయ కోవిదుడు నారిమన్ కన్నుమూత

70 ఏళ్లకు పైగా న్యాయవాద వృత్తికే అంకితం.. అహరహం లౌకికవాదం కోసం కృషి

హక్కుల పరిరక్షణ కోసం పోరాటం.. చరిత్రాత్మక తీర్పులు వచ్చిన కేసుల్లో వాదనలు

మరణానికి ముందు రోజు రాత్రి రాజ్యాంగ ధర్మాసనానికి పత్రాల సమర్పణలో నిమగ్నం

పద్మభూషణ్, పద్మవిభూషణ్ అవార్డులు.. మోదీ, ఖర్గే, రాహుల్ సంతాపం

2

ZEEMEDIA

'జీ'లో 2,000 కోట్ల నిధుల మళ్లింపు

సెబీ దర్యాప్తులో బయటపడిన వ్యవహారం

10

ఇంగ్లండ్ పాఠశాలల్లో మొబైల్ ఫోన్లపై నిషేధం

యూకే ప్రభుత్వ నిర్ణయం

ఇప్పటికే ఫ్రాన్స్, ఇటలీ, పోర్చుగల్ వంటి దేశాల బడుల్లో ఆంక్షలు

2

డీవోపీ నియామకం చెల్లదు

- వైసీపీ నేత సుదర్శన్‌రెడ్డి నియామక ఉత్తర్వులు రద్దు
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ
- తాత్కాలిక డీవోపీగా సుదర్శన్‌రెడ్డి: ధర్మాసనం

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్(డీవోపీ)గా వైసీపీ నేత జల్లా సుదర్శన్‌రెడ్డిని నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సుదర్శన రెడ్డి నియామకం చట్టవిరుద్ధమని ప్రకటిస్తూ నియామక ఉత్తర్వులను ధర్మాసనం రద్దు చేసిం ది. చట్ట నిబంధనలను అనుసరించి ప్రతిభ ఆధారంగా 4నెల ల్లో డీవోపీ పోస్టును భర్తీ చేయాలని తేల్చిచెప్పింది. హైకోర్టు సీజే సమ్మతితో నియామకం జరుగుతుందనే కారణంతో సా..దారణ పద్ధతుల్లో నిర్వహించే మౌఖిక, రాత పరీక్ష నిర్వహించాల్సిన అవసరం లేదని భావించకూడదని తెలిపింది. ముం దు ఎంపిక ప్రక్రియను సిద్ధం చేయాలని ఆదేశించింది. అనంతరం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమ్మతితో కొత్త ప్రాసిక్యూషన్ డైరెక్టర్‌ను నియమించాలని హోంశాఖ ముఖ్యకార్యదర్శికి సూచించింది. నాలుగు నెలల్లోగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశిస్తూ... అప్పటివరకు సుదర్శన్‌రెడ్డిని తాత్కాలిక డీవోపీగా కొనసాగించేందుకు ధర్మాసనం వెసులుబాటు ఇచ్చింది. నిర్దేశిత గడువులోగా ప్రక్రియ పూర్తి చేయడంలో విఫలమైతే సుదర్శన్‌రెడ్డిని డీవోపీగా కొనసాగించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. తనను డీవోపీగా నియమించేలా ఆదేశాలు ఇవ్వాలన్న పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం తీర్పు ఇచ్చింది. డీవోపీగా జల్లా సుదర్శన్‌రెడ్డిని నియమిస్తూ గతేడాది మే 22న హోంశాఖ ముఖ్యకార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బి. రామకోటేశ్వరరావు పిటిషన్ దాఖలు చేశారు. హోంశాఖ జారీ చేసిన జీవో 552ను రద్దు చేయడంతో పాటు పదోన్నతి పై తనను డీవోపీగా నియమించేలా ఆదేశించాలని కోరారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది రవీంద్రనాథ్ రెడ్డి వాదనలు వినిపించారు. అధికార వైసీపీ తరఫున సుదర్శన్‌రెడ్డి రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. ఎంపీపీగా ఎన్నికయ్యారని, అన్నమయ్య జిల్లా, గాలివీడు మండల పరిషత్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆ పదవికి రాజీనామా చేసి డీవోపీగా బాధ్యతలు చేపట్టారని, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా డీవోపీ నియమకం జరిగిందని విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్(ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు.

3న కేంద్ర కేబినెట్ సమావేశం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కీలక భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన మార్చి 3వ తేదీన కేంద్ర కేబినెట్ సమావేశం కానుంది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు కొద్ది రోజులు ముందు జరగనున్న ఈ భేటీలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ పథకాల అమలు, ప్రభుత్వ విధానాలు, ఇతర ముఖ్యమైన అంశాలపై కేంద్ర మంత్రులతో ప్రధాని సమీక్షిస్తారని అధికార వర్గాలు వెల్లడించాయి.

లోకం తీరు



అదానీ అంటే అంతే!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన.. అధికారంలోకి వచ్చాక అదే పనిచేశారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)ని అడ్డుపెట్టుకుని అదానీ నుంచి 7000 మెగావాట్ల విద్యుత్‌ను యూనిట్‌కు రూ.2.49 చొప్పున కొనుగోలు చేసేందుకు ఒప్పందాన్ని చేసుకున్నారు. సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను బహిర్గతం చేయాలని ప్రజా సంఘాలు, సీపీఎం, విద్యుత్ రంగ నిపుణులు గడచిన రెండేళ్లుగా డిమాండ్ చేస్తున్నా రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) పట్టించుకోలేదు. ప్రజాభిప్రాయాన్ని సేకరించకుండానే సెకీ ఒప్పందానికి ఏపీఈఆర్‌సీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తాజాగా సెకీకి యూనిట్‌కు ఏడు పైసల చొప్పున కమీషన్ చెల్లించేందుకు ఇంధన శాఖ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో ఈ ఒప్పందాలను బహిర్గతం చేయాలని సీపీఎం డిమాండ్ చేస్తోంది. ఈ ఒప్పందం వల్ల ప్రభుత్వం, ప్రజలపై ఏటా అదనపు భారం పడుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజస్థాన్ నుంచి విద్యుత్ రాష్ట్రానికి రావాలంటే పవర్ గ్రిడ్ కార్పొరేషన్ లిమిటెడ్ (పీజీసీఎల్)కు వీలింగ్ చార్జీలను అదనంగా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించినప్పుడు.. ఇలాంటి వీలింగ్ చార్జీలు వర్తించవని రాష్ట్ర ఇంధన శాఖ 2021లో ఒప్పందం చేసుకునే సమయంలో స్పష్టం చేసింది. తాజాగా సెకీకి యూనిట్‌కు ఏడు పైసల చొప్పున కమీషన్ చెల్లించేందుకు ఆమోదం తెలిపింది. దీని విలువ ఏడాదికి రూ.250 కోట్ల దాకా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఒప్పందం మేరకు ఈ ఏడాది సెప్టెంబరు నాటికి 3000 మెగావాట్లు, వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికి మరో 3000 మెగావాట్లు, 2026 సెప్టెంబరు నాటికి 1000 మెగావాట్ల చొప్పున రాష్ట్రానికి సెకీ ద్వారా అదానీ సోలార్ విద్యుత్ రాజస్థాన్ నుంచి అందాల్సి ఉంది. డిస్కమ్‌లు, రాష్ట్ర ప్రభుత్వం, సెకీ 2021లో చేసుకున్న త్రిసభ్య ఒప్పందాన్ని 2021 నవంబరు 11వ తేదీన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆమోదించింది. ఈ ఒప్పందం వివరాలు బహిర్గతం చేయాలని విద్యుత్ రంగ నిపుణులు పట్టుబడుతూ వస్తున్నారు. ఏపీఈఆర్‌సీ బహిర్గతం చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఏటా 450 కోట్లు భారం

2021లో సెకీతో యూనిట్‌కు రూ.2.49కే కొనుగోలు ఒప్పందం చేసుకోవడమే కారుచౌక అంటూ ప్రభుత్వం చెబుతోంది. కానీ గత ఏడాది సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (సీఈఆర్‌సీ) సోలార్ విద్యుత్ యూనిట్ ధరను రూ.2.37 నుంచి రూ.2.38గా ధృవీకరించింది. అంటే.. రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న 7000 మెగావాట్ల విద్యుత్‌కు ఏటా దాదాపు రూ.450 కోట్లు అదనంగా చెల్లిస్తున్నట్లుగానే భావించాల్సి ఉంటుందని ఇంధన రంగ నిపుణులు చెబుతున్నారు. ఈ లెక్కన ఒప్పందం మేరకు 25 ఏళ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.11,250 కోట్లు అదనంగా చెల్లించాల్సి వస్తుందని చెబుతున్నారు.

ఒప్పందాలను బయటపెట్టాలి: సీపీఎం

అదానీ సంస్థ నుంచి కొనుగోలు చేస్తున్న సోలార్ విద్యుత్ ఒప్పందాలను బహిర్గతం చేయాలని ఏపీఈఆర్‌సీని సీపీఎం డిమాండ్ చేసింది. అదానీతో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని ప్రజాభిప్రాయ సేకరణకు ఉంచాలని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, సీనియర్ జర్నలిస్టు ఎం.వేణుగోపాలరావు బుధవారం వేర్వేరుగా ఏపీఈఆర్‌సీకి లేఖలు రాశారు. ఇలాంటి దీర్ఘకాలిక ఒప్పందాల వల్ల విద్యుత్ వినియోగదారులపైనా, ప్రభుత్వంపైనా తీవ్ర ప్రభావం పడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రతిపాదనలకు ఈఆర్‌సీ ఆమోదం తెలపడం సమంజసం కాదన్నారు.

పోలీసు కాల్పుల్లో రైతు మృతి

21 ఏళ్ల యువ రైతుకు తగిలిన బుల్లెట్.. రబ్బరు బుల్లెటా? అసలుదా? అన్నదానిపై అస్పష్టత

- రైతులను చంపుతున్న బీజేపీ.. మీడియా వెనక దాక్కుంది: రాహుల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: పంట ఉత్పత్తులకు మద్దతు ధర కోరుతూ మలిదశ ఉద్యమం ప్రారంభించిన రైతులు.. పోలీసులతో జరిగిన ఘర్షణలో తొలిసారిగా ఓ సహచరుడిని కోల్పోయారు. పంజాబ్-హరియాణా సరిహద్దులోని ఖానౌరి వద్ద బుధవారం ఈ విషాదం చోటు చేసుకుంది. మృతుడిని 21 ఏళ్ల శుభ్‌కరణ్ సింగ్‌గా గుర్తించారు. పంజాబ్‌లోని భటిండా జిల్లా బాలోక్ గ్రామానికి చెందిన శుభ్‌కరణ్‌ను చికిత్స కోసం పాటియాలలోని రాజింద్రా హాస్పిటల్‌కు తరలించగా.. తల మీద తీవ్రమైన గాయంతో అప్పటికే ఆయన మరణించారని, బుల్లెట్ తగలటం వల్లే ఇది జరిగినట్లు భావిస్తున్నామని, శవపరీక్షలో మిగిలిన వివరాలు వెల్లడవుతాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ హెచ్ఎస్ రేఖి తెలిపారు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు రైతులు చికిత్స పొందుతున్నారు. మరణించిన రైతు నిజమైన బుల్లెట్ తగలటం వల్ల ప్రాణాలు కోల్పోయారా? లేక రబ్బరు బుల్లెట్ వల్లనా అనేది స్పష్టం కాలేదు. ఈ ఘటన నేపథ్యంలో రైతు నేతలు చలో ఢిల్లీ ఉద్యమానికి రెండు రోజుల విరామం ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం తమ భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తామన్నారు. అప్పటి వరకూ పంజాబ్-హరియాణా సరిహద్దులోని శంభు, ఖానౌరీ ప్రాంతాల్లో మోహరించిన దాదాపు 14 వేల మందికి పైగా రైతులు అక్కడే ఉంటారని చెప్పారు. కాగా, బుధవారం రైతులతో జరిగిన ఘర్షణలో 13 మంది పోలీసు సిబ్బంది గాయపడ్డారని హరియాణాకు చెందిన ఒక పోలీసు అధికారి తెలిపారు.

2 రోజుల విరామం తర్వాత..

ఈ నెల 18న కేంద్రంతో జరిగిన నాలుగో దఫా చర్చలు విఫలమైన నేపథ్యంలో.. రైతు ఉద్యమానికి నేతృత్వం వహిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా సంఘాల నేతలు పంజాబ్-హరియాణా సరిహద్దు నుంచి ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని బుధవారం తిరిగి మొదలుపెడతామని ప్రకటించారు. దీంట్లో భాగంగా ముందుకు కదిలిన రైతులపై పోలీసులు, భద్రతా సిబ్బంది విరుచుకుపడ్డారు. రబ్బరు బుల్లెట్లను, టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. డ్రోన్లతో గ్యాస్ షెల్స్‌ను వదిలారు. పలువురు రైతులు టియర్ గ్యాస్ ప్రభావం నుంచి రక్షించుకోవటానికి మాస్కులను, కళ్లద్దాలను ధరించారు. పోలీసు కాల్పుల్లో యువరైతు మృతిపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ.. బీజేపీ రైతులను చంపుతోందని ఆరోపించారు. స్నేహపూర్వక మీడియా వెనక దాక్కున్న బీజేపీ నుంచి చరిత్ర ఏదో ఒక రోజు తప్పకుండా రైతుల హత్యలకు జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తుందన్నారు. మరోవైపు, రైతులను కేంద్రం ఐదో దఫా చర్చలకు ఆహ్వానించింది.



రైతులపై టియర్ గ్యాస్ ప్రయోగిస్తున్న పోలీసులు

గ్రామాలకు రాకుండా అడ్డుకుంటాం: టికాయత్

యూపీలోని ముజఫర్‌పూర్‌లో భారతీయ్ కిసాన్ యూనియన్ నేత రాకేశ్ టికాయత్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ధర్నాలో ఓ రైతు ఒంటికి నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. అయితే, ఇతర రైతులు సకాలంలో మంటలు ఆర్పి, అతడిని ఆస్పత్రికి తరలించారు. స్వల్పగాయాలే అయ్యాయని వైద్యులు తెలిపారు. తమను ఢిల్లీకి రానివ్వకుండా అడ్డుకునే వారిని వచ్చే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తమ గ్రామాలకు రాకుండా అడ్డుకుంటామని బీజేపీని ఉద్దేశించి రాకేశ్ టికాయత్ హెచ్చరించారు.

మాపై ఆరోపణ సరికాదు: పంజాబ్

రైతుల ముసుగులో అసాంఘిక శక్తులు చొరబడుతున్నారని, రైతులు పెద్ద సంఖ్యలో గుమిగూడకుండా అడ్డుకోవటం లేదంటూ కేంద్ర హోంశాఖ రాసిన లేఖపై పంజాబ్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. తమపై వేసిన ఆరోపణలు పూర్తిగా తప్పని చెప్పింది. హరియాణా పోలీసులు ప్రయోగిస్తున్న టియర్‌గ్యాస్, రబ్బరు బుల్లెట్లు, లాఠీచార్జి వల్ల ఇప్పటికి 160 మందికిపైగా గాయపడ్డారని, ఇటువంటి పరిస్థితుల్లోనూ శాంతిభద్రతలు క్షీణించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని కేంద్ర హోంశాఖకు పంపిన లేఖలో పేర్కొంది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, పంటరుణాల మాఫీ, రైతులకు పింఛను వంటి డిమాండ్లతో ఈ నెల 13 నుంచి రైతులు తమ నిరసనను తిరిగి ప్రారంభించారు. అయితే, వారు ఢిల్లీ వైపు రాకుండా రోడ్లపై భారీ ఎత్తున బారికేడ్లను, సిమెంటు దిమ్మెలను, ఇనుప చువ్వలను కేంద్రం ఏర్పాటు చేసింది.

భారత్-గ్రీస్ బంధం బలోపేతం!

- ఢిల్లీలో గ్రీస్ ప్రధాని మిట్సొటకీస్ పర్యటన
- ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: ఆయుధ సంపత్తి తయారీ, అభివృద్ధి కోసం కలిసి పనిచేసేందుకు భారత్, గ్రీస్ దేశాలు అంగీకారానికి వచ్చాయి. గ్రీస్ ప్రధాని కిరియాకోస్ మిట్సొటకీస్ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం ఢిల్లీకి విచ్చేశారు. తొలుత రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీకి ఆయన నివాళి అర్పించారు. అనంతరం రాష్ట్రపతి భవన్‌లో ఆయనకు ఘనస్వాగతం లభించింది. తర్వాత ప్రధాని నరేంద్ర మోదీతో ఆయన ద్వైపాక్షిక చర్చలు జరిపారు. సాధ్యమైనంత త్వరగా వలసలపై ఇరుదేశాలు ఒప్పందం చేసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఉగ్రవాదంపై పోరులో ఇరుదేశాల ఆందోళనలు, ప్రాధాన్యతలు ఒకేలా ఉన్నాయని అనంతరం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రధాని మోదీ తెలిపారు. అనేక ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇద్దరం చర్చలు జరిపామని, అన్ని వివాదాలు, ఉద్రిక్తతలను చర్చలు, దౌత్యమార్గాల ద్వారా పరిష్కరించుకునేందుకు అంగీకారం కుదిరిందని వివరించారు. మోదీ గతేడాది ఆగస్టులో గ్రీస్‌లో పర్యటించినప్పటి నుంచి ఇరుదేశాల సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెరిగాయి.



'గగన్‌యాన్'లో మరో మైలురాయి

- సీఈ20 క్రయోజనిక్ ఇంజిన్‌కు తుది పరీక్షలు పూర్తి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 21: వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకెళ్లి, మళ్లీ సురక్షితంగా భూమిపైకి తీసుకొచ్చే లక్ష్యంతో ఇస్రో సిద్ధం చేస్తున్న ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ మిషన్‌లో కీలక ముందడుగు పడింది. ఈ మిషన్ కోసం వినియోగించే ఎల్‌వీఎం-3 జీ1 రాకెట్‌లోని సీఈ20 క్రయోజనిక్ ఇంజిన్‌కు అన్ని పరీక్షలూ పూర్తయినట్టు ఇస్రో బుధవారం వెల్లడించింది. ఈ నెల 13న సీఈ20 ఇంజిన్‌కు సంబంధించిన తుది పరీక్ష హ్యూమన్ రేటింగ్ టెస్ట్‌ను విజయవంతంగా నిర్వహించినట్టు ఎక్స్ (ట్విటర్)లో పేర్కొంది. కాగా, గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా మానవ సహిత అంతరిక్ష యాత్రకంటే ముందు ఇస్రో మానవ రహిత యాత్రను చేపట్టనుంది. ఈ ఏడాది రెండో త్రైమాసికంలో ఈ ప్రయోగం ఉండొచ్చు.

అది నేను కాదు.. ఆయన వేరే వెంకటరమణారెడ్డి

- టీడీఆర్ బాండ్లపై ధర్మారెడ్డి వియ్యంకుడి వివరణ

తిరుపతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నేత ఆనం వెంకటరమణారెడ్డి తిరుపతి టీడీఆర్ బాండ్లకు సంబంధించి తనపై చేసిన ఆరోపణ అవాస్తవమని టీటీడీ ఈవో ధర్మారెడ్డి వియ్యంకుడు ఎం.వెంకట్రమణారెడ్డి తెలిపారు. తన పేరు ఎం.వెంకట్రమణారెడ్డి అని, తన తండ్రి పేరు రెడ్డెప్పరెడ్డి అని.. ఆనం చేసిన ఆరోపణ కె.వెంకట్రమణారెడ్డి అనే వ్యక్తిపై అని, ఆయన తండ్రి పేరు దామోదర్‌రెడ్డి అని బుధవారం వివరణ ఇచ్చారు. కె.వెంకట్రమణారెడ్డి అనే వ్యక్తితో తనకు గానీ, తన వియ్యంకుడైన టీటీడీ ఈవో ధర్మారెడ్డికి గానీ ఎలాంటి సంబంధం లేదన్నారు. సంబంధం లేని విషయాన్ని తనకు ఆపాదించడాన్ని ఖండిస్తున్నానని.. ఆనం చేసిన ఆరోపణలు తన, తన వియ్యంకుడి గౌరవప్రతిష్ఠలకు భంగం కలిగించేలా ఉన్నాయని పేర్కొన్నారు.


కృష్ణానదిలో తవ్వకాలను ఆపండి: హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం నడికుదురు, నిమ్మగడ్డ గ్రామాల పరిధిలోని కృష్ణానదీ గర్భంలో ఇసుక, బుసక అక్రమ తవ్వకాలను నిలువరించాలని కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. అక్రమ తవ్వకాలను నిలువరించేందుకు తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని స్పష్టంచేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను రెండువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ నిబంధనలకు విరుద్ధంగా నడికుదురు, నిమ్మగడ్డ గ్రామాల పరిధిలోని నదీగర్భంలో ఇసుక, బుసకను అక్రమంగా తవ్వి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ సామాజిక కార్యకర్త తాతినేని లీలాకృష్ణ పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది తులసి దుర్గాంబ, మైనింగ్‌శాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది నవీన్ వాదనలు వినిపించారు. వాటిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... పిటిషనర్ సమర్పించిన ఫొటో ఆధారాలను పరిశీలిస్తే... ఇసుకను తవ్వి తరలిస్తున్నట్లు అర్థమవుతోందని, తవ్వకాలు నిలువరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించింది.

ఆంధ్రరత్న భవన్‌లోనే షర్మిల

- పోలీసుల హౌస్ అరెస్టును తప్పించుకోవడానికే...

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి బుధవారం రాత్రి ఆంధ్రరత్న భవన్‌లో బస చేశారు. గురువారం సచివాలయం ముట్టడి కోసం ఆమె బుధవారం రాత్రి విజయవాడకు చేరుకున్నారు. కేవీపీ రామచంద్రరావు ఇంట్లో బస చేయాలని భావించినా... పోలీసుల గృహ నిర్బంధాల నేపథ్యంలో ఆంధ్రరత్న భవన్‌లోనే రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 'నిరుద్యోగుల పక్షాన పోరాటానికి పిలుపును ఇస్తే గృహ నిర్బంధాలు, అరెస్టులు చేస్తారా? మమ్మల్ని ఆపాలని చూస్తున్నారంటే... కాంగ్రెస్‌ను చూసి భయపడుతున్నారనేగా..! ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు చూస్తున్నారంటే.. అసలు వాస్తవాలను దాస్తున్నట్టే కదా..! బారికేడ్లతో బంధించాలని చూసినా నిరుద్యోగుల పక్షాన మా పోరాటం ఆగదు' అని స్పష్టం చేశారు.



విజయవాడ ఆంధ్రరత్న భవనలోని తన కార్యాలయంలో కింద నిద్రిస్తున్న షర్మిల

అతిగా పారాసిటమాల్ తీసుకుంటే.. కాలేయానికి అనర్థమే..!

- సిరోసిస్, హెపటైటిస్, క్యాన్సర్ వ్యాధుల ముప్పు

ఎడిన్‌బరో, ఫిబ్రవరి 21: జ్వరం, ఒళ్లునొప్పులు, జలుబు, తలనొప్పి..! వీటిల్లో ఏ లక్షణం కనిపించినా పారాసిటమాల్ వాడడం సాధారణంగా మారింది. కొవిడ్ సమయంలోనూ పెయిన్ కిల్లర్లు వాడొద్దని, పారాసిటమాల్‌ను మాత్రమే తీసుకోవాలని వైద్యులు సూచనలు చేశారు. అయితే.. అతిగా పారాసిటమాల్‌ను వాడితే కాలేయం పాలిట అనర్థాలు తప్పవని స్కాట్లాండ్‌లోని ఎడిన్‌బరో వర్సిటీ పరిశోధకులు తేల్చారు. స్కాటిష్ నేషనల్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ సర్వీస్‌తో కలిసి.. ఎలుకలపై జరిపిన పరిశోధనలో.. అతిగా పారాసిటమాల్‌ను తీసుకోవడం వల్ల ఆ డ్రగ్‌లోని హానికరమైన పదార్థాలు(టాక్సిన్స్) కాలేయానికి కీడు చేస్తాయని తేల్చారు. మనుషులపైనా ఇలాంటి దుష్ప్రభావాలనే కనుగొన్నట్లు వెల్లడించారు. ఈ పరిశోధన పత్రాలు 'సైంటిఫిక్ రిపోర్ట్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. అతిగా పారాసిటమాల్ తీసుకోవడం వల్ల కాలేయంపై దుష్ప్రభావం పడి.. సిరోసిస్, హెపటైటిస్, క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదముందని పరిశోధకులు హెచ్చరించారు. "కాలేయంలోని కణజాలం గోడలు దృఢంగా ఉండి.. కణాల మధ్య సందులను పట్టి ఉంచుతాయి. పారాసిటమాల్‌ను ఎక్కువగా వాడితే కాలేయంలోకి చేరే టాక్సిన్స్ కణాల పటుత్వానికి అంతరాయం కలిగిస్తాయి. దాంతో కాలేయంలోని కణజాల నిర్మాణానికి నష్టం వాటిల్లుతుంది. ఈ కారణంతో హెపటైటిస్, సిరోసిస్, క్యాన్సర్ వ్యాధుల ముప్పు ఉంటుంది" అని ఆ పరిశోధన వెల్లడించింది.

కాలేయంపైనే ఎందుకు?

నిజానికి ఏ ఔషధం(డ్రగ్) అయినా.. నాలుగు దశల్లో పనిచేస్తుంది. మొదటి దశ జీర్ణాశయంలో కరిగిపోవడం(డిసాల్వింగ్). రెండో దశలో ఔషధం కాలేయాన్ని చేరుతుంది (మెటబాలిజం). మూడో దశలో అక్కడి నుంచి శరీర భాగాలకు చేరుతుంది (డిస్ట్రిబ్యూషన్). మూడో దశలోనే అవసరమైన శరీర భాగానికి ఔషధం అందుతుంది. నాలుగో దశలో ఔషధ వ్యర్థాలు మూత్రపిండాల ద్వారా బయటకు వెళ్తాయి (ఎక్స్‌క్రేషన్). ఔషధ వ్యర్థాలు చెమట రూపంలోనూ అతి తక్కువ మోతాదులో బయటకు వెళ్తాయి. అయితే.. ఎక్కువ మోతాదులో ఏ ఔషధాన్ని తీసుకున్నా.. అది మెటబాలిజంపై దుష్ప్రభావం చూపిస్తుంది. సాధారణంగా పారాసిటమాల్ మాత్ర 500 ఎంజీ మోతాదులో లభిస్తోంది. ఒకట్రెండు మాత్రలు తీసుకోవడంతో ముప్పు ఉండదని ఎడిన్‌బరో పరిశోధకులు పేర్కొన్నారు. ఒళ్లు నొప్పులు ఎక్కువగా ఉన్న వారు రోజులో 4 గ్రాముల దాకా పారాసిటమాల్‌ను వాడొచ్చని, అంతకు మించితే కాలేయానికి ముప్పు అని హెచ్చరించారు.

బాబాయ్ అడిగితే ప్రచారం చేస్తా: వరుణ్‌తేజ్


విజయవాడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బాబాయ్ పవన్ కల్యాణ్ కోరితే కచ్చితంగా రాబోయే ఎన్నికల్లో జనసేన తరఫున ప్రచారం చేస్తానని సినీ నటుడు వరుణ్‌తేజ్ వెల్లడించారు. బుధవారం విజయవాడ వచ్చిన ఆయన్ని వచ్చే ఎన్నికల్లో జనసేన తరఫున ప్రచారం చేస్తారా అని మీడియా అడగడంతో పవన్ కల్యాణ్ అడిగితే ప్రచారం చేస్తానని వెల్లడించారు.

న్యాయ కోవిదుడు నారిమన్ కన్నుమూత

- 70 ఏళ్లకు పైగా న్యాయవాద వృత్తికే అంకితం
- న్యాయ సేవలకు పద్మవిభూషణ్ అవార్డు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: న్యాయ కోవిదుడు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఫాలి ఎస్.నారిమన్(95) ఇకలేరు. బుధవారం ఆయన ఢిల్లీలో తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా ఆయన గుండె సంబంధిత ఇబ్బందులతోపాటు పలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. చివరి వరకూ ఆయన లౌకికవాదం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేశారు. మంగళవారం రాత్రి కూడా ఆయన రాజ్యాంగ ధర్మాసనం ముందుకు రాబోయే ఓ కేసుకు సంబంధించి పత్రాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమైనట్లు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొనడం.. నారిమన్‌కు న్యాయవాద వృత్తిపై ఉన్న నిబద్ధతకు నిదర్శనం. నారిమన్ 1929 జనవరి 10న రంగూన్ (ప్రస్తుతం మయన్మార్‌లోని యాంగాన్)లో ఓ పార్సీ వర్తకవ్యాపారుల కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు బరియాంజీ నారిమన్, బానూ నారిమన్. రెండో ప్రపంచయుద్ధ సమయంలో బర్మా (ప్రస్తుతం మయన్మార్)పై జపాన్ దురాక్రమణ సందర్భంగా ఆ కుటుంబం భారత్‌కు వలస వచ్చింది. ఆయన తన పాఠశాల విద్యను హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లాలో ఉన్న బిషప్ కాటన్ స్కూల్‌లో పూర్తిచేశారు. ముంబైలోని సెయింట్ జెవియర్స్ కళాశాల నుంచి ఎకనామిక్స్, చరిత్రలో పట్టభద్రులయ్యారు. నారిమన్‌ను ఇండియన్ సివిల్ సర్వీస్ (ఐసీఎస్-ప్రస్తుతం ఐఏఎస్) అధికారిగా చూడాలని ఆయన తండ్రి కాంక్షించారు. కానీ, నారిమన్ న్యాయవిద్య వైపు మొగ్గుచూపారు. 1950లో ముంబైలోని ప్రభుత్వ న్యాయ కళాశాలలో న్యాయవిద్య పూర్తి చేశారు. ఆవెంటనే బాంబే హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. అప్పటి నుంచి ఆయన న్యాయవాద వృత్తిలోనే కొనసాగారు. 1961లో సీనియర్ అడ్వొకేట్‌గా ఎంపికయ్యారు. 1972లో సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. ఆ తర్వాత భారత అదనపు సొలిసిటర్ జనరల్‌గా నియమితులయ్యారు. ఎమర్జెన్సీ సమయంలో పత్రికలకు భావ ప్రకటన స్వేచ్ఛ లేకుండా సెన్సార్ విధించడాన్ని నిరసిస్తూ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన ఏకవాక్య రాజీనామా లేఖ అప్పట్లో సంచలనం. న్యాయవాద వృత్తిలో ఆయన సేవలకుగాను భారత ప్రభుత్వం 1991 లో పద్మభూషణ్, 2007లో పద్మవిభూషణ్ అవార్డులతో సత్కరించింది. ఆయన 1991 నుంచి 2010వరకు భారత బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. అంతర్జాతీయ స్థాయిలోనూ పనిచేశారు.

> లౌకికవాదం వర్ధిల్లుతున్న భారతదేశంలో నేను జీవించాను. దేవుడు కరుణిస్తే.. నా శేషజీవితాన్ని, చివరకు మరణాన్ని సెక్యులర్ భారతదేశంలోనే కోరుకుంటున్నాను
>
> - ఫాలి ఎస్ నారిమన్ వ్యాఖ్య



మైలురాయి తీర్పుల్లో కీలకం..!

సుప్రీంకోర్టు చరిత్రలోనే మైలురాయి వంటి తీర్పులు వచ్చిన పలు కేసుల్లో నారిమన్ వాదనలు వినిపించారు. ఇప్పటికీ 'రాజ్యాంగ మౌలిక స్వరూపం' అంశంపై యూపీఎస్సీ, రాష్ట్రాల పీఎస్సీల్లో కేశవానంద భారతి కేసు తీర్పు స్కోరింగ్ అంశమే. ఈ కేసులో నారిమన్ వాదనలు వినిపించగా.. మరో కీలకమైన కేసు- మినర్వా మిల్స్ కేసులోనూ సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. దీంతోపాటు ఎస్పీ గుప్తా కేసు (కొలీజియం వ్యవస్థకు సంబంధించినది), 2005, 2012ల్లో సమాచార హక్కు చట్టంపై దాఖలైన పిటిషన్లలోనూ ఆయన వాదనలు కీలకం. జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కలిగించే ఆర్టికల్ 370రద్దును ఆయన తీవ్రంగా విమర్శించారు. భోపాల్ గ్యాస్ ఉదం తం కేసులోనూ ఆయన యూనియన్ కార్బైడ్ కంపెనీ తరఫున 1985 లో వాదనలు వినిపించారు. ఆ తర్వాత ఆయన పలు సందర్భాల్లో ఈ కేసులో తాను వాదించకుండా ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు.

ప్రముఖుల సంతాపం

నారిమన్ మృతిపట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అత్యుత్తమ న్యాయవాదుల్లో నారిమన్ ఒకరని, సామాన్య పౌరుల కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. యువ న్యాయవాదులు రాజ్యాంగం, పౌరహక్కుల పవిత్రతను కాపాడేందుకు నారిమన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. నారిమన్ మృతి న్యాయవాద లోకానికి తీరని లోటు అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. నారిమన్ మృతిపట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, తమిళనాడు సీఎం స్టాలిన్ సంతాపం తెలిపారు.

యూపీలో సీట్ల సర్దుబాటు కొలిక్కి

- కాంగ్రెస్‌కు 17, ఎస్పీకి 62
- ఆజాద్ సమాజ్‌వాదీ పార్టీకి ఒక స్థానం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమిలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ)ల మధ్య సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చింది. యూపీలో మొత్తం 80 లోక్‌సభ స్థానాలు ఉండగా 17 సీట్లలో కాంగ్రెస్ పోటీ చేస్తుంది. 62 స్థానాల్లో ఎస్పీ, ఒకచోట ఆజాద్ సమాజ్‌వాదీ పార్టీ పోటీలో చేస్తాయి. కాంగ్రెస్, ఎస్పీ మధ్య సయోధ్య కుదరడంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ కీలక పాత్ర పోషించారని యూపీ కాంగ్రెస్ ఇన్‌చార్జి అవినాశ్ పాండే తెలిపారు. మధ్యప్రదేశ్‌లో 29 లోక్‌సభ స్థానాలు ఉండగా ఖజురహో స్థానంలో ఎస్పీ పోటీ చేస్తుంది. మిగిలిన స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తుంది. తొలుత కాంగ్రెస్ పార్టీ 19 సీట్లు కావాలని పట్టుబట్టింది. 11 సీట్లు ఇస్తామని ఎస్పీ తెలిపింది. మొరాదాబాద్, వారాణసీ, సీట్ల తదితర విషయంలో కీలకంగా చర్చ జరిగినట్టు తెలిసింది. ఎట్టకేలకు వారాణసీలో పోటీచేయబోమని, కాంగ్రెస్‌కు పూర్తిగా సహకరిస్తామని ఎస్పీ తెలిపింది. మొరాదాబాద్‌ను వదులుకునేందుకు అంగీకరించింది. దీంతో పొత్తు కొలిక్కివచ్చింది.

కాంగ్రెస్ ఖాతాల నుంచి రూ.65 కోట్లు విత్‌డ్రా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ పార్టీకి చెందిన వేర్వేరు బ్యాంకు ఖాతాల నుంచి ఆదాయపు పన్ను శాఖ రూ.65కోట్లు విత్‌డ్రా చేసిందని ఆ పార్టీ మండిపడింది. ఈ చర్య అప్రజాస్వామికమని, గత సంవత్సరాల పన్ను రిటర్న్‌లకు సంబంధించిన కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండగానే ఈ విధంగా వ్యవహరించడమేంటని ఏఐసీసీ కోశాధికారి అజయ్ మాకెన్ నిలదీశారు. ఖాతాల జప్తుపై అప్పిలేట్ అధికారులు విచారణ చేపడుతున్నప్పటికీ కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఖాతాల నుంచి రూ.65 కోట్లు డీడీల రూపంలో విత్‌డ్రా చేయాలని బ్యాంకులకు ఐటీ శాఖ లేఖలు రాసిందని ఆరోపించారు. గత పన్ను రిటర్నుల్లో వ్యత్యాసాలకు రూ.210కోట్ల రికవరీపై తమ పార్టీ అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించగా స్టే విధించిందని, అయినా కూడా తమ ఖాతాల నుంచి డబ్బులు విత్‌డ్రా చేస్తూ అప్రజాస్వామిక చర్యలకు పాల్పడ్డారని తెలిపారు.

ఇంగ్లండ్ పాఠశాలల్లో మొబైల్ ఫోన్లపై నిషేధం

- యూకే ప్రభుత్వ నిర్ణయం

లండన్, ఫిబ్రవరి 21: ఈ రోజుల్లో మొబైల్ ఫోన్ లేకుంటే గంట గడవని పరిస్థితి! చిన్నా పెద్దా అని తేడా లేకుండా స్మార్ట్‌ఫోన్లను విపరీతంగా వినియోగిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ల వాడకం వల్ల ప్రయోజనాలు ఉన్నట్టే నష్టాలు కూడా ఉంటున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు ఫోన్లకే అతుక్కు పోవడం పట్ల తల్లిదండ్రుల్లో ఆందోళనలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో మొబైల్ ఫోన్లను నిషేధించే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ఫ్రాన్స్, ఇటలీ, పోర్చుగల్ వంటి యూరోపియన్ దేశాల్లోని పాఠశాలల్లో మొబైల్ ఫోన్ల వాడకంపై ఆంక్షలు విధించారు. తాజాగా ఇంగ్లండ్ వ్యాప్తంగా పాఠశాలల్లో మొబైల్ ఫోన్లను బ్రిటన్ ప్రభుత్వం నిషేధించింది. మొబైల్ ఫోన్ల వాడకాన్ని తగ్గించే లక్ష్యంతో సోమవారం ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. పాఠశాల ప్రాంగణాల్లో ఫోన్లను నిషేధించడం, పాఠశాలకు రాగానే ఫోన్లను తీసుకోవడం లేదా వాటిని పాఠశాల సమయాల్లో భద్రంగా స్టోర్ చేయడం వంటి వాటిని ఆయా పాఠశాలలు అమలు చేయడానికి అవకాశం కల్పించారు. పాఠశాలలు పిల్లలు చదువుకునే ప్రదేశాలని, తరగతి గదిలో మొబైల్ ఫోన్లు అనవసర అవరోధాలని యూకే విద్యా శాఖ సెక్రటరీ గిలియన్ కీగన్ పేర్కొన్నారు.

డీఎస్సీ దరఖాస్తు గడువు పెంపు

- 25 వరకు ఫీజు, అప్లికేషన్‌కు చాన్స్
- ఈడబ్ల్యూఎస్ కోటా అమలు: ప్రభుత్వం

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ దరఖాస్తు గడువును పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అభ్యర్థుల వినతుల మేరకు దరఖాస్తులు, ఫీజుల చెల్లింపుల గడువును ఈ నెల 25 వరకు పొడిగించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇక, డీఎస్సీ నియామకాల్లో ఆర్థికంగా వెనుక బడిన వర్గాలకు కల్పించే రిజర్వేషన్‌ను(ఈడబ్ల్యూఎస్) వర్తింప చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనిపై జరుగుతున్న వ్యతిరేక ప్రచారాలను అభ్యర్థులు విశ్వసించవద్దని సూచించారు. సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వుల ప్రకారమే రోస్టర్ విధానం పాటిస్తున్నామన్నారు. డీఎస్సీ వెబ్‌సైట్‌లో సర్వర్ సమస్య లేదన్నారు. ఇదిలావుంటే, డీఎస్సీకి ఇప్పటి వరకు 3,19,176 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. టెట్‌కు 3,17,950 దరఖాస్తులు వచ్చాయన్నారు.

డీఎస్సీలో మరో మోసం!

- గిరిజన గురుకులాల్లో ఖాళీ పోస్టులు 1534
- తాజా నోటిఫికేషన్‌లో 517 పోస్టులకే భర్తీ
- పీఈటీ, ఆర్ట్స్, డ్రాయింగ్ టీచర్ల ఊసేదీ?

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 21: డీఎస్సీ భర్తీలో రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థలకు ప్రభుత్వం మొండిచేయి చూపింది. గురుకులాల్లో ఖాళీలు ఎక్కువగా ఉన్నప్పటి కీ అతి తక్కువ పోస్టులను మాత్రమే నోటిఫికేషన్‌లో చూపించారు. నాలుగు జోన్లలో ఒక వంతు టీచర్ పోస్టులు మాత్ర మే భర్తీ చేస్తుండడంపై అభ్యర్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వీటిలోనూ పీఈటీ, ఆర్ట్స్, డ్రాయింగ్ టీచర్ పోస్టుల ఊసే లేకపోవడం మరింత చర్చనీయాంశంగా మారింది. గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో 1,534 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. 2024లో ఉద్యోగ విరమణలు ఉన్నందున మరిన్ని పోస్టులు ఖాళీ అయ్యే అవకాశం ఉందని కూడా పేర్కొన్నారు. అయితే, ఈ నివేదికను పూర్తిగా పక్కన పెట్టిన ప్రభుత్వం.. మొత్తం 1,534 పోస్టుల్లో కేవలం 517 ఖాళీల భర్తీకే డీఎస్సీ నోటిఫికేషన్‌లో అవకాశం కల్పించింది. వీటిలో కేవలం పీజీటీ, టీజీటీ పోస్టులు మాత్రమే ఎక్కువగా ఉన్నా యి. గురుకులాల్లో ఖాళీగా ఉన్న మిగిలిన ఉపాధ్యాయ పోస్టులను పూర్తిగా విస్మరించింది.

గిరిజన పిల్లలకు ఆటలు వద్దా?

గిరిజన గురుకులాల్లో విద్యార్థులకు ఆట, పాట నేర్పించే పీఈటీ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. 122 పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఒక్క ఖాళీ కూడా పేర్కొనలేదు. 124 ఆర్ట్స్, డ్రాయింగ్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నా ఒక పోస్టనూ భర్తీ చేయటానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడం గమనార్హం.



శివాజీ గోపురంపై కలశప్రతిష్ఠ కార్యక్రమంలో శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య

శ్రీశైలంలో శాస్త్రోక్తంగా మహాకుంభాభిషేకం

శ్రీశైలం, ఫిబ్రవరి 21: శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం మహాకుంభాభిషేకం మహోత్సవాన్ని దేవస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించింది. ఈ నెల 16వ తేదీన ప్రారంభమైన మహాకుంభాభిషేకం క్రతువులు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి, శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి , కాశీ పీఠాధిపతి మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య పాల్గొన్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన మహాకుంభాభిషేకం క్రతువు మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగింది. మహాకుంభాభిషేకం అనంతరం శివాజీ గోపురానికి సువర్ణ కలశ ప్రతిష్ఠ, ఆలయ ప్రాంగణంలో పునరుద్ధరించిన కొన్ని ఉప ఆలయాలు, పంచమఠాలలోని మూడు మఠాలలో యంత్ర, శివలింగ, నందీశ్వరుల ప్రతిష్ఠలను శాస్త్రానుసారంగా చేశారు. అనంతరం ఏకకాలంలో ఆలయంలోని అన్ని ఆలయ గోపురాలకు మహాకుంభాభిషేకం నిర్వహించారు.

డీఎస్సీ.. జగన్నాటకం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించి భర్తీ ప్రక్రియను వివాదం చేసింది. తద్వారా ఈ ప్రక్రియ వెనుక మరింత జాప్యం చేయాలనే పన్నాగం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వాస్తవానికి ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులు అనర్హులని గతంలోనే సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ విషయం తెలిసి కూడా ప్రభుత్వం వీరిని అర్హులుగా పేర్కొంటూ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో డీఈడీ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఫలితంగా ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుంది. అయితే, ఇలా నిర్ణయం మార్చుకున్న దరిమిలా భర్తీ ప్రక్రియ ఆలస్యం కానుందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

అసలేంటీ వివాదం?

టీచర్ పోస్టుల్లో రెండు రకాలుంటాయి. 1 నుంచి 5 తరగతులకు బోధించే ఎస్జీటీ టీచర్లు, 6 నుంచి 8 వరకు బోధించే స్కూల్ అసిస్టెంట్లు(ఎస్ఏ) రెండు కేటగిరీల్లో ఉంటారు. ఎస్జీటీ టీచర్ కావాలనుకునేవారు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఎడ్) చేస్తారు. స్కూల్ అసిస్టెంట్ కావాలనుకునేవారు బీఈడీ కోర్సు చదువుతారు. అయితే, ఎస్జీటీ పోస్టులకు బీఈడీ చదివిన వారు కూడా పోటీపడుతున్నారు. దీంతో డీఎడ్ చేసిన వారికి అవకాశాలు తగ్గిపోయే పరిస్థితి ఏర్పడింది. పైగా వారి లక్ష్యం కూడా నెరవేరకుండా పోనుంది. మరోవైపు, ఇలాంటి పరిస్థితే గతేడాది రాజస్థాన్‌లో తెరమీదకు వచ్చింది. దీనిని విచారించిన సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఎస్జీటీ పోస్టులకు డీఈడీ చేసినవారు మాత్రమే అర్హులని, బీఈడీ కోర్సు చదివినవారు ఆపై తరుగతులకు అర్హులని స్పష్టం చేసింది. దీంతో ఎస్జీటీ పోస్టులకు డీఈడీ అభ్యర్థులు మాత్రమే అర్హులన్న విషయం స్పష్టమైంది.

సుప్రీం తీర్పునకు వ్యతిరేకంగా..

రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కూడా సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగానే నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జనవరి 26న టెట్‌కు అర్హతలపై జీవో 4 జారీ చేసింది. ఎస్జీటీ పోస్టులకు డీఈడీ, బ్యాచిలర్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ లేదా అందుకు సమానమైన కోర్సులు చేసినవారు అర్హులని స్పష్టంచేసింది. అందులో ఎక్కడా బీఈడీ అభ్యర్థులు అర్హులు అని పేర్కొనలేదు. మళ్లీ నెల రోజులు కూడా కాకుండానే ఈ నెలలో జారీచేసిన డీఎస్సీలో ఆ జీవోలో పేర్కొన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులకూ అర్హత కల్పించింది. దీనిపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్‌కుమార్ అదే రోజు మాట్లాడుతూ.. "బీఈడీ అభ్యర్థులు ఎస్జీటీ పోస్టులకు అర్హులు కారని సుప్రీంకోర్టు చెప్పలేదు. డీఈడీ వారు అర్హులని మాత్రమే తెలిపింది. ఆ తర్వాత ఇతర రాష్ట్రాలు బీఈడీ అభ్యర్థులకు అర్హత కల్పించాయి. అందుకే ఇక్కడ కూడా అర్హత కల్పించాం" అని వివరించారు. అదే నిజమనుకుంటే సరిగ్గా రెండు వారాల ముందు బీఈడీ వారు అర్హులు కారని ప్రభుత్వం జీవో ఎందుకు ఇచ్చింది? జీవో ఇచ్చే సమయంలో సుప్రీంకోర్టు అలా చెప్పలేదని తెలియదా? అనే ప్రశ్నలు అభ్యర్థుల నుంచి వస్తున్నాయి.

రాజకీయ కోణం?

ఇలా నిర్ణయాలు మార్చుకోవడం వెనుక రాజకీయ కోణం కనిపిస్తోందనే వాదన వినిపిస్తోంది. బీఈడీ అభ్యర్థులకు అర్హత కల్పిస్తే వివాదం అవుతుందని తెలిసే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని నిపుణులు చెబుతున్నారు. వివాదం అయినా అందరికీ అవకాశం కల్పించామనే సానుభూతి పొందవచ్చని చూసింది. మరోవైపు దీనిపై ఎవరైనా న్యాయస్థానానికి వెళ్తే ప్రక్రియ మరింత ఆలస్యం అవుతుందని కూడా ఆశించినట్లు అర్థమవుతోంది. ఎందుకంటే ఐదేళ్ల తర్వాత ఇచ్చిన మొట్టమొదటి నోటిఫికేషన్‌పై ప్రభుత్వం ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా సాంకేతిక అంశాల్లో లోపాలు లేకుండా చూసుకోవాలి. కానీ అన్నీ తెలిసినా వివాదాస్పద నిర్ణయాలే తీసుకుంది. ఇదంతా డీఎస్సీ ఆలస్యం కావడానికేనని అర్థమవుతోంది.

కోర్టు ఆదేశాలతో వెనక్కి

డీఎడ్ అభ్యర్థులు సర్కారు నిర్ణయంపై హైకోర్టును ఆశ్రయించారు. వీరి పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. డీఎడ్ అభ్యర్థులు మాత్రమే ఎస్జీటీ పోస్టులకు అర్హులని న్యాయస్థానం అభిప్రాయపడింది. ఇక, హైకోర్టులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆదేశాలు వస్తాయని భావించిన పాఠశాల విద్యాశాఖ హడావుడిగా మరోసారి నిర్ణయం మార్చుకుంది. ఎస్జీటీ పోస్టులకు డీఎడ్ వారిని మాత్రమే అనుమతిస్తామని మంగళవారం కోర్టుకు తెలిపింది. ఇదే నోటిఫికేషన్‌లో పేర్కొని ఉంటే అసలు ఈ వివాదమే ఉండేది కాదు. కాగా, ఇప్పుడు ఎస్జీటీ పోస్టులకు(పేపర్-1ఎ)కు దరఖాస్తు చేసుకున్నవారు ఏంచేయాలనేది మరో ప్రశ్న. పైగా వారు రూ.750 చొప్పున ఫీజులు కూడా చెల్లించారు. ఇప్పుడు ఆ ఫీజులన్నీ తిరిగి ఇస్తారా? మళ్లీ అభ్యర్థులకు దరఖాస్తుల్లో మార్పులకు అవకాశం కల్పిస్తారా? ఇలా అనేక సందేహాలు తెరమీదికి వచ్చాయి. సర్కారు నిర్వాకంతో అభ్యర్థులు పరీక్షలపై ఏకాగ్రత కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.



ద్వారంపూడి ఫ్లెక్సీని చెప్పుతో కొడుతున్న ఏపీ ఫిషర్‌మెన్ జేఏసీ సభ్యులు

మత్స్యకారులకు ద్వారంపూడి బహిరంగ క్షమాపణ చెప్పాలి

- ఏపీ ఫిషర్‌మెన్ జేఏసీ

విజయవాడ (ధర్నాచౌక్), ఫిబ్రవరి 21 : 'మీది అమ్ముడుపోయే జాతి..' అంటూ మత్స్యకారుల మనోభావాలను కించపరిచేలా వ్యాఖ్యానించిన కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ఏపీ ఫిషర్‌మెన్ జేఏసీ ఛైర్మన్ సైకం రాజశేఖర్ డిమాండ్ చేశారు. 'ఖబడ్దార్ చంద్రశేఖర్‌రెడ్డి.. నోరు అదుపులో పెట్టుకో.. లేదంటే ఎన్నికల్లో నీ సంగతి తేలుస్తాం..' అని హెచ్చరించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 60 వేల మత్స్యకార ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచి, ఆ జాతినే హేళన చేస్తూ అవమానిస్తావా? అని ధ్వజమెత్తారు. మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ మత్స్యకార సంఘాలు ఆందోళనలు చేస్తున్నా ఆయన స్పందించకపోవడంపై మండిపడ్డారు. కుల దురహంకారి చంద్రశేఖర్‌రెడ్డిని తక్షణమే భర్తరఫ్ చేయాలని, లేదంటే ఆయన వ్యాఖ్యల వెనుక వైసీపీ ప్రభుత్వం ఉందని భావించాల్సి వస్తుందన్నారు. అనంతరం ప్రెస్‌క్లబ్ బయట చంద్రశేఖర్‌రెడ్డి ఫొటోను చెప్పుతో కొట్టి, కాళ్లతో తొక్కుతూ నిరసన తెలిపారు. అగ్నికుల క్షత్రియ సంఘం నేతలు శ్రీకాంత్, మహేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి పొగాకు కొనుగోళ్లు

అమరావతి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది వర్జీనియా పొగాకు కొనుగోళ్లు ఈనెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. 29న ఒంగోలు-1, కొండెపి, మార్చి6 నుంచి కందుకూరు-1,2, వెల్లంపల్లి, మార్చి14 నుంచి ఒంగోలు-2, టంగుటూరు, కలిగిరి, డీసీ పల్లి, కనిగిరి, పొదిలి, దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం-1,2 ఆక్షన్ ప్లాట్‌ఫారాల్లో పొగాకు కొనుగోళ్లు ప్రారంభించనున్నారు. వేలం కేంద్రాల నిర్వహణపై బుధవారం గుంటూరులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో ఛైర్మన్ యశ్వంత్‌కుమార్, ఈడీ శ్రీధర్‌బాబు రైతులు, వ్యాపార ప్రతినిధులతో చర్చించారు.

పోలింగ్ ఏజెంట్లుగా వలంటీర్లు!

- వారికి సర్వీసు రూల్స్ లేవు: ధర్మాన

శ్రీకాకుళం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పోలింగ్ ఏజెంట్లుగా వలంటీర్లను నియమించొద్దని ఎన్నికల కమిషన్ ఆదేశించినా.. మంత్రి ధర్మాన ప్రసాదరావు మాత్రం వారే ఏజెంట్లని చెబుతున్నారు. దీనిపై ఆలోచన చేస్తున్నామని చెప్పారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా గార మండలంలో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసింది. 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసేందుకు వీలుంది. వారి నుంచి పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు మీరే చేయించండి. మన ప్రభుత్వంపై కోపమున్నవారు.. ఈవీఎంలను చూపిస్తూ.. వారే ఓటు నొక్కేయకుండా (ఉద్యోగుల గురించి పరోక్షంగా) వాలంటీర్లు గమనించాలి. వలంటీర్లు అంటేనే స్వచ్ఛంద సేవకులు. రేపటి ఎన్నికల్లో మీరు ఏజెంట్లుగా కూర్చునే పరిస్థితి ఉంటుంది. ఈ విషయమై ఆలోచిస్తున్నాం. వాలంటీర్లకు సర్వీస్ రూల్స్ లేవు. ఎవరైనా దొంగ ఓట్లు వేసేస్తామంటే ఈ దఫా పప్పుడకదు. అటువంటవి సాగనీయం. ఈ ప్రభుత్వం మళ్లీ రాకుంటే వేలాది గుండెలు ఆగిపోతాయి. ఈ విషయాన్ని గుర్తుంచుకోండి' అని మంత్రి వ్యాఖ్యానించారు.

ఎస్జీటీ పోస్టులకు బీఈడీలను అనుమతించం!

- హైకోర్టుకు ప్రభుత్వం వెల్లడి
- జీవో 4 ప్రకారం భర్తీకి కోర్టు అనుమతి

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బీఈడీ క్వాలిఫికేషన్ ఉన్న అభ్యర్థులను సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ) పోస్టులకు అనుమతించబోమని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం హైకోర్టుకు నివేదించింది. ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులను అనుమతించేలా ఉన్న డీఎస్సీ నోటిఫికేషన్‌లోని నిబంధనపై 'స్టే' విధించాలని అడ్వకేట్ జనరల్(ఏజీ) ఎస్. శ్రీరామ్ అభ్యర్థించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 26న జారీ చేసిన జీవో 4 మేరకు పోస్టుల భర్తీకి అనుమతించాలని కోరారు. ఈ వివరాలను నమోదు చేసిన ధర్మాసనం ఎస్జీటీ పోస్టులకు బీఈడీ అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించింది. ఈ నెల 12న జారీ చేసిన జీవో 11లో ఎస్జీటీ పోస్టులకు.. బీఈడీ అభ్యర్థులను అర్హులుగా పేర్కొన్న నిబంధనపై స్టే విధించింది. జీవో 4 మేరకు పోస్టుల భర్తీకి వెసులుబాటు కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను 8వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్. రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 12న ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఎస్జీటీ పోస్టుల భర్తీకి బీఈడీ అభ్యర్థులను అనుతించడాన్ని సవాల్ చేస్తూ గుంటూరు జిల్లా రెంటచింతలకు చెందిన భూక్యా గోవర్ధన్‌సాయి నాయక్ మరో నలుగురు డీఎడ్ అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఇదే వ్యవహారంపై ఉమ్మడి ప్రకాశం జిల్లా, అద్దంకికి చెందిన బొల్లా సురేశ్ మరో పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం జరిగిన విచారణలో ప్రభుత్వ నిర్ణయాన్ని హైకోర్టు ప్రాథమికంగా తప్పుపట్టింది. పూర్తి వివరాలు సమర్పించేందుకు ఏజీ సమయం కోరడంతో విచారణ బుధవారాని వాయిదా పడింది. ఈ వ్యాజ్యాలు బుధవారం మరోసారి విచారణకు రాగా ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. ఎస్జీటీ పోస్టులకు బీఈడీ క్వాలిఫికేషన్ ఉన్న అభ్యర్థులను అనుమతించబోమన్నారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది బి. ఆదినారాయణరావు, న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు.

టెట్, టీఆర్‌టీల మధ్య నెల రోజులైనా అవసరం!

- పరీక్షలపై హైకోర్టు అభిప్రాయం.. అలా ఇవ్వలేమన్న ప్రభుత్వం .. నేడు నిర్ణయం ప్రకటిస్తామన్న కోర్టు

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఏపీ టెట్, ఏపీ టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ) మధ్య సముచి త సమయం ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో సుదీర్ఘ వా దనలు జరిగాయి. న్యాయస్థానం స్పందిస్తూ.. టెట్ తర్వాత టీఆర్‌టీకి సిద్ధమయ్యేందుకు కనీసం నెల రోజుల సమయం ఇవ్వడం సముచితమని అభిప్రాయపడింది. షెడ్యూల్‌లో మార్పులు చేసే ఆలోచన ఏమైనా ఉందా? అని ప్రభుత్వాన్ని ఆరా తీసింది. ప్రభుత్వం నుంచి సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొంటూ నిర్ణయాన్ని గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ బుధవారం ఆదేశాలిచ్చారు. టెట్, ఏపీ టీఆర్‌టీ మధ్య సముచిత సమయం ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం. పెద్దిరాజు, మరో నలుగురు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది బి. ఆదినారాయణరావు, న్యాయవాది జవ్వాజి శరత్‌చంద్ర వాదనలు వినిపించారు. ఏపీ ప్రభుత్వం టెట్, టీఆర్‌టీల నిర్వహణకు ఒకేసారి షెడ్యూల్ ప్రకటించిందన్నారు. టెట్ ఫలితాలను మార్చి 14న ప్రకటిస్తుండగా, ఆ తర్వాత రోజే టీఆర్‌టీ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. టెట్‌కు సైతం ఈ నెల 8న నోటిఫికేషన్ ఇచ్చి, ఈ నెల 27న పరీక్ష నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించారన్నారు. పరీక్షకు సిద్ధమయ్యేందుకు అభ్యర్థులకు కేవలం 19 రోజుల సమయం మాత్రమే ఉందని తెలిపారు. అభ్యర్థులు పరీక్షకు సిద్ధమయ్యేందుకు మరింత సమయం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరే హక్కు పిటిషనర్ల కు లేదన్నారు. పరీక్ష నిర్వహణ వాయిదా వేస్తే టీసీఎస్ సంస్థ వేరే స్లాట్ ఇచ్చే అవకాశం లేదన్నారు.

సై అంటే సై అనేలా పోరాడాలి

- ఎన్నికల యుద్ధంలో విజయం సాధించాలి
- టీడీపీ శ్రేణులకు నారా భువనేశ్వరి పిలుపు
- 'చిత్తూరు'లో ఐదు కుటుంబాలకు పరామర్శ

చిత్తూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో టీడీపీ కార్యకర్తలు సై అంటే సై అనేలా పోరాడాలని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా బుధవారం చిత్తూరు జిల్లా శాంతిపురం, రామకుప్పం, పెద్దపంజాణి, పుంగనూరు మండలాల్లో ఆమె పర్యటించారు. చంద్రబాబు జైలుకు వెళ్లినప్పుడు మనస్తాపంతో మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. పెద్దపంజాణి మండలం కతార్లపల్లె గ్రామంలో పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం తనకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన కార్యకర్తలతో భువనేశ్వరి మాట్లాడారు. 'అన్యాయాలు, అక్రమాలు, దౌర్జనాలు, టీడీపీ కార్యకర్తలపై దుర్మార్గాలకు పాల్పడేవారు ఎన్నికలకు సిద్ధం అంటున్నారు. టీడీపీ కార్యకర్తలు దీటుగా నిలబడి ఎన్నికల యుద్ధంలో గెలవాలి. వైసీపీ ప్రభుత్వం అన్నివిధాలా ఇబ్బందులకు గురిచేసినా తట్టుకుని పార్టీ కోసం నిలబడుతున్న ప్రతి కార్యకర్తకూ శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. రాబోయేది టీడీపీ ప్రభుత్వమే. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించుకునేందుకు ప్రతి కార్యకర్తా ముందుకు రావాలి' అని ఆమె కోరారు. అంతకు ముందు శాంతిపురంలో 'ఆడబిడ్డలకు ఆర్థిక స్వేచ్ఛ' అంశంపై ఆమె మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. సీఎంగా చంద్రబాబు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి ఆర్థిక స్వాలంబన కలిగించి, ఎన్నో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించారని గర్తుచేశారు. మళ్లీ అధికారంలోకి వస్తే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రతి ఆడబిడ్డ కు ఏడాదికి రూ.15వేలు అకౌంట్ల లో జమ చేస్తారని ఇచ్చిన హామీని గుర్తుచేశారు.



శివాడి గ్రామంలో కనకరాజు కుటుంబాన్ని పరామర్శించి చెక్కు అందిస్తున్న నారా భువనేశ్వరి

చంద్రబాబు యంగ్‌స్టర్

'భోజనం సమయంలోనూ ప్రజల గురించే చంద్రబాబు మాట్లాడతారు. లోకేశ్ కన్నా షార్ప్‌గా ఆలోచిస్తారు. అందుకే ఆయన 2047 విజన్ దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తారు. అలాంటి ఆయన్ను పట్టుకుని ఈ ప్రభుత్వం వయసైపోయింది అంటోంది. కానీ ఆయన ఇంకా యంగ్‌స్టర్' అన్నారు. కాగా, రెండో రోజు పర్యటనలో తొలుత శాంతిపురం ఎన్టీఆర్ సర్కిల్, రామకుప్పం పోలీస్‌స్టేషన్ పక్కన అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. అనంతరం కతార్లపల్లెలో శంకరప్ప, పుంగనూరు మండలంంలో నాదన్నగారి జయమ్మ, మంగళంలో పాలెపల్లి పద్మావతి, ఒంటిమిట్టలో శ్రీనివాసులు కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున సాయం అందించారు.

ఈసారి నన్ను గెలిపిస్తారా?

'కుప్పంలో చంద్రబాబును 35ఏళ్లుగా గెలిపిస్తున్నారు. ఈసారి నన్ను గెలిపిస్తారా?' అంటూ భువనేశ్వరి సరదా వ్యాఖ్యలు చేశారు. 'ఇక్కడ నాకు మద్దతిస్తారా? చంద్రబాబుకు మద్దతిస్తారా?' అంటూ మహిళల్ని ప్రశ్నించగా, ఇద్దరూ కావాలంటూ మహిళలు చేతులెత్తారు. అలా కుదరదు, ఎవరో ఒకరి పేరే చెప్పాలంటూ సరదాగా అడిగిన ఆమె.. రాజకీయాలకు తాను దూరంగా ఉంటానని అన్నారు. కాగా, ఈ వ్యాఖ్యలకు వైసీపీ సోషల్ మీడియాలో వక్ర భాష్యం చెబుతూ వికృతానందం పొందుతుండటం గమనార్హం.

వలంటీర్ వేధింపులు.. బాలిక ఆత్మహత్యాయత్నం

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 21: వలంటీర్ వేధింపులు, బెదిరింపులతో పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం పాలపాడు గ్రామానికి చెందిన ఓ బాలిక బుధవారం ఆత్మహత్యకు యత్నించింది. వివరాలివీ.. తనను ప్రేమించాలని పాలపాడు గ్రామానికి చెందిన వలంటీర్ పిట్టు శ్రీకాంత్ రెడ్డి అదే గ్రామానికి చెందిన ఓ యువతిని వేధిస్తున్నాడు. ఈ వేధింపులకు భయపడి ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీ కళాశాలలో చేరినా, ఫోన్ చేసి మరీ వేధిస్తున్నాడు. దీంతో యువతి తల్లిదండ్రులు వలంటీరును, అతడి తల్లిదండ్రులను ప్రశ్నించగా.. జగనన్న విద్యా దీవెన నిమిత్తం ఫోన్ చేస్తున్నానని సమాధానం ఇచ్చాడు. ఆ తర్వాత కూడా వేధింపులు వస్తుండగా తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే గ్రామ పెద్దల జోక్యంతో పోలీసులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో వేధింపులు తాళలేక యువతి గత ఏడాది ఇంటికి వచ్చేసింది. ఇంటి వద్ద ఉన్నా అతడు వదలక పోవడంతో తల్లిదండ్రులు ఆమెను బంధువుల ఇంటికి పంపేశారు. దీంతో వలంటీరు ఆ యువతి చెల్లెలైన ఎనిమిదో తరగతి బాలికను వేధించడం మొదలుపెట్టాడు. బాలిక పాఠశాలకు వెళ్లి, వచ్చే సమయంలో వెంటపడి ప్రేమించాలని లేదా మీ అక్కను తీసుకు రావాలని హింసిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఇంటికి వస్తున్న బాలికను వేధించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక ఇంటికి వెళ్లి ఎలుకల మందు తాగింది. చికిత్స కోసం నరసరావుపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.రోశయ్య తెలిపారు.

తండ్రీకొడుకులకు ఉరిశిక్ష.. తల్లికి జీవిత ఖైదు

జంట హత్యల కేసులో కర్నూలు కోర్టు సంచలన తీర్పు

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 21: పెళ్లయిన 2 వారాలకే భార్య శీలాన్ని శంకించి భార్యతో పాటు అత్తను హత్య చేసిన తండ్రీకొడుకులకు కర్నూలు నాలుగో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఉరిశిక్ష విధిస్తూ బుధవారం సంచలన తీర్పు ఇచ్చింది. జంట హత్యలకు సహకరించిన నిందితుడి తల్లికి జీవిత ఖైదు విధిస్తూ న్యాయాధికారి జి.ప్రతిభాదేవి తీర్పునిచ్చారు. పోలీసుల కథనం మేరకు.. నంద్యాలకి చెందిన నారపురం వరప్రసాద్, రమాదేవి, వారి కుమారుడు నారపురం శ్రావణ్‌కుమార్‌కు గతేడాది మార్చి1న తెలంగాణలోని వనపర్తికి చెందిన రుక్మిణితో వివాహం జరిగింది. పెళ్లయిన మరుసటి రోజు నుంచే మనస్పర్థలు వచ్చాయి. భర్తకు మగతనం లేదంటూ ఒకరు.. భార్యకు అక్రమ సంబంధం ఉందంటూ మరొకరు.. ఇలా రెండు కుటుంబాల వారు పరస్పరం ఆరోపించుకుని ఘర్షణ పడ్డారు. దీంతో తమ పరువు పోతుందని భావించిన నిందితులు నవ వధువు కుటుంబాన్ని హతమార్చాలని పథకం పన్ని గతేడాది మార్చి 14న వారిని కర్నూలు లో తమ ఇంటికి రప్పించుకున్నారు. అదేరోజు నారపురం కృష్ణవేణిని ఇంటి బయట కాపలాగా ఉంచి నిందితుడు నారపురం శ్రావణ్ కుమార్ తన తండ్రి వరప్రసాద్‌తో కలిసి భార్య కొత్త రుక్మిణి(18)తోపాటు.. ఆమె తల్లి కొత్త రమాదేవి(32)ని కత్తులతో పొడిచి హత్య చేశారు. అడ్డొచ్చిన రుక్మిణి తండ్రి వెంకటేశ్‌ను తీవ్రంగా గాయపరిచి పరారయ్యారు. వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు నాలుగో పట్టణ సీఐ పి.శంకరయ్య కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రకాశ్ రెడ్డి వాదనలు వినిపించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చిన్ననేత, పెద్ద నేరం


పశ్చిమబెంగాల్‌లో బీజేపీ, తృణమూల్ మధ్య వైరం పచ్చగడ్డి వేయకుండానే నిత్యం మండుతూంటుంది కనుక, సందేశ్‌ఖాలీ వంటి ఘటనలు జరిగి, ఆయుధాలుగా అందివచ్చినప్పుడు రాజకీయ యుద్ధం పతాకస్థాయికి చేరుకోవడం సహజం. జరుగుతున్న ఘోరాలను ఆపడం, నేరస్థులను శిక్షించడం, బాధితులకు న్యాయం చేయడం వంటివి వెనక్కుపోయి రాజకీయానిదే పైచేయి అవుతున్నందున సందేశ్‌ఖాలీ నిత్యం వార్తల్లో ఉంటూ వస్తున్నది. ఒక మారుమూల ప్రాంతంలో స్థానిక నాయకుడి అఘాయిత్యాలు, కృత్యాలు మీడియాలో ప్రధానాంశమైనాయి.

తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ఓ చిన్నస్థాయి నాయకుడు షేక్ షాజహాన్, ఆయన మనుషులు ఏళ్ళ తరబడి గ్రామస్తులను పీక్కుతింటూంటే, భూములను ఆక్రమించుకుంటూ, ప్రశ్నించినవారిమీద దాడులు చేస్తూ, మహిళలపై అకృత్యాలు చేస్తూంటే ఆ ఘోరాలన్నీ ఇంతకాలమూ ఎందుకు వెలుగుచూడలేదో అర్థంకాదు. జనవరి 5న ఏదో రేషన్ కుంభకోణానికి సంబంధించి అరెస్టు చేయడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అధికారులు వెడితే, షాజహాన్ మనుషులు ఈడీ అధికారులమీద ఎదురుదాడి చేయడంతో సందేశ్‌ఖాలీ తొలిసారిగా వార్తలకు ఎక్కింది. ఇది జరిగిన నెల్లాళ్ళకు కొందరు మహిళలు షాజహాన్‌నీ, ఆయన అనుచరులనూ అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. వారిలో ఒకరు కెమెరాముందు చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించే రీతిలో ఉన్నాయి. పేదలభూములు ఆక్రమించడం, కొన్నింటిని చెరువులుగా మార్చివేయడం, వెట్టిచేయించుకోవడం వంటి ఆరోపణలతో పాటు, ఈ ముఠా అందంగా ఉన్న మహిళలను వెతికిపట్టుకొని మరీ అక్కడి పార్టీ కార్యాలయానికి రప్పించి అత్యాచారాలకు పాల్పడుతున్నదని ఆమె ఆరోపించారు. మహిళలు ఇలా వీధుల్లోకి వచ్చి తమకు జరుగుతున్న అన్యాయాన్ని చెప్పుకోవాల్సిరావడం నిజానికి దురదృష్టకరమైన విషయం. ఈ నిరసనలు, ఆ వ్యాఖ్యల వెనుక అసలు నేరం కంటే రాజకీయమే ఎక్కువని తృణమూల్ వాదన. అయినా, నిజాన్ని నిగ్గుతేల్చవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద ఉంది. ఆ గ్రామానికి ప్రభుత్వం పంపిన మహిళా పోలీసు బృందానికి స్థానిక మహిళలు సదరు ముఠాతో తాము పడుతున్న బాధలు అనేకం చెప్పారు కానీ, అత్యాచారాల ఊసెత్తలేదు. మీ భద్రతకు లోటేమీ లేదన్న హామీ తరువాత కూడా వారు ఈ విషయం మాట్లాడకపోవడాన్ని తృణమూల్ ప్రధానంగా ప్రస్తావిస్తూంటే, ముఠాతో రాసుకుపూసుకుతిరిగే స్థానికపోలీసులనుంచి భవిష్యత్తులో తమకు ప్రమాదం ఉందన్న భయంతోనే వారు మాట్లాడలేదని బీజేపీ నాయకులవాదన.

అసత్యప్రచారాలతో, తెరవెనుక కుట్రలతో సందేశ్‌ఖాలీని బీజేపీ ఓ భయంకరమైన విషయంగా మారుస్తున్నదని ఆరోపిస్తూ తృణమూల్ సమస్యను పూర్తిగా కొట్టిపారేస్తూంటే, పార్టీ కార్యాలయాలను అత్యాచారస్థావరాలుగా మార్చేశారంటూ స్మృతి ఇరానీవంటివారు ఘాటైన పదజాలంతో మీడియా సమావేశాలు నిర్వహిస్తున్నారు. బీజేపీ పెద్దలంతా రాష్ట్రపర్యటనలు చేస్తూ వివాదం వేడిగా ఉండేట్టు చూస్తున్నారు. జాతీయ మహిళా కమిషన్ రాష్ట్రాన్ని తీవ్రంగా దుయ్యబడితే, ఎస్సీ కమిషన్ ఏకంగా రాష్ట్రపతి పాలనే విధించాలన్నది. సందేశ్‌ఖాలీ వెడుతూ ఘర్షణల్లో గాయపడిన బెంగాల్ బీజేపీ అధ్యక్షుడి ఫిర్యాదుమేరకు లోక్‌సభ సెక్రటేరియట్ ప్రివిలేజెస్ కమిటీ రాష్ట్ర డీజీపీ, చీఫ్ సెక్రటరీకి తనముందు హాజరుకావాలని నోటీసులు జారీ చేస్తే, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించి దానిని అడ్డుకుంది. రేపోమాపో ప్రధాని మోదీ సందేశ్‌ఖాలీ వచ్చి మహిళలను పరామర్శిస్తారని కూడా వార్తలు వస్తున్నాయి.

ఈ రాజకీయాన్ని అటుంచితే, ఇద్దరు ప్రధాన అనుచరులను అరెస్టు చేసినప్పటికీ, షేక్ షాజహాన్ ఇంకా పోలీసులకు దొరకలేదంటే ఆశ్చర్యం కలుగుతుంది. కమ్యూనిస్టుల కంచుకోటను బద్దలుకొట్టడానికి వీధిపోరాటాలు చేసి, తృణమూల్‌తోనే మార్పు సాధ్యమని ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన మమతా బెనర్జీ ఈ ఘటన విషయంలో ఉన్నతంగా వ్యవహరించడం అవసరం. కేసులు, దర్యాప్తులు జరుగుతున్నప్పటికీ, మొదట్లో ఈ వ్యవహారంమీద నోరువిప్పకపోవడం, ఆ తరువాత కొట్టిపారేయడం మమతకు అప్రదిష్ట తెచ్చాయి. సార్వత్రిక ఎన్నికలముందు తృణమూల్ కాంగ్రెస్‌ను రాజకీయంగా భ్రష్టుపట్టించేందుకు విపక్షాలు సహజంగానే ప్రయత్నిస్తాయి. కానీ, మహిళాపక్షపాతినని చెప్పుకుంటున్న మమతా బెనర్జీ ఈ ఘోర ఉదంతం విషయంలో న్యాయంగా వ్యవహరించడం, ప్రజలకు విశ్వాసం కలిగించడం అవసరం.

మానసిక యుద్ధం, ముందస్తు విజయాలు



ఎన్నికల వేళ జనం మనసులో ఏమున్నదో తెలియదంటారు కానీ, మరీ అంత తెలియకుండా పోదు. రాజకీయ నాయకులలాగా ఓటర్లు తమ మనోభావాలు దాచిపెట్టుకుని నటించలేరు. గొట్టాలు పెట్టి, ఓటెవరికో చెప్పమంటే చెప్పరు కానీ, ముఖకవళికలు చదవగలిగేవారు అంతరంగాలను గ్రహించగలరు. కాకపోతే, ఎటువైపు మొగ్గు ఎంతెంత అన్న పరిమాణాల అంచనాలోనే సర్వేవీరులు సఫలమో విఫలమో అవుతుంటారు.

పాత్రికేయులు, పరిశీలకులు పసిగట్టగలిగే నాడి, జనంతోనే ఉండే నాయకులకు అందదా? అందుతుంది, కానీ, అంగీకరించరు. తన రేటింగ్ తగ్గిందని సిటింగ్ ఎంపీలకు, ఎమ్మెల్యేలకు తెలుస్తుంది, కానీ ఒప్పుకోబుద్ధి వేయదు. ఎదురులేదని చెవుల్లో హోరెత్తే భజనల్లో హితవాక్యాలు వినిపించవు. క్షేత్రస్థాయి ప్రజాప్రతినిధులకే అట్లా ఉంటే, రాష్ట్ర నేతలకు ఎట్లా ఉంటుంది? కోటలాగా కమ్ముకున్న కోటరీ, జయజయధ్వానాలను తప్ప అపశబ్దాలను దగ్గరికి కూడా రానివ్వదు కనుక, చాపకింద నీరు అసలే తెలియదు.

కేసీఆర్ విషయంలో అలానే జరిగింది. జనంలో వ్యతిరేకత అంత గగ్గోలుగా ఉంటే కూడా, ఆయనకు వినపడలేదు. లేదా, వినిపించుకోలేదు. ఇప్పుడు జగన్ సంగతీ అంతే. కాళ్ల కింద నేల జారిపోతున్నా, వాస్తవం తలకెక్కడం లేదు. ఓటమి పర్యవసానాలంటే భయం లేకపోలేదు, కానీ, తన సొంత బటన్ సంక్షేమం మీద అపారమైన నమ్మకం. కండబలం మీద మంద బలం మీద విశేషమైన గౌరవం. తన గెలుపునకు భరోసా లేదన్న ధీమాతో ఊహలలో తేలిపోతున్నారు. తప్పుల మీద తప్పులు చేసి, అధికారాంతం కోసం అవురావురుమంటున్నారు. మరోపక్క, అపజయభయంతో పత్రికల మీద, పాత్రికేయుల మీద దాడులకు తెగబడుతున్నారు. ఉత్తరాది తరహాలో మూకలను ఉసిగొల్పుతున్నారు. సర్వశక్తిమంతులమని భ్రమపడే ఇటువంటి నాయకుల వల్ల అనేక సమస్యలున్నా, జనానికి ఒక సదుపాయం కూడా ఉన్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజల మనసులో మాట తమ చెవి సోకకుండా, తగిన జాగ్రత్తలు తీసుకుంటారు కాబట్టి, చాపకిందనీరులా ప్రజలు తమ అభీష్టాన్ని నెరవేర్చుకోవచ్చు.

ఏదైనా పక్షానికి గెలుస్తామన్న ధీమా, అన్నీ సవ్యంగా ఉన్నప్పుడు సానుకూలంగా పనిచేస్తుంది కూడా. యుద్ధం అన్ని వేళలా, భౌతికంగానే ఉండదు. ప్రత్యక్ష యుద్ధానికి ముందు పరోక్ష యుద్ధం ఉంటుంది, మరో పక్క మానసిక యుద్ధం ఉంటుంది. ఉత్సాహం మీద ఉన్న పక్షానికి, విజయం ఖాయమనే నమ్మకం అదనపు బలాన్ని ఇస్తుంది. ఇతర అంశాలు అనుకూలంగా ఉంటే, ఈ అదనపు బలం విజయానికి చేరువ చేస్తుంది. ఏ పక్షమూ కూడా తను ఓడిపోతానని అనుకోదు. తనకు తాను విజయోత్సాహాన్ని, ప్రత్యర్థులకు అపజయ భావాన్ని కలిగించడమే మానసిక యుద్ధం లక్ష్యం.

జాతీయస్థాయిలో చూస్తే, తాను గెలవడం నూటికి నూరుపాళ్లు, నిస్సందేహమైన పరిణామం అన్నట్టు భారతీయ జనతాపార్టీ ధీమాగా ఉంది. సొంతంగా 370 అందుకుంటామా లేదా, మిత్రులతో కలసి 400 దాటతామా లేదా అన్నదే తప్ప, మరో చింత తనకు లేదని ఆ పార్టీ చెబుతోంది. ఇక, తిరుగులేని అధికారంలో ఉన్న పార్టీ కాబట్టి, జాతీయ మీడియా అంతా అదే చాటింపు వేస్తోంది. ఇది మొత్తంగా ఎన్నికల వాతావరణాన్ని ముందే ఫలితం నిర్దయమైపోయిన క్రీడ లాగా మార్చేసింది. బీజేపీ కూటమి 400 దాటడం అసాధ్యం అంటారు ప్రతిపక్ష ఇండియా కూటమి నాయకుడు మల్లికార్జున ఖర్గే. ఆయన మాటల్లో కూడా "మీదే గెలుపు ఒప్పుకుంటున్నాము కానీ, అన్ని సీట్లు మాత్రం రావు" అన్న ధోరణే వినిపించింది. నాలుగువందలు మాకు వస్తాయో రావో కానీ, మీరు మాత్రం 40 కంటె ఎక్కువ తెచ్చుకోవాలని కోరుకుంటున్నా.. అని నరేంద్రమోదీ కాంగ్రెస్‌ను ఉద్దేశించి చెణికారు. ఇప్పుడు 40కీ 400కీ నడుమ యుద్ధమన్నమాట. తాను చేస్తున్న తప్పు అర్థమై ఖర్గే తాజాగా, బీజేపీకి 100 సీట్లు కూడా రావని అన్నారు కానీ, అది బక్క కోపంతో అన్న మాటల్లాగే వినిపించాయి.



■ కె. శ్రీనివాస్

సందర్భం

ఘనవిజయం సాధిస్తున్నా అని మోదీ పరివారం అనుకుంటున్నట్టుగానే, ఓడిపోతున్నాం అని ప్రతిపక్ష శిబిరమూ అనుకుంటోంది. ఇప్పుడు కాదు, మేం 2029లో చూసుకుంటాం అని కేజ్రీవాల్ అంటున్నారు. ఇంకో వైపున ఒకనాటి కాంగ్రెస్ అగ్రనేతల వారసులు బీజేపీలోకి దూకేస్తున్నారు. కశ్మీర్ నాయకులు అర్ధరాత్రులు అధికార భవనాల్లో తచ్చాడుతున్నారని గులాం నబీ ఆజాద్ అంటున్నారు కానీ, దేశవ్యాప్తంగా వీరాధివీర ప్రతిపక్ష నేతలు అదే పని చేస్తున్నారు.

సాధారణ ఎన్నికల మానసిక యుద్ధరంగం ఒకవైపే మొగ్గి ఉంది నిజమే కానీ, మరి ఓటర్లు కూడా నిజంగా అటే ఉన్నారా? ఒక వార్తాసంస్థ జరిపిన సర్వేలో తెలంగాణలో 34 శాతం మంది ప్రధానిగా మోదీని ఇష్టపడుతుంటే, 23 శాతం మాత్రమే రాహుల్ గాంధీని కోరుకుంటున్నారట. మరి, తెలంగాణలో బీజేపీ కాంగ్రెస్ కంటె ఎక్కువ ఎంపీ సీట్లు గెలవబోతోందా? యాభైశాతం దాకా మోదీ ప్రభుత్వం పనితీరు సంతృప్తికరంగా ఉన్నట్టు చెప్పారు, మరి వాళ్లంతా బీజేపీకి ఓట్లు వేస్తారా? ఈ దేశంలో ఓటింగ్ సరళి ఇంకా ప్రాంతీయ ఆలోచన ద్వారానే వ్యక్తమవుతోంది. ఎవరూ నేరుగా ప్రధానిని ఎన్నుకోరు. ఉత్తరాదిలో అనేక రాష్ట్రాలలో బీజేపీ ప్రాబల్యం కారణంగానే జాతీయస్థాయిలో ఆ పార్టీకి ఆధిక్యం లభిస్తోంది తప్ప, జాతీయ ప్రాధాన్యాల ఎంపికనుంచి కాదు. అన్ని రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్లు కావాలని బీజేపీ కోరుకునేది అందుకే, ప్రాంతీయ, జాతీయ అదేశం సాధించవచ్చునని. రాష్ట్ర స్థానికతలను అధిగమించే బాధ్యతను రామాలయ ప్రచారం తీసుకోగలదని ఆ పార్టీ ఆశిస్తోంది. బహుశా, అందులో అది కొంతవరకు విజయం సాధించేటట్టే ఉంది.

తమకిక ఓటమే ఖాయమని అనుకునేటట్టయితే, ప్రతిపక్ష కూటమికి పోరాడే చేవనే ఉండబోదు. ఎంతో కొంత ప్రతిఘటన ఇవ్వాలని, కనీసం అనుకున్న సంఖ్య అందకుండా చూడాలని ప్రతిపక్ష శ్రేయోభిలాషులు సమాధానపడవచ్చును కానీ, ప్రతిపక్షాలు మాత్రం గెలవగలమనే అనుకోవాలి. ఏ ధైర్యంతో రెండు రాష్ట్రాల రైతులు ఢిల్లీలో బైఠాయించి, తమ గొంతు వినిపిస్తున్నారు? కేంద్రం వివక్ష మీద ఢిల్లీ పౌరులతో ఉద్యమిస్తానని కేజ్రీవాల్ ఎందుకు ఆలోచన చేస్తున్నారు? అన్ని చోట్లా వీగిపోయిన కాంగ్రెస్ పొత్తు ఉత్తరప్రదేశ్‌లో ఎందుకు సఫలమయింది? అన్ని చీలికలు, ఫిరాయింపులు జరిగి, అనేక ఉద్రిక్తతలను అనుభవించి, చివరకు మరాఠా రిజర్వేషన్లను సాధించి కూడా మహారాష్ట్ర సమాజం ఎందుకు అంత గుంభనంగా ఉన్నది? మరీ దేశం అంత ఎడారిగా మారలేదు! దేవుణ్ణి మెచ్చినంతమాత్రాన, ప్రజలు రాజునీ మెచ్చాలని ఏమీలేదు! తలచుకుంటే జనం తమ విచక్షణతో అందరినీ ఆశ్చర్యపరచవచ్చు!

జనహృదయంలో ఏకపక్షంగా ఘనవిజయాలు అందించే ఆలోచనలేవీ ఉన్నట్టు కనిపించకపోవడం వల్లనే ఢిల్లీ వ్యూహకర్తలు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కేసీఆర్ లాగా, జగన్ లాగా ముంచుకు వస్తున్న ముప్పును చూడకుండా కళ్లు మూసుకోవడం లేదు. ఓట్ల కుంభవృష్టి కురుస్తుందని పైకి చెబుతూనే, ఒక్క చినుకూ వృథాపోకుండా పట్టుకోవాలని చూస్తున్నారు. అంకెలలో ఎవరు అధికులో వారికే అధికారం వస్తుంది నిజమే కానీ, ఈ సారి అనేక పవనాలు, అనేక వెల్లువలు భారతీయ సమాజంలో ప్రసరిస్తున్నాయేమో, ప్రవహిస్తున్నాయేమో అనిపిస్తుంది. తమను అతిగా ప్రభావితం చేసి, అభిమతాలను దారి మళ్లించాలనుకునే ధోరణులకు పగ్గం వేసే లక్షణం ఏదో మన రాజకీయ ఎంపికలకు ఉండవచ్చునన్న ఆశ కలుగుతుంది. ఇది ఒక ధోరణికి వ్యతిరేకతో, మరొకదానికి అనుకూలతో కాదు, అన్నీ తానై ఆక్రమించుకునే బాహుబలి తత్వాన్ని నిరాకరించే ప్రజాస్వామికత.

> జనహృదయంలో ఏకపక్షంగా ఘనవిజయాలు అందించే ఆలోచనలేవీ ఉన్నట్టు కనిపించకపోవడం వల్లనే ఢిల్లీ వ్యూహకర్తలు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కేసీఆర్ లాగా, జగన్ లాగా ముంచుకు వస్తున్న ముప్పును చూడకుండా కళ్లు మూసుకోవడం లేదు. అంకెలలో ఎవరు అధికులో వారికే అధికారం వస్తుంది నిజమే కానీ, ఈ సారి అనేక పవనాలు, అనేక వెల్లువలు భారతీయ సమాజంలో ప్రసరిస్తున్నాయేమో, ప్రవహిస్తున్నాయేమో అనిపిస్తుంది. తమను అతిగా ప్రభావితం చేసి, అభిమతాలను దారి మళ్లించాలనుకునే ధోరణులకు పగ్గం వేసే లక్షణం ఏదో మన రాజకీయ ఎంపికలకు ఉండవచ్చునన్న ఆశ కలుగుతుంది.

> ఈ సాధారణ ఎన్నికలు దేశానికి ఎంతో ముఖ్యమని, భయరహితమైన భవితవ్యానికి ఎంతో కీలకమని గుర్తింపు పెద్దగా లేకుండానే అశేషజనం ఈ ప్రక్రియలో పాల్గొంటారు. కానీ చైతన్యవంతులైన అతికొద్ది మంది మాత్రమే కాలాన్ని మలుపు తిప్పే ప్రయత్నం చేస్తారు.

మరో రెండువారాల్లో ఎన్నికల రంగస్థలం అవతరిస్తుంది. ఆ తరువాత చేయలేని అనేక పనులు ఈ లోగా జరిగిపోతాయి. అనేక రాజకీయ కథనాలు సామాజిక మాధ్యమాల ద్వారా, ప్రధాన మీడియాద్వారా ప్రజల మీదకు దాడిచేస్తాయి. జనం చూపును, శ్రవణశక్తిని, విచక్షణను అనునయించే, భ్రమపెట్టే, గందరగోళపరిచే అనేక విన్యాసాలు విజృంభిస్తాయి. ప్రజల ఎంపికల మీద సంధించే ఆఖరి అస్త్రం డబ్బు. ఈ సాధారణ ఎన్నికలు దేశానికి ఎంతో ముఖ్యమని, భయరహితమైన భవితవ్యానికి ఎంతో కీలకమని గుర్తింపు పెద్దగా లేకుండానే అశేషజనం ఈ ప్రక్రియలో పాల్గొంటారు. కానీ చైతన్యవంతులైన అతికొద్ది మంది మాత్రమే కాలాన్ని మలుపు తిప్పే ప్రయత్నం చేస్తారు.

ఎం.ఎస్. స్వామినాథన్‌ని 'ఎం.ఎస్.పి'కి కుదించేశారు!

హరిత విప్లవ పితామహుడు డాక్టర్ స్వామినాథన్‌కి మరణానంతర భారతరత్న, ఇంతలోనే మళ్లీ రైతుల ముట్టడి. మళ్లీ కదిలింది హరిత విప్లవ పంజాబు రైతులే. హరిత విప్లవం వల్ల ధాన్యాల దిగుమతులు అవసరంలేని స్థితికి చేరుకున్నట్టే కనిపించినా, పప్పులూ వంటనూనెల దిగుమతులు 2031 దాకా తప్పవని నాబార్డ్ అధ్యయనం చెప్తున్నది. గత మూడేళ్లలో వాటి దిగుమతుల విలువ రూ.4 లక్షల కోట్లు. ఉల్లి వెల్లుల్లి దిగుమతులూ సాగుతున్నాయి! ఇంకా అనేక సమస్యలు — పాతవీ కొత్తవీ కూడా — పరిష్కారం కాకుండా ఉన్నాయి.

భారీస్థాయిలో యంత్రాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో కూడిన హరితవిప్లవం భూసారాన్ని, నీటి వనరులని, పర్యావరణాన్ని దెబ్బతీసిందన్న విమర్శలు తెల్సినవే. అంతేనా? అనేకానేక ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, సమస్యల్నీ వైరుధ్యాల్నీ సృష్టించింది హరిత విప్లవం. గ్రామీణ నిరుద్యోగం, పట్టణాలకి వలసల పెరుగుదల సంక్షోభ స్థాయిలో ఉన్నాయి. పట్టణ నిరుద్యోగం తీవ్రమైంది. ఆ క్రమంలోనే యూపీఏ కాలంలో — కోట్లాదిమందికి ఏటా కనీసం వందరోజుల ఉపాధిని విధిగా ప్రభుత్వమే కల్పించే ఉద్దేశంతో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం రూపొందింది. దాని రద్దుని మోదీ తొలిదశలో ఆలోచించినా, దశాబ్దాల యూపీఏ వైఫల్యాన్ని ఎత్తి చూపటానికైనా ఆ పథకాన్ని అట్టిపెడతాం అన్నట్టుగా కొనసాగిస్తున్నారు. పదేళ్ల 'సబ్ కా వికాస్' పాలన తర్వాత, ఉచితంగా 80 కోట్ల మందికి నెలకి తలకు 5కిలోల తిండిగింజలని మరో 5 ఏళ్ల పాటు ఇస్తాం అని ప్రధానమంత్రి ప్రకటించారు. 2020లో కోవిడ్ వల్ల ప్రారంభించిన ఉచిత ఆహార ధాన్యాల పథకాన్ని, 2013 నాటి కాంగ్రెస్ వారి ఆహార భద్రతా చట్టంతో జోడించి మోదీ కొనసాగిస్తున్నారు. ఉచితాలు సముచితం కాదంటూనే మోదీ ఛత్తీస్‌గఢ్ ఎన్నికల మధ్య ఈ ప్రకటన చేశారు. ఇందిరమ్మ గరీబీ హటావో నినాదం ఇచ్చిన 50ఏళ్లకు ఇంకా 'గరీబ్ కళ్యాణ్ అన్నయోజన' పేరిట పథకం కొనసాగింపు ఆయా ప్రభుత్వాల నిర్వాకానికీ దేశ దుర్గతికీ సాక్ష్యంగా ఉన్నది. 80 కోట్ల మందికి ఐదేళ్లు ఉచితంగా తిండి గింజలను ఇవ్వగల సామర్థ్యాన్ని ఇచ్చిన హరిత విప్లవమే కోట్లాది పేదల్ని సృష్టించటం మన వ్యవస్థ విధాన వైఫల్యాల్నీ వైరుధ్యాల్నీ ఎత్తిచూపుతున్నది. దేశదుర్గతిని, వ్యవసాయరంగ సంక్షోభాన్ని బట్టబయలు చేసే యథార్థ దృశ్యమిది.



> వ్యవసాయ యోగ్యమైన భూములని, అడవులని వ్యవసాయేతర రంగాల్లోని వారూ, పెట్టుబడిదారులూ, కార్పొరేట్లూ, ఫార్మ్ హౌసుల దొరలూ చౌకగా కాజేస్తున్నారు. అలాంటి వ్యవసాయభూముల మళ్లింపుని నివారించాలని స్వామినాథన్ కమిషన్ సూచించింది. పాలక వర్గాలే కాక వామపక్షాలూ ఈ భూమి సమస్యని వదిలేశాయి.

బీటెక్ పాసైన లక్షలాదిమంది యువత అమెజాన్‌లో, ఊబర్‌లో, ఓలాలో రోజు కూలీలుగా కుములుతున్నారు. అలాంటివారు ప్రభుత్వ రంగంలో నాలుగో తరగతి ఉద్యోగాలకై ఏళ్ల తరబడి కోచింగులు తీసుకుంటున్నారు. విద్యా ఉపాధి రంగాల్లోని సంక్షోభాన్ని ఏకకాలంలో ఎత్తిచూపుతున్న సన్నివేశం ఇది. మిగులు ధాన్యాన్ని మార్కెట్‌కై ఉత్పత్తి చేస్తున్న వేలమంది 'అన్నదాతలు' — అందులో అత్యధిక భాగం భూస్వాములూ, ధనిక రైతులూ — రోడ్డెక్కిన తరుణంలో నిర్బంధమే విధానంగా ఉన్న రామరాజ్యం మనది. కనీస మద్దతు ధర, రుణమాఫీ, ఉచిత విద్యుత్తు వంటి డిమాండ్లూ, ఆ డిమాండ్లకు పర్యాయపదమన్నట్టుగా పదేపదే ప్రస్తావించబడుతున్న స్వామినాథన్ రిపోర్టు మరోసారి విస్తృతంగా చర్చలోకి వచ్చాయి. అయితే పెద్దలంతా చూడదలచని వాస్తవం ఒకటుంది. స్వామినాథన్ 2006లోనే లేవనెత్తిన ఒక మౌలిక సమస్యని అందరూ విస్మరిస్తున్నారు. 'భూసంస్కరణలు ఇంకా ముగియని ఎజెండాగా ఉన్నాయి' అని ఆ నివేదిక నొక్కిచెప్పింది.

భూసంస్కరణల ప్రకారం మిగులు భూముల్నీ, బంజరు భూముల్నీ భూమిలేని పేద రైతాంగానికి పంచాలని నివేదికలో ఉందని అంతా మర్చిపోయారు. గ్రామీణ కుటుంబాల్లో 10 శాతంగా ఉన్న సంపన్నుల చేతిలో 54శాతం సాగుభూమి ఉన్నదనీ, క్రిందనున్న సగం గ్రామీణ జనాభా వద్ద కేవలం 3.8శాతం భూమి ఉన్నదనీ, ఏళ్ల తరబడి సాగుచేస్తున్న భూమికి తామే యజమానులు కావాలని గ్రామీణపేదలు కోరుతున్నారనీ స్వామినాథన్ నివేదిక చెప్పింది. కలప కాకపోయినా మిగతా అడవి ఉత్పత్తులైనా తమకు చెందాలనీ, పచ్చిక మైదానాల్లో పశువుల మేత హక్కులు గ్యారంటీ చేయబడాలనీ ఆదివాసులు, పశుపోషకులు, ఇతర గ్రామీణ పేదలూ కోరుతున్న వాటిని వారికి దక్కేలా చూడాలనీ నివేదికలో పేర్కొన్నారనీ అంతా మర్చిపోయారు! ఈ అసమానతలు కొనసాగుతున్నాయని ఇటీవలి వ్యవసాయ గణాంకాలూ సూచిస్తున్నాయి. సుమారు 48 కోట్ల ఎకరాల పంట భూమిలో వర్షాధార సాగుభూమి 60శాతం దాకా ఉందనీ, వ్యవసాయోత్పత్తుల్లో 45శాతం అలాంటి భూమి నుంచేననీ అందులో పేర్కొన్నారు. పంట కాలువల్లేని వెనుకబడిన ప్రాంతాల్లో చాలినంత సాగునీరు దక్కని గ్రామీణ పేదలే ఈ శ్రేణుల్లో ఉండి ఆహారోత్పత్తికి దోహదం చేస్తున్నారు. ఉచిత ఆహార పథకం పొందే 80కోట్ల మందిలో అత్యధికులు ఈ వర్గాలూ, గ్రామాల్లో బతకలేక పట్టణాలకు వచ్చిన పట్టణపేదలే. ఈ పేదల సమస్యల్ని పరిష్కరించకపోవటం వల్ల గిట్టుబాటు కాని వ్యవసాయాలు చేయలేక, ఆ భూముల్ని తెగనమ్ముకుని వ్యవసాయ రంగం నుంచే ఏటా లక్షలాదిగా వైదొలగుతున్నారు. వ్యవసాయ యోగ్యమైన భూములని, అడవులని వ్యవసాయేతర రంగాల్లోని వారూ, పెట్టుబడిదారులూ, కార్పొరేట్లూ, ఫార్మ్ హౌసుల దొరలూ చౌకగా కాజేస్తున్నారు. అలాంటి వ్యవసాయ భూముల మళ్లింపుని నివారించాలని కమిషన్ రిపోర్టులో సూచించింది.

ఈ పేదల సమస్యలే మన దేశ వ్యవసాయ రంగ సంక్షోభంలోని కీలకాంశం. దాన్ని స్వామినాథన్ కమిషన్ ఎత్తి చూపినా విస్మరిస్తున్నారు. పాలక వర్గాలే కాక వామపక్షాలూ ఈ భూమి సమస్యని వదిలేశారు. వ్యవసాయంలో పెట్టుబడిదారీ అభివృద్ధి పేరిట సమర్థించుకుంటున్నారు. హరిత విప్లవం మొదలైన సుమారు 30ఏళ్ల తర్వాత హరిత విప్లవ పితామహుడు నొక్కిచెప్పిన ఈ విషయాన్ని విస్మరిస్తున్నారు. స్వామినాథన్ రిపోర్టు అంటే కనీస మద్దతు ధరలూ వగైరాయే అన్న రీతిలో కుదించి వక్రీకరించి చూపెడుతున్నారు.

పెట్టుబడిదారీ వ్యవసాయం 50ఏళ్లుగా అత్యంత అభివృద్ధి చెందిన 'పంజాబులో ఈనాటికీ అర్థ ఫ్యూడలిజం తాండవిస్తున్నది; అందువల్ల పెట్టుబడిదారీ సంబంధాలు పూర్తిగా రూపుదాల్చలేదు' అని అక్కడి ఉద్యమకారులు అంటున్నారు. ఇటీవలి రైతు ఆందోళనలోని సంస్థలవారు తాము పంజాబులో దేశీ విదేశీ బడా పెట్టుబడిదారులతోపాటు అర్థఫ్యూడలిజాన్నీ వ్యతిరేకించి పోరాడాల్సివస్తున్నదని చెప్తున్నారు. పంజాబ్ గ్రామాల్లోని లక్షలాది వ్యవసాయకూలీలు భూమి కోసం తహతహలాడుతున్నారు. దేశంలోనే అత్యధిక శాతం దళితులున్న పంజాబులో వారిపై దోపిడీ అణచివేతలు కొనసాగుతున్నాయి. జాట్ తదితర భూస్వామ్యవర్గాల సేవలో తరిస్తున్న పార్టీలన్నీ వారిని విస్మరిస్తూ వచ్చాయి. ఆ అదనులోనే ఆప్ పార్టీ దళిత ముఖ్యమంత్రి వచ్చారు. స్వామినాథన్ పేరిట భూస్వాముల సేవలో మునిగిన అందరినీ ప్రజలు, ముఖ్యంగా గ్రామీణ పేదలు నిలదీయాల్సిన తరుణమిది.

■ ఎమ్. జయలక్ష్మి
ఆప్కాబ్ రిటైర్డ్ ఏజీఎం

స్ఫూర్తిదాయక తీర్పు

చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో జరిగిన అక్రమాన్ని నిలువరించి, నిజమైన విజేతకు పట్టం కడుతూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు అభినందనీయం. ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఆలంబన. జనవరి 30న జరిగిన ఆ ఎన్నికలో రిటర్నింగ్ అధికారి బహిరంగంగా, నిర్లజ్జగా నిబంధనల్ని తోసిపుచ్చి, ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్‌లకు చెందిన ఎనిమిది ఓట్లను ఉద్దేశ్యపూర్వకంగా చెల్లనివిగా ప్రకటించి అసలు విజేతను వెనక్కి నెట్టాడు. పరాజిత బీజేపీ అభ్యర్థిని మేయర్‌గా ప్రకటించాడు. పట్టపగలు, వీడియోల సాక్షిగా బయటపడ్డ ఆ అన్యాయపు ఎన్నికను బీజేపీ ఏ శషభిషలు లేకుండా తన ఖాతాలో వేసుకుంది. ఇప్పుడు సుప్రీంకోర్టు 142 ఆర్టికల్ ద్వారా తనకున్న అధికారాన్ని వినియోగించి ఆ ఎన్నిక చెల్లనేరదని చెప్పడమే కాకుండా రిటర్నింగ్ అధికారి రద్దు చేసిన ఓట్లను లెక్కలోకి తీసుకుని అసలు విజేతను మేయర్‌గా ప్రకటించింది. తప్పు చేసిన అధికారిపై కన్నెర్ర చేసింది.

వివాదాస్పదంగా మారిన ఒక ఎన్నికల ప్రక్రియలో సుప్రీంకోర్టు స్పష్టమైన వైఖరి తీసుకోవడం ఇదే మొదటిసారి. ఆహ్వానించదగ్గ పరిణామం. ఇది స్థానిక ఎన్నికకు పరిమితమైన చిన్న విషయం కాదు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి భంగం కలిగే పరిస్థితి వస్తే న్యాయపాలిక చూస్తూ ఊరుకోబోదన్న భరోసా ఇచ్చిన తీర్పు. ఇది జాతీయ పార్టీ బీజేపీ తలదించుకోవాల్సిన తీర్పు. దేశాన్నేలుతూ ఎన్నికల రాజకీయాల్లో పై చేయిగా ఉన్న ఆ జాతీయ పార్టీ ఒక చిన్న స్థానిక ఎన్నికలో తప్పుడు మార్గంలో గెలవాలని చూడడం, గెలుపు కోసం ప్రజాభిప్రాయాన్ని తారుమారు చేయడం, తప్పు నిరూపితం అయిన తర్వాత కూడా వేరే మార్గాల్లో దొడ్డిదారిలో వచ్చిన పదవిని కాపాడుకోజూడడం దాని విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఆ ఎన్నికని సుప్రీంకోర్టు ఒకవేళ రద్దు చేసి, రీపోలింగ్ జరిపేటట్లు తీర్పు ఇచ్చి ఉంటే మరలా తమ అభ్యర్థి గెలిచేందుకు వీలుగా, ముగ్గురు ఆమ్ ఆద్మీ పార్టీ కౌన్సిలర్లు పార్టీ మారడం ఇందుకు సాక్ష్యం. అలాంటి జిత్తులకు తావివ్వకుండా సుప్రీంకోర్టు అసలైన విజేతను నిర్ద్వంద్వంగా ప్రకటించింది. ఈ స్ఫూర్తిదాయక తీర్పు ప్రజల్లో చైతన్యం పెంచాలి. ఎన్నికల దీపాన్ని గాలిలో పెట్టి సుప్రీందే భారం అంటే కుదరదు. అన్ని వేళలా న్యాయపాలిక ఆదుకోవడం అసాధ్యం. పౌరులు చైతన్యంతో మెలగడం, ఎక్కడికక్కడ ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య రీతులు అమలయ్యేలా చూడడం చెయ్యాలి. ఎన్నికల ప్రక్రియను అవహేళన చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలి. ప్రజాస్వామ్యానికి ప్రజలు ప్రభువులు మాత్రమే కాదు రక్షకులు కూడా.

— డి.వి.జి. శంకరరావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

కృష్ణా జలాలపై కుప్పిగంతులు

గత కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం చేసిందని, జగన్‌రెడ్డితో కుమ్మక్కై ఏపీకి దోచి పెట్టిందని తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ విషయంపై ఏపీ అసెంబ్లీలో సీఎం జగన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కూడా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. దీనిపై ఏపీ నీటిపారుదల శాఖా మంత్రి అంబటి ఇదంతా కాంగ్రెస్ — బీఆర్ఎస్‌ల మధ్య రాజకీయ పోరులో భాగమే గానీ, నిబంధనలకు విరుద్ధంగా ఏపీ ఒక్క చుక్క కూడా అదనంగా తీసుకోలేదని పేలవంగా స్పందించారు. అంతేతప్ప గణాంకాలతో వివరించే ప్రయత్నం చేయలేదు. జగన్‌రెడ్డి — కేసీఆర్‌ల మధ్య ఉన్న స్నేహబంధం అనేక విషయాల్లో నిరూపితమైంది. అయితే నిజంగా ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఆరోపిస్తున్నట్టు కృష్ణా జలాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏపీకి దోచిపెడితే, ఆ నీటిని వైసీపీ ప్రభుత్వం సద్వినియోగం చేసుకుని ఉంటే, కృష్ణా డెల్టా పరివాహక ప్రాంతం గానీ, రాయలసీమ ప్రాంతం గానీ సస్యశ్యామలం అయ్యుండేదిగా అనే ప్రశ్నకు ఎవరివద్దా సమాధానం లేదు.

అసలు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణల్లో నిజమెంత అన్నది కూడా మనం ఒక్కసారి ఆలోచించాలి. జగన్‌రెడ్డి — కేసీఆర్‌ల మధ్య ఉన్న స్నేహసంబంధాలు వారి రాజకీయ, ఆర్థిక ఎదుగుదలకు మాత్రమే గానీ, రెండు తెలుగు రాష్ట్ర ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదన్నది వాస్తవం. వారి స్నేహం వలన ఒక్క విభజన సమస్య కూడా పరిష్కారం కాలేదు. పైగా తెలంగాణ ఎన్నికల వేళ సాగర్ డ్యామ్‌పై రెండు రాష్ట్రాల పోలీసులతో కేసీఆర్ — జగన్ రెడ్డిలు చేసిన హైడ్రామా వారి మధ్య ఉన్న బలమైన చీకటి స్నేహాన్ని బయటపెట్టింది. అయితే ఈ హఠాత్పరిణామాలకు తెలంగాణలో నెలకొన్న రాజకీయ పరిస్థితులే కారణం తప్ప మరొకటి కాదనే వాదనలు బలంగానే వినిపిస్తున్నా, ఆ కారణం కూడా ఒకింత నిజమే అయినా, భవిష్యత్తులో రెండు రాష్ట్రాలలో అధికారంలో ఉండే ప్రభుత్వాల స్వార్థ రాజకీయాలకు నీటి ప్రాజెక్టులు కూడా ఆయుధాలు అవుతాయి కాబట్టి, అనేక ఏళ్ల తరబడి రగులుతూనే ఉన్న ఈ నీటి సమస్యలకి ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం జరగాలని అందరూ కోరుకుంటున్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో 1995 ఫిబ్రవరి 15న వచ్చిన జీవో నం. 69లో 834 అడుగుల నీటి మట్టం క్రింద విద్యుత్ ఉత్పత్తి చేయకూడదని, ఆ విద్యుత్ ఉత్పత్తి చేసేటప్పుడు 834 అడుగుల పైన కూడా నాగార్జునసాగర్ వద్ద కృష్ణా డెల్టాలో ఇరిగేషన్‌కు నీరు అవసరం ఉన్నప్పుడు మాత్రమే జల విద్యుత్ చేయాలని పేర్కొన్నారు. అయితే 800 అడుగులకు కూడా నీరు చేరకుండానే ఎడమవైపు నుంచి గత కేసీఆర్ ప్రభుత్వం జల విద్యుత్ ఉత్పత్తి చేసి జీవో 69ను ఉల్లంఘించింది. ఏపీ ప్రభుత్వం దీనిపై కృష్ణా యాజమాన్య బోర్డుకు ఫిర్యాదు చేయగా, బోర్డు కూడా విద్యుత్ ఉత్పత్తి చేయడం ఆపాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ ఆదేశాలను కూడా గత తెలంగాణ ప్రభుత్వం బేఖాతరు చేస్తూ పోలీసు పహరాలో సాగర్, జూరాల, పులిచింతల వద్ద నూరు శాతం జల విద్యుత్తును ఉత్పత్తి చేసింది. పులిచింతల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కట్టిందే కృష్ణా డెల్టా కోసం. దానికి వేరే ఆయకట్టు లేదు. పులిచింతల వద్ద వదిలేస్తే నీరు డైరెక్టుగా ప్రకాశం బ్యారేజీకి చేరుకుంటుంది. అక్కడ 3 టీఎంసీలకంటే ఎక్కువ నీరు నిల్వ చేయడానికి లేదు. తెలంగాణ ప్రభుత్వం జలవిద్యుత్‌తో విడుదల చేస్తున్న నీరు అంతా వృథాగా సముద్రంలోకి పోతోంది. అవసరానికి మించి కృష్ణా డెల్టాకు కాలువల ద్వారా నీరు విడుదల చేసే అవకాశం లేదు. అందుకే 834 అడుగుల లోపు నీటి మట్టం వద్ద జల విద్యుత్ చేయకూడదనే నిబంధన అప్పట్లోనే పెట్టారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మించేటప్పుడు జల విద్యుత్ ప్రాజెక్టుగానే నిర్మించినా 1981లో శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ (ఎస్సార్బీసీ)ని డిజైన్ చేశాక ఆ ప్రాజెక్టును బహుళార్థ సాధక ప్రాజెక్టుగా మార్చారు. ఎడమవైపున ఉన్న శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్సెల్బీసీ) ఆ తరువాత కట్టిందే అన్నది తెలంగాణ ప్రభుత్వం ఎందుకు విస్మరిస్తుందో అర్థం కానిది. ముందుగానే కట్టిన కుడి కాలువ వైపున విద్యుత్తును ఉత్పత్తి చేయకుండా, నీళ్ల లేకపోయినా కూడా తర్వాత కట్టిన ఎడమ కాలువ వైపునుండి జల విద్యుత్ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం చెప్పడం ఎంతవరకు సబబో ఆలోచించాలి.

> ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఆరోపిస్తున్నట్టు కృష్ణా జలాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏపీకి దోచిపెడితే, ఆ నీటిని వైసీపీ ప్రభుత్వం సద్వినియోగం చేసుకుని ఉంటే, కృష్ణా డెల్టా పరివాహక ప్రాంతం గానీ, రాయలసీమ ప్రాంతం గానీ సస్యశ్యామలం అయ్యుండేదిగా అనే ప్రశ్నకు ఎవరివద్దా సమాధానం లేదు.

బచావత్ ట్రిబ్యునల్ వినియోగ ప్రాతిపదికపై ప్రాజెక్టుల వారీగా నీటిని కేటాయించింది. పర్యవసానంగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీల కేటాయింపు జరిగింది. జూరాల, రాజోలిబండ మళ్లింపు పథకం, కేసీ కెనాల్, తుంగభద్ర ఎగువ కాలువ దిగువ కాలువ, నాగార్జునసాగర్ కుడి ఎడమ కాలువలు, కృష్ణా డెల్టాకు విస్పష్టంగా నీటిని కేటాయించింది. దాన్ని వక్రీకరించడానికి, ప్రాజెక్టుల వారీగా నీటిని కేటాయించలేదని అడ్డగోలుగా వాదించడం వల్ల



ఎలాంటి ప్రయోజనం లేదు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కూడా బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను మార్చడానికి వీల్లేదని విస్పష్టంగా తన తీర్పులో పేర్కొన్న వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి. అమలులో ఉన్న బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ఉభయ రాష్ట్రాలకు శిరోధార్యం. ఆ తీర్పుకు అనుగుణంగానే కృష్ణా నదీ జలాలను వినియోగించుకోవడానికి రెండు రాష్ట్రాలూ చిత్తశుద్ధితో కట్టుబడి ఉండాలి. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌పై ఏపీ, తెలంగాణలు సుప్రీంకోర్టులో వేసిన కేసు తేలే వరకు ఏపీ, తెలంగాణలతో పాటు పైనున్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు కూడా బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కేటాయించిన నీటి ఆధారంగా ప్రాజెక్టుల నిర్మాణం చేయడం సరైనది కాదు. విభజన చట్టంలో తెలంగాణలో కల్వకుర్తి, నెట్టంపాడు, ఏపీలో తెలుగు గంగ, హంద్రీ — నీవా, గాలేరు — నగరి, వెలిగొండ ప్రాజెక్టులను మాత్రమే పెండింగ్ ప్రాజెక్టులుగా పేర్కొన్నారు. ఆ జాబితాలో లేని, జూరాల నుంచి ప్రతిపాదించబడిన పాలమూరు — రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని అపెక్స్ కౌన్సిల్ అనుమతి లేకుండా శ్రీశైలం జలాశయం నుంచి 800 అడుగుల నీటి మట్టం నుండి నీటిని తోడే పథకం అక్రమ ప్రాజెక్టు కాక, సక్రమ ప్రాజెక్టు ఎలా అవుతుందో తెలంగాణ ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

ప్రస్తుతం శ్రీశైలం ఏపీ నిర్వహణలోనూ, నాగార్జునసాగర్ తెలంగాణ నిర్వహణలోనూ ఉన్నాయి. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులున్న ప్రాజెక్టులన్నీ కృష్ణాబోర్డు పరిధిలోకి వస్తాయి. అయితే కృష్ణాజలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ — కాంగ్రెస్ నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రాజెక్టులకు కేఆర్ఎంబీకి అప్పచెప్పేదిలేదని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం కూడా చేసింది. ఈ తీర్మానానికి ఎంత విలువ ఉందో కేంద్ర జలశక్తి శాఖ తేల్చి చెప్పాలి. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పచెప్పడమంటే అదేదో విదేశీయులకు కట్టబెడుతున్నట్టు, కృష్ణా నదిని వేరేచోటుకు తరలించుకుపోతున్నట్టు తెలంగాణ నాయకులు చేస్తున్న హడావిడి చూస్తుంటే హాస్యాస్పదంగా ఉంది. ఏ రాష్ట్రానికైనా ఆ రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టులు, తాగు సాగు అవసరాలను బట్టి నీటి కేటాయింపులు ఉంటాయి గానీ, పరివాహక ప్రాంతాన్ని బట్టి కాదు. ఒక పక్క పునర్విభజన చట్టాన్ని బట్టి హక్కులు కావాలని కోరుతూనే, మరో పక్క ఆ చట్టం అన్యాయం చేసిందని చెప్పడం రాజకీయ దురుద్దేశమే తప్ప మరొకటి కాదు. ఏదిఏమైనా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉభయ రాష్ట్రాలు సమన్వయంతో చర్చించుకోవడమే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం.

ముందుగా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అమలులో ఉన్న విభజన చట్టానికి కట్టుబడి ఉండాలి. ప్రస్తుతం అమలులో ఉన్న బచావత్ ట్రిబ్యునల్ తీర్పులను గౌరవించాలి. ఆ ట్రిబ్యునల్ గడువు ముగిసిపోయిన తర్వాత ఏర్పడిన బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌పై సుప్రీంకోర్టులో ఉన్న వ్యాజ్యం త్వరితగతిన తీర్పు వచ్చేలా ఉభయ రాష్ట్రాలూ, కేంద్ర ప్రభుత్వం కూడా శ్రద్ధ పెట్టాలి. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అమల్లోకి వస్తే మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య నెలకొన్న సమస్యలకు పరిష్కారం సులభమవుతుంది. ఇటువంటి శాశ్వత పరిష్కారాలకు చిత్తశుద్ధితో ప్రయత్నించాలే తప్ప గాల్లో కత్తులు దూసుకోవడం వలన ఎవరికీ ప్రయోజనం లేదనేది బీఆర్ఎస్ — కాంగ్రెస్ పార్టీలతో పాటు, ఇరు రాష్ట్ర ప్రభుత్వాలూ గ్రహించాలి.

• కూసంపూడి శ్రీనివాస్

దుర్గమ్మ సన్నిధిలో దోపిడీ



దేవస్థానంలోని చీరల కౌంటర్

పాలకమండలిలోని కీలక వ్యక్తి కాసుల కక్కుర్తి

పవిత్రమైన దుర్గమ్మ దేవస్థానంలో అవినీతి అసురులు ఎక్కువైపోతున్నారు. అమ్మకు సమర్పించే చీరలే కాదు.. భక్తులకు వడ్డించే అన్న ప్రసాదంలోనూ కాసులు దండుకుంటున్నారు. ప్రొటోకాల్ దర్శనాల భక్తుల నుంచి వచ్చే చీరలను మూడో కంటికి తెలియకుండా పాలకమండలిలోని ఓ చాంబరుకు తరలిస్తుండగా, అన్నదానం, పులిహోర ప్రసాదం, పడితరం బియ్యం సరఫరాలోనూ డబ్బు దండుకుంటున్నది సదరు పాలకమండలిలోని కీలక వ్యక్తే కావడం ఇప్పుడు ఇంద్రకీలాద్రిపై హాట్ టాపిక్స్‌గా మారాయి.

దారి తప్పుతున్న వీఐపీ భక్తులు సమర్పించే చీరలు

- మూడో కంటికి తెలియకుండా ఓ చాంబరుకు..
- అన్నదానం, పులిహోర, పడితరం బియ్యంలోనూ చేతివాటం
- టెండరులో ఉన్న రేటుకు కాకుండా ఎక్కువకు కొనుగోలు
- నాణ్యతలేని బియ్యంతో భక్తులకు అన్నప్రసాదం
- అక్టోబరు నుంచి దేవస్థానానికి రూ.12 లక్షల నష్టం
- ఆలస్యంగా గుర్తించిన ఈవో రామారావు
- ప్రత్యేక విచారణకు ఆదేశాలు

విజయవాడ/వన్‌టౌన్, ఆంధ్రజ్యోతి : దుర్గమ్మ దర్శనానికి ప్రొటోకాల్ కేటగిరీలో వచ్చిన భక్తులు ఇచ్చే చీరలు కొంతకాలంగా లెక్కల్లోకి రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు చీరల వ్యవహారాన్ని దేవస్థాన సిబ్బంది చూసేవారు. ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాల్లో చీరల లెక్కల్లో వ్యత్యాసాలు ఉన్నట్టు గుర్తించి నివేదిక ఇచ్చారు. ఇందులో ఉన్న ఉద్యోగుల పాత్రను ఏసీబీ గుర్తించింది. తర్వాత నుంచి చీరలను కాంట్రాక్టుకు ఇవ్వడం మొదలుపెట్టారు. భక్తులు ఇచ్చిన చీరలు ప్రైవేట్ కాంట్రాక్టరుకు చేరడానికి ముందు చీరల కౌంటర్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అన్ని దర్శనాల్లో భక్తులు ఇచ్చిన చీరలు రశీదు కౌంటర్లకు చేరుతున్నా ప్రొటోకాల్ కేటగిరీలో భక్తులు ఇచ్చినవి మాత్రం అటువైపు వెళ్లడం లేదని తెలుస్తోంది.

రశీదు మాయ

కనకదుర్గమ్మను దర్శించుకోవడానికి నిత్యం వేలమంది భక్తులు వస్తుంటారు. కొంతమంది భక్తులు అమ్మవారికి చీరలను సమర్పించుకుంటారు. రూ.300, రూ.100, ఉచిత దర్శన క్యూల్లో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని వెంట తెచ్చుకున్న చీరను బయటకు వచ్చే మార్గంలో ఉన్న కౌంటర్‌లో ఇవ్వాల్సి ఉంటుంది. దానిపై ఉన్న ధరకు 20-30 శాతం తగ్గించి ఆలయ సిబ్బంది ధర నిర్ణయిస్తారు. దీనికి సంబంధించి రశీదును భక్తులకు ఇస్తారు. అమ్మవారికి నిత్యం 5 నుంచి 7 చీరలు కడతారు. పౌర్ణమి నాడు



అమ్మవారు స్వర్ణకవచ అలంకారంలో దర్శనమిస్తారు. సరస్వతీదేవి అలంకారంలో తెలుపు రంగు చీరలో దర్శనమిస్తారు. ఈ రెండు అలంకారాల్లో తప్ప మిగిలిన రోజుల్లో అమ్మవారికి 5 నుంచి 7 చీరలు కడతారు. ఈ భక్తులు కాకుండా వీఐపీ కోటాలో కొంతమంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. వారికి ప్రొటోకాల్ విభాగం సిబ్బంది దర్శనాలు చేయిస్తారు. ఈ

ఎక్కడికి వెళ్తున్నట్టు?

చీరలను కౌంటర్‌లో ఇచ్చి రశీదు తీసుకునే క్రమంలో కొంతమంది భక్తులు తిరిగి ఆ చీరను తాము తీసుకుంటామని చెబుతారు. కొంతమంది మాత్రం చీరను దేవస్థానానికి ఇచ్చేస్తారు. పెళ్లిరోజు, పుట్టినరోజు వంటి ముఖ్యరోజుల్లో అమ్మవారికి తామిచ్చిన చీరను అలంకరించాలని కోరతారు. ఇలా అలంకరించిన చీరలను కొంతమంది భక్తులు తీసుకుంటారు. దీనికి సంబంధించి చీరల కౌంటర్‌లో దేవస్థానం సిబ్బంది నిర్ణయించిన ధరలను వారు చెల్లించాల్సి ఉంటుంది. ప్రొటోకాల్ కేటగిరీలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీసుకొచ్చే చీరలు రశీదు ఇచ్చే కౌంటరుకు వెళ్లడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ధర్మకర్తల మండలి తరఫు నుంచి జరుగుతున్న ప్రొటోకాల్ దర్శనాల్లో ఈ వ్యవహారం జోరుగా జరుగుతోందని చెప్పుకొంటున్నారు. ఈ చీరలు ఎవరి చాంబరులోకి వెళ్తున్నాయన్నది సస్పెన్స్‌గా మారింది.

ప్రొటోకాల్ దర్శనాలు రెండు విధాలుగా ఉంటాయి. కొండపైన ఉన్న సమాచార కేంద్రం వద్ద పేర్లు నమోదు చేయించుకుని దర్శనాలకు వెళ్తుంటారు. కొంతమంది ధర్మకర్తల మండలి చైర్మన్ కార్యాలయం నుంచి ప్రొటోకాల్ దర్శనాలకు వెళ్తుంటారు. ఈ కోటాలో దర్శనాలకు వెళ్లే భక్తులు అమ్మవారికి సమర్పించే చీరలే దారి తప్పుతున్నాయని ఇంద్రకీలాద్రిపై చర్చ నడుస్తోంది. ఇవన్నీ పాలకమండలికి చెందిన ఓ ప్రత్యేక చాంబరుకు వెళ్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో ఆలయ సిబ్బంది కక్కలేక మింగలేక ఉండిపోతున్నారు. చీరను కౌంటరులో ఇవ్వాలని అడిగితే అవతలి వ్యక్తుల వైపు నుంచి ఎలాంటి స్పందన వస్తుందోనని భయపడుతున్నారు. చీరలు ప్రత్యేక చాంబరుకు వెళ్తున్నాయని ఆలయ సిబ్బంది కొందరు మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది.

బియ్యాన్నీ భోంచేశారు..!

భక్తులకు పెట్టే అన్నప్రసాదం.. ఆఖరుకు పులిహోర ప్రసాదంలోనూ కాసుల కోసం కక్కుర్తి పడుతున్నారు. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టుబోర్డులో కీలక వ్యక్తి అధికారులతో కుమ్మక్కై భక్తులకు నాసిరకం బియ్యాన్ని వండి పెడుతున్నారని తెలుస్తోంది.


అన్నదాన వంటశాలలో నిల్వ ఉన్న నాణ్యత తక్కువ కలిగిన బియ్యం

అసలేం జరిగిందంటే..

గత సెప్టెంబరులో దేవస్థానం అన్నదాన విభాగానికి, పడితరం విభాగానికి బియ్యం సరఫరా చేసేందుకు వేలంపాట పాడారు. లలితా బ్రాండ్‌లో ఆరెంజ్ బీపీటీ రకం బియ్యాన్ని సరఫరా చేసేందుకు ఇద్దరు కాంట్రాక్టర్లు ఈ వేలంలో పాల్గొన్నారు. కిలో రూ.45కు సరఫరా చేస్తానని కాంట్రాక్టర్ సీహెచ్ విశ్వేశ్వరరావు టెండర్ ఫారంలో పేర్కొన్నాడు. దీనిని అప్పటి ఈవో భ్రమరాంబ.. దేవదాయ శాఖ కమిషనర్‌కు పంపగా, అనుమతి లభించింది. ఆ తరువాత భ్రమరాంబ బదిలీ అయ్యారు. దసరా ఉత్సవాల సమయంలో కొత్త ఈవోగా రామారావు వచ్చారు. ఆయన మరొక ఆలయానికి కూడా ఇన్‌చార్జిగా ఉండటంతో దుర్గగుడిలోని పరిస్థితులను అవగాహన చేసుకోవడానికి సమయం పట్టింది. ఆయన ఆలయంలోని పలు విభాగాలను తనిఖీ చేసినప్పటికీ లోతులకు వెళ్లకుండా ఏఈవోలు, అధికారులు చెప్పిన వాటినే పరిగణనలోకి తీసుకున్నారు. అన్నదానం, పడితరం విభాగంపై ఆయనకు పూర్తి అవగాహన లేని వైనాన్ని అవకాశంగా మలచుకున్నారు. కమిషనర్ ఉత్తర్వులను బయటపెట్టకుండా ట్రస్టుబోర్డులోని కీలక వ్యక్తి అధికారులతో కుమ్మక్కై సదరు కాంట్రాక్టర్ నుంచి కిలో బియ్యం రూ.45కు కాకుండా, రూ.56కు కొంటున్నారు. దీనివల్ల గత అక్టోబరు నుంచి ఇప్పటివరకు సుమారు రూ.12 లక్షల మేర నష్టం వాటిల్లింది. ఈ మొత్తాన్ని సదరు కీలక వ్యక్తి, అధికారులు పంచుకున్నారని కొండపై చర్చ జరుగుతోంది.

ఈవో నిలదీత

ఈ వ్యవహారం రెండు రోజుల క్రితం ఈవో రామారావు దృష్టికి వచ్చింది. ఆయన అన్నదాన విభాగంలో తనిఖీలు నిర్వహించారు. తొలుత టెండర్ మేరకు లలితా బ్రాండ్ బియ్యానికి బదులు మరో బ్రాండ్ బియ్యం కనిపించాయి. రేటు, నాణ్యత తక్కువగా ఉన్న బ్రాండ్ బియ్యం ఉండటాన్ని ఆయన ఆరా తీశారు. కాంట్రాక్టరును పిలిపించి టెండరులో పేర్కొన్న మేరకు ఎందుకు సరఫరా చేయడం లేదని నిలదీశారు. నాసిరకం బియ్యం ఎందుకు తీసుకుంటున్నారని అధికారులను కూడా అడిగారు. అయితే, వారంతా పొంతనలేని సమాధానాలు చెప్పారు. ఆర్‌జేసీ, డీఎస్‌వో, ఈవో సమక్షంలో వేలం ఖరారైతే దానిని ఎందుకు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, కొండపై ఇంత జరుగుతున్నా ఏసీబీ, విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఈ అంశంపై ఎందుకు దృష్టి సారించలేదన్న అనుమానాలు వస్తున్నాయి. బాధ్యత కలిగిన ట్రస్టుబోర్డులోని కీలక వ్యక్తి అవినీతి మార్గంలో వచ్చిన డబ్బును భోంచేస్తున్న వైనంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విచారణకు ఆదేశాలు

బియ్యం బ్రాండ్లలో లోపాలపై విచారణాధికారిగా ఆలయ డిప్యూటీ ఈవో లీలాకుమార్‌ను ఈవో నియమించారు. ఆయన బియ్యం బ్రాండ్లను పరిశీలించారు. టెండర్ మేరకు బియ్యం సరఫరా కావడం లేదని గుర్తించారు. దీనిపై కాంట్రాక్టరుకు నోటీసు ఇవ్వనున్నట్లు లీలాకుమార్ తెలిపారు.


వరుణ్ తేజ్ సందడి

సినీనటుడు వరుణ్ తేజ్ బుధవారం నగరంలో సందడి చేశారు. ఆయన నటించిన 'ఆపరేషన్ వాలంటైన్' మార్చి 1న విడుదలకానున్న నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమంలో భాగంగా ఆయన నగరానికి విచ్చేశారు.


అమ్మకు వందనం

మాతృభాషా దినోత్సవ సంబరాలు నగరంలోని ఘంటసాల సంగీత కళాశాలలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఔన్నత్యాన్ని కళ్లకు కడుతూ యువతులు ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది.


అద్భుతం.. అభినయం

సిద్ధార్థ మహిళా కళాశాల 41వ కళాశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన కోయ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈసారీ నాన్చుడేనా?


పూడుక పేరుకుపోయిన కామూరు కాలువ


చెట్లు, చెదారంతో నిండిన యనమలకుదురు కాలువ

కాల్వల్లో పూడికతీతపై రైతుల ఆందోళన

జూన్ నుంచి రెండు సంవత్సరాలు ప్రారంభమవుతాయి. అందులో ఒకటి విద్యాసంవత్సరం. జూన్ నుంచి ఏప్రిల్ వరకు విద్యా సంవత్సరం ఉంటుంది. దీని మాదిరిగానే నడుస్తుంది ఇరిగేషన్ ఇయర్. జూన్ నెలలో కాల్వలకు నీరు విడుదల చేస్తే మార్చి, ఏప్రిల్ నెలల్లో ఆపేస్తారు. తిరిగి నీరు విడుదల చేసే సమయానికి కాలువల్లో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు, లాకులు, కల్వర్టుల మరమ్మతు పనులను పూర్తి చేయాలి. రైతులు దుక్కి, దున్ని, నాట్లు వేసుకునే సమయానికి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా నీటిని అందజేయాలి. ఇదంతా జలవనరుల శాఖ క్యాలెండర్. ఈ క్యాలెండర్ ప్రకారం జరగాల్సిన పనులు నెలలు తప్పుతున్నాయి. కాలువలు మూసివేసి ఉన్నప్పుడు చేయాల్సిన పనులు కొద్దిరోజులు నీరు వదిలే సమయానికి మొదలవుతున్నాయి. ఫలితంగా రైతులకు మేలు కాకుండా నష్టం జరుగుతోంది.

- ప్రతి ఏడాది నీరు విడుదల సమయానికి పనులు
- పైపై పనులు చేసిన కాంట్రాక్టర్లకు చెల్లింపులు
- ఈ ఏడాది అయినా తీరు మారేనా?

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : బందరు.. ఏలూరు.. రైవస్.. ఈ మూడు కాల్వలు కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి మూడు భాగాలు విడిపోయి దిగువకు ప్రవహిస్తాయి. అక్కడి నుంచి మరికొన్ని భాగాలు విడిపోయి స్థానిక నామకరణాలతో ప్రవహిస్తాయి. ఈ కాలువలే కృష్ణా జిల్లాకు సాగు, తాగునీటిని అందజేస్తాయి. ఈ కాల్వల ద్వారా సవ్యంగా నీరు ప్రవహించాలంటే పూడికతీతను జలవనరుల శాఖ ప్రతి ఏడాదీ తీస్తుంటుంది. తూర్పు డెల్టా కింద 6లక్షల78వేల531 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇది కాకుండా పొరుగున ఉన్న పశ్చిమగోదావరి జిల్లాలో 58 వేల ఎకరాల ఆయకట్టు సాగుతోంది. వెరసి 7లక్షల36వేల531 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ మొత్తం ఆయకట్టుకు బందరు, ఏలూరు, రైవస్ కాలువల ద్వారా సాగునీరు అందుతోంది. ఆయా గ్రామాల్లో ప్రజలకు తాగునీటి అవసరాలను ఈ కాలువలే తీర్చాల్సి ఉంది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా రబీకి నీరు ఇవ్వలేదు. కొద్దిరోజుల క్రితమే తాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేశారు. పది రోజుల క్రితం కాలువలను మూసివేశారు. తూర్పు డెల్టాలో మొత్తం నాలుగు డివిజన్లు ఉన్నాయి. కృష్ణా తూర్పు, కృష్ణా సెంట్రల్, డ్రెయినేజ్, స్పెషల్ డివిజన్లలో లాకులు, కల్వర్టులు ఉన్నాయి. కాలువలు మూసివేసిన తర్వాత ఓ అండ్ ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనులను చేపడతారు. లాకులు, కల్వర్టుల మరమ్మతులతోపాటు కాలువల్లో పూడికతీతలు చేస్తుంటారు. ఆయా డివిజన్లలో ఏఈలు తమ పరిధిలోని కాలువలను పరిశీలించి ఏయే పనులు చేయాల్సి ఉందో ప్రతిపాదనలు తయారు చేస్తారు. ఈ ప్రతిపాదనలు డీఈలకు వెళ్తాయి. అక్కడి నుంచి ఈఈలకు, అనంతరం ఎస్ఈ టేబుల్ మీదకు వెళ్తాయి. ఎస్ఈ ఈ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సీఈకి పంపుతారు. అక్కడి నుంచి 'కడ' (కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ)కి వెళ్తాయి. అక్కడ ఆమోదముద్ర పడిన తర్వాత మాత్రమే జిల్లా అధికారులు టెండర్ల ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుంది.

తయారీ దశలో ప్రతిపాదనలు

కాలువల్లో గడచిన ఏడాది మొత్తం రూ.30 కోట్లతో తూటికాడ తొలగింపు పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ పనులు పూర్తిస్థాయిలో చేయకుండానే కాంట్రాక్టర్లు సొమ్ము చేసుకున్నారు. జూన్‌లో కాలువలకు నీటిని విడుదల చేస్తారనగా దీనికి కొద్దిరోజుల ముందే టెండర్లు ఖరారు చేశారు. పనులు జరుగుతుండగానే నీటిని విడుదల చేశారు. దీంతో కాంట్రాక్టర్లు పైపైన పనులు చేసి మమ అనిపించారు. తర్వాత పొలాలకు నీరు సక్రమంగా అందకపోవడంతో రైతులు సొంత డబ్బులతో తూటికాడను తొలగించుకోవాల్సి వచ్చింది. జలవనరుల శాఖ నుంచి కడకు వెళ్లిన ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ రావడానికి నెలల సమయం పడుతోంది. రైతుల నుంచి రెవెన్యూ అధికారులు నీటి తీరువా వసూలు చేస్తారు. ఈ నిధులు కడ వద్ద ఉంటాయి. జిల్లా వారీగా ఉన్న నిధులను నిల్వలను బట్టి పనులకు అనుమతుల ఇస్తారు. అధికారులు ప్రతిపాదనలు తయారు చేయడానికి నెలల సమయం తీసుకుంటే, వాటికి అనుమతులు ఇవ్వడానికి కడ మరికొన్ని నెలల సమయం తీసుకుంటుంది. ఈ మొత్తం జాప్యం రైతులకు తీరని నష్టాన్ని కలిగిస్తోంది. ఈ ఏడాది అయినా ఖరీఫ్‌కు నీటిని విడుదల చేసే సమయానికి ఓఅండ్ఎం పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

ఇంకెన్నాళ్లు!

కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ల కోసం లారీ యజమానుల ఎదురుచూపులు



కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లు రాక.. వ్యాపారాన్ని నిర్వహించలేక.. లారీ యజమానులు కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వాలు తమ మొర ఆలకించకపోవటంతో లారీ యజమానులు తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిపోతున్నారు. కరోనా ప్రభావంతో ఉత్పాదకత తగ్గి సతమతమవుతుంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు రోడ్ ట్యాక్స్, సింగిల్ పర్మిట్, ఆల్ ఇండియా పర్మిట్ వంటి అంశాలు రవాణా వాహన యజమానులకు తీవ్ర భారంగా మారాయి. దశాబ్ద కాలంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లకు అనుమతులు రావడం లేదు. వీటిపై నిర్ణయాలు తీసుకోవాల్సిన రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల లారీ యజమానులు ఆందోళన చెందుతున్నారు.

- ఈ పర్మిట్‌తో లారీ యజమానులకూ, ప్రభుత్వాలకు మేలు
- ఉమ్మడి కృష్ణాలో 10 వేల మంది లారీ యజమానుల గగ్గోలు
- ఐదేళ్లుగా అడుగుతున్నా పట్టించుకోని ప్రభుత్వాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లా రవాణా రంగానికి కేంద్ర స్థానంగా ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40 వేల రవాణా వాహనాలు ఉన్నాయి. ఇందులో 25 వేలకుపైగా నేషనల్ పర్మిట్ లారీలున్నాయి. మిగిలిన 15 వేల లారీల్లో లోకల్‌గా తిరిగేవి ఉన్నాయి. వీటిలోనే పెద్ద, చిన్న లారీలు కూడా ఉన్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లా తెలంగాణా జిల్లాకు సరిహద్దున ఉన్న ప్రాంతం. తెలంగాణా సరిహద్దు జిల్లాల్లో 15 వేలకుపైగా నేషనల్ పర్మిట్ లారీలు, 8 వేల వరకు లోకల్‌గా తిరిగే లారీలున్నాయి. రెండు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల నుంచి ప్రతిరోజూ స్థానికంగా పెద్దఎత్తున ఎగుమతులు, దిగుమతులు జరుగుతుంటాయి.

- మిగతా 6లో

నేటి నుంచి వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు



కోడూరు, ఫిబ్రవరి 21 : హంసలదీవి రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ధర్మాధికారి కుప్పా సుబ్రహ్మణ్యం అవధాని బుధవారం తెలిపారు. స్వామివార్లను పెండ్లి కుమారుడిగా, పెండ్లి కుమార్తెగా అలంకరించనున్నట్టు చెప్పారు. సాయంత్రం విష్వేశ్వర పూజ, పుణ్యాహవచనం, దీక్ష స్వీకరణ, అఖండ దీపారాధన, ఉదయం అంకుర్పారణ, ధ్వజారోహణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 23న ఉదయం బలిహరణ, పంచామృత స్నపన, పాలాభిషేకం, రాజ్యలక్ష్మీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, రాత్రి స్వామివార్ల కళ్యాణాన్ని నిర్వహిస్తామని తెలిపారు. 24న ఉదయం సాగర సంగమం, పాలకాయితిప్ప బీచ్ వద్ద సింధు స్నానాలకు వచ్చే భక్తులతో ప్రత్యేక పూజలు, రాత్రికి స్వామివారి రథోత్సవం, 25న అవభృదోత్సవం, సాయంత్రం ధ్వజారోహణం, పూర్ణాహుతి, రాత్రికి స్వామివారి స్వామివారి పవళింపు సేవతో ఉత్సవాలను ముగుస్తాయని చెప్పారు.



మద్దులపర్వలో అసంపూర్తిగా ఉన్న స్కూల్ వద్ద సెల్ఫీ దిగుతున్న ఉమా, చిన్ని

ప్రచార మోత తప్ప బడిరాత మారలేదు

- జగన్ సర్కార్‌కు ఉమా, కేశినేని శివనాథ్‌ల సెల్ఫీ ఛాలెంజ్

రెడ్డిగూడెం, ఫిబ్రవరి 21 : పూరి గుడిసెల్లో పాఠాలు, రేకుల షెడ్డులో రాతలు, శిథిల భవనాల్లో చదువులు ఇలా రాష్ట్రంలోని పాఠశాలల పరిస్థితులు ఉన్నాయంటూ జగన్మోహన్ రెడ్డి సర్కార్‌కు టీడీపీ నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, కేశినేని శివనాథ్‌లు బుధవారం సెల్ఫీ చాలెంజ్ చేశారు. రెడ్డిగూడెం మండలం మద్దులపర్వలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీలో పాల్గొన్న వారు మద్దులపర్వలో అసంపూర్తిగా ఉన్న ఎంపీయూపీ పాఠశాల ఎదుట సెల్ఫీ చాలెంజ్ విసిరారు. పాఠశాల భవనం నాలుగేళ్లుగా అసంపూర్తి ఉండిపోతే పాలకులు మాత్రం నాడు-నేడు కింద అద్భుతాలు చేసేశాం అంటూ జబ్బలు చరుచుకుంటున్నారన్నారు. అనేక బడుల్లో రెండో విడత పనులే పూర్తి కాలేదన్నారు. ఆరంభ శూరత్వంతో ఉన్న భవనాలు పడగొట్టిన ప్రభుత్వం కొత్తవి కట్టడంలో జాప్యం చేస్తున్నదని దుయ్యబట్టారు.

గోదావరి నీళ్లు తేవడమే లక్ష్యం : ఉమా

జి.కొండూరు : టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు నేతృత్వంలో ఏడాది తిరగకుండానే చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా నాగార్జున సాగర్ కాలువల్లో గోదావరి నీళ్లు పారించడమే లక్ష్యంగా పని చేస్తానని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం 'బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా ఆయన దుగ్గిరాలపాడు, గంగినేనిపాలెం, సున్నంపాడు, మునగపాడు, గడ్డమణుగు గ్రామాల్లో పర్యటించారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. చనమోలు అనిల్‌కుమార్ (బాబీ), ధనేకుల సాంబశివరావు (బుల్లిబాబు), పజ్జూరు రవికుమార్, లంక రామకృష్ణ, పంటా పంచల నరసింహారావు, ఉయ్యూరు వెంకట నరసింహారావు, మంగలంపాటి వెంకటేశ్వరరావు, నూతక్కి రాజరావు, నూతక్కి అపర్ణ, ఉండిమోదుగుల సుబ్బారావు, పెద్ద ఎత్తున నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలకు అండగా టీడీపీ, జనసేన : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 21 : వైసీపీ పాలనలో బీసీల రిజర్వేషన్లలో భారీ కోత విధించి బీసీల హక్కులకు సీఎం జగన్‌రెడ్డి భంగం కలిగించారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. బుధవారం విశ్వబ్రాహ్మణ కాలనీ, అంజమ్మ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, పొట్లపాలెం, కొత్తపూడితో పాటు వివిధ ప్రాంతాలను రవీంద్ర పర్యటించారు. 'బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా విశ్వబ్రాహ్మణకాలనీలో స్వర్ణకారుల కార్యశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్వర్ణకారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక తర్ఫీదు ఇచ్చి స్వర్ణకారులు తయారు చేసే నగలకు మార్కెటింగ్ కల్పిస్తామన్నారు. చేతి, కులవృత్తులను ఆదుకునేది తెలుగుదేశం ప్రభుత్వమేనన్నారు. విశ్వబ్రాహ్మణ కాలనీలో దివ్యాంగులకు వీల్‌చైర్లు అందచేశారు. కార్యక్రమంలో తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, రూరల్ అధ్యక్షుడు కుంచే నాని, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ పాషా, ముంతా రవీంద్ర, మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, వాలిశెట్టి తిరుమలరావు, వాలిశెట్టి విమనేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకలి తీర్చే అన్న క్యాంటీన్

- చంద్రబాబు స్ఫూర్తితో వెనిగండ్ల క్యాంటీన్‌కు 400 రోజులు పూర్తి
- రోజుకు 300 మందికి ఉచితంగా భోజనం



పేదలకు భోజనం వడ్డిస్తున్న జజఛిటవెనిగండ్ల

గుడివాడ : పేదలకు అందుబాటులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.5కే అన్న క్యాంటీన్‌లో భోజనం అందజేయగా, పేదల ద్వేషి అయిన జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను నిలిపివేశారు. కరోనా విపత్తులో ఎందరో పేదలు ఆకలితో అలమటించి మృత్యువాతపడిన విషయం తెలిసిందే. ఆ సమయంలో అమెరికాలో సాఫ్ట్‌వేర్‌లో ఉన్న గుడివాడకు చెందిన వెనిగండ్ల రాము మాతృభూమిపై మమకారంతో వెనిగండ్ల ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. అన్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా 2023 జనవరిలో పట్టణంలో మొబైల్ అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. నాటి నుంచి 400రోజులుగా పేదలకు రోజుకు 300మందికి ఉచితంగా భోజనాన్ని అందజేస్తున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చయినా వెనుకంజ వేయక ముందుకు సాగుతున్నారు.

పేదల ఆకలి తీర్చాలి : వెనిగండ్ల

రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్‌లను తిరిగి తెరుస్తాం. ప్రభుత్వ హయాంలో యధావిధిగా పట్టణంలో రెండు అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేస్తాం. భవిష్యత్ అవసరాల దృష్ట్యా మరొకటి సొంత ఖర్చుతో ఏర్పాటు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నా. ఎంత ఖర్చు అయినా పేదల ఆకలి తీర్చాలనేదే నా కోరిక.



వీరంకిలాకు ఎన్టీఆర్ కాలనీలో వైసీపీ నుంచి టీడీపీలోకి వస్తున్న వారితో వర్ల

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు

పమిడిముక్కల, ఫిబ్రవరి 21 : వైసీపీ పాలనలో అరాచకాలు, అకృత్యాలతో ఇమడలేక రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని టీడీపీలో చేరేందుకు నాయకులు, కార్యకర్తలు తరలివస్తున్నారని పామర్రు టీడీపీ ఇన్‌చార్జ్ వర్ల కుమార్‌రాజా అన్నారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం పమిడిముక్కల, వీరంకి, అమినాపురం గ్రామాల్లో పర్యటించి టీడీపీ, జనసేన పార్టీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా పమిడిముక్కల ఎన్టీఆర్‌కాలనీకి చెందిన వైసీపీ నాయకుడు ఇమిడాబత్తిన నారాయణతో పాటు పది కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరగా కుమార్‌రాజ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి కొల్లూరి బాబ్జి, నాదెళ్లసుబ్రమణ్యం, పమిడిముక్కల గ్రామ సర్పంచ్ ముళ్లపూడి సునీత, వైస్ సర్పంచ్ వెంకటేశ్వరరావు, తలశిల శ్రీనివాసరావు, నార్ల రమణ, బోలెం తాతారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు కన్నెర్ర జేస్తే..

జగన్‌రెడ్డి పార్టీ గల్లంతే

- మార్చి 4న 'మహిళా గళం' సభను విజయవంతం చేయండి
- మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, తలశిల స్వర్ణలత పిలుపు



తెలుగు మహిళల విస్తృత స్థాయి సమావేశంలో నినదిస్తున్న మహిళలు, చిత్రంలో కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 21 : మహిళలు కన్నెర్ర జేస్తే సీఎం జగన్‌రెడ్డి పార్టీకి రానున్న ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, కృష్ణాజిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జిల్లా స్థాయి తెలుగు మహిళల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో మాజీ ఎంపీ, కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, తలశిల స్వర్ణలతలు మార్చి 4వతేదీన జరగనున్న జిల్లాస్థాయి 'మహిళా గళం' కార్యక్రమంపై చర్చించారు. జిల్లాలో మండల స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొనకళ్ల మాట్లాడుతూ, టీడీపీ ఆవిర్భావం నుంచి మహిళలు పార్టీ వెంటే ఉన్నారన్నారు. చంద్రబాబు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళా సాధికారికత తీసుకుని వచ్చారన్నారు. మహిళలు స్వతంత్రంగా ఆర్థికంగా జీవించే విధంగా వనరులు ఏర్పాటు చేశారన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించారన్నారు. స్వర్ణలత మాట్లాడుతూ, మహిళా శక్తిని మించింది లేదని అన్నారు. సూపర్ సిక్స్‌లో చంద్రబాబు మహిళల అభివృద్ధికి మహాశక్తి పేరుతో పెద్ద పీట వేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా సాధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారి, జిల్లా అధికార ప్రతినిధులు తదితరులు మాట్లాడారు.

పాత్రికేయులపై దాడులు అప్రజాస్వామికం

- తెలుగు మహిళల నిరసన ప్రదర్శన

మచిలీపట్నం టౌన్ : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫోటో గ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాలు దాడులకు తెగబడటం అప్రజాస్వామికమని టీడీపీ తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత ధ్వజమెత్తారు. శ్రీకృష్ణపై దాడి, కర్నూలులో ఈనాడు కార్యాలయం పై దాడికి నిరసనగా బుధవారం మచిలీపట్నం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగు మహిళలు బైఠాయించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణలత మీడియాతో మాట్లాడారు. వైసీపీకి ఓటమి భయం పుట్టుకొచ్చిందన్నారు. విలేకరులపై ఇటీవల దాడులు జరగడం దురదృష్టకరమన్నారు. మీడియా నడుపుతున్న సీఎం జగన్‌రెడ్డి తోటి మీడియా ప్రతినిధులపై, కార్యాలయాలపై దాడులు జరపడం సిగ్గుచేటన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య మాట్లాడుతూ, మీడియా ప్రతినిధులపై, కార్యాలయాలపై వైసీపీ కార్యకర్తలు దాడులు జరపడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా సాధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్ తదితరులు పాల్గొన్నారు.



తెలుగుతల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మండలి

ప్రాథమిక విద్య మాతృభాషలో జరగాలి

- మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, ఫిబ్రవరి 21 : ప్రాథమిక విద్య మాతృభాషలో జరిగినప్పుడే భాషను పరిరక్షించుకోవటం సాధ్యమవుతుందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం అవనిగడ్డ గాంధీక్షేత్రంలో మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, మాతృభాషలో ప్రాథమిక విద్య బోధన జరగాలన్న యునెస్కో సూచనలను రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టడం దురదృష్టకరమన్నారు. తమ పేరు కూడా రాయలేని దుస్థితిలో పిల్లలు తయారవుతున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు మండలి వెంకట్రామ్, కొల్లూరి వెంకటేశ్వరరావు, కూనపరెడ్డి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు బాధ్యతగా పనిచేయాలి

- జర్నలిస్టులపై దాడులు చేస్తే కఠిన చర్యలు
- కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి



పెదపారుపూడి స్టేషన్ పరిశీలిస్తున్న ఎస్పీ నయీమ్ అస్మి

పెదపారుపూడి, ఫిబ్రవరి 21 : ఎన్నికల సమయంలో పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గుడివాడ డివిజన్ పెదపారుపూడి స్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ నయీమ్ అస్మీ స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదు చేయటానికి స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పెదపారుపూడిలోని గ్రామాల మ్యాప్‌ను పరిశీలించారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి ఎన్నికలకు ఎటువంటి అవాంతరాలు రాకుండా సహకరించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. లా అండ్ ఆర్డర్ విషయంలో కఠినంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు అన్ని గ్రామాల్లో లా అండ్ ఆర్డర్ పర్యవేక్షణ చేయాలని ఎస్ఐ జి.రాజుని ఆదేశించారు. గ్రామాల్లో గొడవలు సృష్టించే వారిపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. విలేకరులపై దాడులు చేసేవారి పట్ల కఠినమైన చర్యలు తీసుకోవాలని, ఇటీవల ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఈనాడు కార్యాలయాలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పెదపారుపూడి విలేకరులు ఎస్పీని కోరారు. విలేకరులపై దాడి చేసే వారి పట్ల కఠినంగా శిక్షలు ఉంటాయన్నారు. ఎస్పీతోపాటు గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్, పామర్రు సీఐ శుభకరరావు, పెదపారుపూడి ఎస్ఐ జి.రాజు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

షెడ్యూలు వచ్చే వరకు జాబితాలో చేర్పులు-మార్పులు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఢిల్లీరావు

వన్‌టౌన్, ఫిబ్రవరి 21 : ఎన్నికల షెడ్యూలు వచ్చేంతవరకు ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు అవకాశముందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన తర్వాత ఓటర్లజాబితాలో తొలగింపులకు, చేర్పులకు అవకాశం ఉండదన్నారు. ఫారం 7, ఫారం 6లను జిల్లా ముఖ్య ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుమతితోనే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తులను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించనున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించి కలెక్టరేట్‌లో ప్రత్యేక బృందం పనిచేస్తోందన్నారు. ఇదే సమయంలో పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను ప్రస్తావించారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ విజయవంతం చేయండి

వన్‌టౌన్ : ఇళ్లస్థలాల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సంబంధిత అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్‌లు సంయుక్తంగా సూచించారు. బుధవారం కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ హాలు నుంచి మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ళు పథకం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పురోగతిపై సమీక్షించారు. ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జాయింట్ సబ్‌రిజిస్ట్రార్, వీఆర్వో తదితరులు లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసి ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే వంద గ్రామాలు లక్ష్యాన్ని చేరుకున్నాయని, ఇదే స్ఫూర్తితో మిగతా గ్రామాల్లో కూడా పూర్తి చేయాలని సూచించారు. ప్రజల ఆరోగ్య భద్రతకు సంబంధించిన పథకాలు, కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీని త్వరితగతం చేయాలన్నారు. మార్చి 3న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ, ఐసీడీఎస్, కార్మిక శాఖ, పంచాయితీ రాజ్, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ, పేదరిక నిర్మూలనా విభాగం, ఆర్టీసీ, రైల్వే, తదితర అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. హైరిస్క్ ప్రాంతాలను గుర్తించేందుకు త్వరితగతిన సర్వే పూర్తి చేయాలన్నారు. నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు!

(5వ పేజీ తరువాయి)

పక్కనే ఉన్నా రెండు రాష్ట్రాలుగా ఉండటం వల్ల నేషనల్ పర్మిట్ ఉంటేనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఒకే రాష్ట్రంలో తిరిగే వాహనాలకు నేషనల్ పర్మిట్ తీసుకోవటం వల్ల బోలెడంత ఖర్చు అవుతోంది. అధిక భారంగా మారు తోంది. దీని బదులు రెండు రాష్ట్రాల్లో పరస్పరం తిరిగేలా కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లు జారీ చేస్తే భారం తగ్గుతుందని లారీ యజమానులు కోరుతున్నారు. కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ల ద్వారా ఆదాయం అంతా రెండు రాష్ట్రాలకు దక్కుతుంది. అదే నేషనల్ పర్మిట్ల ద్వారా వచ్చే ఆదాయం అనేక రాష్ట్రాలకు పంపిణీ అవుతుంది. కాబట్టి కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ల వల్ల రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు, లారీ యజమానులకు ఉభయతారకంగా ఉంటుందని ఎప్పటి నుంచో కోరుతున్నా పట్టించుకోవటం లేదని ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్, న్యూ ఆంధ్రా మోటార్ ట్రక్కర్స్ అసోసియేషన్ (నమత) పేర్కొన్నాయి.

కౌంటర్ సిగ్నేచర్‌తో ప్రభుత్వాలకు లాభమే

ఆలిండియా పర్మిట్ల జారీ కూడా పరిమితంగా ఉంది. రెండు రాష్ట్రాల్లోని సరిహద్దు జిల్లాల్లో ఉన్న 50 శాతం రవాణా వాహనాలకు కూడా నేషనల్ పర్మిట్లు లేవు. ఇవన్నీ ట్రిప్పులు వేయలేని పరిస్థితిలో ఉన్నాయి. ఇలాంటి రవాణా వాహనాలకు కూడా ప్రయోజనం కల్పించటానికి కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లు దోహదపడ తాయి. ఒక ఏడాదిలో ఒక రవాణా వాహనం నెలకు నాలుగు ట్రిప్పులు వేస్తే.. పది నెలలకు 30 నుంచి 40 ట్రిప్పులకు మాత్రమే పరిమితమౌతోంది. నేషనల్ పర్మిట్ (ఎన్‌పీ) రూ.16 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ కట్టిన మొత్తాన్ని దేశ వ్యాప్తంగా 26 రాష్ట్రాలకు వాటాలుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన రెండు రాష్ట్రాలకు వాటాగా రూ.647 వస్తుంది. రోజుకు సగటున 5 వేల వాహనాలు ఇలా తిరుగుతాయనుకుంటే రూ.32 లక్షల ఆదాయం మాత్రమే వస్తుంది. అదే కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్లు జారీ చేయటం వల్ల ఒక్కో వాహనానికి నేరుగా రూ.8 వేలే అవుతుంది. రోజుకు 5 వేల వాహనాల చొప్పున లెక్కిస్తే రూ.4 కోట్లు ఆదాయం వస్తుంది.

శారదా నదిలో మునిగి వ్యక్తి మృతి

- విజయవాడ టైలర్‌పేటకు చెందిన బంగారు దుర్గాప్రసాద్,

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 21 : శారదా నదిలో స్నానానికి దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ టైలర్‌పేటకు చెందిన బంగారు దుర్గాప్రసాద్, కుమారుడు దిలీప్ ఈ నెల 17వ తేదీన అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగిన వివాహానికి హాజరయ్యారు. మంగళవారం సాయంత్రం ఇద్దరూ కలిసి సమీపంలోని శారదా నదిలో స్నానానికి వెళ్లారు. దుర్గాప్రసాద్ నదిలో దిగుతుండగా జారిపడి నీటిలో మునిగిపోయాడు. ఒడ్డున వున్న దిలీప్ వెంటనే తుమ్మపాలలో బంధువులకు వెళ్లి చెప్పాడు. వారు వచ్చి గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. కకాగా బుధవారం మధ్యాహ్నం నదిలో దుర్గాప్రసాద్ మృతదేహం బయటపడింది. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడి భార్య సంతోషి నూకలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేత నలంద డిగ్రీ కళాశాల



విజయవాడ స్పోర్ట్స్, ఫిబ్రవరి 21 : నగరంలోని నలంద డిగ్రీ కళాశాల ఆతిథ్యం ఇచ్చిన కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నలంద జట్టు ప్రథమస్థానం సాధించిందని టోర్నీ చైర్‌పర్సన్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. వైవీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ద్వితీయ), మచిలీపట్నం ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల (తృతీయ), మైలవరంలోని డాక్టర్ ఎల్‌హెచ్ఆర్ డిగ్రీ కళాశాల (చతుర్థ) స్థానాల్లో నిలిచాయన్నారు. విజేతలకు బుధవారం బహుమతుల ప్రదానోత్సవంలో ప్రిన్సిపాల్‌తో పాటు ఫిజికల్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, సెలక్షన్ కమిటీ సభ్యులు అంజాద్, నాగరాజు పాల్గొన్నారు.



మంగినపూడి బీచ్‌లో కొబ్బరిచెట్లు నాటుతున్న కలెక్టర్ రాజాబాబు, జేసీ గీతాంజలి శర్మ

కోటి రూపాయలతో మంగినపూడి బీచ్ అభివృద్ధి

- కృష్ణా కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి) : మంగినపూడిబీచ్‌ను కోటి రూపాయలతో అభివృద్ధి చేయనున్నట్టు కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. బీచ్‌లో చెట్లను పెంచే కార్యక్రమంలో భాగంగా బుధవారం జేసీ గీతాంజలి శర్మ, అధికారులతో కలిసి ఆయన కొబ్బరిమొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకేంద్రానికి అత్యంత సమీపంలో ఉన్న మంగినపూడి బీచ్‌ను అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. చెన్నై నుంచి తెప్పించిన 300 కొబ్బరిచెట్లను నాటుతున్నట్టు తెలిపారు. బీచ్‌లో రూ.40లక్షల తో టాయిలెట్లు, రూ.12లక్షలతో హైమాస్క్‌లైట్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. బీచ్‌కు వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా ఉంచేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, పేర్ని కిట్టు, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మీ, శీలం భారతి నాగ కుసుమకుమారి, ముడా చైర్‌పర్సన్ బొర్రా వెంకటనాగదుర్గాభవానీ, జిల్లా పర్యాటకశాఖ మేనేజరు రామలక్ష్మణ్, జిల్లాఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి. డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, తహసీల్దార్ పి.సతీష్, తాళ్లపాలెం మాజీ సర్పంచ్ వాలిశెట్టి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఖోఖో పోటీల్లో జిల్లా జట్టుకు ద్వితీయ స్థానం

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో జిల్లాకు చెందిన ఖోఖో జట్టు రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం సాధించింది. జట్టును కలెక్టర్ అభినందించారు. రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం సాధించిన జట్టు రూ.3లక్షల నగదు బహుమతితోపాటు మెడల్‌ను సాధించినట్టు జిల్లా క్రీడాప్రాధికారసంస్థ చీఫ్ కోచ్ రూఫ్సీ లక్ష్మి తెలిపారు. క్రీడాకారులను, కోచ్‌లు మడకప్రసాద్, కె.అనూరాధ, ఎన్.సుధీర్‌ను కలెక్టర్ అభినందించారు.

డీఎస్సీ గడువు పొడిగింపు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 21 : డీఎస్సీ 2024 అభ్యర్థుల కోరిక మేరకు ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తును ఫీజుతో సహా సమర్పించేందుకు గడువు పొడిగించినట్టు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.




దళితవాడలో వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

- గర్భం దాల్చిన బాలిక.. ఆలస్యంగా వెలుగులోకి

మోపిదేవి, ఫిబ్రవరి 21 : మండల కేంద్రమైన మోపిదేవిలో బాలికను లోబర్చుకుని వరుసకు తాతయ్య అయ్యే వ్యక్తి గర్భవతిని చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మోపిదేవి దళితవాడకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న 14 సంవత్సరాల బాలికను ఇంటి పక్కనే ఉంటున్న సమీప బంధువు కర్లపూడి అంకినీడు మాయమాటలతో లోబర్చుకుని నాలుగు నెలల గర్భవతిని చేశాడు. బుధవారం రాత్రి బాలిక తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతుండగా, తల్లి, బంధువులు వైద్యం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం నాలుగు నెలల గర్భిణిగా వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు బాలిక బంధువులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంటిలో టీవీ లేకపోవటంతో పక్కనే ఉన్న తాతయ్య ఇంటికి వెళ్తుండేదని, మాయమాటలు, డబ్బులు ఆశ చూపి బాలికను లోబర్చుకుని అనేక పర్యాయాలు లైంగికదాడికి పాల్పడినట్టు బంధువులు తెలిపారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తుండగా, మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం బాలికను మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ తెలిపారు. చల్లపల్లి సీఐ నాగ ప్రసాద్, మోపిదేవి ఎస్ఐ సత్యనారాయణలు డీఎస్పీ వెంట ఉన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితుడు మృతి



గంపలగూడెం, ఫిబ్రవరి 21 : కిడ్నీ వ్యాధితో బాధపడుతూ నాగబత్తుని కృష్ణ (55) బుధవారం మృతి చెందాడు. అనుముల్లంక దళితవాడకు చెందిన కృష్ణకు నాలుగేళ్ల క్రితం కిడ్నీలు ఫెయిల్ అయ్యి రెండేళ్లు విజయవాడ, తర్వాత రెండేళ్లు తిరువూరులో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఆరోగ్యం విషమించడంతో చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్లలున్నారు.

వలలో చిక్కిన భారీ కొండచిలువ



చల్లపల్లి, ఫిబ్రవరి 21 : మండల పరిధిలోని నిమ్మగడ్డ లాకుల వద్ద కొండచిలువ వలలో చిక్కింది. పాత నడకుదురుకు చెందిన పీతా కోటేశ్వరరావు నిమ్మగడ్డ లాకులు ఎగువ ప్రాంతం కాలువలో చేపల కోసం మంగళవారం రాత్రి వల కట్టి వెళ్లాడు. బుధవారం వల ఒడ్డుకు లాగగా, 11 అడుగుల కొండచిలువ చిక్కుకుని ఉండటం చూసి తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. వలలో చిక్కిన కొండ చిలువ అప్పటికే చనిపోయి ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల కాలంలో కొండ చిలువ కనిపించటం ఇది రెండవ సారి. గతంలో పురిటిగడ్డలో కొండచిలువ కనిపించిన సంగతి తెలిసిందే.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	308
చికెన్ స్కిన్‌లెస్	316

సెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.15

అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్ పంపిన నాగుల్‌మీరా



వన్‌టౌన్, ఫిబ్రవరి 21: అజ్మీర్ షరీఫ్ దర్గా ఉత్సవాల సందర్భంగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా బుధవారం ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ చాదర్ పంపించారు. చాదర్‌ను ముస్లిం మతపెద్దల వద్ద ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నేతలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అజ్మీర్ షరీఫ్ దర్గాలో సూఫీ మతగురువు మొయినుద్దీన్ చిస్తీపై కప్పేందుకు చాదర్‌ను అందజేశారు. హాఫీ సాహెబ్ షేక్ కరీముల్లా, షేక్ మహబూబ్ సుభాని, షేక్ జిలానీ బాషా, నక్లారు పెద్ద అప్పారావు, షేక్ షమీఉల్లా, సయ్యద్ బాబు, షేక్ కరీముల్లా, షేక్ ఇబ్రహీం, షేక్ నాగూలు, షేక్ షంషుద్దీన్, షేక్ జనా, షేక్ ఇమ్రాన్, షేక్ బాషా, షేక్ అహ్మద్, షేక్ గాలీబ్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సమాజాన్ని నయవంచనకు గురిచేస్తున్న జగన్

టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బేగ్

విద్యాధరపురం, ఫిబ్రవరి 21: విశ్వాసానికి, నమ్మకానికి, అనుబంధాలకు వారధులుగా ఉన్న ముస్లిం సామాజిక వర్గాన్ని ఏపీ సీఎం జగన్‌రెడ్డి నయవంచనకు గురిచేస్తున్నాడని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మీర్జా ముజాఫర్ బేగ్ అన్నారు. బుధవారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ముస్లిం నివాస ప్రాంతాల్లో తాము పర్యటించినప్పుడు వారు వెల్లడించిన అంశాలు ఎంతో బాధాకరంగా ఉన్నాయన్నారు. ఎన్నో పథకాలను రద్దు చేసిన జగన్‌రెడ్డి ఇమామ్‌లకు రూ.10వేలు, మౌజ్‌లకు రూ.5వేలు భృతి ఇస్తామని చెప్పి అరకొరగా ఇస్తున్నారన్నారు. ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తానన్న జగన్‌రెడ్డి ఆ ఊసే ఎత్తలేదన్నారు. రాష్ట్రంలో 10.2శాతం ఉన్న ముస్లిం జనాభా జగన్ ప్రభుత్వం చేసిన మోసాన్ని అర్థం చేసుకుందని, తాము చేసిన సర్వేలో వ్యతిరేకత బాగా కనిపిస్తుందని వివిధ వర్గాలతో పాటు ముస్లిం సమాజం మొత్తం జగన్ తాటా తీసేందుకు సిద్ధంగా ఉందన్నారు.

మాతృభాషపై మమకారం ఉండాలి

పీబీ సిద్దార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్



పద్యాలాపన చేస్తున్న విద్యార్థిని

మొగల్రాజపురం, ఫిబ్రవరి 21: మాతృభాషపై ప్రతి ఒక్కరికీ మమకారం ఉండాలని, మాతృభాషలో పట్టుఉంటే వేరే భాష సులభంగా వస్తుందని పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ పేర్కొన్నారు. సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో కళాశాల తెలుగు విభాగం సంయుక్తంగా ప్రపంచ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్యాలాపన పోటీలు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ తెలుగు మాట్లాడాలనే నిబద్ధత తెలుగు వారిలో ఉండాలని, మాతృభాషను నిర్లక్ష్యం చేయడం తగదని సూచించారు. డీన్ రాజేష్ జంపాల మాట్లాడుతూ ప్రపంచంలో ఏ భాషలోలేని అద్భుతం పద్యం మన తెలుగు భాషలోనే ఉందని అన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు పద్యాలను రాగయుక్తంగా పాడి ఆహూతులను రంజింపచేశారు.



మాట్లాడుతున్న డి.శ్రీలక్ష్మి

నగరంలో కళాశాలలు, పాఠశాలల నుంచి రెండు వందల మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పాఠశాల విభాగంలో వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ డి. గ్రాహ్య (6వ తరగతి), నిర్మల హైస్కూల్ ఎం. మహత్ (8వ తరగతి), బి.వైష్ణవి (7వ తరగతి), కళాశాల స్థాయిలో ఏ.దుర్గా సాయి, కె. తిలకవతి, వి.మాధురి వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. తెలుగు శాఖ అధిపతి డాక్టర్ ఎన్. శివకుమార్ పర్యవేక్షణలో తెలుగు అధ్యాపక బృందం డాక్టర్ పి.నీరజ, డాక్టర్ ఏవీ రమణమూర్తి, డాక్టర్ బలరాంలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా డాక్టర్ చల్లా సీతామహాలక్ష్మి, పి. దాసు వ్యవహరించారు.



రాగూర్ గ్రంథాలయంలో

జనశిక్షణా సంస్థాన్ కార్యాలయంలో..

మొగల్రాజపురం: ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని జనశిక్షణా సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా ఆధ్వర్యంలో కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ తెలుగు ఉపన్యాసకురాలు డి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఇతర భాషల్లో ప్రావీణ్యం రావాలంటే మాతృభాష వచ్చి ఉండాలని చెప్పారు. సంస్థ చైర్ పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తెలుగు భాష గురించి తెలుసుకోవాలని, తెలుగు మాత్రమే మాట్లాడాలని సూచించారు. సంస్థ డైరెక్టర్ ఏ. పూర్ణిమ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలు మాతృభాషతో ముడిపడి ఉంటాయన్నారు. సిబ్బంది, శిక్షకులు పాల్గొన్నారు.

రాగూర్ గ్రంథాలయంలో..

గవర్నర్‌పేట: ఎంజీ రోడ్డులోని రాగూర్ స్మారక గ్రంథాలయంలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి. జమలపూర్ణమ్మ మాట్లాడుతూ చిన్నారులు గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదవడం ద్వారా భాషను అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం లభిస్తుందన్నారు. గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి, జ్యోతి మహిళా మండలి అధ్యక్షురాలు ఝాన్సీరాణి, మహిళా మండలి సభ్యులు, పాఠకులు పాల్గొన్నారు.

పశ్చిమలో జనసేన-టీడీపీకే ప్రజల మద్దతు: పోతిన

భవానీపురం, ఫిబ్రవరి 21: పశ్చిమలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అవినీతి కార్యక్రమాలను బట్టబయలు చేయడంతో జనసేన-టీడీపీ కూటమికి ప్రజలు సంపూర్ణ మద్దతు పలుకుతున్నారని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ అన్నారు. 44వ డివిజన్‌లో జనసేన అధ్యక్షురాలు మల్లెపు విజయలక్ష్మితో కలిసి బుధవారం రాత్రి చెరువు సెంటర్‌లో ఇంటింటి రాబోయే మన జనసేన ప్రభుత్వం కార్యక్రమంలో మహేశ్ పర్యటించారు. ఐదేళ్ల కాలంలో ప్రజలకు అండగా ఉండటం వలన సంపూర్ణ మద్దతును తమ కూటమికి ఇస్తున్నారని, ఖచ్చితంగా అధికారంలోకి వచ్చి తీరతామన్నారు. ప్రజలు అందరూ మార్పును కోరుకుంటున్నారని, వైసీపీ ప్రభుత్వంలో పడిన ఇబ్బందులే కారణమన్నారు. శనివారపు శివ, కాపు వడ్డే, నాని, భాను, దుర్గారావు, లక్ష్మిరత్నం, మనోజ్ఞ, గంజి పవన్‌లు పాల్గొన్నారు.



ఇంటింటికీ జనసేన ప్రభుత్వం కార్యక్రమంలో పోతిన మహేశ్, విజయలక్ష్మి

మీడియాపై దాడి హేయమైన చర్య

పాతరాజరాజేశ్వరి పేట : మీడియా పైన దాడి అంటే ప్రజాస్వామ్యంపైన దాడేనని జనసేన పశ్చిమ ఇన్‌చార్జ్ పోతిన మహేశ్ అన్నారు. స్థానిక 55వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సోమి గోవింద్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికి రాబోయే మన జనసేన- టీడీపీ ప్రభుత్వం కార్యక్రమాన్ని విఓచిపేటలోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోతిన మహేశ్ ఇంటింటికీ వెళ్లి పార్టీ కరపత్రాలు అందజేసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడి దారుణమన్నారు. రాబోయే ఎన్నికల్లో జనసేన- టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నాయకులు పల్లెంటి ఆది, రమణ, రామకృష్ణ, సంపంరెడ్డి రాజు, ఆనంద్ కుమార్, సోమి మహేష్, శ్రీరామ్‌శెట్టి శ్రీను, పాల్గొన్నారు.

ఐరన్ అందజేత

చిట్టినగర్: 46వ డివిజన్ ఏసురత్నంవీధిలో ఉన్న కరుణామయ దేవాలయానికి పోతిన రామారావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బుధవారం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు పోతిన మహేశ్ రూ.లక్ష విలువ చేసే ఐరన్‌ను దేవాలయ నిర్వాహకులకు అందజేశారు. షేక్ షర్మిల, అమీర్‌బాష, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, గోపిశెట్టి వెంకన్న, బీ.ప్రసాద్, బెవర లోకేష్, రాజేష్, కరీముల్లా పాల్గొన్నారు.

జగన్‌కు ఓట్లు వేయనంటున్నారు

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



ఆర్థిక సహాయం అందజేస్తున్న గద్దె

పటమట, ఫిబ్రవరి 21 : జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేయబోమని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. బుధవారం 11వ డివిజన్ రెల్లీస్ కాలనీలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పార్టీ అధ్యక్షులు కోనేరు రాజేష్‌తో కలిసి గద్దె ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించారు. ఇటీవల మరణించిన బంగారు దుర్గాదేవి కుటుంబానికి గద్దె రూ.10 వేలు అందజేశారు. గత ఎన్నికల్లో జగన్‌కు ఓట్లు వేసి చాలా నష్టపోయామని, ఈ సారి జగన్‌కు ఓట్లు వేయబోమని స్పష్టంగా తమకు చెబుతున్నారని అన్నారు. ఒక్క రూపాయికే ఇంటి రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పిన జగన్ పేదల ఇళ్లను తాకట్టు పెట్టుకుని రుణాలు పొందారని చెప్పారు. రాష్ట్రంలో 33వేల మంది మహిళలు కనిపించకుండా పోయారని, ప్రభుత్వం సరఫరా చేస్తున్న మద్యాన్ని తాగి ఐదు లక్షల మంది మరణించిన విషయాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరిస్తామని చెప్పారు. బంగారు మురళీ, బంగారు నూకరాజు, దేవరపల్లి ఆంజనేయులు, పామర్తి కిషోర్, జాస్తి సురేష్, బెజవాడ నజీర్ పాల్గొన్నారు.

గంగానమ్మ-పోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్ఠ

పాయకాపురం, ఫిబ్రవరి 21 : 64వ డివిజన్ కుందావారి కండ్రికలో శ్రీశ్రీశ్రీ గంగానమ్మ-పోతురాజుస్వామి వార్ల విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించేలా బోధన ఉండాలి

● జిల్లా పాఠశాల విద్యాధికారి సుబ్బారావు



తనిఖీ చేస్తున్న డీఎస్ఈవో సుబ్బారావు

వన్‌టౌన్, ఫిబ్రవరి 21: పాఠశాలలో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయుల బోధన ఉండాలని జిల్లా పాఠశాల విద్యాధికారి (డీఎస్ఈవో) యు.వి సుబ్బారావు అన్నారు. కృష్ణలంకలోని అమరజీవి పొట్టి శ్రీరాములు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున ఆయా సబ్జెక్టులలో విద్యార్థుల అవగాహనను ఆయన పరిశీలించారు. విద్యార్థులను పాఠ్యాంశాలకు సంబంధించి ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతమైన మనస్సుతో ఏకాగ్రతతో చదవాలన్నారు. ఇందుకు సంబంధించి మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయుల బోధన సాగాలని సూచించారు. 8,9 తరగతుల విద్యార్థులకు అందజేసిన బైజూస్ కంటెస్ట్ ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలించారు.

ఇంధన పొదుపుపై అవగాహన కలిగి ఉండాలి

● డాక్టర్ సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం

చిట్టినగర్, ఫిబ్రవరి 21: ఇంధన పొదుపుపై పంప్ ఆపరేటర్లు అవగాహన కలిగి ఉండాలని హైదరాబాద్ సీపీ ఎక్సెర్జీ అండ్ కార్బన్ అడ్వైజరీ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం నూతన భవనం సమావేశ హాలులో ఇంధన పొదుపు ఆవశ్యకతపై ఇంజనీరింగ్ విభాగం పంప్ ఆపరేటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంలో వాటర్ పంపింగ్, వీధి దీపాలకు సంబంధించి నగరపాలక సంస్థ సిబ్బంది ఏ విధంగా విద్యుత్ పొదుపు చేయవచ్చు తదితర అంశాలను వివరించారు. అనంతరం మున్సిపాలిటీలలో ఇంధన సామర్థ్యంపై బుక్ లెట్ విడుదల చేశారు. ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీ. శ్రీనివాసులు, కుమారరెడ్డి, వీఎంసీ చీఫ్ ఇంజనీర్ ప్రభాకరరావు, ఏఈ ఎన్.ఫణింద్రకుమార్, పంప్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

'సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత కథ'పై పుస్తక సమీక్ష

భారతీనగర్, ఫిబ్రవరి 21: ఆంధ్రా లయోల కళాశాలలో ఫాదర్ గార్డెన్ లైబ్రరీ హాల్‌లో ప్రముఖ రచయిత ప్రేమ్ నందకుమార్ రచించిన సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత కథ అంశంపై బుధవారం పుస్తక సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరస్పాండెంట్ ఫాదర్ డాక్టర్ ఎం.సగాయరాజ్ పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణ ఒక గొప్ప తాత్వికుడు, ఆయన జీవితం ఎందరికో ఆదర్శం అని తెలియజేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ ఎస్.రాజు, లైబ్రేరియన్ సెక్రటరీ డాక్టర్ జి.ఎ. ప్రసాద్ రావు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు

భవానీపురం, ఫిబ్రవరి 21 : విద్యాధరపురం ఆర్టీసీ వర్క్ షాపులోని ట్రైనింగ్ కళాశాలలో నూతనంగా 18 బ్యాచ్ కింద 16 మంది డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. లైట్ వెహికల్ నుంచి హెవీ వెహికల్ లైసెన్సు ఇచ్చేందుకు ప్రతీ బ్యాచ్‌లో 16 మంది శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు 40 రోజుల పాటు డ్రైవింగ్ శిక్షణలో చేపట్టే అంశాలను కూలంకషంగా వివరించారు.

గంజాయి పట్టివేత: ఇద్దరు యువకుల అరెస్ట్

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 21 : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను బుధవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతానికి చెందిన షేక్ నూహెల్(19), రజన్ పడియార్(22) టీ స్టాల్ నడుపుతున్నారు. వీరిరువురు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సోదా చేయగా గంజాయి ఉండటాన్ని గుర్తించారు. ఒక్కొక్కరి వద్ద కేజీ 300 గ్రాముల చొప్పున 2 కేజీల 600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

పాలూరికి పురందేశ్వరి నివాళి

భవానీపురం, ఫిబ్రవరి 21 : బీజేపీ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శి పాలూరి శ్రీనివాసరావు మృతి తనకెంతో బాధను కలిగించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి బుధవారం నివాళి అర్పించారు. బుధవారం పాలూరి భౌతిక కాయాన్ని సందర్శించిన ఆమె మాట్లాడుతూ పార్టీ కార్యాలయంలో నిబద్ధతగా ఎనిమిదేళ్ల పాటు సేవలందించారన్నారు. బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పాల్గొన్నారు.

కొత్త పైపులైన్ పనులకు శంకుస్థాపన



గవర్నర్‌పేట, ఫిబ్రవరి 21: 23వ డివిజన్ సూర్యారావుపేటలోని డాక్టర్ ఎన్ సుబ్బారావు వీధిలో తాగునీరు సరఫరా కోసం కొత్త పైపులైన్ వేయడానికి చేపట్టిన పనులకు బుధవారం స్థానిక కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి రోడ్డు మార్జిన్‌లో ఉన్న అమ్మవారి గుడి వద్ద కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కార్పొరేషన్ నిధులు శాంక్షన్ చేయించి రూ. 5.70 లక్షల అంచనా వ్యయంతో పైపులైన్ పనులు చేపట్టినట్లు బాలస్వామి తెలిపారు. రానున్న వేసవి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాంట్రాక్టర్ కోటిరెడ్డి, మున్సిపల్ సిబ్బంది కెనడీ, అడుసుమిల్లి భాను పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో

35 మంది నలంద విద్యార్థులకు ఉద్యోగార్హత



లబ్బీపేట, ఫిబ్రవరి 21: కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 35మంది విద్యార్థులు ఉద్యోగార్హత సాధించినట్లు నలంద కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. బెంగళూరుకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్ మేనేజ్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 126మంది విద్యార్థులు పాల్గొనగా 35మంది అర్హత సాధించారని తెలిపారు. ఎంపికైన వారికి బెంగళూరులో 45రోజుల శిక్షణ, అనంతరం ఆంధ్రప్రదేశ్, బెంగళూరు, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాలలో ఉద్యోగం కల్పిస్తారని తెలిపారు. కమ్యూనికేటివ్ ఇంగ్లీషు టీచింగ్ ఆసక్తిగల విద్యార్థులకు ఐఎల్ఎం సంస్థ మంచి అవకాశాలు అందిస్తోందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ ఎ.విజయబాబు అభినందించారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి, కమ్యూనికేషన్ స్కిల్స్ హెచ్‌వోడీ బి.రజనీప్రదీప, టెక్నికల్ హెడ్ యు.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 21: సింగ్‌నగర్ ఫ్లైఓవర్ కింద రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు బుధవారం విజయవాడ గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం ఫ్లైఓవర్ కింద ట్రాక్‌పై ఓ యువకుడి మృతదేహం ఉన్నట్లు అక్కడ పనిచేస్తున్న రైల్వే ఉద్యోగి కె.నరసింహులు సంబంధిత రైల్వే అధికారులకు తెలియజేశారు. పోలీసులు ఘటనా ప్రదేశానికి వెళ్ళి మృతదేహాన్ని పరిశీలించారు. ఎలాంటి ఆధారం లేనందున విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి సుమారు 25 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఎడమ చేతిపై శివుడి త్రిశూలం ఉన్న బొమ్మ ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

జర్నలిస్టులపై దాడి పాశవిక చర్య

రాణిగారితోట, ఫిబ్రవరి 21: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడి అత్యంత పాశవిక చర్య అని రాష్ట్రం మొత్తం ఈ చర్యను ఖండిస్తుందని, అ ఘటన మరవక ముందే ఈనాడు కార్యాలయంపై దాడి చేయడం వైసీపీ నాయకుల దారుణ ఆలోచనలకు అద్దం పడుతుందని 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేములు దుర్గారావు అన్నారు. ప్రభుత్వం దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోతే ప్రజలు క్షమించరని అన్నారు. డివిజన్ లోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత నాలుగున్నర సంవత్సరాల నుంచి జరుగుతున్న వైసీపీ పాలనపై వాస్తవాలు రాస్తున్న ప్రతికలపై దాడులు చేయడం వారి నిరంకుశత్వానికి నిదర్శనం అని, ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ లేకుండా చేస్తున్న ఈ వైసీపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు.

సూర్య కెరీర్‌లోనే హై బడ్జెట్ ఫిల్మ్



విభిన్న పాత్రలను పోషించడంలో ఎప్పుడూ ముందుండే తమిళ హీరో సూర్య ప్రస్తుతం పాన్ వరల్డ్ ఫిల్మ్ 'కంగువ'లో నటిస్తున్నారు. మొత్తం పది భాషల్లో విడుదల కానున్న ఈ పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్‌కు శివ దర్శకత్వం వహిస్తున్నారు. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇందులో బాబీ డియోల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. దిశా పటాని కథానాయిక. ఈ సినిమా డబ్బింగ్ వర్క్ ప్రారంభించారు సూర్య. ఆయన కెరీర్‌లోని హై బడ్జెట్ ఫిల్మ్‌గా రూపొందుతున్న ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తారు. త్రీడీలోనూ 'కంగువ' విడుదల కానుంది.

వేడుకగా దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుల ప్రదానం




భారతీయ సినీరంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2024 మంగళవారం రాత్రి ముంబైలో కన్నుల పండుగగా జరిగింది. పలువురు సినీతారలు ఈ చిత్రోత్సవంలో సందడి చేశారు. 'యానిమల్' చిత్రానికి గాను సందీప్‌రెడ్డి వంగా ఉత్తమ దర్శకుడి పురస్కారం అందుకున్నారు. ఉత్తమ నటీనటులుగా 'జవాన్' చిత్రానికి షారూఖ్, నయనతార అవార్డు స్వీకరించారు. ఉత్తమ ప్రతినాయకుడిగా బాబీడియోల్, ఉత్తమ సంగీత దర్శకుడిగా అనిరుధ్ రవిచందర్ నిలిచారు. సంగీత ప్రపంచానికి అందించిన సేవలకు గాను యేసుదాస్ ప్రత్యేక పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా షారూఖ్‌ఖాన్ మాట్లాడుతూ 'దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అంటే నాకు చాలా గౌరవం. చాలా ఏళ్ల తర్వాత మళ్లీ ఉత్తమ నటుడి పురస్కారం దక్కినందుకు ఆనందంగా ఉంది. ఈ అవార్డును నాతో పాటు పురస్కారాలకు నామినేట్ అయిన తోటి నటీనటులకు అంకితమిస్తున్నాను. ఇంత గొప్ప గౌరవం దక్కేలా చేసినందుకు ప్రేక్షకులకూ, జవాన్ చిత్రబృందానికి నా ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

సన్నిహితుల సమక్షంలో రకుల్ వివాహం




హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తన చిరకాల మిత్రుడు, నిర్మాత జాకీ భగ్నానీతో ఆమె వివాహం గోవాలోని ఐటీసీ గ్రాండ్ రిసార్ట్స్‌లో బుధవారం జరిగింది. ఉదయం సిఖ్ పద్ధతి ప్రకారం, సాయంత్రం సింధి సంప్రదాయ పద్ధతిలో జరిగిన వీరి వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే పాల్గొన్నారు. బాలీవుడ్ నుంచి అక్షయ్‌కుమార్, వరుణ్ ధావన్, జెనీలియా, టైగర్ ష్రాఫ్, శిల్పా శెట్టి, రాజ్ కుంద్రా, అర్జున్ కపూర్, ఆయుష్మాన్ ఖురానా తదితరులు హాజరయ్యారు.

అభినవ్ హీరోగానూ సక్సెస్ కావాలి



అభినవ్ గోమఠం హీరోగా నటించిన 'మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా' చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో వరుణ్‌తేజ్ ముఖ్య అతిథిగా హాజరై బిగ్ టికెట్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'విభిన్న పాత్రల ద్వారా ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న అభినవ్ తొలిసారిగా హీరోగా నటిస్తున్నాడు. చిత్రంలో అన్ని భావోద్వేగాలు ఉన్నాయని తెలిసింది. కంటెంట్‌ను నమ్మి తీసిన సినిమాలా అనిపించింది. ఈ చిత్రం విజయం సాధించాలి' అని అన్నారు. 'నా కెరీర్‌లో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాను. ఈ సినిమాలో నటించడం లక్కీగా ఫీలవుతున్నాను. నా సినిమా కంటెంట్ నచ్చితే ప్రోత్సహించండి.' అన్నారు అభినవ్. దర్శకుడు తిరుపతిరావు మాట్లాడుతూ 'దర్శకుడిగా నాకు అవకాశం ఇచ్చిన అభినవ్‌కు, నిర్మాతలకు రుణపడి ఉంటాను. అందరి సహకారంతో చిత్రాన్ని పూర్తి చేశాను. తప్పకుండా నచ్చుతుందని అనుకుంటున్నాను' అన్నారు. నిర్మాతల్లో ఒకరైన భవాని కాసుల మాట్లాడుతూ 'సినిమాలోని ప్రతి పాత్ర అందరికీ రిలేటెడ్‌గా ఉంటుంది. ప్రేక్షకులకు నచ్చే అంశాలు ఉన్నాయి. సినిమా విజయం మీద నమ్మకం ఉంది' అన్నారు. వైశాలి రాజ్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని భవాని కాసుల, ఆరెమ్ రెడ్డి, ప్రశాంత్ వి నిర్మించారు.

బడ్జెట్ పెరిగినా వెనక్కు తగ్గలేదు

- నిర్మాతలు స్నేహాల్, శశిధర్, కార్తీక్

శివ కందుకూరి హీరోగా పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'భూతద్దం భాస్కర్ నారాయణ'. ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌ను స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించారు. మార్చి 1న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్మాతలు మీడియాతో ముచ్చటించారు.




- గతంలో 'పీష్ మహల్', 'నీతో' చిత్రాలు నిర్మించాం. 'భూతద్దం భాస్కర్ నారాయణ' స్క్రిప్ట్ అద్భుతంగా అనిపించడంతో బడ్జెట్ పెరిగినా ఎక్కడా రాజీపడకుండా మంచి క్వాలిటీతో నిర్మించాం. ఇదొక డిటెక్టివ్ థ్రిల్లర్. టీజర్, ట్రైలర్, పాటలకు మంచి స్పందన వచ్చింది. ఓవర్సీస్, ఓటీటీ బిజినెస్ క్లోజ్ చేశాం.
- ఇందులో కథే హీరో. ఇప్పటి వరకూ ఇలాంటి కథను ప్రేక్షకులు చూసి ఉండరు. ప్రతి ఇంటి ముందూ ఉండే దిష్టిబొమ్మ వెనుక ఉన్న కథేమిటి అనే అంశానికి ఫాంటసీ ఎలిమెంట్‌ను జోడించి ఆసక్తికరంగా తెరకెక్కించారు. పురుషోత్తం రాజ్ విజన్ ఉన్న దర్శకుడు. చాలా కొత్తగా తీశారు. పురాణాలతో ముడిపెట్టి కథను నడిపే తీరు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. డిటెక్టివ్‌గా శివ కందుకూరి పాత్రలో ఒదిగిపోయారు. హీరోయిన్ రాశీ సింగ్ కూడా ప్రతిభగల నటి. శ్రీ చరణ్ బీజీఎం సినిమాను ఓ స్థాయిలో నిలబెడుతుంది. ఏఐ టెక్నాలజీ వాడి రూపొందించిన శివ ట్రాన్స్ సాంగ్‌కు చక్కటి స్పందన రావడం ఆనందాన్నిచ్చింది.

పద్నాలుగు రోజుల ప్రేమకథ



కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రేమకథా చిత్రం '14 డేస్ లవ్'. నాగరాజు బోడెం దర్శకత్వంలో హరిబాబు దాసరి నిర్మించారు. మనోజ్ పుట్టూర్, చాందిని భాగవని హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ నెల 23న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'తమ కుటుంబాన్ని కాపాడుకునే ప్రయత్నంలో వారసులు ఎదుర్కొన్న సమస్యలు ఏమిటి? అనేది ఆసక్తికరంగా ఉంటుంద'ని చెప్పారు. కుటుంబ విలువలు, సంప్రదాయాలను హృదయానికి హత్తుకునేలా ఆవిష్కరించే ప్రయత్నం ఈ చిత్రంలో చేశామని దర్శకుడు తెలిపారు. సంగీతం: కిరణ్ వెన్న, సినిమాటోగ్రఫీ: కన్నన్ మునస్వామి

'బినాకా గీత్ మాలా' అమీన్ సయానీ ఇక లేరు!



'బెహనో ఔర్ భాయియో' అంటూ 42 ఏళ్ల పాటు సిలోన్ రేడియోలో, ఆ తర్వాత వివిధ భారతిలోనూ 'బినాకా గీత్ మాలా' కార్యక్రమంతో శ్రోతలను అలరించిన స్వరం మూగబోయింది. రేడియో అనౌన్సర్లకు, జాకీలకు పితామహుడు లాంటి అమీన్ సయానీ తన 91 ఏట గుండెపోటుతో బుధవారం ముంబైలో కన్నుమూశారు. ఆయన సమర్పించే 'బినాకా గీత్ మాలా' వినడం కోసం ఆ రోజుల్లో ప్రతి బుధవారం అంతా రేడియో ముందు చేరిపోయేవారు. ఈ కార్యక్రమంలో ప్రసారం చేసే పాట గురించి మధ్య మధ్యలో ఆయన చేసే వివరణ చాలా ఆసక్తికరంగా ఉండేది. 'బినాకా గీత్ మాలా' మాత్రమే కాకుండా క్విజ్ ప్రోగ్రామ్, షాలీమార్ సూపర్ జోడీ, 'సంగీత్ కే సితారే' వంటి కార్యక్రమాలు ఆయన నిర్వహించారు. 54 వేల రేడియో కార్యక్రమాలు నిర్వహించిన రికార్డ్ సృష్టించిన అమీన్ సయానీ 2009లో పద్మశ్రీ పురస్కారం పొందారు. ఇప్పటివరకూ పద్మశ్రీ పురస్కారం పొందిన రేడియో అనౌన్సర్ అమీన్ సయానీ మాత్రమే. అలాగే 'భూత్ బంగ్లా', 'బాక్సర్', 'ఖతాల్' వంటి చిత్రాల్లో అమీన్ నటించి, అనౌన్సర్ పాత్రలనే పోషించడం విశేషం.



నేనొక ట్రాన్స్‌కు తల్లిని

ఎలాంటి ఆంక్షలు, హద్దులు లేని మాతృప్రేమకు నిలువెత్తు రూపం ముకుంద మాల. తన కడుపున పుట్టిన బిడ్డ యుక్త వయసుకొచ్చాక మొదట తాను 'గే' అని చెబితే, ఫర్లేదు 'నువ్వు నా బిడ్డవు' అని కొండంత అండగా మారారు. కొన్నాళ్లకు 'అబ్బాయిని కాదు, అమ్మాయిని' అనగానే... 'నాకు పుట్టింది అమ్మాయే అనుకొంటా' అంటూ బిడ్డలో జీవిత కాలానికి సరిపడా ఆత్మస్థైర్యాన్ని నింపారు. ఇప్పుడు తన కూతురులాంటి వారందరి హక్కుల కోసం గళం విప్పారు. ఎల్జీబీటీక్యూ వ్యక్తుల హక్కుల ఉద్యమంతో మమేకమై... కన్నవారు తిరస్కరించిన కమ్యూనిటీకి పెద్దమ్మగా మారిన ముకుంద మాల 'నవ్య'తో 'క్వీర్ బంధు' ప్రస్థానం గురించి పంచుకున్నారిలా.

"నా బిడ్డలాంటి వారి హక్కుల కోసం 'క్వీర్ బంధు పేరెంట్స్ అసోసియేషన్' ప్రారంభించాను. దాని ద్వారా ఎల్జీబీటీక్యూ వ్యక్తుల హక్కుల కోసం పోరాడుతున్నాను. కొన్నాళ్ళ కిందటి వరకు లెస్బియన్, గే, బై, ట్రాన్స్... ఇవన్నీ నాకు అసలు తెలియని, నేనెన్నడూ వినని పదాలు. అలాంటిది ఇప్పుడు వాటి గురించి సంభాషించని రోజే లేదు. పదిహేనేళ్ల కిందటి సంగతి... నేనొక కార్పొరేట్ కంపెనీ ఉద్యోగిని. నా భర్త ఓ ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు. మాకు ఒక్కగానొక్క అబ్బాయి. వాడు మొదటి నుంచి చదువులో చాలా చురుకు. ప్రతి తరగతిలోనూ వాడే స్కూలు ఫస్ట్. ఎంబీబీఎస్ సీటు కూడా ప్రభుత్వ వైద్య కళాశాలలోనే వచ్చింది. ఇంకేముంది... జీవితం సాఫీగా సాగిపోతుందనుకొన్నాం. "కాలేజీలోనే మంచి అమ్మాయిని చూసుకోరా! చదువు పూర్తి అవ్వగానే పెళ్లి చేసేస్తాం' అని ఓ రోజు బాబుతో అన్నాను. 'అది సాధ్యం కాదు అమ్మ' అంటూ విషయం దాటేశాడు. అప్పుడు వాడి మాటలు నాకు అర్థం కాలేదు. కానీ ఆ తర్వాత రోజు నుంచి వాడితో బయటకు వెళ్లినప్పుడు అబ్బాయిలను చూపిస్తూ... వాళ్ళ అందాన్ని పొగుడుతూ చెప్పడం గమనించాను. అయినా, నాకేమీ అర్థంకాలేదు. ఇంతలో ఒక రోజు ఇద్దరం కలిసి కూర్చొని సరదాగా మాట్లాడుకుంటుండగా, తనకు అబ్బాయిలంటేనే ఇష్టమని చెప్పేశాడు. ఆ మాట విన్న వెంటనే నాకు కాళ్ళ కింద భూమి కంపించినట్టు అయింది. నా మనసులో బాధ వర్ణనాతీతం.

మొదటిసారి 'ప్రైడ్ మార్చ్'లో...

అలాంటి పరిస్థితిలో వాడే నన్ను మొదట సముదాయించి, ధైర్యం చెప్పాడు. ప్రకృతిలో ఆడ, మగ మాత్రమే కాదు భిన్న జెండర్లు, విభిన్న లైంగికత్వాలుంటాయని నాకు అర్థమయ్యేలా చెప్పడానికి ప్రయత్నించాడు. నా తృప్తి కోసం బాబును సైకాలజిస్టులు, సైకియాట్రిస్టుల వద్దకు తీసుకెళ్లాను. 'అది అసహజం కాదు సహజమని'

మరో కోణం

వారంతా తిరిగి నాకే కౌన్సెలింగ్ ఇచ్చారు. దాంతో నేనూ లైంగికత్వాల మీద లోతుగా తెలుసుకోవడం మొదలుపెట్టాను. వాళ్ళ నాన్నతోనూ విషయం చెబితే, 'మనమేమీ చేయలేం. మౌనంగా ఉండు. బాబును ఏమీ అనకు' అని ఆయన నాకు నచ్చచెప్పారు. అదే సమయంలో పిల్లాడి చదువు దెబ్బతినకూడదని... వాడి అభిప్రాయాలను గౌరవిస్తూ... చాలా సున్నితంగా వ్యవహరించాం. మేము ఏ మాత్రం కాస్త భిన్నంగా స్పందించినా, అది వాడి చదువు, కెరీర్ మీద ప్రభావం చూపుతుందని అనిపించింది. తన జెండర్ అస్తిత్వాన్ని అప్పుడే బహిర్గతం చేస్తానన్నాడు. మెడిసిన్ పూర్తి అయ్యేవరకు ఆగమన్నాను. తర్వాత 2012లో ఎల్జీబీటీక్యూ వ్యక్తులకు మద్దతుగా మొట్టమొదటిసారి బాబుతో కలిసి నేనూ 'ప్రైడ్ మార్చ్'లో పాల్గొన్నాను. అలాంటి కార్యక్రమాలను కమ్యూనిటీతో కలిసి ఇప్పుడు నిర్వహిస్తున్నందుకు గర్విస్తున్నాను.

అమ్మాయికి పెళ్లి...

నాకు పుట్టింది కొడుకు కాదు, కూతురు అనుకొన్నాను. మా అమ్మాయి ఆలోచనలపట్ల నాకు అవగాహన లేక, "నీకు ఇష్టమైన వ్యక్తిని ఎంపిక చేసుకొని సహజీవన బంధంలో కొనసాగమని' సూచించాను. 'కాదమ్మా! సగటు ఆడపిల్లలా నాకు పెళ్లి చేసుకొని, పిల్లల్ని కనాలనుంది" అన్నది. మా అమ్మాయికి నచ్చిన అబ్బాయితో పెళ్లి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ట్రాన్స్ వ్యక్తుల పెళ్ళిళ్లకు చట్టబద్ధత కల్పించాలని చాలా కాలంగా పోరాడుతున్నాం.

అమెరికాలో ట్రాన్స్ అమ్మాయిగా...

మా అబ్బాయికి చిన్నప్పటి నుంచి భయంతోకాకుండా, బాధ్యత నేర్పిస్తూ పెంచాను. మనసులోని ప్రతి మాటను నిర్భయంగా నాతో పంచుకొనే స్వేచ్ఛ వాడికి ఎప్పుడూ ఉంది. ఇద్దరం కలిసి హెచ్ఐవీ బాధిత చిన్నారులకు, వృద్ధాశ్రమాలకు వెళ్లి, తోచిన సహాయం అందిస్తుండేవాళ్లం. అలా వాడికి బాల్యం నుంచి సేవాభావాన్ని కొంత అలవర్చగలిగాం. ఒకరోజు నన్ను అడిగాడు... 'అమ్మా... నాకు అండగా ఉన్నట్టే, నాలాంటి వారందరి కోసం కూడా నిలబడచ్చు కదా' అని. వాడిదంత మంచి మనసు. అలాంటి వాడికి ఈ సమాజం నుంచి అవమానాలు, ఛీత్కారాలు ఎదురవ్వడం నాకిష్టంలేదు. ఎంబీబీఎస్ అయిపోగానే, విదేశాలకు వెళ్ళమని సూచించాను. వాడి ప్రతిభకు యూరప్‌లోని ఓ మంచి యూనివర్సిటీలో మాస్టర్స్‌కు ఫ్రీ సీటు వచ్చింది. అక్కడే ఎంఎస్ జెరోంటాలజీ పూర్తి చేశాడు. తర్వాత నిమ్స్‌లో జీరియాట్రిక్ మెడిసిన్‌పై పీజీ డిప్లొమా చదివాడు. అమెరికాలోని ప్రముఖ



యూనివర్సిటీలో జెరోంటాలజీలో ఎల్జీబీటీక్యూ వ్యక్తుల ఏజింగ్ మీద పీహెచ్‌డీ చేస్తున్న సమయంలో... తన అస్తిత్వం ట్రాన్స్ అమ్మాయిగా నిర్ధారించుకొన్నాడు.

హార్మోన్ థెరపీతో...

జెండర్ విషయంలో స్పష్టత వచ్చినందుకు నేనూ సంతోషించాను. హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ లాంటివి తీసుకొంటున్నప్పుడు విపరీతమైన మూడ్ స్వింగ్స్‌తో అవస్థ పడింది. అలాంటి సమయంలో రోజూ వీడియో కాల్, స్కైప్ ద్వారా మా అమ్మాయికి అందుబాటులో ఉంటూ ధైర్యం చెప్పేదాన్ని. అమెరికాలోనూ ముఖ్యంగా ట్రంప్ కాలంలో కొన్ని సమస్యలు ఎదురయ్యాయి. వాటన్నింటిని అధిగమించడానికి అవసరమైన మానసిక స్థైర్యాన్ని అందిస్తూ నా బిడ్డకు ఓ తల్లిలానేకాదు, అంతకు మించిన స్నేహితురాలిగా మార్గనిర్దేశం చేశాను. ఇప్పుడు పీహెచ్‌డీ పూర్తి చేసి, పోస్ట్ డాక్టోరల్ కోసం ప్రయత్నిస్తోంది. అదీ మేము ఒక్క రూపాయి ఫీజు చెల్లించకుండా, తన ప్రతిభతోనే ఇంతవరకు చదువుకుంది.

అమ్మ ప్రేమలో షరతులా..!

నా బిడ్డ లైంగికత్వం ఫలానా అని తెలిసిన తర్వాత నేను ఎన్నడూ తనను పల్లెత్తు మాట అనలేదు. ఈ లోకమంతా నా బిడ్డను తిరస్కరించినా, నేను మాత్రం గుండెల్లో పొదువుకోడానికి సిద్ధమయ్యాను. కడుపున పుట్టిన బిడ్డా! బంధుమిత్రులా... అన్న మీమాంస తలెత్తినప్పుడు నా కూతురే నాకు ముఖ్యం అనుకొన్నాను. సృష్టిలో స్వచ్ఛమైనది తల్లి ప్రేమ అంటారు. మరి అలాంటి బిడ్డ లైంగిక అస్తిత్వాన్ని ముందుగా తల్లిదండ్రులు ఆమోదించాలి కదా! 'నువ్వు ఫలానాలా ఉంటేనే బిడ్డగా అంగీకరిస్తామని' షరతులు విధించడం తగునా! అమ్మ ప్రేమలోనూ షరతులుంటాయా! ఏ బిడ్డా తనను లెస్బియన్‌గానో, గేగానో కనమని కోరదు. అలాంటిది వారి లైంగికతను బలవంతంగా నిలువరించే అధికారం కన్నవారికెక్కడిది! 'మమ్మల్ని ఎందుకు ఇలా కన్నావు' అని తిరిగి వాళ్ళు నిలదీస్తే, చెప్పడానికి మన దగ్గర సమాధానం ఉందా? అందుకే జెండర్ అంటే కేవలం స్త్రీ, పురుషులే కాదు... విభిన్న అస్తిత్వాలు, సమూహాలు అని ప్రతి ఒక్కరికి తెలియజేయడం కోసమే నా ప్రయత్నమంతా...

ఇంటిపేరు చెడగొడుతున్నావన్నారు...

ట్రాన్స్ అమ్మాయిగా ఇంటికి మొట్టమొదటిసారి నా బిడ్డ వస్తున్నప్పుడు... మా వీధిలోని ప్రతి ఇంటికి వెళ్లి విషయాన్ని వివరిస్తూ, మా అమ్మాయిని ప్రశ్నలతో ఇబ్బంది పెట్టద్దని కోరాను. నిజానికి వారంతా చాలా బాగా అర్థం చేసుకొన్నారు. ఇదివరకటి కంటే ఎక్కువగా మా అమ్మాయి పట్ల చాలా ప్రేమాభిమానాలను చూపించారు. సమస్యల్లా మా బంధువుల నుంచి ఎదురైంది. ఇంటి పేరు చెడకొడుతున్నారంటూ కొందరు రక్తసంబంధీకులు విమర్శించారు. అప్పటి నుంచి నేను కూడా పేరుకు ముందు ఇంటిపేరు రాయడం మానేశాను. చాలా దగ్గరి బంధువులు కూడా ఇళ్ళల్లో వేడుకలకు నన్ను ఆహ్వానిస్తారు కానీ, మా అమ్మాయి గురించి మాత్రం అస్సలు అడగరు. అలాంటప్పుడు నాకు చాలా బాధగా ఉంటుంది. అయినా, నా కూతురును గౌరవించనివాళ్ళతో బంధుత్వాన్ని నేను వదులుకోలేదు. ఎప్పటికైనా వారిలో మార్పు వస్తుందనే ఆశతోనే ప్రతి వేడుకకూ వెళ్లి, అవసరమైతే నా వంతు సహాయం చేస్తుంటాను. ఎల్జీబీటీక్యూ వ్యక్తులు సాటి మనుషులే అని తెలియజెప్పేందుకు ప్రయత్నిస్తుంటాను.

కమ్యూనిటీతో కలిసి...

నా కూతురుకి ఇచ్చిన మాట ప్రకారం ఇంటి నుంచి బయటకు వచ్చి ఒంటరిగా జీవిస్తున్న ఎల్జీబీటీక్యూ వ్యక్తుల్లో మానసిక స్థైర్యం నింపేందుకు నావంతుగా ప్రయత్నిస్తున్నాను. అలా నాకు జర్మనీ, లండన్, అమెరికా, కెనడా... తదితర దేశాల్లో చదువుతున్న వారూ రెగ్యులర్‌గా ఫోన్ చేసి మాట్లాడుతుంటారు. వాళ్ళ ఇళ్ళల్లో పరిస్థితి వివరిస్తూ, 'మీలా మా అమ్మానాన్న కూడా మా లైంగికత్వాన్ని అంగీకరిస్తే ఎంత బావుంటుంది ఆంటీ' అంటూ బాధపడుతుంటారు. నాకున్న పరిచయాలతో పదిమంది వరకు ఎల్జీబీటీ వారికి కార్పొరేట్ కంపెనీలలో ఉద్యోగాలు ఇప్పించగలిగాను. ఇంట్లో అంగీకారంలేని వాతావరణంలో ఇమడలేక చాలామంది మదనపడుతుంటారు. అలాంటివారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, గైడ్ చేస్తున్నాం. ఇలా 14 ఏళ్లుగా కమ్యూనిటీతో కలిసి పని చేస్తున్న క్రమంలో ముంబైలోని 'స్వీకార్ రెయింబో పేరెంట్స్' వాట్సాప్ గ్రూపు స్ఫూర్తితో 'క్వీర్ బంధు పేరెంట్స్ అసోసియేషన్'ను ఇక్కడ ప్రారంభించాను. దీని ద్వారా కన్నవారి ఆలోచనల్లో మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాను. నాలా బయటకు వస్తున్న వాళ్ళు చాలా తక్కువ. ట్రాన్స్ వ్యక్తులకు గుర్తింపు కార్డులు ఇప్పించడం... మెరుగైన వైద్య సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడటం లాంటి కార్యక్రమాలు కమ్యూనిటీతో కలిసి నిర్వహిస్తున్నాను. 'తెలంగాణ స్టేట్ ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డు'లోనూ నన్ను సభ్యురాలిగా తీసుకున్నారు. మా చొరవతో లీగల్ సర్వీస్ అథారిటీ సేవలను ఎల్జీబీటీక్యూ వారికి అందేలా చేయగలిగాం. ఇలా కమ్యూనిటీ వెన్నంటే ఉండి, చివరి వరకూ వారి కోసమే పనిచేయాలని ఉంది."

• సాంత్వన్

కౌన్సెలింగ్



కాల్షియం అవసరం ఎంత?

డాక్టర్! 30 ఏళ్లు దాటిన వాళ్లందరూ క్యాల్షియం సప్లిమెంట్లు తీసుకోవడం అవసరం అని విన్నాను. క్యాల్షియం మాత్రలను ఎలా ఎంచుకోవాలి? వీటిని ఎవరికి వారు స్వయంగా వాడుకోవచ్చా?

- ఓ సోదరి, హైదరాబాద్.

పెద్ద వయసులో ఎముకలు గుల్లబారకుండా ఉండాలంటే కాల్షియం సప్లిమెంట్ తీసుకోక తప్పదని మన నమ్మకం. కానీ కాల్షియం సప్లిమెంట్లు రెండంచుల పదునున్న కత్తిలాంటివి. వీటి వాడకంలో అప్రమత్తత ఎంతో అవసరం. 19 నుంచి 50 సంవత్సరాల మహిళలకు రోజుకి 1000 మి.గ్రా, 51-70 ఆ పైవయసులో ఉన్న మహిళలకు 1200 మి.గ్రా కాల్షియం అవసరమవుతుంది. కానీ ఈ కాల్షియం ఆహారం ద్వారా పొందే ప్రయత్నం చేయాలి. వైద్యులు చెప్పకపోయినా కాల్షియం సప్లిమెంట్లను వాడేవాళ్లు ఇతరత్రా ఆరోగ్య ఇబ్బందులకు కూడా గురికాక తప్పదు అవసరానికి మించి కాల్షియం శరీరంలో చేరటం వల్ల కిడ్నీలో రాళ్లు, మిల్క్ ఆల్కలై సిండ్రోమ్ లాంటి రుగ్మతలతోపాటు శరీరం ఐరన్‌ను పీల్చుకునే స్వభావం కుంటుపడుతుంది. అలాగే ఇతరత్రా వ్యాధులకు వాడే మందుల మీద కూడా ప్రభావం పడుతుంది. ఆహారం ద్వారా శరీరంలోకి ఎంత కాల్షియం చేరుతుందో గమనించి లోపించిన కాల్షియంను మాత్రల ద్వారా భర్తీ చేసే ప్రయత్నం చేయాలే గానీ చేతికందిన సప్లిమెంట్‌ను తీసుకోకూడదు. ముఖ్యంగా మెనోపాజ్ దశలో ఉన్న మహిళలు ఎముకల నొప్పులు, నీరసం లక్షణాలు కనిపిస్తే సొంత వైద్యం చేసుకోకుండా వైద్యులను సంప్రదించి తగిన మోతాదు కాల్షియం సప్లిమెంట్లను తీసుకోవాలి.

డాక్టర్ దశరాధరామి రెడ్డి,
ఆర్థోపెడిక్ సర్జన్, హైదరాబాద్.

స్కిన్ కేర్



ఇలా చర్మం యవ్వనం

కొంతమంది వయసు పైబడినా యవ్వనంగా కనిపిస్తూ ఉంటారు. అందుకు కారణం వాళ్ల చర్మం యవ్వనంగా ఉండడమే! ఇలాంటి చర్మం సొంతం చేసుకోవడం కోసం కొన్ని అలవాట్లకు దైనందిన జీవితంలో చోటు కల్పించాలి.

చర్మాన్ని శుభ్రంగా ఉంచుకోవడం అలవాటు చేసుకోవాలి. అలాగే పొడిబారిపోకుండా కాపాడుకోవాలి. వయసు పైబడేకొద్దీ చర్మం సాగే గుణాన్ని కోల్పోయి, ముడతలు పడుతుంది. ఈ ప్రభావాన్ని తగ్గించడం కోసం డీహైడ్రేషన్‌కు గురి కాకుండా చూసుకోవాలి. సరిపడా నీళ్లు తాగుతూ ఉండాలి. అలాగే కంటి నిండా నిద్రపోవాలి. చర్మం తేమను కోల్పోకుండా మన్నికైన మాయిశ్చరైజర్ ఉపయోగించాలి. స్నానం చేసిన వెంటనే చర్మం మీద తడి ఆరిపోకముందే మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి. అలాగే కాలంతో సంబంధం లేకుండా నాణ్యమైన సన్‌స్క్రీన్ లోషన్‌ను వాడుకుంటూ ఉండాలి. ఎండ సోకడం వల్ల చర్మం జీవం కోల్పోతుంది. కాబట్టి ఎండలోకి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా చేతులకు కూడా సన్‌స్క్రీన్ అప్లై చేసుకోవాలి. గరుకుగా ఉండే స్క్రబర్స్ ముఖానికి వాడకూడదు. సబ్బుకు బదులుగా ఫేస్ వాష్ అలవాటు చేసుకోవాలి. అలసటకు గురైనా, జబ్బు పడినా చర్మం జీవం కోల్పోతుంది. కాబట్టి సాధ్యమైనంత వరకూ ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించాలి. అలాగే చర్మాన్ని యవ్వనంగా ఉంచే ఆహార పదార్థాలకు భోజనంలో చోటు కల్పించాలి. సలాడ్లు, పండ్లు ఎక్కువగా తినాలి. ప్రొటీన్లు, పీచు ఆహారంలో సరిపడా ఉండేలా చూసుకోవాలి. చక్కెర చర్మానికి శత్రువు. కాబట్టి తీపి పదార్థాలను పరిమితంగానే తీసుకోవాలి. అలాగే శీతల పానీయాలు, మద్యాలకు దూరంగా ఉండాలి.

పిల్లల్లో సిగ్గు పోవాలంటే..

ఇంట్లోకి ఎవరైనా వస్తూనే కొందరు పిల్లలు తల్లిచాటునో, తండ్రి చాటునో దాక్కోవటం.. లేదా ఇంట్లో దాక్కోవటం చేస్తుంటారు. ఆ తర్వాత ఇది అలవాటుగా మారుతుంది. ఇలాంటి పిల్లల్లో సిగ్గును పోగొట్టాలంటే ఈ పద్ధతులు పాటించాలి.

- పిల్లలు ఇంట్రోవర్ట్స్ కావొచ్చు లేదా పెంపకం వల్ల కావచ్చు. మరేదైనా కావొచ్చు. అనుకోకుండా పిల్లల్లో షైనెస్ వస్తుంది. ఒకవేళ కొత్తవారెవరైనా ఇంట్లోకి వచ్చినపుడు అమ్మానాన్నల దగ్గర దాక్కుంటే.. 'మా పిల్లవాడు సిగ్గుపడతాడు' లాంటి పదాలు ఉపయోగించకూడదు. సిగ్గు పిల్లవాడు.. అంటూ విశేషణాలు తగిలించాల్సిన అవసరం లేదు. ఈ రోజే మిమ్మల్ని చూసారు కదా.. అందుకే ఇలా. కాస్త అడ్జస్ట్ కావాలి.. అంటూ మాట్లాడాలి.
- మీ కిడ్ బొమ్మలు వేస్తుంటే.. కాస్త ఎంకరేజ్ చేయండి. గేమ్స్ ఆడితే ప్రశంసించండి. ఇలా ఒక పని బాగా చేసినపుడు కాంప్లిమెంట్స్ ఇస్తే కాన్ఫిడెన్స్ పెరుగుతుంది. దీనివల్ల షైనెస్ తగ్గిపోతుంది. పదిమందితో సులువుగా సోషలైజ్ అవుతారు.
- కొందరు పిల్లలు ఆడుతుంటే.. 'మా కిడ్ సిగ్గు పడతాడు' అంటూ అక్కడే కుర్చీ వేసుకుని కూర్చోకూడదు. సొంతంగా పక్కన ఉండే పిల్లలతో ఆడుకునే స్వేచ్ఛ ఇవ్వాలి. అప్పుడే కలుపుగోలుతనం పెరుగుతుంది. కొత్త స్కిల్స్ ఏవైనా ఉంటే నేర్పించాలి.
- టీవీ, ఫోన్‌ల మీద ఫోకస్ తగ్గేలా జాగ్రత్తపడాలి. బొమ్మలు తీసుకుని ఇతర పిల్లలకు ఇవ్వమని ప్రోత్సహించడం.. కలిసి ఆడుకోమని చెప్పటం.. షేరింగ్ చేయాలని పదే పదే చెప్పడం చేయాలి. ముఖ్యంగా ఇతర పిల్లలు ఆడుకుంటుంటే వారితో కలిసి ఆడమని ప్రోత్సహించాలి. ఇలాంటి చిన్న పనుల వల్లనే పిల్లలో సిగ్గరితనం పోతుంది.
- కమ్యూనికేషన్‌ను అభివృద్ధి చేయటం.. ఆత్మవిశ్వాసాన్ని పెంచటం ద్వారానే పిల్లల్లో భయం పోతుంది. తద్వారా సిగ్గు మెల్లగా తగ్గిపోతుంది.



రైతుకు 'టెక్' సాయం

దుక్కి దున్ని... నారు పోసి... పంట పండించాలంటే ఎన్నో వ్యయప్రయాసలు. అంత కష్టపడినా... తీరని నష్టాలతో... అప్పుల ఊబిలో కూరుకుపోయిన అన్నదాతల కథలెన్నో. అందుకు ప్రధాన కారణం... వారికి సరైన సమాచారం, మార్గదర్శనం లేకపోవడమే అంటోంది సాయి గోలె. ఐఐటీ మద్రాసులో చదివిన ఆమె... తన స్నేహితుడితో కలిసి 'భారత్ అగ్రీ' పేరిట వ్యవసాయదారుల కోసం ఒక డిజిటల్ వేదికను తీసుకువచ్చింది. సాగుకు సాంకేతికతను జోడించి... ఉత్పత్తి పెంచి... రైతును సాధికారత వైపు అడుగులు వేయిస్తోంది.

విభిన్నం



'రైతు కుటుంబంలో పుట్టి పెరిగిన అమ్మాయిగా నేను తెలుసుకున్నది ఏంటంటే... వ్యవసాయం ఒక సంక్లిష్టమైన శాస్త్రం. దాన్ని అర్థం చేసుకోవడం అంత సులువు కాదు. అయితే చిన్నప్పటి నుంచి పంట పొలాల మధ్య పెరిగాను కాబట్టి రైతుల బాధలు, వాళ్లు ఎదుర్కొనే సవాళ్లు, సమస్యలపై కొంత అవగాహన ఉంది. ముఖ్యంగా అన్నదాతల ఆత్మహత్యలతో మా ఊరి పేరు ఎప్పుడూ వార్తల్లోకి ఎక్కేది. ఇది నన్ను కలవరపెట్టేది. మహారాష్ట్రలోని ఆర్వీ గ్రామం మాది. నాగ్‌పూర్ నుంచి 120 కిలోమీటర్ల దూరంలో ఉంటుందీ ఊరు. చదువుల నిమిత్తం మా కుటుంబం నాగ్‌పూర్‌కు మారింది. ప్రతి శనివారం ఆర్వీలోని మా మామయ్య ఇంటికి వెళుతుండేవాళ్లం. ఆయన వ్యవసాయ క్షేత్రంలో గడిపేవాళ్లం. ఎక్కువగా పత్తి, సోయాబీన్స్, శనగలు పండించేవారు. అవి అంత లాభసాటిగా ఉండేవి కావు. కాలేజీలో చదివే రోజుల్లో రైతుల ఆత్మహత్యలకు గల కారణాలేంటని మామయ్యను అడుగుతుండేదాన్ని. ఆయన విశ్లేషణలు, సమీక్షలు నాకు సంతృప్తి ఇవ్వలేదు.

కాలం చెల్లిన పద్ధతులు...

మామయ్యతో మాట్లాడిన తరువాత... చదువు లేకపోవడం, ఇంకా కాలం చెల్లిన పురాతన వ్యవసాయ పద్ధతుల మీదే ఆధారపడడం రైతుల అభివృద్ధికి ఆటంకంగా మారిందని నాకు అర్థమైంది. ఇవాళ రేపు ఏ ఇతర రంగం తీసుకున్నా అందులో విద్యావంతులు ఉంటున్నారు. కానీ రైతుల విషయం వచ్చేసరికి ఆ సంఖ్య అత్యల్పం. ప్రధానంగా వాతావరణ ప్రభావాలను తట్టుకోగలిగే వ్యవసాయ విధానాలపై వారికి ఉన్న పరిజ్ఞానం పరిమితం. ఈ పరిస్థితిలో మార్పు తేవాలంటే అందుకు నేనేంచేయగలను? ఐఐటీ- మద్రాసులో చదవడానికి చెన్నై వెళ్లినప్పుడు కూడా నాకు ఇదే ఆలోచన. మా ఊర్లో వ్యవసాయం ఎలా సాగుతుందనేది ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకొనేదాన్ని. పదే పదే అక్కడి రైతులు వెలిబుచ్చిన ఆందోళన ఏంటంటే... ప్రతి సీజన్‌లోనూ నష్టాలు చవిచూస్తున్నామని. వాళ్లలో అధికశాతం మంది వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నవారే. పంట చేతికి రాకపోతే అప్పుల పాలవుతున్నారు. మరింత ఆందోళనకర అంశం ఏంటంటే... కొందరు తీసుకున్న అప్పు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. దాంతో వారి కుటుంబం దిక్కులేనిది అయిపోతోంది.

ఏం చేయాలి..?

అత్యవసరంగా చేయాల్సింది రైతుకు భరోసా కల్పించడం. ఎప్పుడు ఏ పంట వేయాలి? దేనికి ఎంత పెట్టుబడి పెట్టాలి? ఎందులో పెడితే నష్టపోతాం? ఒకవేళ రుణం తీసుకొంటే వడ్డీలు ఎంత కట్టాలి? ఇలాంటి ఎన్నో విషయాల్లో వారికి పూర్తి స్థాయి అవగాహన లేదని నా అధ్యయనంలో తేలింది. మా మామయ్యనే ఉదాహరణగా తీసుకొంటే.. పత్తి ఎందుకు పండిస్తున్నాం? దానికి సమాంతరంగా వేరే పంటలు ఎందుకు వేయడంలేదు? తదితర విషయాలపై ఆయనకున్న అవగాహన నామమాత్రమే. ఆధునిక వ్యవసాయం గురించి మొక్కుబడిగా పాఠాలు చెప్పి వదిలేస్తే పరిస్థితులు మార్పు రాదు. అందుకే వీటన్నిటిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, మార్గదర్శనం చేసే ఒక వ్యవస్థ కావాలి. అంటే ఒక కన్సల్టెన్సీలా!



స్నేహితుడితో కలిసి...

ఇదే విషయాన్ని నాతోపాటు ఐఐటీలో చదువుతున్న సిద్ధార్థ్‌కు చెప్పాను. కావల్సినంత పెట్టుబడి పెట్టినా లాభాలు పొందడంలో విఫలమవుతున్న మా కుటుంబాన్నే ఉదాహరణగా చూపించాను. దీనిపై అతడు కూడా ఎంతో ఆసక్తి కనబరిచాడు. మరింత లోతైన అధ్యయనం చేయాలన్న ఉద్దేశంతో ఎంటెక్‌లో బయోటెక్నాలజీని సబ్జెక్ట్‌గా ఎంచుకున్నాడు. నేను కూడా అదే బాటలో నడిచాను. ఇద్దరం కలిసి వ్యవసాయంపై అధ్యయనం చేశాం. విలువైన సమాచారం ఎంతో సేకరించాం. సాంకేతికతతో సాగును అనుసంధానం చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయనిపించింది. మాస్టర్స్ తరువాత ఇద్దరం కలిసి 'ఇంటర్నేషనల్ క్రాప్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్'లో ఒక ప్రాజెక్ట్ చేశాం. అక్కడ వ్యవసాయ శాస్త్రం, నేల సారం, మొక్కల రోగనిర్ధారణ, కీటకాలు తదితర ఎన్నో అంశాల గురించి తెలుసుకున్నాం. తరువాత నేను 'ఐటీసీ'లో చేరాను. సిద్ధార్థ్ వ్యవసాయ శాస్త్రంలో మరింత అధ్యయనం కోసం ఇజ్రాయల్ వెళ్లాడు.

అలా పుట్టింది...

సిద్ధార్థ్ భారత్‌కు తిరిగి వచ్చాక నేను నా ఉద్యోగం వదిలేశాను. పూణె వెళ్లి ఒక వ్యవసాయ క్షేత్రం తీసుకొని ప్రయోగాలు ప్రారంభించాం. రైతుకు సరైన సమయానికి సరైన సమాచారం అందిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావించాం. దాని కోసం 2017లో 'భారత్ అగ్రీ' పేరిట ఫార్మ్ సొల్యూషన్స్ కంపెనీ ఒకటి బెంగళూరులో ప్రారంభించాం. మహారాష్ట్రలోని నారాయణగావ్‌లో ఏడాదిపాటు ప్రయోగాత్మకంగా ఉపయోగించాం. సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్రమంతటా, క్రమంగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు కూడా సేవలు విస్తరించాం.

'ఫోర్బ్స్ 30 అండర్ 30'లో...

వ్యవసాయానికి సంబంధించి 350కి పైగా పంటల సమాచారంతో పాటు వాతావరణ పరిస్థితులకు తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నాం. సమస్యలు ఎదురైతే వాటి పరిష్కార మార్గాలు కూడా చూపుతున్నాం. వ్యక్తిగతంగా రైతులు కోరిన సేవలను అందిస్తున్నాం. వారి సౌకర్యం కోసం యాప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చాం. మా సేవలు పొందిన రైతుల ఆదాయంలో ఇప్పుడు నలభై నుంచి యాభై శాతం వృద్ధి కనిపిస్తోంది. నిధులు సేకరించి ఆర్థిక స్థోమత లేని రైతులకు అండగా నిలుస్తున్నాం. 2020లో 'ఫోర్బ్స్' మ్యాగజైన్ ప్రకటించిన '30 అండర్ 30'లో చోటు దక్కించుకోవడం గర్వంగా ఉంది. రాబోయే రెండేళ్లలో దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకూ మా కంపెనీని విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం."

షూటర్ ఉమాకు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో విజయవాడ షూటర్ మద్దినేని ఉమా మహేష్ రజత పతకం కొల్లగొట్టాడు. గువాహటిలో బుధవారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో ఉమా మహేష్ 249.5 స్కోరుతో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ప్రతాప్ సింగ్ తోమర్ (మధ్యప్రదేశ్) స్వర్ణం, సుమేధ్ (మహారాష్ట్ర) కాంస్యం సాధించారు. ఈ పోటీల్లో ఉమా మహేష్ కేఎల్ యూనివర్సిటీ తరఫున పాల్గొన్నాడు. ఇదే యూనివర్సిటీకి చెందిన సాయి నిహార్ స్విమ్మింగ్‌లో స్వర్ణ పతకం సాధించాడు.

ఆటకు ముందు వేడుక

రేపటి నుంచే మహిళల ప్రీమియర్ లీగ్

బెంగళూరు: మహిళల ఐపీఎల్ అయిన ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌కు రంగం సిద్ధమైంది. శుక్రవారం నుంచి జరిగే ఈ లీగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొత్తం ఐదు జట్లు పోటీపడే ఈ లీగ్ ట్రోఫీని బుధవారం ఇక్కడ ఆవిష్కరించారు. ఈ వేడుకలో ఐదు జట్ల కెప్టెన్లు పాల్గొన్నారు. వచ్చేనెల 17న ఫైనల్ పోరు జరగనుంది. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌తో నిరుడు రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ అమీతుమీ తేల్చుకోనుంది. గుజరాత్ జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, యూపీ వారియర్స్ లీగ్ బరిలో ఉన్న మిగతా జట్లు. వచ్చేనెల 4 వరకు జరిగే మ్యాచ్‌లన్నింటినీ ఇక్కడి చిన్నస్వామి స్టేడియంలో నిర్వహించనుండగా.. తర్వాత జరిగే మ్యాచ్‌లకు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. కాగా, తొలిరోజు జరిగే ప్రారంభ వేడుకల్లో బాలీవుడ్ నటులు టైగర్‌ష్రాఫ్, వరుణ్ ధావన్, సిద్ధార్థ్ మల్హోత్రా, కార్తీక్ ఆర్యన్ చిందేయనుండగా.. ప్రముఖ సింగర్లు తమ పాటలతో అలరించనున్నారు.



డబ్ల్యూపీఎల్ ట్రోఫీతో జట్ల కెప్టెన్లు

టాప్-20లో జైస్వాల్

» ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్



దుబాయ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో డబుల్ సెంచరీలతో పరుగుల వరద పారించిన భారత యువ బ్యాటర్ యశస్వీ జైస్వాల్ ర్యాంకుల్లో దూసుకెళ్లాడు. ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్ బ్యాటర్ల విభాగంలో యశస్వీ ఏకంగా 14 స్థానాలు మెరుగుపరచుకొని 15వ స్థానంలో నిలిచాడు. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు దూరంగా ఉన్న విరాట్ కోహ్లీ 7వ ర్యాంక్‌తో టాప్-10లో ఉన్న భారత బ్యాటర్‌గా నిలిచాడు. రోహిత్ శర్మ ఓ స్థానం ఎగబాకి 12వ ర్యాంక్‌లో నిలవగా, జడేజా 34వ స్థానానికి చేరుకున్నాడు. కేన్ విలియమ్సన్ టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. బౌలర్ల జాబితాలో బుమ్రా నెంబర్‌వన్‌గా, అశ్విన్ రెండో ర్యాంక్‌లో ఉన్నారు.

యూఏఈ క్రికెట్ చీఫ్ కోచ్‌గా లాల్‌చంద్ రాజ్‌పుత్



దుబాయ్: టీమిండియా మాజీ క్రికెటర్ లాల్‌చంద్ రాజ్‌పుత్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పురుషుల క్రికెట్ జట్టుకు ప్రధాన కోచ్‌గా నియమితులయ్యాడు. 62 ఏళ్ల లాల్‌చంద్ 2016లో అఫ్ఘానిస్థాన్, 2018లో జింబాబ్వే జట్లకు చీఫ్ కోచ్‌గా పనిచేశాడు.

లంకపై అఫ్ఘాన్ గెలుపు

దంబుల్లా: శ్రీలంక టూర్‌లో అఫ్ఘానిస్థాన్ ఎట్టకేలకు గెలుపు నమోదు చేసింది. మూడు టీ20ల సిరీస్‌లో బుధవారం ఉత్కంఠగా జరిగిన ఆఖరి మ్యాచ్‌లో అఫ్ఘాన్ 3 పరుగులతో లంకను ఓడించింది. తొలుత అఫ్ఘానిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 209 పరుగులు చేసింది. రహ్మనుల్లా గుర్బాజ్ (70), హజ్రతుల్లా జజాయ్ (45) ధాటిగా ఆడారు. ఛేదనలో లంక ఓవర్లన్నీ ఆడి 206/6 స్కోరు మాత్రమే చేసింది. కమిందు మెండిస్ (65 నాటౌట్), నిస్సంక (60 రిటైర్డ్ హర్ట్) పోరాడినా ఫలితం లేకపోయింది.

టర్నింగ్ పిచ్‌పై ఇద్దరికీ అవకాశాలు



స్పిన్ ఫ్రెండ్లీ వికెట్ అయితే ఇరుజట్లకూ సమానావకాశాలుంటాయి. తొలి బంతి నుంచి బాల్ టర్న్ అయితే.. టాస్ ప్రభావం ఉండదు. ఫ్లాట్ వికెట్ అయితే క్రమంగా మారుతుంది. ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచడానికి స్వీప్, సృజనాత్మక షాట్లు ఆడతాం. పిచ్ తీరును బట్టి భారత్ నాలుగో స్పిన్నర్‌తో ఆడే చాన్సుంది.

– ఇంగ్లండ్ బ్యాటర్ ఒల్లీ పోప్



ప్రాక్టీస్ సెషన్‌లో ముకేష్, సిరాజ్, ఆకాష్‌దీప్

బుమ్రా లేడు.. ఎలా ఇప్పుడు?

రాంచీ: ఇంగ్లండ్‌తో రాజ్‌కోట్ వేదికగా జరిగిన మూడో టెస్టులో నెగ్గిన భారత్.. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో 2-1తో ముందంజలో ఉంది. ఇదే జోరులో శుక్రవారం నుంచి ఇక్కడ జరిగే నాలుగో టెస్టులో గెలిచి.. మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ పట్టేయాలనే పట్టుదలతో ఉంది. కానీ, వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా కీలకమైన పేసర్ బుమ్రాకు నాలుగో మ్యాచ్‌లో విశ్రాంతినివ్వడంతో భారత తుది జట్టు కూర్పు ఎలా ఉంటుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత మూడు టెస్టులను పరిశీలిస్తే స్పిన్నర్ల కంటే బుమ్రానే తన రివర్స్ స్వింగ్‌తో ఇంగ్లండ్ పనిబట్టాడు. రెండో టెస్టును ఒంటిచేత్తో గెలిపించాడు. ఇంతటి ఫామ్‌లో ఉన్న బుమ్రాకు తక్షణం బ్రేక్ ఇవ్వాల్సిన పరిస్థితులైతే లేవు. కానీ, అతడి వెన్నెముక సమస్యతోపాటు రాబోయే ఐపీఎల్ టీ20 వరల్డ్‌కప్ టోర్నీలను దృష్టిలో ఉంచుకొని.. బుమ్రాకు విశ్రాంతి ఇవ్వాల్సిన పరిస్థితి. మరి అతడి స్థానాన్ని భర్తీ చేసేదెవరనేది ఇప్పుడు టీమిండియా మేనేజ్‌మెంట్ ముందున్న పెద్ద ప్రశ్న. ఇలాంటి పరిస్థితుల్లో రాంచీ పిచ్ ఎలా ఉంటుందనే దానిపైనే భారత తుది జట్టు కూర్పు ఆధారపడి ఉంది. గత మూడు టెస్టుల కోసం ఫ్లాట్ వికెట్లనే మేనేజ్‌మెంట్ ఎంపిక చేసింది. దీంతో భారత స్పిన్నర్లకు ఆశించినంత మద్దతు లభించకపోవడంతో.. పేసర్లు ఆ భారాన్ని భుజానకెత్తుకున్నారు. కానీ, ఇప్పుడు బుమ్రా గైర్హాజరీలో భారత పేస్ బౌలింగ్ కొంత బలహీనంగా కనిపిస్తోంది.

ఆకాష్ అరంగేట్రం?

రాంచీ వికెట్ కూడా నల్లమట్టితో తయారు చేసిందే. దీంతో హైదరాబాద్, వైజాగ్, రాజ్‌కోట్ తరహాలోనే ఈ పిచ్ కూడా ఉంటుందని భావిస్తున్నారు. ఒకవేళ భారత జట్టు స్పిన్ వికెట్ కావాలని కోరితే.. గ్రౌండ్ సిబ్బంది నిర్దేశిత ప్రాంతాల్లో నీటిని చల్లడమో లేదా పూర్తిగా ఆపేయడమో జరుగుతుంది. కాగా, మరో పేసర్ కావాలనుకొంటే సిరాజ్‌తో కొత్త బంతిని పంచుకోనేందుకు ముకేష్ కుమార్ లేదా ఆకాష్‌దీప్‌లో ఒకరికి తుది జట్టులో స్థానం లభించొచ్చు. అయితే, వైజాగ్ టెస్టులో ముకేష్ ధారాళంగా పరుగులివ్వగా.. భారత్-ఎ తరపున ఆకాష్ 10 వికెట్లతో ఆకట్టుకొన్నాడు. కానీ, బజ్‌బాల్ గేమ్‌తో ఇంగ్లండ్ విరుచుకుపడుతున్న నేపథ్యంలో ఆకాష్‌తో అరంగేట్రం చేయించడం కొంత రిస్కే. అయినా.. సెలెక్టర్లు మాత్రం అతడిని ఆడించాలనుకొంటున్నారని సమాచారం. అయితే, సిరీస్‌లో ఆఖరిదైన ఐదో టెస్టు ధర్మశాలలో జరగనుంది. అక్కడి చల్లటి వాతావరణ పరిస్థితులు ఇంగ్లండ్‌కు ఒకింత అనుకూలం. దీంతో ఇక్కడే సిరీస్‌ను సొంతం చేసుకోవాలనుకొంటున్న భారత్.. తమ ప్రధాన బలమైన స్పిన్‌ను దృష్టిలో ఉంచుకొని టర్నింగ్ వికెట్‌వైపే మొగ్గుచూపుతుందని మాజీ ఆటగాళ్ల విశ్లేషణ. ఇదే జరిగితే బుమ్రా స్థానంలో బ్యాటింగ్ కూడా చేయగల స్పిన్ ఆల్‌రౌండర్లు వాషింగ్టన్ సుందర్ లేదా అక్షర్ పటేల్‌లో ఒకరికి తుది జట్టులో చోటు దక్కొచ్చు.



ద్రవిడ్

వావ్.. ఆసీస్

కివీస్‌తో తొలి టీ20

భారీ ఛేదనలో ఆఖరి బంతికి థ్రిల్లింగ్ విన్



మిచెల్ మార్ష్ (72 నాటౌట్)

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ పర్యటనను ఆస్ట్రేలియా అద్భుతంగా ఆరంభించింది. బుధవారం జరిగిన తొలి టీ20లో భారీ లక్ష్యాన్ని ఆఖరి బంతికి ఛేదించి వారెవ్వా అనిపించింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (44 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్సర్లతో 72 నాటౌట్), టిమ్ డేవిడ్ (10 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 31 నాటౌట్) సూపర్ ఇన్నింగ్స్‌తో ఆసీస్ ఆరు వికెట్లతో గెలిచింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కివీస్.. రచిన్ రవీంద్ర (35 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్సర్లతో 68), డెవాన్ కాన్వే (46 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 63)కు తోడు ఫిన్ అలెన్ (31) సత్తా చాటడంతో 20 ఓవర్లలో 3 వికెట్లకు 215 పరుగులు సాధించింది. భారీ ఛేదనలో ఆసీస్ 20 ఓవర్లలో 216/4 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్లు వార్నర్ (32), హెడ్ (15 బంతుల్లో 24) మెరుపు ఆరంభాన్నిచ్చారు. వన్‌డౌన్‌లో వచ్చి ఆఖరిదాకా క్రీజులో నిలిచిన కెప్టెన్ మిచెల్.. మ్యాక్స్‌వెల్ (11 బంతుల్లో 25), టిమ్‌తో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పి కొండంత లక్ష్యాన్ని కరిగించాడు. చివరి ఓవర్‌లో టిమ్ వీర విహారం చేశాడు. ఆరు బంతుల్లో 16 పరుగులు అవసరమైన దశలో బౌలర్ సౌథీ తొలి రెండు బంతుల్లో 3 పరుగులే ఇచ్చాడు. అయితే, చివరి నాలుగు బంతులను టిమ్ 4, 6, 2, 4గా మలచి కంగారూలకు థ్రిల్లింగ్ విక్టరీని అందించాడు. మిచెల్ మార్ష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. టీ20ల్లో ఆసీస్‌కు ఇది మూడో అత్యధిక ఛేదన కావడం విశేషం.

టాప్-100 నుంచి సుమిత్ అవుట్

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ సింగిల్స్ టాప్ ఆటగాడు సుమిత్ నగల్ ర్యాంకింగ్స్‌లో వెనుకంజలో నిలిచాడు. తాజా ఏటీపీ ర్యాంకింగ్స్‌లో సుమిత్ మూడు స్థానాలు కోల్పోయి 101వ ర్యాంక్‌కు పడిపోయాడు. రామ్‌కుమార్ 420వ, శశికుమార్ ముకుందర్ 457వ ర్యాంకుల్లో నిలిచారు. ఇక, డబుల్స్‌లో వెటరన్ స్టార్ రోహన్ బోపన్న ప్రపంచ నెంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. కాగా, యుకీ 60వ, శ్రీరామ్ బాలాజీ 80వ, సాకేత్ 89వ ర్యాంకుల్లో కొనసాగుతున్నారు.

మనీషా డబుల్.. భారత్ అదుర్స్



అలన్యా (టర్కీ): స్ట్రయికర్ మనీషా కల్యాణ్ డబుల్ గోల్స్‌తో విజృంభించడంతో టర్కిష్ మహిళల ఫుట్‌బాల్ కప్‌లో భారత జట్టు ఉత్కంఠ విజయం సాధించింది. బుధవారం హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 4-3తో ఎస్తోనియాను చిత్తుచేసింది. యూరోపియన్ జట్టుపై భారత్‌కిదే తొలి గెలుపు కావడం విశేషం. భారత జట్టులో మనీషా (17వ, 81వ) రెండు గోల్స్ సాధించగా, ఇందుమతి (62వ), ప్యారీ గ్జాజా (79వ) చెరోటి కొట్టారు.

ప్రీక్వార్టర్స్‌లో ఓడినా..

బుసాన్ (దక్షిణ కొరియా): ప్రపంచ టేబుల్ టెన్నిస్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత్ పోరాటం ముగిసింది. ప్రీక్వార్టర్స్‌లో శరత్ కమల్ సారథ్యంలోని పురుషుల జట్టు 0-3తో ఆతిథ్య దక్షిణ కొరియా చేతిలో, మనికా బత్రా నేతృత్వంలోని అమ్మాయిల బృందం 1-3తో చైనీస్ తైపీ చేతిలో పరాజయం పాలయ్యాయి. ఇది పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత టోర్నీ. క్వార్టర్‌ఫైనల్ చేరిన జట్లకు విశ్వక్రీడలకు బెర్త్ దక్కుతుంది. అయితే, ప్రీక్వార్టర్స్‌లోనే ఓడినా..ప్రపంచ ర్యాంకింగ్స్ ఆధారంగా భారత క్రీడాకారులకు పారిస్ బెర్త్ ఖరారయ్యే అవకాశముంది. ఒలింపిక్స్‌కు ఎవరు అర్హత సాధించారనేది వచ్చేనెల 5న ప్రకటించనున్నారు.

అగ్రస్థానానికి పుణెరి పల్టన్

పంచకుల: ప్రొ కబడ్డీ సీజన్-10 లీగ్ దశను పుణెరి పల్టన్ జట్టు అగ్రస్థానంతో ముగించింది. బుధవారం ఆడిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పుణె 40-38తో యూపీ యోధాస్‌పై నెగ్గింది. ఒక దశలో ఏకంగా 13 పాయింట్లు వెనుకంజలో నిలిచిన పుణె అనూహ్యంగా పుంజుకుని, విజయం సాధించింది. పుణె రైడర్ పంకజ్ కీలక సమయంలో 12 పాయింట్లు సాధించి, ఆ జట్టు గెలుపులో ముఖ్యభూమిక పోషించాడు. మరో మ్యాచ్‌లో బెంగుళూరు బుల్స్ 53-39తో హరియాణాపై నెగ్గింది.

భారత్ జీపీటీ ‘హనుమాన్’ వచ్చేస్తోంది..

వచ్చేనెలలో అందుబాటులోకి..

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందిన జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అప్లికేషన్ చాట్ జీపీటీ తరహా దేశీ వెర్షన్ త్వరలోనే అందుబాటులోకి రాబోతోంది. ఐఐటీ బాంబే నేతృత్వ భారత్ జీపీటీ ఎకోసిస్టమ్ భాగస్వామ్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీకి చెందిన సీతా మహాలక్ష్మీ హెల్త్‌కేర్ (ఎస్ఎంఎల్) సంస్థ ‘హనుమాన్’ పేరుతో లార్జ్ లాంగ్వేజ్ మోడల్‌ను మంగళవారం ఆవిష్కరించింది. వచ్చే నెలలోనే దీన్ని ఓపెన్ సోర్స్‌గా అందరికీ అందుబాటులోకి తేనున్నారు. ఈ లాంగ్వేజ్ మోడల్ హిందీ, తెలుగు, తమిళం సహా 11 దేశీయ భాషల్లో సేవలందించగలదు. దీని సేవల సామర్థ్యాన్ని భవిష్యత్‌లో 22 దేశీయ భాషలకు విస్తరింపజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

హనుమాన్ సేవలు: మల్టీ మోడల్ ఏఐ సామర్థ్యాలతో అభివృద్ధి చేస్తున్న హనుమాన్.. యూజర్లకు టెక్స్ట్ టు టెక్స్ట్, టెక్స్ట్ టు స్పీచ్, టెక్స్ట్ టు వీడియో లేదా స్పీచ్ టు టెక్స్ట్, వీడియో టు టెక్స్ట్ విధానాల్లో సమాధానాలు అందించగలదు. తొలుత హెల్త్‌కేర్, గవర్నెన్స్, ఆర్థిక సేవలు, విద్యా విభాగాల్లో సేవలందించనుంది.

భారత్ జీపీటీ ఎకోసిస్టమ్ గురించి: దేశంలోని భిన్న భాషల్లో మాట్లాడే సామాన్యులకు సైతం చాట్ జీపీటీ తరహా సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ఐఐటీ బాంబే నేతృత్వంలోని 8 ఐఐటీల రీసెర్చ్ కన్సార్షియమే భారత్ జీపీటీ ఎకోసిస్టమ్. సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్‌తో పాటు అంబానీకి చెందిన ఎస్ఎంఎల్, రిలయన్స్ జియో ఈ ప్రాజెక్టుకు మద్దతిస్తున్నాయి. దేశీయంగా జనరేటివ్ ఏఐ అప్లికేషన్ అభివృద్ధి కోసం ఏర్పాటైన తొలి ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యమిది.

అమ్మకానికి కేఎన్ఆర్ రోడ్డు ప్రాజెక్టులు

» రూ.820 కోట్ల వరకు సమకూరే అవకాశం

హైదరాబాద్: కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ నాలుగు రోడ్డు ప్రాజెక్టులను అమ్మకానికి పెట్టింది. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని ఈ నాలుగు హైబ్రిడ్ యాన్యుటీ ప్రాజెక్టుల కోసం క్యూబ్ హైవేస్ పోటీపడుతున్నట్లు సమాచారం. ఇందులో తమిళనాడులోని ఒద్దాన్‌చత్రం-మడతుకులం నాలుగు వరుసల రహదారికి సంబంధించి రెండు కంపెనీల మధ్య చర్చలు తుదిదశకు వచ్చాయి. దీనికి సంబంధించిన అవగాహనా ఒప్పందం (ఎంఓయు)పై రెండు సంస్థలు ఒకటి రెండు నెలల్లో సంతకాలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేరళ, ఆంధ్రప్రదేశ్‌లోని మిగతా మూడు రోడ్డు ప్రాజెక్టులపైనా క్యూబ్ హైవేస్ ఆసక్తి చూపిస్తోంది. అయితే వీటి అమ్మకం ధరపై రెండు కంపెనీలు ఇంకా అవగాహనకు రాలేదని సమాచారం. ఈ నాలుగు హైబ్రిడ్ యాన్యుటీ రోడ్డు ప్రాజెక్టుల అమ్మకం ద్వారా రూ.800 కోట్ల నుంచి రూ.820 కోట్లు సమకూర్చుకోవాలని కేఎన్ఆర్ భావిస్తోంది.

అంతరిక్ష రంగంలో మరింత ఎఫ్‌డీఐ

న్యూఢిల్లీ: అంతరిక్ష రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కృత్రిమ ఉపగ్రహాల్లో ఉపయోగించే విడి భాగాల తయారీలో 100 శాతం ఎఫ్‌డీఐని అనుమతించాలని నిర్ణయించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశం ఇందుకు ఆమోదం తెలిపింది. దీనికి తోడు ఉపగ్రహాల తయారీ, నిర్వహణ, ఉపగ్రహ డేటా ఉత్పత్తుల రంగంలో ఆటోమేటిక్ రూట్‌లో 74% ఎఫ్‌డీఐని అనుమతించేందుకూ ఆమోదం లభించింది. ఈ రంగాల్లో 74 శాతానికి మించిన ఎఫ్‌డీఐకి మాత్రం ప్రభుత్వ ప్రత్యేక అనుమతి అవసరం. ఉపగ్రహ ప్రయోగ వాహక నౌకలు, ప్రయోగ కేంద్రాల ఏర్పాటులో మాత్రం ఆటోమేటిక్ రూట్‌లో 49% ఎఫ్‌డీఐని అనుమతిస్తారు. అంతకుమించితే మాత్రం ప్రభుత్వ అనుమతి తప్పనిసరి.

ఈసారి 9.5 శాతం వేతన పెంపు!

» వెల్లడించిన అయాన్ సర్వే

న్యూఢిల్లీ: ఈ ఏడాది భారత్‌లో ఉద్యోగుల వేతనాలు సగటున 9.5 శాతం పెరగవచ్చని అయాన్ పీఎల్‌సీ తాజా సర్వే నివేదిక అంచనా వేసింది. 2023లో 9.7 శాతం వేతన వృద్ధితో పోలిస్తే మాత్రం తక్కువేనని పేర్కొంది. కరోనా సంక్షోభం ముగిశాక 2022లో రెండంకెల ఇంక్రిమెంట్ల తర్వాత ఇండస్ట్రీలో జీతాల పెంపు ఏక అంకె స్థాయి వద్ద స్థిరపడిందని రిపోర్టు అభిప్రాయపడింది. 45 రంగాలకు చెందిన 1,414 కంపెనీల డేటా విశ్లేషణ ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో అగ్ర దేశాలతో పోలిస్తే భారత్‌లో వేతన పెంపు అధికమని అంటోంది. ఈ ఏడాది సగటు వేతన వృద్ధిలో భారత్ తర్వాత స్థానంలో బంగ్లాదేశ్ (7.3 శాతం), ఇండోనేషియా (6.5 శాతం) ఉన్నాయి.

అక్రమ రుణ యాప్‌ల పని పట్టాల్సిందే



మరిన్ని చర్యలు తీసుకోండి

రెగ్యులేటరీ సంస్థలకు ఆర్థిక మంత్రి సీతారామన్ సూచన

న్యూఢిల్లీ : అక్రమ ఆన్‌లైన్ రుణ యాప్‌ల దందాపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరోసారి ఆందోళన వ్యక్తం చేశారు. వీటి భరతం పట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)తో సహా రెగ్యులేటరీ సంస్థలు మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం నాడిక్కడ జరిగిన ఆర్థిక స్థిరత్వం, అభివృద్ధి మండలి (ఎఫ్ఎస్‌డీసీ) సమావేశంలో ఆమె ఈ విషయం చెప్పారు. అక్రమ రుణ యాప్‌ల మాయాజాలంతో వేల మంది మదుపరులు నష్టపోతున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ ఈ విషయం చెప్పడం విశేషం. దేశ ఆర్థిక స్థిరత్వానికి దేశ, విదేశాల నుంచి ఎదురయ్యే ముప్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమె రెగ్యులేటరీ సంస్థలను కోరారు. ఇందుకోసం నిరంతరం జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై నిఘా పెట్టి, అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీతారామన్ కోరారు. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్, సెబీ చీఫ్‌తో సహా పలు రెగ్యులేటరీ సంస్థల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

జీడీపీ వృద్ధి రేటు మరింత పెరగాలి

2047 నాటికి మన దేశం 35 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే వచ్చే 30 సంవత్సరాలు మన జీడీపీ ఏటా 9-10 శాతం చొప్పున పెరగాలని నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ అన్నారు. బ్రిటన్, జపాన్, జర్మనీ ఆర్థిక మాంద్యంలో ఉన్నందున భారత్ 2027 నాటికి ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం ఖాయమన్నారు.

జూన్ నుంచి వడ్డీ రేట్లు తగ్గొచ్చు : క్రిసిల్

జూన్ నుంచి ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించే అవకాశం ఉందని క్రిసిల్ అంచనా. గత ఏడాది డిసెంబరుతో పోలిస్తే ఈ ఏడాది జనవరిలో ద్రవ్య లభ్యత లోటు రెట్టింపైందని తెలిపింది. ఈ లోటు భర్తీ చేసేందుకు ఆర్‌బీఐ వివిధ రూపాల్లో రూ.2.07 లక్షల కోట్లు మార్కెట్లో అందుబాటులోకి తెచ్చిందని తెలిపింది. నిధుల లభ్యత తగ్గడం వల్లే స్వల్ప కాలిక కాల్‌మనీ వడ్డీ రేట్లు 6.75 శాతానికి చేరాయని క్రిసిల్ పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో జూన్ నుంచి ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం ఉందని తెలిపింది.

‘జీ’లో రూ. 2,000 కోట్ల నిధుల మళ్లింపు

సెబీ దర్యాప్తులో బయటపడిన వ్యవహారం

సోనీతో విలీనం ఒప్పందం రద్దయిన జీ గ్రూప్‌నకు మరో గట్టి దెబ్బ తగిలింది. జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (జెడ్ఈఈఎల్) లో రూ.2,000 కోట్ల మేర నిధుల మళ్లింపు జరిగినట్లు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ గుర్తించినట్లు బ్లూంబర్గ్ తాజా కథనం పేర్కొంది. జీ వ్యవస్థాపకులపై సెబీ జరుపుతున్న దర్యాప్తులో భాగంగా కంపెనీ పద్దుల తనిఖీ సందర్భంగా ఈ విషయం బయటపడినట్లు తెలిసింది. నిధుల మళ్లింపుపై దర్యాప్తు అధికారుల ప్రాథమిక అంచనాల కంటే పదింతలు అధికమిది. ఈ విషయంలో వివరణ ఇవ్వాలంటూ సెబీ జీ గ్రూప్ వ్యవస్థాపకులైన సుభాష్ చంద్ర, ఆయన కుమారుడు పునీత్ గోయెంకాతో పాటు కంపెనీ బోర్డులోని కొందరు సభ్యులకు సమన్లు జారీ చేసినట్లు రిపోర్టు తెలిపింది. అయితే, నిధుల మళ్లింపు విషయంపై వ్యాఖ్యానించేందుకు కంపెనీ ప్రతినిధి నిరాకరించారు. సెబీ దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నట్లు మాత్రం తెలిపారు.

15 శాతం క్షీణించిన షేరు: ఈ వార్త నేపథ్యంలో జెడ్ఈఈఎల్ షేరు బుధవారం ఇంట్రాడే ట్రేడింగ్‌లో భారీగా క్షీణించి లోయర్ సర్క్యూట్‌ను తాకింది. బీఎస్ఈలో ట్రేడింగ్ నిలిచేసరికి, షేరు 14.77 శాతం నష్టంతో రూ.164.50 వద్ద ముగిసింది.

ఆరు రోజుల ర్యాలీకి బ్రేక్

సెన్సెక్స్ 434 పాయింట్లు డౌన్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీల ఆరు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. బుధవారం ట్రేడింగ్ ఆఖరి గంటలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 434.31 పాయింట్లు క్షీణించి 72,623.09 వద్దకు జారుకుంది. నిఫ్టీ 141.90 పాయింట్లు కోల్పోయి 22,055.05 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 20 నష్టపోయాయి. ఎన్‌టీపీసీ షేరు 2.76 శాతం పతనంతో సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. పవర్‌గ్రిడ్, విప్రో సైతం రెండు శాతానికి పైగా తగ్గాయి. టాటాస్టీల్, ఎస్‌బీఐ మాత్రం ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. ప్రధాన షేర్ల కంటే చిన్న, మధ్య స్థాయి కంపెనీల స్టాక్స్ అధిక ఒత్తిడికి లోనయ్యాయి.

27 నుంచి ఎక్సికామ్ టెలీ-సిస్టమ్స్ ఐపీఓ

ఈవీ చార్జర్ల తయారీ సంస్థ ఎక్సికామ్ టెలీ-సిస్టమ్స్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 27న ప్రారంభమై 29న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.329 కోట్ల విలువైన తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రమోటింగ్ కంపెనీ నెక్స్‌వేవ్ వాటాకు చెందిన 70.42 లక్షల షేర్లను ఓఎఫ్ఎస్ పద్ధతిన విక్రయించనుంది. కాగా, ఐటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ ఓరియంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓ ద్వారా రూ.120 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రమోటర్లకు చెందిన 46 లక్షల షేర్లను ఓఎఫ్ఎస్ పద్ధతిలో విక్రయించనుంది.

కొత్త రియల్ ఎస్టేట్ ఫండ్ ద్వారా మోతీలాల్ ఓస్వాల్ రూ.1,250 కోట్ల సమీకరణ

మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రత్యామ్నాయ పెట్టుబడుల విభాగమైన మోతీలాల్ ఓస్వాల్ ఆల్టర్నేట్స్ (ఎంఓ ఆల్ట్స్)కు చెందిన ఆరో రియల్ ఎస్టేట్ ఫండ్ తొలి విడతలో రూ.1,250 కోట్లు సమీకరించింది. ఈ నిధులను ముంబై, ఢిల్లీ సహా దేశంలోని 8 ప్రధాన నగరాల్లోని రియల్టీ మార్కెట్లో వ్యాపారావకాశాల కోసం ఉపయోగించనున్నట్లు ఎంఓ ఆల్ట్స్ తెలిపింది.

ఐదో అత్యంత విలువైన కంపెనీగా ఎస్‌బీఐ

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ.. ఇన్ఫోసిస్‌ను వెనక్కి నెట్టి దేశంలో ఐదో అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీగా అవతరించింది. బీఎస్ఈలో ఎస్‌బీఐ షేరు 1.51 శాతం పెరిగి రూ.771.55 వద్ద ముగిసింది. దాంతో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6,88,578 కోట్లకు చేరుకుంది. రూ.6.87 లక్షల కోట్ల ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాప్ కంటే రూ.1,228 కోట్లు అధికమిది.

బిజినెస్

ఫోన్‌పే.. ఇండస్ యాప్‌స్టోర్

న్యూఢిల్లీ: భారత్‌లో గూగుల్ ప్లేస్టోర్‌కి పోటీగా కొత్త ఆండ్రాయిడ్ యాప్‌స్టోర్ అందుబాటులోకి వచ్చింది. డిజిటల్ పేమెంట్ సంస్థ ఫోన్‌పే.. బుధవారం స్థానికంగా అభివృద్ధి చేసిన మొబైల్ యాప్ స్టోర్.. ఇండస్ యాప్‌స్టోర్‌ను విడుదల చేసింది. మొత్తం 45 కేటగిరిల్లో 2 లక్షల మొబైల్ యాప్స్, గేమ్స్‌ను భారతీయ వినియోగదారులు ఈ ఇండస్ యాప్‌స్టోర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఫోన్‌పే వెల్లడించింది. మొత్తం 12 భారతీయ భాషల్లో ఈ యాప్ అందుబాటులో ఉండనుంది. డెవలపర్ల కోసం ఏడాదిపాటు యాప్ లిస్టింగ్ ఫీజు నుంచి మినహాయిస్తున్నట్లు తెలిపింది. అలాగే డెవలపర్లు తమకు ఇష్టమైన ఏదేనీ థర్డ్ పార్టీ పేమెంట్ గేట్‌వేను ఉచితంగా ఉపయోగించుకోవచ్చని పేర్కొంది.

హైదరాబాద్‌లో బ్లాక్‌బెర్రీ సీఓఈ

హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ కొలువు తీరింది. కెనడా కేంద్రంగా పని చేసే సాఫ్ట్‌వేర్ కంపెనీ బ్లాక్‌బెర్రీ లిమిటెడ్ తన ‘ఐఓటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ), ఇంజనీరింగ్ అండ్ ఇన్నోవేషన్’ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. కెనడా తర్వాత తమ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) డివిజన్‌కు ఇదే అతిపెద్ద సీఓఈ అని తెలిపింది. ఈ కేంద్రంలో ఐఓటీ ఆధారిత పరిశ్రమలకు అవసరమైన మిషన్ క్రిటికల్ ఎంబడెడ్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేస్తారు.

ఎఫ్ఎంసీజీ సంస్థ మారికో.. తన ఫ్లాగ్‌షిప్ బ్రాండ్ సఫోలా ఓట్స్ శ్రేణిలో నాలుగు కొత్త ఫ్లేవర్లను తీసుకువచ్చింది. తొలిసారిగా స్వీట్ ఫ్లేవర్స్‌లో నట్టీ చాక్లెట్, యాపిల్ ఇన్ ఆల్మండ్స్‌తో పాటు ప్రస్తుత మసాలా ఓట్స్ విభాగంలో స్పైసీ మెక్సికానా, ఛీజీ ఇటాలియా ఫ్లేవర్లతో ఓట్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ-కామర్స్ పోర్టల్స్, ఆన్‌లైన్ గ్రోసరీ ప్లాట్‌ఫామ్స్‌పై ఇవి అందుబాటులో ఉండనున్నాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,740 ▲	57,600 ▲	77,200 ▲
ముంబై	62,258 ▲	57,028 ▲	70,708 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ		విజయవాడ	515
హైదరాబాద్	534	విశాఖపట్నం	525
22వ తేదీ		వరంగల్	536
చిత్తూరు	603	డజను గుడ్లు రూ.72	
గోదావరి	515		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140	గోదావరి	144
వరంగల్	140	విజయవాడ	144
కరీంనగర్	140	గుంటూరు	144
మహబూబ్‌నగర్	140	ఒంగోలు	144
కర్నూలు	140	చిత్తూరు	140
విశాఖపట్నం	127		



సీఈవో మీనాను కలిసిన స్వీప్ అధికారుల బృందం

ధనబలం, కండబలాన్ని అడ్డుకుంటాం

» మద్యం, నగదు పంపిణీని నియంత్రిస్తాం: ఈసీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: లోక్‌సభ ఎన్నికల్లో ధనబలం, కండబలం వాడకుండా అడ్డుకుంటామని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) స్పష్టం చేసింది. ఇందుకోసం టెక్నాలజీని ఉపయోగిస్తామని.. ప్రధానంగా డబ్బు పంపిణీపై ఉక్కుపాదం మోపాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలను ఆదేశించామని తెలిపింది. మద్యం, నగదు, ఉచితాలు, మాదక ద్రవ్యాల పంపిణీని అరికట్టేందుకు పోలీసులు, ఎక్సైజ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ), ఈడీ, ఐటీ, తపాలా, అటవీ శాఖలు సహా సంబంధిత ప్రభుత్వ సంస్థలన్నీ వ్యవహరించాలని బుధవారం 'ఎక్స్'లో పేర్కొంది. మద్యం బాస్‌లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్, ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ తమ అధికారుల బృందంతో ఇప్పటికే జార్ఖండ్‌లో ఎన్నికల సన్నద్ధతపై సోమ, మంగళవారాల్లో చర్చించారు. బుధవారం బిహార్ ఎన్నికల అధికారులతో, సీఎస్ బృందంతో చర్చలు జరిపారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ముందుగానే మొదలుపెట్టి.. సకాలంలో పూర్తిచేయాలని పలు రాజకీయ పార్టీలు విజ్ఞప్తి చేశాయని రాజీవ్‌కుమార్ మీడియాకు తెలిపారు. కాగా.. ఎన్నికల ప్రక్రియలో 3.4లక్షలకు పైగా కేంద్ర సాయుధ బలగాలను వినియోగిస్తామని.. వారిని నిర్దేశిత రాష్ట్రాలకు సజావుగా, సత్వరమే రైళ్లలో తరలించేందుకు సహకరించాలని రైల్వే బోర్డుకు ఈసీ విజ్ఞప్తి చేసింది.

26 లక్షల ఇంకు సీసాలు

ఓటు హక్కు వినియోగించుకునే ఓటరు ఎడమ చూపుడువేలిపై వేసే సిరాను ఈసీ సిద్ధం చేస్తోంది. 26 లక్షల ఇంకు సీసాలు సరఫరా చేసే బాధ్యతను మైసూరు పెయింట్స్ అండ్ వార్నిష్ లిమిటెడ్ సంస్థకు అప్పగించింది. 1962 నుంచి ఈ సిరాను కర్ణాటక ప్రభుత్వం ఎన్నికల కమిషన్ కోసం మాత్రమే ఉత్పత్తి చేస్తోంది. 26.5 లక్షల సీసాల సరఫరాకు ఆర్డర్ అందిందని.. ఇందులో 60 శాతాన్ని ఇప్పటికే రాష్ట్రాలకు పంపామని సదరు కంపెనీ ఎండీ కె.మొహమ్మద్ ఇర్ఫాన్ వెల్లడించారు.

పోలింగ్ 83శాతం దాటేలాచూస్తాం: మీనా

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో 83 శాతానికిపైగా పోలింగ్ నమోదు లక్ష్యంగా పని చేస్తున్నట్టు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్య కార్యక్రమాలను సమీక్షించేందుకు భారత ఎన్నికల సంఘానికి చెందిన స్వీప్ అధికారుల బృందం సీఈవో మీనాను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ.. 2019లో రాష్ట్రంలో 79.77 పోలింగ్ శాతం నమోదవ్వగా, జాతీయ స్థాయిలో 69 శాతం నమోదయినట్లు తెలిపారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో 83 శాతానికి పైగా పోలింగ్ నమోదయ్యే లక్ష్యంతో స్వీప్ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలోని ప్రతి పౌరునికి, ఓటరుకి ఎన్నికల ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా అన్ని జిల్లాల స్వీప్ నోడల్ అధికారులతో మీనా సమీక్ష నిర్వహించారు. పట్టణాల్లో అపార్టుమెంట్లలో నివాసం ఉండేవారు, కంపెనీల్లో పనిచేసే కార్మికులు, ఐటీ ఉద్యోగులు, విద్యార్థులు, గిరిజనులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు పెద్దగా శ్రద్ధ చూపడం లేదని మీనా తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం అధికారుల బృందం సభ్యులు సంతోష్ కుమార్ (కార్యదర్శి) మాట్లాడుతూ.. పోలింగ్ నమోదు శాతాన్ని మరింత పెంచేందుకు స్వీప్ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో అమలు పర్చాలన్నారు.

చందాలతో రాష్ట్ర పండగా!

» కోటప్పకొండ శివరాత్రి ఉత్సవాలపై నిర్లక్ష్యం

» పల్నాడు జిల్లాలో పంచాయతీలు, మండల పరిషత్‌ల నుంచి విరాళాల వసూలు చేయాలని కలెక్టర్ ఆదేశాలు

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సంక్షేమానికి లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నామని పదేపదే గొప్పలు చెబుతున్న జగన్ సర్కారు.. రాష్ట్ర పండుగగా పేరొందిన పల్నాడు జిల్లా కోటప్పకొండ ఉత్సవాల నిర్వహణకు నిధులు ఇవ్వలేని దుస్థితిలో ఉంది. శివరాత్రి సందర్భంగా కోటప్పకొండలో పారిశుధ్య ఏర్పాట్లు చేసేందుకు గ్రామ పంచాయతీల నుంచి చందాలు వసూలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పల్నాడు జిల్లాలోని ప్రతి మైనర్ గ్రామ పంచాయతీల నుంచి రూ.10 వేలు, మేజర్ గ్రామ పంచాయతీల నుంచి రూ.20 వేలు, మండల ప్రజా పరిషత్‌ల నుంచి రూ.50 వేల చొప్పున వసూలు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. అసలే నిధుల లేమితో కునారిల్లుతున్న పంచాయతీలపై అదనపు భారం పడుతోంది. మార్చి 7 నుంచి 9 వరకు కోటప్పకొండలో మహాశివరాత్రి వేడుకలు జరగనున్నాయి. ఈ ఉత్సవాల సందర్భంగా కోటప్పకొండలో పారిశుధ్య ఏర్పాట్లు చేసేందుకు రూ.14 లక్షల 45 వేలు అవుతాయని అంచనా వేశారు. ఈ ఖర్చును పంచాయతీల నుంచి కాంట్రిబ్యూషన్‌గా వసూలు చేసేందుకు పల్నాడు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా ప్రొసీడింగ్స్ జారీ చేశారు. వసూళ్ల కార్యక్రమం పీఆర్ అండ్ ఆర్డీ విస్తరణ అధికారులకు అప్పజెప్పారు. నరసరావుపేట, గురజాల, సత్తెనపల్లి డివిజన్‌ల విస్తరణాధికారులు (పీఆర్ అండ్ ఆర్డీ) ఈ చెల్లింపులు నిర్ణీత గడువులోగా జరిగేలా చూడాలని సూచించారు. కాగా వసూలు చేసే మొత్తాలను ఒక చోట క్రోడీకరించే బాధ్యతను నరసరావుపేట విస్తరణాధికారితో పాటు కోటప్పకొండ పరిధిలోని కొండకావూరు గ్రామ పంచాయతీ కార్యదర్శికి అప్పగించారు. కలెక్టర్ నిర్ణయంపై సర్పంచ్‌లు లబోదిబోమంటున్నారు. ఇప్పటికే తమ ప్రమేయం లేకుండా పంచాయతీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవటంతో గ్రామ పరిపాలన ఎంతో హీన స్థితిలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ నరహంతక పాలనలో రాతియుగంలోకి

» రౌడీ మూకలకు అడ్డే లేకుండా పోయింది: చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ప్రతిపక్షాలు, మీడియాతో పాటు సామాన్య ప్రజలపైనా దాడులు నిత్యకృత్యమైపోతున్నాయి. ఇలాగైతే మన రాష్ట్రం ఎటుపోతోందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలి' అని టీడీపీ అధినేత చంద్రబాబు కోరారు. బుధవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... 'వైసీపీ నరహంతక పాలనలో రాష్ట్రం పూర్తిగా రాతియుగంలోకి వెళ్లిపోయింది. అసమ్మతిగళాలపై దాడులు, అరాచకాన్ని ముఖ్యమంత్రే ప్రోత్సహిస్తుండగా, వైసీపీ రౌడీ మూకలకు అడ్డే లేకుండా పోయింది. తెలుగుదేశం నేతలకు తన సమస్యను చెప్పిన పాపానికి దాడి చేసి, ఒక వితంతు మహిళ కంటి చూపు పోగొట్టిన ఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి స్పందించాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలి' అని చంద్రబాబు డిమాండ్ చేశారు.

నారిమన్ నిబద్ధత స్ఫూర్తిదాయకం: చంద్రబాబు

పద్మవిభూషణ్ గ్రహీత ఫాలి ఎస్ నారిమన్ మృతి పట్ల టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నారిమన్ మరణంతో భారతీయ న్యాయవాదులు గొప్ప వ్యక్తిని కోల్పోయినట్లని పేర్కొన్నారు. పౌరహక్కుల పరిరక్షణలో నారిమన్ చిత్తశుద్ధి ఔత్సాహిక న్యాయవాదులకు స్ఫూర్తి అన్నారు.

ప్రజలకు జగన్ క్షమాపణ చెప్పాలి: చలసాని

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 21: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధించడంలో విఫలమైన ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు కోరుతూ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం చేపట్టిన రిలే నిరాహారదీక్షలకు చలసాని శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. జగన్ ఇప్పటికైనా కేంద్రంపై పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర హక్కులను రాజకీయ నాయకులు ఢిల్లీలో తాకట్టు పెట్టడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రాన్ని ముంచిన పార్టీ బీజేపీ అని, ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చకుండా ఆంధ్రా పిల్లలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. సిద్ధం సభలో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ దౌర్జన్యం చేయడం సిగ్గుచేటని విమర్శించారు.

ఇసుకాసురుల ఇష్టారాజ్యం!

సర్కారు సహాయ నిరాకరణ

ఇసుక దందాపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం తమకు సహకరించలేదని కేంద్ర కమిటీ పేర్కొంది. 2020 జనవరి నుంచి జిల్లాల వారీగా ఎవరెవరికి ఎంతమేరకు ఇసుక రీచ్‌లు కేటాయించారు? ఉల్లంఘనలు ఎక్కడ జరిగాయో తెలపాలని గత ఏడాది డిసెంబరు 12న రాసిన లేఖకు ఇంతవరకు ఏపీ ప్రభుత్వం సమాధానం ఇవ్వలేదని తెలిపింది. తమ కమిటీకి ప్రభుత్వం, గనుల శాఖ ఏమాత్రం సహకరించలేదని ఎన్జీటీ దృష్టికి తీసుకెళ్లింది. ఇసుక తవ్వకాల పరిశీలన, అధ్యయనం, వాస్తవికత కోసం కొన్ని రకాల నివేదికలు, రీచ్‌లు, ఇతర వివరాలు ఇవ్వాలని కోరినా స్పందించలేదని తెలిపింది. ఈ విషయాలన్నింటిని నివేదిక రూపంలో సుప్రీం కోర్టుకు సమర్పించాలని కమిటీని ఎన్జీటీ ఆదేశించింది.

(మొదటి పేజీ తరువాయి)

ట్రిబ్యునల్ అభిప్రాయపడింది. ఇందుకు సంబంధించిన పత్రాలను సుప్రీంకోర్టుకు సమర్పించాలని అటవీ, పర్యావరణ శాఖను ఆదేశించింది. రాష్ట్రంలో ఇసుక తవ్వకాలపై దండా నాగేంద్ర అనే వ్యక్తి వేసిన పిటిషన్‌పై ఎన్జీటీలో విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇసుక తవ్వకాలను నిలిపి వేయాలని గతంలోనే ట్రిబ్యునల్ ఆదేశించింది. కానీ... దీనిని రాష్ట్ర సర్కారు పట్టించుకోలేదు. ఇక ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు... కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ కమిటీ రాష్ట్రంలో పర్యటించి, ఇసుక తవ్వకాలు సాగుతున్న వైనాన్ని నిశితంగా పరిశీలించి నివేదిక సమర్పించింది. ఆయా అంశాలకు సంబంధించి ఫొటోలు, గూగుల్ మ్యాప్స్ వంటి ఆధారాలనూ జత చేసింది. దీనిని పరిశీలించిన ఎన్జీటీ.. ఏపీ ప్రభుత్వం తన ఆదేశాలను ఖాతరు చేయడంలేదని స్పష్టమవుతోందని వ్యాఖ్యానించింది.

నిగ్గు తేల్చిన నిజాలివే...

రాష్ట్రంలో కేవలం 40 రీచ్‌లలో మాత్రమే మాన్యువల్ మైనింగ్ కు అనుమతి ఉంది. అయినా, 500పైగా రీచ్‌లలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ నెల 19వ తేదీన మేం పర్యటించిన సమయంలో గోదావరి నది వద్ద అక్రమ ఇసుక మైనింగ్ జరుగుతోంది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ గ్రామంలో జేసీబీలతో తవ్వకాలు సాగిస్తుండటాన్ని గుర్తించాం.గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఎలాంటి పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక మైనింగ్ జరుగుతోంది. ఈ ఏడాది జనవరి 17, 19 తేదీల మధ్య మేం పరిశీలించినప్పుడు... జీసీకేసీ ప్రాజెక్ట్స్ అండ్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ దాదాపు 2.2 టన్నుల కెపాసిటీ బకెట్ సైజ్‌లు కలిగిన జేసీబీ, హిటాచీ యంత్రాలతో అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతోంది. రోజంతా ఎడతెరిపి లేకుండా ఈ తవ్వకాలు సాగుతున్నాయి. తవ్వకాలు జరుగుతున్న రీచ్‌లలో ఏ ఒక్కదానికీ పర్యావరణ అనుమతులు లేవు. రీచ్‌ల ఏర్పాటుకు కాలుష్య నియంత్రణ మండలి అనుమతులూ తీసుకోలేదు. గనుల శాఖ నుంచి సంబంధిత రీచ్‌లను లీజుకు తీసుకున్నట్లు కూడా లేదు. అంటే, ఎలాంటి చట్టపరమైన అనుమతులు లేకుండానే జీసీకేసీ అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతోంది. ప్రతి రీచ్‌లో రోజుకు 1000 నుంచి 2000 టన్నుల మేరకు ఇసుకను తవ్వుతున్నారు. టన్ను ఇసుక రూ.475 చొప్పున అమ్ముతున్నారు.

అంతా అడ్డగోలుగా...

ఇసుక మైనింగ్ మార్గదర్శకాలకు విరుద్ధంగా మ్యానువల్‌గా వే బిల్లులను జారీ చేస్తున్నారు. బార్‌కోడ్ కలిగిన రవాణా పర్మిట్‌లు లేవు. రీచ్‌ల వద్ద సీసీటీవీ కెమెరాలు లేవు. వాహనాల ట్రాకింగ్ జరగడం లేదు.

ఏపీ మైన్స్, జియాలజీ విభాగం ఇచ్చిన లీజ్ ప్రాంతాన్ని మించి ఇసుక మైనింగ్ సాగుతోంది. 2021లో గూగుల్ ఎర్త్ ద్వారా లభ్యమైన ఉపగ్రహ దృశ్యాల ద్వారా ఇది స్పష్టమైంది.

రాష్ట్రంలో ఇసుక తవ్వకాలకు 2023 ఏప్రిల్ నుంచి ఎలాంటి పర్యావరణ అనుమతులు ఇవ్వలేదు. అయినా తవ్వకాలు ఆగలేదు. రీచ్‌ల వద్ద 2 నుంచి 5 కిలోమీటర్ల పరిధిలో తవ్వకాలు చేస్తున్నారు. నీటి ప్రవాహం లేని చోట 4 నుంచి 5 అడుగుల లోతులో ఇసుకను తవ్వేస్తున్నారు.

జేపీదే బాధ్యత...

ఇసుక మైనింగ్ చేయాలంటే తాజాగా పర్యావరణ అనుమతులు తీసుకోవాలని జేపీ వెంచర్స్‌ను ఆదేశించాం. కానీ ఆ సంస్థ మా ఆదేశాలను ధిక్కరించింది. కొత్తగా ఎలాంటి ఈసీలు తీసుకోకుండానే ఇసుక తవ్వకాలు జరిపింది. పర్యావరణాన్ని పరిరక్షించాలన్న మా ఆదేశాలను ధిక్కరించింది. 2021 నుంచి ఇసుక మైనింగ్‌కు సంబంధించిన పర్యావరణ అనుమతులను ఏపీ ప్రభుత్వానికి చెందిన మైన్స్ అండ్ జియాలజీ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్, జయప్రకాశ్ పవర్ వెంచర్స్ పేరిట జారీ చేస్తున్నారు. అందువల్ల వారే అక్రమ మైనింగ్‌కు బాధ్యులు. తాజాగా ఇసుక కాంట్రాక్టు దక్కించుకున్న జీసీకేసీ, ప్రతిమ సంస్థలు కూడా అవే తప్పులు చేస్తున్నాయని ప్రస్తావించింది. చట్టాలు అడ్డగోలుగా ఉల్లంఘించి తప్పులు చేసినందుకు జేపీ వెంచర్స్ , ఇతర సంస్థలు ముమ్మాటికి శిక్షార్హులే!

సుప్రీంకోర్టు దృష్టికి...

జేపీ వెంచర్స్ నుంచి ఒక్కో రీచ్‌కు 18 కోట్ల చొప్పున మొత్తం రీచ్‌ల నుంచి అపరాధం లెక్కకట్టి వసూలు చేయాలని గత ఏడాది మార్చిలో ఎన్జీటీ ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ నేపథ్యంలో... ఇసుక అక్రమాల అంశాన్ని, తమ పరిశీలనలు, నివేదికలను తిరిగి సుప్రీం కోర్టుకే సమర్పించాలని కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ ఎన్జీటీ ఆదేశించింది.

ఇదీ నేపథ్యం..

2023 మార్చిలోనే రాష్ట్రంలోని అన్ని రీచ్‌లకు ఇచ్చిన పర్యావరణ అనుమతులను ఎన్జీటీ రద్దు చేసింది. అయితే, ఈ తీర్పుపై జేపీ వెంచర్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఎన్జీటీ తీర్పు అమలుపై సుప్రీం స్టే ఉత్తర్వులు ఇచ్చింది. కొత్తగా పర్యావరణ అనుమతులు (ఈసీ) తీసుకొని నిబంధనల ప్రకారం ఇసుక తవ్వకాలు చేసుకోవచ్చని సుప్రీం కోర్టు ఆదేశించింది. అయితే, జేపీ వెంచర్స్ కొత్తగా ఈసీలు తీసుకోలేదు. పాత ఈసీలు రద్దయినా నిబంధనలకు విరుద్ధంగానే గత ఏడాది నవంబరు వరకు ఇసుక తవ్వకాలు చేపట్టింది. ఇదే అంశంపై జనవరిలో విచారణ జరిగినప్పుడు... కేంద్రం, జిల్లాల కలెక్టర్లు ఇసుక రీచ్‌లను సందర్శించి క్షేత్రస్థాయి నివేదికలు ఇవ్వాలని ఎన్జీటీ ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర పర్యావరణ సంస్థ, దాని పరిధిలోని ఉమ్మడి కమిటీలు జనవరి 17-19 తేదీల్లో కృష్ణా, గుంటూరు, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో తనిఖీలు జరిపి ఎన్జీటీకి నివేదికలు ఇచ్చాయి.



'చలో విజయవాడ' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

'చలో విజయవాడ'కు అనుమతి లేదు!

» ఏపీజేఏసీ ఉద్యమంపై నిర్బంధం

» జేఏసీ నేతలకు పోలీసుల నోటీసులు

» సర్కారు నుంచి మళ్లీ చర్చలకు పిలుపు

» రేపు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం

» నేడు జరగాల్సిన కార్యవర్గ సమావేశం వాయిదా

» 'చలో విజయవాడ' పోస్టర్ ఆవిష్కరణ

విజయవాడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైన ఏపీజేఏసీ 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని తలపెట్టిన విషయం తెలిసిందే. అయితే.. ఈ నిరసనపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఈ నెల 27న విజయవాడలోని బీఆర్‌టీఎస్ రోడ్డులో తలపెట్టిన చలో విజయవాడకు అనుమతి లేదని జేఏసీ నేతలకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఏపీజేఏసీ నేతలు విజయవాడలోని ఏపీఎన్జీవో భవన్‌లో బుధవారం సాయంత్రం 'చలో విజయవాడ'కు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమయంలో అక్కడకు చేరుకున్న పోలీసులు చలో విజయవాడకు అనుమతి లేదని నోటీసులు ఇచ్చారు. ఏపీజేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు, సెక్రటరీ జనరల్ బి. హృదయరాజులు ఈ నోటీసులను తీసుకున్నారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ.. "ప్రభుత్వం నోటీసులు పంపటం కాదు.. డబ్బులు పంపితే సంతోషంగా ఉంటుంది" అన్నారు. తమకు రావాల్సిన బకాయిలు విడుదల చేస్తే ప్రభుత్వం నోటీసులు పంపించే పని ఉండదు కదా? అని ప్రశ్నించారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా ఉద్యమం కొనసాగుతుందని తేల్చిచెప్పారు. కాగా, ఉద్యమ సంఘాల నేతలు 'చలో విజయవాడ'కు కదులుతున్న నేపథ్యంలో ప్రభుత్వం.. మరోసారి చర్చలకు రావాలని జేఏసీల నేతలకు మౌఖిక సమాచారం అందించింది. శుక్రవారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం విజయవాడలో 'ఏపీజేఏసీ అమరావతి' తలపెట్టిన రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను తాత్కాలికంగా వాయిదా వేసింది. గురువారం నిర్వహించే సమావేశంలో ఉద్యమ కార్యాచరణను ప్రకటించడటంతో పాటు.. ఉమ్మడిగా 'చలో విజయవాడ'ను నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని ఏపీజేఏసీ అమరావతి భావించింది. అయితే, ప్రభుత్వం నుంచి పిలుపురావటంతో జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు దీన్ని వాయిదా వేసుకున్నారు.

'చలో విజయవాడ' ఖాయం!

చట్టబద్ధంగా ఉద్యోగులకు దక్కాల్సిన ఆర్థిక ప్రయోజనాల విషయంలో తమ లక్ష్యం నెరవేరే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని ఏపీ జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు రావాల్సిన బకాయిల విడుదల కోరుతూ ఈ నెల 14 నుంచి దశలవారీగా చేస్తున్న ఆందోళన కీలక దశకు చేరుకుందన్నారు. ఈ నెల 27న తలపెట్టిన 'చలో విజయవాడ' విజయవంతం కావాలని కోరుతూ గురువారం నుంచి రాష్ట్ర నాయకత్వం జిల్లాల వారీగా పర్యటించనుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చర్చలకు పిలిస్తే వెళ్లేందుకు సిద్ధమన్నారు.

రుణాంధ్రగా ఆంధ్రప్రదేశ్

» 2.5 లక్షలకు చేరిన తలసరి అప్పు

» విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 21: రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పులతో రుణాంధ్రప్రదేశ్‌గా మారిందని విశ్రాంత ఐఏఎస్ పీవీ రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. అప్పులు తీర్చేందుకే అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం గుంటూరులో ఆంధ్రప్రదేశ్ ఆర్థికస్థితిపై జనచైతన్య వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖాముఖిలో రమేశ్ ప్రసంగించారు. మద్యం అమ్మకాల ద్వారా ఖజానా ఆదాయం 250శాతం పెరిగిందని, అయితే పేదలు నిరుపేదలుగా మారారన్నారు. తలసరి అప్పు 2.5లక్షలకు చేరిందన్నారు. గత ఐదేళ్లలో నీటిపారుదల ప్రాజెక్టులు, పరిశ్రమలను అభివృద్ధి చేసుకోలేకపోయామన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి పెట్టుబడులను సక్రమంగా పెట్టలేకపోయామన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు లోక్‌సభకు రూ.100కోట్లకుపైగా, శాసనసభకు రూ.30కోట్లకుపైగా వెచ్చించే పరిస్థితి వచ్చిందన్నారు. దీనివల్ల ఎన్నికల్లో కొన్ని కుటుంబాలు మాత్రమే పోటీ పడే పరిస్థితి వచ్చిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటి మధ్య సమతౌల్యం లోపించిందన్నారు. అధికార యంత్రాంగం అవినీతిపరులైన రాజకీయ నేతల కబంధహస్తాల్లో మగ్గిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ప్రాజెక్టులు పూర్తయితే వ్యవసాయ రంగంలో పంజాబ్, హర్యానా స్థాయికి ఏపీ చేరుకోగలిగేదన్నారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, ప్రాజెక్టులకు అతితక్కువ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్ట్రార్ ఎన్.రంగయ్య, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సేవాకుమార్, జై ఆంధ్ర ఫోరం నేత అవధానుల హరి, మానవత చైర్మన్ పి.రమేష్ తదితరులు ప్రసంగించారు.

యుద్ధానికి 'సిద్ధం'!

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. తెలుగుదేశం నిలబడిన చోట జనసేన ఓట్లు ఆ పార్టీకి మళ్లాలని స్పష్టం చేశారు. 'అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రాన్ని రక్షించుకోవడానికి వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వనని అన్నాను. పార్టీ ప్రయోజనాల కంటే ప్రజాప్రయోజనాల కోసం నిలబడ్డాను. కాబట్టే అన్ని పార్టీలను ఒక గాటికి తీసుకురాగలిగాం. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ కోసం ఇది తప్పదు. అధికారంలోకి వచ్చిన తర్వాత కష్టపడిన వారందరికీ గుర్తింపు ఉంటుంది. స్థానిక సంస్థల్లో మూడో వంతు జనసేన తీసుకుంటుంది. పార్టీ శ్రేణులకు న్యాయం చేస్తుంది' అని హామీ ఇచ్చారు. ఈసారి గెలుపే ప్రామాణికమని.. రాష్ట్రంలో బలమైన వ్యూహాన్ని అమలు చేస్తున్నామని.. పొత్తులు అందులో భాగమేనని చెప్పారు. జగన్ కులాల మధ్య చిచ్చు పెట్టి లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. ఉభయగోదావరి జిల్లాల్లో తీసుకుంటే కాపులు, క్షత్రియులు, శెట్టి బలిజలు, దళితులు కొట్లాడుకునేలా ఎత్తులు వేస్తున్నారని.. తద్వారా మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్నారని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కులాలకు అతీతంగా ఈసారి తెలుగుదేశం-జనసేన కూటమికి మద్దతివ్వాలని పిలుపిచ్చారు. జగన్ విచ్ఛిన్నకర చర్యలు కుటుంబాల వరకు వెళ్లాయని ధ్వజమెత్తారు.

బీసీలకు సీట్లు అంటూ వైసీపీ గేలం

బీసీలకు సీట్లు ఇస్తున్నామంటూ వైసీపీ గేలం వేస్తోందని పవన్ అన్నారు. 'సాధికారత అంటూ వారిని మభ్య పెడుతోంది. ఎంపీలు, కార్పొరేషన్ పదవులు ఇస్తున్నా.. అధికారాలు ఇవ్వడం లేదు. నిర్ణయాలు తీసుకునే అవకాశం అంతకన్నా లేదు. పేరుకే పదవులు. బీసీలు, కాపులు వైసీపీ నాయకత్వం వద్ద దేహీ అనే పరిస్థితి ఏర్పడింది. ఇది మారాలి. బీసీలు, బడుగు వర్గాలు, కాపులు అధికారం చలాయించాలి. ఆ దిశగా మార్పు తీసుకొస్తాం' అని స్పష్టం చేశారు.

అప్పులు చేసి బటన్ నొక్కితే సరిపోతుందా..

అప్పులు చేసి జగన్ బటన్ నొక్కుతున్నారని పవన్ ఎద్దేవా చేశారు. రాష్ట్ర భవిష్యత్‌కు ఇటువంటి బటన్ నొక్కుడు శ్రేయస్కరం కాదన్నారు. 'సంపద సృష్టించాలి. సంక్షేమాన్ని అమలు చేయాలి. తెలుగుదేశం-జనసేన అధికారంలోకి వస్తేనే అది సాధ్యపడుతుంది. బటన్ నొక్కుడుతో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోతోంది. జగన్ ఆస్తులు పెరుగుతున్నాయి తప్ప సంపద సృష్టిలేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఇద్దరు బిడ్డలకూ ఆస్తులను పంచారు. కానీ జగన్ తన సొంత చెల్లికి వాటా ఇవ్వలేదు. భారతీ సిమెంట్, సాక్షి పేపర్‌లో వాటాలు ఇవ్వకుండా ఆమెకు అన్యాయం చేశారు. ఇక ప్రజలకు మేలు చేస్తున్నారంటే ఎలా నమ్ముతాం' అని ప్రశ్నించారు. అంతకుముందు పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జులు వచ్చి ఆయన్ను కలిశారు. అందరం ఐక్యంగా పనిచేయాలని.. ఓట్ల బదిలీ పకడ్బందీగా జరిగేలా చూసుకోవాలని.. టీడీపీ-జనసేన కూటమి విజయం సాధించాలని ఆయన వారితో అన్నారు.

నేడు బెజవాడలో టీడీపీ, జనసేన సమన్వయ సమావేశం

» ఉమ్మడి కార్యక్రమాలపై చర్చ

అమరావతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం, జనసేన పార్టీల రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ సమావేశం గురువారం విజయవాడలో జరగనుంది. నోవాటెల్ హోటల్లో మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే భేటీలో టీడీపీ నుంచి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జనసేన నుంచి ఆ పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ హాజరవుతారు. కమిటీలో ఈ రెండు పార్టీల నుంచి సభ్యులుగా ఉన్న మరో ఎనిమిది మంది నేతలకు కూడా ఆహ్వానాలు పంపారు. కింది స్థాయిలో ఉమ్మడి కార్యాచరణ, నియోజకవర్గాల్లో సమన్వయపరంగా ఏవైనా సమస్యలుంటే వాటిని సర్దుబాటు చేయడానికి చర్యలు, ఉమ్మడి మేనిఫెస్టో విడుదలపై చర్చలు జరుపుతారని ఆయా పార్టీల వర్గాలు తెలిపాయి.

అనంత లోక్‌సభకు పార్థసారథి!

» పెనుగొండలో సవిత పోటీ

» ఉమ్మడి 'అనంత' జిల్లాలో కొలిక్కి వస్తున్న టీడీపీ కసరత్తు

అమరావతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపిక కసరత్తు కొలిక్కి వస్తోంది. పెనుగొండ మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథిని ఈసారి అనంతపురం లోక్‌సభ అభ్యర్థిగా పోటీచేయించాలని ఆ పార్టీ నాయకత్వం నిర్ణయించింది. ఆయన గతంలో హిందూపురం ఎంపీగానూ పనిచేశారు. కానీ ఈసారి ఆ జిల్లాలో సామాజిక సమీకరణల్లో భాగంగా ఆయన్ను అనంతపురంలో నిలపాలని నిశ్చయించింది. పెనుగొండ అసెంబ్లీ అభ్యర్థిగా ఆ పార్టీ మహిళా నేత సవిత పోటీచేయనున్నారు. హిందూపురం ఎంపీ అభ్యర్థిగా ఈసారి బోయ సామాజిక వర్గానికి చెందిన నేతను నిలబెడతారు. ఆ వర్గానికి చెందిన మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులును అక్కడ నిలపాలని పార్టీ అధిష్ఠానం గతంలో అనుకుంది. కానీ తనకు ఎమ్మెల్యేగానే అవకాశం కల్పించాలని కాల్వ అనేక సార్లు విజ్ఞప్తి చేయడంతో నిర్ణయాన్ని పెండింగ్‌లో ఉంచారు. మడకశిరలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు అనిల్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. శింగనమలలో మహిళా నేత బండారు శ్రావణిని ఖరారు చేశారు. మిత్రపక్షాలతో పొత్తుల వల్ల ఈ జిల్లాలో మూడు సీట్లకు అభ్యర్థుల ఎంపిక వ్యవహారం పెండింగ్‌లో పడింది. జనసేన ఈ జిల్లాలో పుట్టపర్తి లేదా అనంతపురం అర్బన్ సీటు ఇవ్వాలని అడుగుతోంది. బీజేపీ ధర్మవరం సీటును ఆశిస్తోంది. కాల్వ శ్రీనివాసులు లోక్‌సభకు పోటీచేస్తారా.. అసెంబ్లీకా అన్నది తేలకపోవడంతో రాయదుర్గం సీటు విషయం కూడా అనిశ్చితిలోనే ఉంది. కదిరిలో ప్రస్తుత ఇన్‌చార్జి కందికుంట వెంకట ప్రసాద్ పోటీకి సంబంధించి కొన్ని న్యాయపరమైన అంశాలు తెరపైకి రావడంతో వాటిపై అధ్యయనం జరుగుతోంది. ఏదైనా ఇబ్బంది ఉంటే మాత్రం ముస్లిం లేదా బీసీలకు ఈ సీటివ్వాలని టీడీపీ నాయకత్వం అనుకుంటోంది. కల్యాణదుర్గంలో కొత్తగా తెరపైకి వచ్చిన పారిశ్రామికవేత్త సురేంద్రబాబుకు వ్యతిరేకంగా ఇద్దరు ప్రధాన పోటీదారులు ఉమామహేశ్వరనాయుడు, ఉన్నం హనుమంతరాయ చౌదరి వర్గాలు ఏకమవడం ఆసక్తికరంగా మారింది.

చింతలపూడి ఇన్‌చార్జిగా రోషన్

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి (ఎస్సీ) ఇన్‌చార్జిగా సొంగా రోషన్ కుమార్‌ను నియమించినట్టు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు బుధవారం ప్రకటించారు. దళితుల్లో రెండు ఉప సామాజిక వర్గాలకు చెందిన డాక్టర్ అనిల్, రోషన్ ఇక్కడ పోటీపడ్డారు. వీరిలో రోషన్‌వైపు పార్టీ నాయకత్వం మొగ్గు చూపింది. అనిల్ పేరును కొవ్వూరు(ఎస్సీ)కు పరిశీలనలోకి తీసుకునే అవకాశం లేకపోలేదని అంటున్నారు. తాజా పరిణామాల్లో.. కడప జిల్లా ప్రొద్దుటూరులో బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ సోదరుడు సురేశ్ కుటుంబం రేసులో ముందుకొచ్చింది. సురేశ్ లేదా ఆయన కుమారుడి పేరును పార్టీ నాయకత్వం పరిశీలిస్తోంది. రమేశ్ టీడీపీ నుంచి బీజేపీలోకి వెళ్లినా ఆయన సోదరుడు మాత్రం టీడీపీలోనే కొనసాగుతున్నారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో తొలుత మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి పేరు పరిశీలనకు వచ్చినా.. స్థానిక పార్టీ నేత సైకం జయచంద్రారెడ్డి పేరు తాజాగా తెరపైకి వచ్చింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గానికి కాకర్ల సురేశ్ పేరును ఖరారు చేస్తారని సమాచారం.

వైసీపీకి వేమిరెడ్డి రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం నెల్లూరులోని తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వ్యక్తిగత కారణాలతో జిల్లా అధ్యక్ష పదవితోపాటు పార్టీ సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు సీఎం జగన్మోహన్‌రెడ్డికి పంపిన లేఖ పంపినట్లు తెలిపారు. వెంటనే ఆమోదించాలని కోరానన్నారు. అదేవిధంగా రాజ్యసభ సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. త్వరలోనే అన్ని విషయాలు, భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని తెలిపారు. ఆయన నిర్ణయం తెలిసి ఉమ్మడి నెల్లూరు జిల్లావ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులు, అభిమానులు పెద్దఎత్తున ఆయన నివాసానికి చేరుకున్నారు. మరికొందరు నెల్లూరులో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వీరందరితో ఆయన భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. తామంతా ఆయన వెంటే నడుస్తామని వారు భరోసా ఇచ్చారు. కాగా.. వేమిరెడ్డి దంపతులు టీడీపీలోకి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కుట్రలు, కుతంత్రాలు తెలియని ఆయన వైసీపీలో ఇమడలేకనే బయటకొచ్చారని, ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర పునర్నిర్మాణానికి టీడీపీతో చేతులు కలపాలని కోరారు. 'మంచివాళ్లకు వైసీపీలో స్థానం లేదని వేమిరెడ్డి రాజీనామాతో తేలిపోయింది. ఆయన ఆ పార్టీలో ఇమడలేకపోయారంటే అక్కడ జగన్, మంత్రుల పోకడలు ఎలా ఉన్నాయో అందరికీ అర్థమవుతోం' అని పేర్కొన్నారు.

ముగ్గురు టీడీపీ.. ఒకరు జనసేనకు

వేమిరెడ్డి రాజీనామాతో వైసీపీ ఎంపీల్లో ఇప్పటికి నలుగురు ఆ పార్టీ నుంచి బయటకు వచ్చినట్లయింది. వీరిలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి జనసేనలో చేరారు. మిగిలిన ముగ్గురిలో వేమిరెడ్డి రాజ్యసభ సభ్యుడు కాగా.. రఘురామకృష్ణంరాజు (నరసాపురం), లావు శ్రీకృష్ణదేవరాయలు (నరసరావుపేట) లోక్‌సభ సభ్యులు. వీరు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారు. రఘురామరాజు చాలా కాలం కిందటే వైసీపీకి దూరమయ్యారు. నరసాపురం టికెట్ టీడీపీ కూటమిలో ఏ పార్టీకి దక్కితే ఆ పార్టీలో చేరాలని ఆయన నిర్ణయించుకున్నారు. శ్రీకృష్ణదేవరాయలు కొద్ది రోజుల్లోనే టీడీపీలో చేరబోతున్నారు. వేమిరెడ్డి కూడా త్వరలోనే తన సతీమణి ప్రశాంతితో కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఈ నలుగురు ఎంపీలకు టీడీపీ కూటమి టికెట్లు ఇవ్వనుంది. వేమిరెడ్డి నెల్లూరు లోక్‌సభ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయడం ఖాయమైంది. మరో ఇద్దరు వైసీపీ ఎంపీలు కూడా ఆ పార్టీకి రాజీనామా ప్రకటించే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నెలాఖరులో వీరి నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

వైసీపీకి కె.శివరామకృష్ణ రాజీనామా

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 21: వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే శివరామకృష్ణ తెలిపారు. జిల్లా కేంద్రమైన ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని ఆయన నివాసంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. 'అమరావతి రాజధాని కోసం 35 వేల ఎకరాలు పచ్చని పంట పొలాలను రైతులు ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేస్తారని ఎన్నికల్లో గెలిపించారు. ఆ రెండూ చేయలేదు సరికదా మూడు రాజధానులు అంటూ కొత్త నాటకం మొదలు పెట్టారు. పార్టీలో కార్యకర్తలు, నాయకులకు విలువలేదు. అందుకే వైసీపీకి రాజీనామా చేస్తున్నా. త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తా' అని కే శివరామకృష్ణ తెలిపారు.

మా అన్నే టీడీపీ అభ్యర్థి.. గుమ్మనూరు సోదరుడు

పామిడి, ఫిబ్రవరి 21: కర్నూలు జిల్లా వైసీపీ నాయకుడు, మంత్రి గుమ్మనూరు జయరాం అనంతపురం జిల్లా గుంతకల్లు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణ అన్నారు. అనంతపురం జిల్లా పామిడిలో బుధవారం ఆయన పలువురు టీడీపీ నాయకులతో సంప్రదింపులు జరిపారు. మంత్రి జయరాంకు వీడియో కాల్ చేసి స్థానిక టీడీపీ కార్యకర్తలతో మాట్లాడించారు. అతి త్వరలో భారీ జన సమూహంతో టీడీపీలోకి చేరుతున్నామని అన్నారు.

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించండి

» ఈసీకి జై భారత్ నేషనల్ పార్టీ వినతి

విజయవాడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికలను నిష్పక్షపాతంగా, ప్రజాస్వామ్యయుతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ కోరారు. సచివాలయంలో సీఈవో ముఖేశ్ కుమార్ మీనాను కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావం లేకుండా చేయడానికి కొన్ని సూచనలను చేశారు. ఎన్నికల విధులను వలంటీర్లకు అప్పగించవద్దని కోరారు.



శారదా పీఠం ప్రాంగణంలో రాజశ్యామల అమ్మవారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పూజలు

శారదా పీఠంలో సీఎం పూజలు

» రాజశ్యామల యాగం పూర్ణాహుతిలో పాల్గొన్న జగన్

» స్వరూపానందేంద్రతో అరగంట ఏకాంత చర్చ!

పెందుర్తి, ఫిబ్రవరి 21: ముఖ్యమంత్రి జగన్ బుధవారం చినముషిడివాడలోని శారదా పీఠాన్ని సందర్శించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకున్నారు. స్వయంజ్యోతి మండపంలో నిర్వహిస్తున్న రాజశ్యామల అమ్మవారి యాగంలో పాల్గొన్నారు. ఆయనతో స్వరూపానందేంద్ర, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి పూర్ణాహుతి జరిపించారు. అంతకుముందు పీఠం అధిష్ఠాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. శమీవృక్షం చుట్టూ ప్రదక్షిణ చేశారు. పీఠాధిపతితో ఆయన అంతరంగిక మందిరంలో సీఎం అరగంట పాటు ఏకాంతంగా చర్చించినట్టు తెలిసింది. మధ్యాహ్నం 12.20గంటలకు వచ్చి.. రెండున్నర గంటలసేపు పీఠంలో గడిపారు.

జగన్ సార్ వస్తున్నారని..!

» బాగున్నరోడ్డుపైనే కొత్త తారురోడ్డు

» విశాఖలో శారదా పీఠం రహదారి 96 లక్షలతో 2 రోజుల్లోనే నిర్మాణం



విశాఖలో శారదా పీఠం వరకు కొత్తగా నిర్మించిన రహదారి

విశాఖపట్నం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చాలా రోడ్లు గుంతలుగా తయారయ్యాయి. వాటిని పట్టించుకోని ప్రభుత్వం.. ముఖ్యమంత్రి జగన్ వస్తున్నారని బాగున్న రోడ్డుపైనే కొత్త తారురోడ్డు వేయించారు. రూ.96 లక్షలు వెచ్చించి జీవీఎంసీ అధికారులు రెండు రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేయించారు. విశాఖపట్నంలోని చినముషిడివాడలోగల శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితులుగా పేరుపొందారు. సీఎం తరచూ పీఠాన్ని సందర్శిస్తుంటారు. ఈ క్రమంలో రాజ శ్యామల యాగంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బుధవారం శారదా పీఠానికి వస్తున్నారని తెలిసి జీవీఎంసీ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. రూ.96 లక్షలు వెచ్చించి పీఠం రహదారిని పునర్నిర్మించారు. రెండు రోజుల కిందట జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ స్వయంగా శారదా పీఠం వద్దకు వెళ్లి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. పీఠానికి వెళ్లే రోడ్డులో సెంటర్ మీడియన్‌లో అందమైన మొక్కలు నాటాలని జోనల్ కమిషనర్ హైమావతిని ఆదేశించారు. కాగా పీఠానికి సమీపంలో గల అత్యంత ప్రధానమైన పెందుర్తి-పులగానిపాలెం రోడ్డు పాడైపోవడంతో వాహనదారులు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆ రోడ్డులో ప్రభుత్వ కళాశాలతో పాటు నివాసాలు ఉన్నాయి. దానిపై దృష్టిపెట్టని అధికారులు... పీఠాధిపతి మెప్పు కోసం బాగున్నరోడ్డుపైనే మళ్లీ లక్షల రూపాయలు ఖర్చు చేసి లేయర్ వేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎండలో రోడ్డుపక్క నిలువుకాళ్లపై...

» జగన్ విశాఖ పర్యటనలో డ్వాక్రా మహిళలకు పాట్లు

» ఉదయం 9 నుంచి 12దాకా నిలబెట్టేశారు

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ విశాఖ పర్యటన సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు వైసీపీ నేతలు, అధికారులు చుక్కలు చూపించారు. సీఎంకు స్వాగతం పలికేందుకంటూ ఉదయం 9గంటలకే మహిళలను తీసుకొచ్చి రోడ్డుపై నిలబెట్టారు. సీఎం 11.30 గంటలకు వచ్చారు. అప్పటివరకూ మండుటెండలో నిలబడిన మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. చినముషిడివాడలోని శారదా పీఠంలో జరిగే రాజశ్యామల యాగంలో పాల్గొనేందుకు జగన్ బుధవారం విశాఖ వచ్చారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు నుంచి శారదాపీఠం వరకూ దారిపొడవునా మహిళలు స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేయాలని జీవీఎంసీ అధికారులను వైసీపీ నేతలు ఆదేశించారు. దీంతో అధికారులు... డ్వాక్రా సంఘాల సభ్యులను తరలించాలంటూ యూసీడీ రీసోర్స్ పర్సన్స్‌కు టార్గెట్లు నిర్దేశించారు. జోన్-5, జోన్-8 పరిధిలో రీసోర్స్ పర్సన్స్ ఒక్కొక్కరు వంద మందిని తీసుకురావాలని ఆదేశించారు. వారిని నిర్దేశించిన చోటకు చేర్చిన తరువాత ఫొటోలు తీసి గ్రూపులో పెట్టాలన్నారు. జన సమీకరణ కోసం యూసీడీ ఏపీడీలు, పీడీతోపాటు జోనల్ కమిషనర్లను ఒక్కో ప్రాంతానికి ఇన్‌చార్జులుగా నియమించారు. ఉదయం 8.30నుంచి ఆటోల్లో మహిళలను తరలించారు. ఒక్కో మహిళ చేతికి జగన్ ఫొటోతో కూడిన ప్లకార్డు ఇచ్చి, ఫుట్‌పాత్‌లపై నిలబెట్టారు. వచ్చినవారు తిరిగి వెళ్లిపోకుండా ఉండేందుకు ఏపీడీలు మహిళల జాబితాలను పట్టుకుని పర్యవేక్షించారు. 11.30 గంటల వరకూ సీఎం ఎయిర్‌పోర్ట్‌లో దిగకపోవడం, ఆ తర్వాత కారులో నెమ్మదిగా కదులుతూ దారిపొడవునా ఉన్న మహిళలకు కారులో నుంచే అభివాదం చేసుకుంటూ వెళ్లడంతో మహిళలు అంతవరకూ ఎండలోనే నిలబడాల్సి వచ్చింది. గంటల తరబడి మండుటెండలో నిలబడడంతో కొంతమంది సొమ్మసిల్లిపోయారు. నీటితో ముఖం కడుక్కొని సేదతీరడం కనిపించింది. ఈ సందర్భంగా కొంతమంది మహిళలు... వైసీపీ నేతలు, జీవీఎంసీ అధికారుల తీరును తూర్పారబట్టారు. సీఎం వస్తే పార్టీ కార్యకర్తలను పిలిచి స్వాగతం పలికించుకోవాలిగానీ, వారి మెప్పు కోసం తమను బలవంతంగా తీసుకొచ్చి రోడ్డుపై ఎండలో నిలబెట్టడమేమిటంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. వైసీపీ నేతలకు మహిళా సంఘాల సభ్యులు తప్ప మరెవరూ కనిపించడం లేదా...అంటూ మండిపడ్డారు. సీఎం వస్తున్నారంటే మహిళా సంఘాల సభ్యుల గుండెల్లో దడ పుడుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఒకవేళ ఎవరైనా రాకపోతే పథకాలు ఆపేస్తామని, రుణాలు మంజూరుకావని బెదిరిస్తున్నారని వాపోయారు. ఇటీవల విశాఖలో జరిగిన 'ఆడుదాం ఆంధ్రా' ముగింపు కార్యక్రమానికి జనాలు లేకపోవడంతో జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌పై సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారనే ప్రచారం జరిగింది. ఆ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని, ఈసారి మహిళా సంఘాల సభ్యులను తరలించి, సీఎం ప్రయాణించే మార్గంలో నిలబెట్టి ఘనస్వాగతం పలికేలా జాగ్రత్త పడ్డారని చెబుతున్నారు.



డ్వాక్రా సభ్యులు ఎవరు వచ్చిందీ పుస్తకంలో నమోదు చేసుకుంటున్న రీసోర్స్‌పర్సన్



మండుటెండలో రోడ్డుపై కూర్చున్న మహిళలు

రామ.. దోపిడీ చూడతరమా!

అమ్మో ఎమ్మెల్యే

వందల కోట్ల దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యే. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంపాదనే ధ్యేయంగా చేసిన అక్రమాలు అన్నీఇన్నీ కావు. నియోజకవర్గంలో పొలం, స్థలం ఏదైనా కానీ అమ్మాలన్నా, కొనాలన్నా ఆయనకు కప్పం కట్టాల్సిందే. ఇల్లు కట్టుకునేదానికి బండెడు ఇసుక కావాలన్నా, పిడికెడు మట్టి కావాలన్నా మామూళ్లు ఇచ్చుకోవాల్సిందే. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుని బతుకుదామన్నా.. అందులో ఆయనకు వాటా ఇవ్వాల్సిందే. పొలంలో నాలుగు ప్లాట్లు వేసి అమ్ముకుందామన్నా రూ.లక్షల్లో ముడుపులు ఇచ్చుకోవాల్సిందే. ఇక ప్రతిపక్ష పార్టీల సానుభూతిపరుల పొట్ట కొట్టడంలోనూ ఘనాపాటి. వైసీపీ సర్కారు తీసుకువచ్చిన ఇసుక పాలసీ ఎమ్మెల్యేకు కాసులు కురిపించింది. ఇసుకను తన ఇంజనీరింగ్ కళాశాల వద్ద నిల్వ చేసి, అందులో తీరప్రాంతపు ఇసుకను కలిపి విక్రయించారు. ఇసుకలో అక్రమ సంపాదన బాగా వెనకేసుకున్నారు.

బంగారు గనిలా గ్రావెల్..

నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో గ్రావెల్ దొరుకుతుండటంతో గ్రావెల్ వ్యాపారం ఎమ్మెల్యేకు బంగారు గనిలా మారింది. ఐదేళ్లుగా మూడు పువ్వులు, ఆరుకాయలుగా కొనసాగింది. గుట్టలు, చెరువులు, అన్నీ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. ఒక్కో మండలానికి ఒక్కో అనుచరుడిని పెట్టి యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు జరిపి అమ్ముకున్నారు. స్థానిక ప్రజలెవరికి మట్టి కావాలన్నా ఎమ్మెల్యే మనిషి చెప్పిన రేటు ఇచ్చి కొనుక్కోవాల్సిందే. ఆయన దెబ్బకు కొండలు, గుట్టలు కరిగిపోయాయి. చెరువులు పారుదలకు వీలులేనంతగా గోతులు పడ్డాయి. చివరికి ప్రభుత్వ భూముల్లో, విమానాశ్రయానికి కేటాయించిన భూములను సైతం పనికి రానంతగా ధ్వంసం చేశారు. కేవలం గ్రావెల్ అమ్మకాల ద్వారానే వందల కోట్లు పోగేసుకున్నారు.

రియల్ ఎస్టేట్‌లో దందాలు

నియోజకవర్గంలో ఎవరైనా రియల్ వెంచర్లు వేయాలంటే అందులోనూ ఎమ్మెల్యేకు వాటా ఇవ్వాల్సిందే. ఆయన అనుమతి లేనిదే ఒక్క లేఅవుట్ కూడా వేయడానికి వీలు లేదు. అనుమతి కావాలంటే ఎకరాకు రూ.లక్ష చొప్పున కప్పం కట్టాలి. లేఅవుట్‌లో ప్రభుత్వ స్థలం, కాలువలు, వాగులు, వంకలు కలిసుంటే దానికి వేరుగా రేటు చెల్లించాలి. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదు. ఎమ్మెల్యే బంధువులైనా సరే మామూళ్లు ఇవ్వాల్సిందే.

భూమి కొనాలన్నా మామూళ్లే

వ్యవసాయ భూమి కొని రియల్ వెంచర్ వేసుకోవాలన్నా ఎమ్మెల్యేకు మామూళ్లు ఇవ్వాల్సిందే. ఈయన అనుమతి లేనిదే రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పత్రాలు రాయరు. రిజిస్ట్రేషన్ జరగాలంటే ఎమ్మెల్యే చీటీ తప్పనిసరి. అందుకోసం వెంచర్‌లో వాటా ఇవ్వాలి. అంతేకాదు ల్యాండ్ కన్వర్షన్ కోసం మళ్లీ వేరుగా మామూళ్లు ఇచ్చుకోవాలి. పని నిమిత్తం రెవెన్యూ ఆఫీసుకు వెళితే ఆ అధికారులు తొలుత ఎమ్మెల్యే వద్దకు వెళ్లమంటారు. భూమి విలువను బట్టి ఎకరానికి లక్ష నుంచి 2లక్షలు ఇచ్చుకోవాలి. ఇందులో కూడా బంధుమిత్రులతో సహా ఎవరికి మినహాయింపులు ఉండవు. రియల్ రంగంలోనూ సదరు నేత ఈ ఐదేళ్ల కాలంలో కొన్ని వందల కోట్ల రూపాయలు పిండుకున్నారు.

> ప్రజారాజ్యం తరపున సదరు నేత ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఒక సారి పోటీచేసి ఓడిపోయారు. 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ నాలుగు పర్యాయాలు ఎన్నికల్లో చేసిన ఖర్చును ఈ ఐదేళ్లలో రాబట్టుకోవాలనుకున్నారో ఏమో ప్రజల మీదపడి దోచుకొంటున్నారు. వచ్చే ఎన్నికలకు అవసరమైన ఖర్చు పోగేసేందుకు దేన్నీ వదలకుండా సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ ఇసుక, గ్రావెల్, రియల్ వెంచర్లు, జగనన్న ఇళ్లకు భూముల కొనుగోళ్లలో వందల కోట్లు మేసేశారు.

జగనన్న ఇళ్ల స్థలాల్లోనూ అక్రమార్జన

నియోజకవర్గ కేంద్రంలో జగనన్న ఇళ్ల నిర్మాణాల కోసం వంద ఎకరాలు సేకరించారు. దీనివల్ల పేదలకు జరిగిన మేలు పెద్దగా లేదు కానీ ఎమ్మెల్యేకు మాత్రం రూ.కోట్లు గిట్టుబాటయ్యాయి. జగనన్న ఇళ్ల కోసం అధికారులు తొలుత సేకరించిన భూమిని నిలుపుదల చేయించారు. టీడీపీ సానుభూతిపరుల భూములు ఎలా కొంటారని దబాయించారు. ఆ తరువాత ఆయన రంగంలోకి దిగారు. ఆ భూములకు పక్కనే ఉన్న వంద ఎకరాలను ఎకరం 10లక్షల నుంచి 15 లక్షలకు బినామీ పేర్లతో కొన్నారు. రైతులకు అడ్వాన్స్‌గా కొంత మొత్తం ఇచ్చి తన మనుషుల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తరువాత ఆ భూమిని జగనన్న ఇళ్ల కోసం సేకరించాలని అధికారుల ముందు ఫైల్ పెట్టారు. ఎకరానికి రూ.50లక్షలు చెల్లించేలా రాయించారు. అప్పటి జిల్లా కలెక్టర్ ఈ దోపిడీని అడ్డుకోవడానికి ప్రయత్నించడంతో అవమానకర రీతిలో జిల్లానుంచి బదిలీపై వెళ్లిపోవాల్సి వచ్చింది. ఆ తరువాత ఎకరం రూ.50 లక్షల చొప్పున ప్రభుత్వం భూములు కొనుగోలు చేసింది. రైతులకు ఎకరానికి 10 లక్షలు ఇచ్చి, ఎమ్మెల్యే 40 లక్షలు బొక్కేశారు. ఈ భూముల కొనుగోలు రూపంలోనే సదరు ఎమ్మెల్యే రూ.40 కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారు.

లిక్కర్ వ్యాపారుల నుంచి మామూళ్లు

సదరు ఎమ్మెల్యే.. అధికారులను, చివరికి లిక్కర్ వ్యాపారులను కూడా వదిలిపెట్టలేదు. బార్లను సిండికేట్ చేసి ఒక్కో బార్ నుంచి భారీ వసూళ్లు చేశారు. బదిలీలు, పోస్టింగ్‌లకు కొంతమంది అధికారుల దగ్గర డబ్బులు తీసుకుంటున్నట్లు ప్రచారం ఉంది. బాగా ఆదాయాలు వచ్చే శాఖలకు చెందిన అధికారులు కొందరు నెలవారీగా ముడుపులు ముట్టజెపుతున్నారనే ప్రచారం కూడా ఉంది. అవినీతిలోనే కాదు అరాచకాల్లోనూ ఈ ఎమ్మెల్యేనే ఫస్ట్. జిల్లాలో మరే నియోజకవర్గంలో చోటు చేసుకోనన్ని సంఘటనలు ఈ నియోజకవర్గంలో జరిగాయి. చేపల చెరువు ద్వారా జీవనం సాగిస్తున్న ఒక దళితుడు టీడీపీ సానుభూతిపరుడన్న ఒకే ఒక్క కారణంగా ఆ చేపల చెరువును ధ్వంసం చేశారు. ఈ నష్టాన్ని భరించలేక ఆ దళితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎమ్మెల్యే వేధింపులు భరించలేక మరో టీడీపీ పార్టీ కార్యకర్త ఆత్మహత్యకు ప్రయత్నించి కొన ఊపిరితో బయటపడ్డాడు. నియోజకవర్గం పరిధిలోని టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలపై డజన్ల కొద్ది పోలీసు కేసులు పెట్టించారు. ఎన్నో ఇళ్లను, దుకాణాలను ధ్వంసం చేయించారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడిచేసిన

నిందితుడి రిమాండ్‌లో హైడ్రామా

» ఎర్రిస్వామికి అడుగడుగునా రాచమర్యాదలు

» 9 కి.మీ. ప్రయాణానికి రెండున్నర గంటలు

» వైసీపీ నేతలు తెచ్చిన స్కార్పియోలో జైలుకు...

» కోర్టు వద్ద ప్యాంటు..జైలు వద్ద లుంగీతో దర్శనం





కోర్టు ఆవరణలో ప్యాంట్‌తో ఎర్రిస్వామి, జైలు వద్ద లుంగీతో కనిపించిన ఎర్రిస్వామి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 21: 'ఆంధ్రజ్యోతి' అనంతపురం జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి కేసులో నిందితుడు మిద్దె ఎర్రిస్వామిని కోర్టునుంచి జైలుకు తరలించడంలో హైడ్రామా నడిచింది. అనంతపురం మొబైల్ కోర్టు బుధవారం ఎర్రిస్వామికి వచ్చేనెల ఆరోతేదీ వరకు రిమాండ్ విధించింది. కోర్టునుంచి జైలుకు వైసీపీ నాయకులు తెచ్చిన స్కార్పియోలో ఎర్రిస్వామిని తరలించడం, తొమ్మిది కిలోమీటర్ల ప్రయాణానికి ఏకంగా రెండున్నర గంటలు తీసుకోవడం, కోర్టు వద్ద ప్యాంట్‌తో కనిపించిన ఎర్రిస్వామి...జైలు వద్ద లుంగీతో దర్శనమివ్వడం... ఇలా పోలీసుల తీరు అడుగడుగునా అనుమానాలకు దారితీసేలా ఉంది. జైలుకు తరలించే క్రమంలో ఎక్కడెక్కడకు ఎర్రిస్వామిని తీసుకెళ్లి, ఏమేం రాచమర్యాదలు చేశారోననే చర్చ పోలీసు వర్గాల్లోనే మొదలైంది. అనంతపురం జిల్లా రాప్తాడు సమీపంలో ఈ నెల 18న జరిగిన సీఎం జగన్ సిద్ధం సభలో వైసీపీ గూండాలు 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన సంగతి తెలిసిందే. దాడి చేసినవారిలో ఆరుగురిని గుర్తించామని ఎస్పీ అన్బురాజన్ ప్రకటించారు. వారిలో మిద్దె ఎర్రిస్వామిని మాత్రమే రాప్తాడు పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతపురం మొబైల్ కోర్టులో బుధవారం సాయంత్రం అతణ్ని హాజరుపరిచారు. ఎర్రిస్వామిని రిమాండ్‌కు పంపకూడదని ఆయన తరఫు న్యాయవాది వేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. రిమాండ్‌కు తరలించాలని మొబైల్ కోర్టు న్యాయాధికారి సుజన్‌కుమార్ ఆదేశించారు. రాప్తాడు పోలీస్‌స్టేషన్ వద్దే మంగళవారం రాత్రి వరకూ ఉన్న వైసీపీ నాయకులు బుధవారం ఎర్రిస్వామి వెనకాలే కోర్టు వద్దకు వచ్చారు. వారు తెచ్చిన స్కార్పియో.. ఎర్రిస్వామిని ఎక్కించుకుని కోర్టు ఆవరణ నుంచి సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరింది. అది జిల్లా జైలు వద్దకు రాత్రి 7.26 గంటలకు చేరుకుంది. కోర్టు వద్ద నుంచి జిల్లా జైలుకు 20 నిమిషాలకు మించి పట్టదు. కానీ సుమారు రెండున్నర గంటలు పట్టింది. కోర్టు వద్ద ఎర్రిస్వామి పింక్ కలర్ షర్టు, బ్లాక్ ప్యాంట్‌తో కనిపించాడు. పోలీసులు జైలులోకి తీసుకెళ్లేటప్పుడు లుంగీతో కనిపించడం గమనార్హం.

'చలో అనంతపురం'పై నిర్బంధం

» ముందస్తు అరెస్టులు, నోటీసులు

» నేడు 'చలో'కు జిల్లాల నుంచి కదులుతున్న జర్నలిస్టులు

» ఎక్కడికక్కడ అణచివేత.. పోలీస్‌స్టేషన్లకు తరలింపు

» నేడు అనంతలో జర్నలిస్టుల ర్యాలీ..కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా

అనంతపురం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి)/కర్నూలు: 'ఆంధ్రజ్యోతి' అనంతపురం స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి నిరసనగా జర్నలిస్టు సంఘాలు పిలుపునిచ్చిన 'చలో అనంతపురం'పై అణచివేతకు పోలీసులు తెగబడ్డారు. గురువారం అనంతపురం చేరుకుని 'చలో'ను విజయవంతం చేయడానికి సిద్ధమవుతున్న జర్నలిస్టులపై నిర్బంధకాండను ప్రయోగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనవద్దంటూ పలు జిల్లాల్లో జర్నలిస్టులకు బుధవారం ముందస్తు నోటీసులను అందించారు. జర్నలిస్టు నాయకుల నివాసాల వద్ద రోజంతా పోలీసులు తిష్టవేశారు. ముందస్తు అరెస్టులతో కర్నూలు జిల్లాలో 'ఆంధ్రజ్యోతి'కి చెందిన పలువురు రిపోర్టర్లను ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. అనంతపురం జిల్లా రాప్తాడు వద్ద 18న నిర్వహించిన 'సిద్ధం' సభలో 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాలు దాడిచేసిన విషయం తెలిసిందే. దాడిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. జర్నలిస్టులు పెద్దఎత్తున ఈ ప్రదర్శనల్లో పాల్గొంటుండటం సర్కారును ఆందోళనకు గురిచేసింది. ఉద్యమాన్ని ఉధృతంచేస్తూ 'చలో అనంతపురా'నికి పిలుపునివ్వడం మరింతగా కలవరపెట్టింది. దీంతో 'చలో'ను భగ్నం చేయాలంటూ అన్ని జిల్లాల పోలీసు యంత్రాంగంపై ఒత్తిడి పెంచేసింది. మరోవైపు 'చలో అనంతపురం'లో పెద్దఎత్తున పాల్గొనేందుకు వివిధ జిల్లాలకు చెందిన జర్నలిస్టులు సన్నాహాలు చేసుకున్నారు. అటువంటి వారిని గుర్తించి పోలీసులు ఫోన్‌చేసి హెచ్చరించారు. మరికొందరిని 'పోలీస్ స్టేషన్‌కు రండి' అని పిలుస్తున్నారు. కర్నూలు జిల్లాలో పలుమండలాలకు చెందిన 'ఆంధ్రజ్యోతి' రిపోర్టర్లకు ఎస్ఐలు నోటీసులిచ్చి అనంతపురం వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశారు. దేవనకొండ 'ఆంధ్రజ్యోతి' రిపోర్టర్ నాగరాజు, పత్తికొండ 'ఆంధ్రజ్యోతి' రిపోర్టర్ రంగన్నలను అదుపులోకి తీసుకుని పోలీ స్‌స్టేషన్లకు తరలించారు. పత్తికొండ 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' రిపోర్టరు పక్కీరప్ప ఇంటికి వెళ్లి నోటీసులు ఇచ్చారు. ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష, కార్యదర్శులను హౌస్ అరెస్టు చేశారు. మంత్రాలయం 'ఆంధ్రజ్యోతి' రిపోర్టర్ జయరాజును స్టేషన్‌కు పిలిపించి నోటీసులు ఇచ్చారు.

'చలో'.. ఇలా...

అనంతపురం సిటీలోని సంగమేశ్ సర్కిల్ నుంచి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు గురువారం ఉదయం 10.30 గంటలకు ర్యాలీగా బయలుదేరతారు. ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని, దాడులు ఆపాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకొని భారీ ధర్నా చేపడతారు. ఈ ధర్నాలో జర్నలిస్టు సంఘాల రాష్ట్ర నాయకులు, ప్రజాస్వామికవాదులు, రాజకీయ నాయకులు, ప్రజా, విద్యార్థి, ఉద్యోగ, కార్మిక, యువజన సంఘాలు భాగం కానున్నాయి. ప్రజలకు ఎలాంటి కలిగించకుండా, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ర్యాలీ, ధర్నా చేపట్టాలని నిర్ణయించారు. కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపేందుకు పోలీసుల అనుమతి తీసుకున్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందు జనార్దన్, రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి, 'సామ్నా' రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మారావు, రమణారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివ, ఫొటో జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర నాయకులు సాంబశివరావు తదితరులు హాజరుకానున్నారు. కాగా, కడప, కర్నూలు జిల్లాల్లో ఏపీయూడబ్ల్యూజే నాయకులను నిర్బంధించడాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు తీవ్రంగా ఖండించారు.



అనంతపురం జిల్లా ఉరవకొండలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జర్నలిస్టులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నిరసన

విలేకరులపై దాడి హేయం

» రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టు సంఘాల ఆందోళన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

విలేకరులపైనా, మీడియా సంస్థలపైనా వైసీపీ మూకల దాడిని జర్నలిస్టు సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాలు తీవ్రంగా ఖండించాయి. అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన వైసీపీ సిద్ధం సభలో ముఖ్యమంత్రి జగన్ పాల్గొన్న సభలోనే 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేసిన విషయం తెలిసిందే. అలాగే, కర్నూలు జిల్లా మద్దికెర మండలంలో 'ఆంధ్రజ్యోతి' విలేకరి కె.వీరశేఖర్‌పైనా, అక్కడి ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపైనా వైసీపీ మూకలు దాడి చేశాయి. ఈ దాడులను నిరసిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో జర్నలిస్టు సంఘాలు ఆందోళనలు నిర్వహించాయి. కర్నూలులో వందలాదిమంది జర్నలిస్టులు మెరుపు ధర్నా, రాస్తారోకోలు చేశారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఏపీయూడబ్ల్యూజే నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి టీడీపీ, సీపీఐ, సీపీఎం, జనసేన, రాయలసీమ విద్యార్థి సంఘం, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్ తదితర ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు హాజరై సంఘీభావం తెలిపారు. రాస్తారోకో చేస్తున్న నిరసనకారులను పోలీసులు బలవంతంగా తోసివేయడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తొలి సభలోనే పత్రికలపై తన అక్కసు వెళ్లగక్కార విమర్శించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, పాణ్యం, ఆలూరు ఇన్‌చార్జిలు గౌరు చరిత, కోట్ల సుజాతమ్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడారు. కడపలో వైసీపీ మూకల దిష్టిబొమ్మను దహనం చేసే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దిష్టిబొమ్మను లాక్కునే ప్రయత్నంలో పోలీసులు, జర్నలిస్టుల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తత నెలకొంది. అనంతరం జర్నలిస్టులు, రాజకీయ పార్టీల నేతలు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. తిరుపతిలో నిరసన ప్రదర్శన చేశారు. తిరుపతి జర్నలిస్టు సంఘాల నేతలు ప్రసాద్, నరేంద్ర, మునిరాజ ఆధ్వర్యంలోనూ ఎస్వీయూలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట మీడియా ప్రతినిధులు ఆందోళన చేపట్టారు. సత్యవేడు నియోజకవర్గం కేవీబీపురంలో టీడీపీ శ్రేణులు కళ్లకు నల్ల గంతలు కట్టుకుని ప్రదర్శన నిర్వహించాయి. శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడులో టీడీపీ శ్రేణులు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని ప్రదర్శన నిర్వహించాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఉరవకొండ, గుంతకల్లు, చిలమత్తూరు, అగళి తదితర మండల కేంద్రాల్లో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

పాతాళానికి ప్రజాస్వామ్యం: అఖిలపక్ష నేతల ధ్వజం

రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పాతాళానికి తొక్కేసిందని, చొక్కాలు మడతపెట్టండని సాక్షాత్తూ ముఖ్యమంత్రే దాడులను ప్రోత్సహించడం అత్యంత హేయమని అఖిలపక్ష నేతలు విమర్శించారు. రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని ధ్వజమెత్తారు. గుంటూరులో ఏపీయూడబ్ల్యూజే, ఐజేయూ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నిరసన కార్యక్రమానికి తెలుగుదేశం, కాంగ్రెస్, సీపీఐ, బీజేపీ మద్దతు తెలిపాయి. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతోపాటు అన్ని పార్టీలు, అనుబంధ సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సంఘీభావం తెలిపారు. ఎస్పీ కార్యాలయం వరకూ భారీ ప్రదర్శన నిర్వహించి, ఎస్పీ తుషార్‌డూడీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు నక్కా ఆనందబాబు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పత్రికల గొంతు నొక్కాలని చూడడం దుర్మార్గమన్నారు. పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, సీపీఐ రాష్ట్ర నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు, బీజేపీ నేత వి.గంగాధర్, జర్నలిస్టు యూనియన్ నేతలు ఎస్.మీరా, భక్తవత్సలరావు, నిమ్మరాజు చలపతిరావు, ఎస్.రవికుమార్, గిరిధరకుమార్, పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణకు

ఎండీ రాధాకృష్ణ పరామర్శ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ పరామర్శించారు. అనంతపురం జిల్లాలో ఆదివారం వైసీపీ మూకల దాడిలో గాయపడిన శ్రీకృష్ణను మెరుగైన చికిత్స కోసం అపోలో ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. బుధవారం ఉదయం వేమూరి రాధాకృష్ణ ఆస్పత్రికి వెళ్లి శ్రీకృష్ణ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. దాడిలో తగిలిన గాయాల నొప్పులతో విపరీతంగా బాధపడ్డారని శ్రీకృష్ణ భార్య రజనీ వివరించారు. అపోలోకు తరలించి చికిత్స అందిస్తుండటంతో ప్రస్తుతం నొప్పులు తగ్గుముఖం పడుతున్నాయని చెప్పారు. ఆస్పత్రిలో మెరుగైన చికిత్స అందిస్తున్నారని, ఆందోళన చెందవద్దని రజనీకి ఎండీ రాధాకృష్ణ ధైర్యం చెప్పారు.

విలేకరులపై దాడులు సరికాదు: వెంకయ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పత్రికా కార్యాలయాలు, విలేకరులపై దాడులు సరికాదని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి' విలేకరులపై జరిగిన భౌతిక దాడులను దృష్టిలో ఉంచుకుని బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఇలాంటి దాడులు విఘాతమని తెలిపారు.

న్యాయ విచారణకు ఆదేశించాలి: అచ్చెన్న

టెక్కలి, ఫిబ్రవరి 21: రాప్తాడు సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్ట్ శ్రీకృష్ణపై, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై దాడి... జగన్ గూండాల పనే అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు శ్రీకాకుళంలో ఆరోపించారు. 'ఈ దాడులను టీడీపీ ఖండిస్తోంది. రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న వరుస దాడులపై కేంద్రం దృష్టికి తీసుకువెళ్తాం. వరుస ఘటనలపై జ్యుడీషియల్ ఎంక్వైరీ వేయాలి' అని అచ్చెన్న డిమాండ్ చేశారు. కాగా, ఈనాడు, ఆంధ్రజ్యోతిపై వైసీపీ రౌడీ మూకలు దాడులు చేయడం దుర్మార్గమని, మీడియాపై దాడుల్ని ప్రోత్సహిస్తూ, జగన్‌రెడ్డి ప్రజాస్వామ్యాన్ని చెరబట్టాడని టీడీపీ నేత వర్ల రామయ్య ధ్వజమెత్తారు.

జగన్‌కు ఓటమితో పరాభవమే: యనమల

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): 'పత్రికా స్వేచ్ఛను హరించే ప్రయత్నం చేస్తున్న జగన్‌కు ఓటమితోపాటు పరాభవం ఖాయం. అది తెలిసే ఉద్దేశపూర్వకంగా వైసీపీ రౌడీ మూకలు మీడియాపై దాడులకు తెగబడుతున్నాయి' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. బుధవారం ఆయన ఓ ప్రకటన చేశారు. 'వాస్తవాలు ప్రజలకు చేరవేసే మీడియా అంటేనే తాడేపల్లి పునాదులు కదిలిపోతున్నాయి. అందుకే ప్రతిపక్ష పార్టీలు, మీడియాపై యథేచ్ఛగా దాడులు చేయిస్తున్నారు. నిరంకుశ పాలనతో విచ్చలవిడిగా చేస్తున్న అవినీతి, దోపిడీ, కబ్జాలు, ల్యాండ్, శాండ్, వైన్, మైన్, రేప్‌లు, హత్యలను వెలుగులోకి తెస్తున్నందునే మీడియాపై ఫ్యాక్షన్ మనస్తతత్వంతో దాడులకు పురిగొలుపుతున్నారు. ప్రజాగళం వింటే వణికిపోతున్న జగన్‌రెడ్డికి ప్రజా కోర్టులో ఓటమి తీర్పు తప్పదు' అని యనమల హెచ్చరించారు.

జగన్ ది నియంత పాలన: మాణిక్కం ఠాగూర్

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి), హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 21: ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగన్ నియంత పాలన సాగిస్తున్నారని ఏపీ కాంగ్రెస్ ఇంచార్జ్ మాణి క్కం ఠాగూర్ మండిపడ్డారు. ఏపీలో మీడియాపై దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. 'ఏపీలో మీడియాపై వైసీపీ శ్రేణుల దాడులు దురదృష్టకరం. జర్నలిస్టులపై దాడులకు జగన్ ప్రభుత్వం మద్దతు తెలిపేలా వ్యవహరించడం సరికాదు. జగన్ నాలుగున్నర ఏళ్లుగా నియంతలా వ్యవహరిస్తున్నారు' అని మాణి క్కం ఢిల్లీలో అన్నారు. ఇక, సీఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందు కే సిద్ధం సభల పేరుతో బల ప్రదర్శనకు దిగుతున్నారని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ విమర్శించారు. వైసీపీ అరాచకాలను బయట పెడు తున్న మీడియాపై దాడులు చేయిస్తున్నారని, ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై, ఈనాడు కార్యాలయంపై దాడులు అందులో భాగమేనని అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



నిరసన తెలియజేస్తున్న జర్నలిస్టు సంఘాల నేతలు

జర్నలిస్టులపై దాడులు మానకుంటే

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

● ఏపీయూడబ్ల్యూజే నేతలు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 21: జర్నలిస్టులపై భౌతికదాడులకు పాల్పడటం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని, అలా చేసే ప్రభుత్వాల మనుగడ కష్టమని ఏపీయూడబ్ల్యూజే నేతలు హెచ్చరించారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై పాశవిక దాడి, కర్నూలులో ఈనాడు పత్రిక కార్యాలయంపై రాళ్లతో దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆయా ఘటనలను ఖండిస్తూ యూనియన్ అర్బన్ కమిటీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్ వద్ద బుధవారం నిరసన ప్రదర్శన జరిగింది. యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చందు జనార్ధన్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులను ఆపాలని లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జర్నలిస్టులపై దాడులు చేసే సంస్కృతి ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమిస్తుందని సీనియర్ నేత ఎస్‌కే బాబు ఆవేదన వ్యక్తం చేశారు. అర్బన్ అధ్యక్షుడు చావా రవి, సామ్నా రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి డి.నాగరాజు, ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు విజయభాస్కర్, నారాయణ, సామ్నా నగరాధ్యక్షుడు ఎంవీ సుబ్బారావు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో గవర్నర్ పాలన విధించాలి

రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ కార్యకర్తల పాశవిక దాడి, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై దాడిని ఆంధ్రా పెన్షనర్ల పార్టీ తీవ్రంగా ఖండించింది. నిందితులను అరెస్టు చేసి శిక్షించాలని పార్టీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పాలంకి సుబ్బరాయన్, బి.పెద్దన్న గౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉద్యోగులు, జర్నలిస్టులపై వైసీపీ రౌడీల దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. రాబోయే ఎన్నికలు గవర్నర్ పర్యవేక్షణలో నిర్వహించాలన్నారు. లేదంటే ఎన్నికల్లో వైసీపీ నేతల తీవ్రమైన దాడులు, అరాచకాలు పాల్పడే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఓటమి భయంతోనే దాడి: పోతిన

వన్‌టౌన్: వైసీపీకి వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించి మీడియా ప్రతినిధులపై దాడులు చేయిస్తున్నారని జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేష్ అన్నారు. బుధవారం వన్‌టౌన్‌లోని తన కార్యాలయం నుంచి ఆయన వీడియో సందేశం విడుదల చేశారు. ఆంధ్రజ్యోతి, ఈనాడు విలేకరులపై వరుస దాడులు జరగడాన్ని ఖండించారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న వైసీపీకి రాబోయే ఎన్నికలలో ప్రజలు తప్పక గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

అసహనంతోనే వైసీపీ దాడులు

రాప్తాడులో ఆంధ్రజ్యోతి విలేకరిపై, కర్నూలులో ఈనాడు దినపత్రిక కార్యాలయంపైన ఎమ్మెల్యే అనుచరులు దాడి చేయడాన్ని ఎస్‌యూసీఐ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి బీఎస్ అమర్‌నాథ్ ఒక ప్రకటనలో ఖండించారు. అధికార వైసీపీ అసహనం ఈ దాడులను ప్రస్ఫుటం చేస్తుందన్నారు. ప్రజలు అసత్య, అర్ధసత్యాలతో పక్కదారి పడుతుండగా సాధారణ విలేకరుల దాడులకు గురవుతున్నారన్నారు.


మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శిస్తున్న తెలుగురైతు నేతలు

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

విద్యాధరపురం, ఫిబ్రవరి 21: జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, అరాచక శక్తులు రాజ్యమేలుతున్నాయని రాష్ట్ర తెలుగురైతు ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర, రాష్ట్ర తెలుగురైతు ఉపాధ్యక్షుడు గద్దె ప్రసాద్, జిల్లా తెలుగురైతు ఉపాధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు అన్నారు. ఒంగోలులో రాష్ట్ర తెలుగురైతు అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డిపై దుండగులు చేసి దాడిని వారు ఖండించారు. ఒంగోలు సంఘమిత్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందన్నారు. సీఎం స్వయంగా చేతులు మడతపెట్టండని కార్యకర్తలకు బహిరంగంగా పిలుపునిస్తుంటే ఇలాంటి ఘటనలు ఎక్కువవుతాయే తప్ప తగ్గుతాయా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో జరిగే అరాచక పాలనకు పెట్టుబడి పెట్టడానికి ఒక్క కంపెనీ రాకపోగా టీడీపీ హయాంలో వచ్చిన కంపెనీలు పక్క రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. మీడియా, ప్రతిపక్ష నేతల పరిస్థితి ఇలా ఉంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. జగన్‌రెడ్డి అరాచక పాలనకు చరమగీతం పాడాలంటే సైకో పోవాలి-సైకిల్ రావాలన్న నినాదంతో ప్రజలు టీడీపీ-జనసేనకు మద్దతు పలకాలని కోరారు.

న్యాయస్థానం నిర్ణయంతో


లక్షలాది మంది విద్యార్థులకు న్యాయం

ధర్నాచౌక్, ఫిబ్రవరి 21: ఎస్‌జీటీ పోస్టులకు డీఈడీ అభ్యర్థులను అనుమతించవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం జారీ చేసిందని జైభీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ తెలిపారు. గాంధీనగర్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్ లో ఆయన మాట్లాడారు. ఎస్‌జీటీ టీచర్ పోస్టులకు బీఈడీ అభ్యర్థులను కూడా అనుమతించడం సుప్రీంకోర్టు నిబంధనలకు వ్యతిరేకమని, బీఈడీ అభ్యర్థులను అనుమతించడం వల్ల లక్షలాది డీఎడ్ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారన్నట్టుగా హైకోర్టు వ్యాఖ్యానించిందన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ జీవోపై స్టే విధిస్తూ ఆదేశాలిచ్చారన్నారు. న్యాయస్థానం నిర్ణయంతో 6 లక్షల మందికి పైగా విద్యార్థులకు న్యాయం జరిగిందన్నారు. ఎన్నికల స్టంట్‌ను ప్లే చేస్తున్న సీఎం జగన్‌కు హైకోర్టు స్టేతో షాకిచ్చిందన్నారు. జగన్ లాంటి వ్యక్తిని సీఎం అని పిలవడానికి సిగ్గుగా ఉందన్నారు. వచ్చేఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెబుతారన్నారు.


ఉద్యోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత కంటి పరీక్షలు

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 21: కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథక సమన్వయకర్త సీహెచ్ శ్రీకాంత్ అధ్యక్షతన ఆటోనగర్‌లోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయంలో బుధవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. సెంటర్ ఫర్ సైట్ ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉచిత వైద్య శిబిరంలో 156 మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నేత్ర పరీక్షలు చేశారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రస్తుతం కార్యాలయాల్లో కంప్యూటర్లు, మొబైల్స్ వినియోగం ఎక్కువగా ఉన్నందున అవి కంటి చూపుపై ప్రభావితం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యోగులకు సూచించారు.





లబ్బీపేట, ఫిబ్రవరి 21: విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఎంచుకుని అందుకనుగుణంగా చదువులో రాణించాలని చెన్నై హిందూ ఎడిటర్ వైష్ణా రాయ్ అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాల 41వ కళాశాల దినోత్సవం ఘనంగా నిరహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళుతున్నారని, ఎంచుకున్న రంగంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా ధైర్యంగా ముందుకు వెళ్లాలన్నారు. అలాగే మనతో ఉన్నవారిలో తక్కువ స్థాయిలో ఉన్నవారికి చేయుతనివ్వాలని, సహాయం చిన్నదైనా పొందినవారికి పెద్దదన్నారు. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎంతో అభివృద్ధి సాధిస్తున్నారని, విద్యార్థులు కూడా ఉద్యోగాలే కాకుండా పారిశ్రామికంగా ఎదిగేందుకు ముందుకు రావాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కళాశాల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. సిద్ధార్థ అకాడమీ ప్రెసిడెంట్ డాక్టర్ సి.నాగేశ్వరరావు, సెక్రటరీ పి.లక్ష్మణరావు, ట్రెజరర్ ఎస్.వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఎన్.లలిత ప్రసాద్, కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.కల్పన పాల్గొన్నారు.

విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఎంచుకుని రాణించాలి


జ్యోతి వెలిగిస్తున్న వైష్ణారాయ్

చెన్నై హిందూ ఎడిటర్ వైష్ణా రాయ్ ● ఘనంగా సిద్ధార్థ మహిళా కళాశాల దినోత్సవం

ఎన్నికల షెడ్యూలు వచ్చేవరకూ

మార్పులు చేర్పులు

● కలెక్టర్ ఢిల్లీరావు


రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

వన్‌టౌన్, ఫిబ్రవరి 21: ఎన్నికల షెడ్యూలు వచ్చేవరకు ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పులకు అవకాశముందని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఎన్నికల షెడ్యూలు వచ్చిన తరువాత తొలగింపులకు, చేర్పులకు అవకాశం ఉండదన్నారు. ఫారం-7, ఫారం-6ను జిల్లా ముఖ్య ఎన్నికల అధికారిగా ఉన్న కలెక్టర్ అనుమతితోనే పరిష్కరిస్తారన్నారు. ఇదే సమయంలో పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను ప్రస్తావించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు చెప్పిన అంశాలను ఆయన పరిగణనలోకి తీసుకుని సానుకూల చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ సమాధానాలతో రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. బీఎస్పీ నుంచి ఎం వినోద్‌కుమార్, సీపీఎం నుంచి డీవీ కృష్ణ, కాంగ్రెస్ నుంచి పి ఏసుదాసు, టీడీపీ నుంచి వై రామయ్య, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఏ రంగంలోనైనా నైపుణ్యతకే ప్రాధాన్యత


ఒప్పందం చేసుకుంటున్న ప్రతినిధులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 21: ఏ రంగంలోనైనా నైపుణ్యానికే ప్రాధాన్యముందని మంత్రి జోగి రమేష్ అన్నారు. సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ (ఎస్ఈఈడీఏపీ) ఆధ్వర్యంలో బుధవారం తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆసక్తి ఉన్నరంగాల్లో నైపుణ్య శిక్షణ ఉచితంగా ఇచ్చి పేరున్న సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించడంలో ఎస్ఈఈడీఏపీ కృషి అభినందనీయమన్నారు. ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) మాట్లాడుతూ మానవ వనరులున్న దేశాల్లో భారత దేశం మిన్నగా ఉండబోతుందని చైనాను అధిగమించనున్నదన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ 2 దశాబ్దాల క్రితం రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కారణంగా పేదలు చదువుకుని ఉపాధి పొందుతున్నారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ మాట్లాడుతూ కొత్త టెక్నాలజీ ఆవిష్కరణలపై యువత శిక్షణ పొందాలని సూచించారు. అనంతరం మేథా లాంగ్వేజ్ థియేటర్, వాద్వాని ఫౌండేషన్ టాటా ట్రస్ట్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రభుత్వ సలహాదారుడు చల్లా మధుసూదనరెడ్డి, ఎస్ఈఈడీఏపీ చైర్మన్ శాంప్రసాదరెడ్డి, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రభుత్వ సలహాదారుడు జి.శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధనంజయుడిని అధికారికంగా స్మరించుకోవాలి

● ప్రభుత్వానికి తొలి తెలుగు దివ్వె విజ్ఞప్తి


ధనంజయుడికి నివాళులర్పిస్తున్న లక్ష్మీ తులసీ దంపతులు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 21: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు తొలి తెలుగు దివ్వె (తెలుగు మూలాల అధ్యయన సంఘం) ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఘనంగా జరిగాయి. తొలి తెలుగు శాసన కర్త ముత్తురాజు ధనంజయుడి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీఎల్ఎన్.రాజు, గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీ తులసీ మాట్లాడుతూ ధనుంజయుడికి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నివాళులర్పించాలని విజ్ఞప్తి చేశారు. సంస్థ ప్రధానకార్యదర్శి బి.ఆంజనేయరాజు, పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీ ఆవరణలో ముత్తురాజు ధనంజయుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలన్నారు. తొలి తెలుగు శాసనం గురించి ఉన్నత విద్య పాఠ్య పుస్తకాల్లో ప్రచురించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సీఐఐ జోన్ కార్యవర్గం ఎన్నిక

విజయవాడ: సీఐఐ విజయవాడ జోన్ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. చాప్టర్ ఛైర్మన్‌గా డీవీ రవీంద్రనాథ్, వైస్ ఛైర్‌పర్సన్‌గా డాక్టర్ వి.నాగలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం 2024-25 వరకు పదవిలో ఉంటుంది. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

షూటింగ్‌లో ఉమామహేష్‌కు రజతం



గౌహతిలో జరుగుతున్న ఖేలో ఇండియా వర్శిటీ గేమ్స్‌లో నగరానికి చెందిన మద్దినేని ఉమామహేష్ కేఎల్ వర్శిటీ నుంచి ప్రాతినిధ్యం వహించి షూటింగ్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పురుషుల షూటింగ్ విభాగంలో రజతంతో బుధవారం సత్తా చాటాడు. వర్శిటీ యాజమాన్యం, కోచ్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావులు ఉమామహేష్‌ను అభినందించారు.

వైసీపీ ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్

వన్‌టౌన్: వైసీపీ రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డిని పెద కాకానిలోని ఆయన కార్యాలయంలో విజయవాడ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత జలీల్‌ఖాన్ కలిశారు. మంగళవారం జలీల్‌ఖాన్ పదిమంది అనుచరులతో కలిసి వెళ్లి ఎంపీని కలిసి వైసీపీ పశ్చిమ సీటు తనకు ఇవ్వాలని కోరినట్టు తెలిసింది. అయితే జలీల్‌ఖాన్‌కు సీటు ఇవ్వడానికి అయోధ్య రామిరెడ్డి నిరాకరించినట్లు సమాచారం.

ఫైనాన్స్ కంపెనీ ఎదుట రుణగ్రహీత ఆందోళన

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 21: ఎన్‌వోసీ కోసం వెళ్లిన రుణ గ్రహీతను ముప్పతిప్పలు పెట్టిన ఒక ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ మేనేజర్ వైఖరికి నిరసనగా రుణ గ్రహీత కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. రుణ గ్రహీత ఆందోళన విషయం తెలుసుకుని వెళ్లిన పాత్రికేయుడిపై దౌర్జన్యంగా ఫోన్ తీసుకుని ఫొటోలు, వీడియోలు తీసి ఆ మేనేజర్ దౌర్జన్యానికి పాల్పడిన సంఘటన బుధవారం జగ్గయ్యపేటలో జరిగింది. నందిగామకు చెందిన చిరుమామిళ్ల సుబ్బారావు అనే రైతు తాను తీసుకున్న వెహికల్ రుణం చెల్లించాడు. ఎన్‌వోసీ కోసం కోదాడ రోడ్డులోని ఫైనాన్స్ కంపెనీకి వెళ్లాగా డబ్బులు కట్టాలని ఒత్తిడి చేయటంతో ఆయన కార్యాలయం ఎదుట బైఠాయించారు.

ఉద్యోగాలిప్పిస్తానని మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

చిట్టినగర్, ఫిబ్రవరి 21: ఉద్యోగాలిప్పిస్తానని చెప్పి ఇద్దరి నుంచి రూ.6లక్షల 40వేలు తీసుకొని మోసగించిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. నర్సాపురం సీతాపురంలో గడ్డం రోజారాణి కుటుంబంతో నివాసం ఉంటుంది. నర్సాపురంలోని ఓ ప్రైవేట్ హాస్పటల్‌లో స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది. ఆమె 2017-19లో పెనుగొండ గురుకుల పాఠశాలలో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా కొన్నాళ్లు పనిచేసింది. ఆ సమయంలో సెక్యూరిటీ మేనేజర్‌గా పనిచేసే పవన్‌కుమార్ పరిచయమయ్యాడు. తనకు గవర్నమెంట్ హాస్పటల్‌లో స్టాఫ్ నర్సుగా ఉద్యోగం ఇప్పిస్తానని, చాలామంది రాజకీయ నేతలతో పరిచయాలున్నాయని నమ్మించాడు. అతని మాయమాటలు నమ్మిన రోజారాణి ఆమెతోపాటు తమ్ముడికి ఉద్యోగం కావాలని చెప్పగా ఇద్దరికి రూ.6లక్షలవుతాయని, తనకు మరో రూ.50వేలు ఖర్చవుతుందన్నాడు. ముందుగా ఇద్దరు రూ.40వేలు కట్టమని చెప్పడంతో రోజారాణి పవన్‌కుమార్ చెప్పిన అడ్రస్ జక్కంపూడి కాలనీకి వచ్చి డబ్బులిచ్చి వెళ్లింది. కొన్నిరోజుల తరువాత ఉద్యోగాలొచ్చాయి.. మరో రూ.లక్షా 35వేలు కట్టాలని చెప్పడంతో ఆమె ఫోన్ పే చేసింది. సెప్టెంబర్‌లో 2023లో ఇద్దరి ఉద్యోగాలు వచ్చాయని మిగిలిన సొమ్ము రూ.4లక్షల 65వేలు కట్టాలని చెప్పడంతో తమ్ముడు అన్నతో కలిసి రోజారాణి కారులో బస్టాండ్ వద్దకు వచ్చి డబ్బులిచ్చారు. అనంతరం ఉద్యోగాల గురించి పలుమార్లు అడుగగా ముఖం చాటేశాడని, ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఉంగుటూరు, ఫిబ్రవరి 21: రైలునుంచి ప్రమాదవశాత్తూ జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం తెల్లవారుజామున పెద అవుటపల్లి రైల్వే గేటు సమీపంలో జరిగింది. ఏలూరు రైల్వే ఎస్సై డి.నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు రైల్వే స్టేషన్ పరిధిలోని పెద అవుటపల్లి రైల్వేగేటు సమీపంలో గుర్తు తెలియని 60-65 ఏళ్ల వయసున్న వ్యక్తి రైలు ప్రమాదంలో మృతిచెంది ఉండటాన్ని పెదఅవుటపల్లి కీమాన్ గోవాడ వెంకటేశ్వరరావు బుధవారం ఉదయం గమనించి స్టేషన్ మాస్టర్‌కు తెలపగా ఆయన ఏలూరు రైల్వే ఎస్సై డి.నరసింహారావుకు సమాచారమిచ్చారు. వెంటనే రైల్వే పోలీస్ విజయ్‌చంద్రతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై పట్టాలపక్కన పడివున్న మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఛిద్రమై ఉండటంతో పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభ్యంకాలేదు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచామని, కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించామని రైల్వే ఎస్సై తెలిపారు.

‘నా సేన కోసం నావంతు’


విరాళాల సేకరణలో శంకర్, రాజానాయుడు

భవానీపురం, ఫిబ్రవరి 21: రానున్న ఎన్నికల్లో డబ్బులు తీసుకుని ఓట్లు వేసే చట్టవ్యతిరేక చర్యలకు తిలోదకాలివ్వాలనే ఉద్దేశంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిలుపులో భాగంగా 41వ డివిజన్‌లోని ఆశ్రమం రోడ్డులో నా సేన కోసం-నా వంతును కృష్ణాజిల్లా ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ సమ్మెట రాజానాయుడు బుధవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా జనసేన సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బాడిత శంకర్ పాల్గొన్నారు. పార్టీకి విరాళంగా ఆన్‌లైన్ పేమెంట్‌ను ప్రారంభిస్తూ ప్రజల భవిష్యత్ కోసం జనసేన పనిచేస్తుందని నేతలు,కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం పనిచేయాలన్నారు. పార్టీ కో-కన్వీనర్ కప్పిరెడ్డి సూర్యనారాయణ మూర్తి నగర ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్, పవన్ మహేంద్ర, సురేష్, శివశంకర్, పగడాల సుబ్బారావు, కళ్ల హరీష్ పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా

షాపుల నిర్వహణ

● లాడ్జీలో అసాంఘిక కార్యకలాపాలు

● లక్షలాది రూపాయల బకాయిలు

● పట్టించుకోని అధికారులు


దేవస్థానానికి చెందిన లాడ్జీ

వన్‌టౌన్, ఫిబ్రవరి 21: దేవదాయశాఖ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా గవర్నరుపేట పెద్దబొట్ల వారి వీధిలోని శ్రీవిఘ్నేశ్వర రమా సహిత సత్యనారాయణస్వామి దేవస్థానానికి చెందిన షాపులను పలువురు వ్యాపారులు నిర్వహించుకుంటున్నారు. షాపులతో పాటు లాడ్జిలో అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. అంతేకాక వ్యాపారులు లక్షలాది రూపాయలు బకాయి పడ్డారు. అధికారులు పట్టించుకోపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

వన్‌టౌన్ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)కు అనుబంధంగా ఉన్న శ్రీ విఘ్నేశ్వర రమా సహిత సత్యనారాయణస్వామి దేవస్థానానికి గవర్నరుపేట పెద్దబొట్ల వారి వీధిలో జీ+1భవనం ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో 11 షాపులు, పై అంతస్తులో లాడ్జి నిర్వహిస్తున్నారు. ఈ భవన సముదాయాన్ని రామవరప్పాడు రింగ్ సెంటర్‌కు చెందిన వెల్లంకి సంపత్ సుమారు పదేళ్ల క్రితం వెల్లంకి వినయ్ పేరుతో నెలకు రూ.60వేలు దేవస్థానానికి చెల్లించేలా లీజుకు తీసుకున్నాడు. తరువాత ఆయన వేరే వ్యాపారులకు సబ్‌లీజ్‌కిచ్చి వారి నుంచి రూ.4 నుంచి రూ.10లక్షలు వసూలు చేశాడు. వెల్లంకి సంపత్ అనారోగ్యంతో చనిపోవడంతో ఆయన కుమారుడు వెల్లంకి వినయ్ ప్రస్తుతం దుకాణంలోని వ్యాపారుల నుంచి అద్దెలు వసూలు చేసుకునేవాడు. ప్రస్తుతం ఆయన విదేశాలకు వెళ్లడంతో దుకాణాదారులు ఈవోకు అద్దెలు చెల్లిస్తున్నారు. దుకాణాదారులు ఇంకా దేవస్థానానికి రూ.6 లక్షల వరకు బకాయి ఉన్నట్టు సమాచారం. ఇదిలా ఉంటే లాడ్జిలో అసాంఘిక కార్యకలపాలు జోరుగా సాగుతున్నాయి. ఈ వ్యవహారంపై పలువురు స్థానికులు, వ్యాపారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. లాడ్జి నిర్వాహకుడికి అధికారపార్టీ ఎమ్మెల్యేల అండదండలుండడంతో చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ఫిర్యాదు చేసిన వారిని లాడ్జి నిర్వాహకుడు బెదిరిస్తున్నట్టు తెలుస్తోంది. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా షాపులు, లాడ్జి నిర్వహిస్తున్న వారి నుంచి కిందస్థాయి అధికారులు పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం: ఇన్‌చార్జి ఈవో లోకేశ్వరి

అద్దెదారులు బకాయిలు చెల్లించాలని లేకుంటే షాపులు స్వాధీనం చేసుకుంటామని వారం క్రితం నోటీసులిచ్చినట్టు దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.లోకేశ్వరి ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఇదే విషయాన్ని పై అధికారులకు కూడా తెలియజేస్తామన్నారు. మొత్తం బకాయి రూ.6లక్షల వరకు ఉంటుందని ఆమె చెప్పారు.


విద్యార్థినులను అభినందిస్తున్న ఏజీఎం

నగర విద్యార్థినులకు జాతీయ ట్రోఫీ

ధర్నాచౌక్: పురుషులతో పాటు మహిళలు అన్ని రంగాలు, క్రీడల్లోనూ రాణించగలరని నగరానికి చెందిన బాలికలు నిరూపించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయ టైక్వాండో మెగా టోర్నీలో 'రుద్రమదేవీ ట్రోఫీ'ని కరెన్సీనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థినులు సాధించారు. ట్రోఫీ గెలిచిన విద్యార్థినులు హాసిని, అమూల్య, శ్రీనిఖిత, మోహిత్‌ను ఏజీఎం ఎం.మురళీకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత పొట్లూరి, ఆర్ఐ.వీ నరేంద్ర బుధవారం అభినందించారు. తమ పాఠశాలలో విద్యతోపాటు క్రీడలను ప్రోత్సహిస్తామన్నారు. విద్యార్థినులు మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

95 డిటోనేటర్స్ స్వాధీనం

» మావోయిస్టులకు పేలుడు సామగ్రి అందిస్తున్న ఇద్దరి అరెస్టు

చింతూరు, ఫిబ్రవరి 21: మావోయిస్టులకు పేలుడు సామగ్రి తరలిస్తున్న ఇద్దరిని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపిన వివరాలు.... 30వ నెంబరు జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఒడిసా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా అనంతపల్లికి చెందిన నక్కా దావీదు అలియాస్ డేవిడ్ రాజు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పట్నంపారాకు చెందిన భీమాల్ విశ్వాస్ అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా పేలుడు సామగ్రి లభ్యమైంది. మావోయిస్టులకు ఇవి చేరవేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్న వీరు తెలంగాణ రాష్ట్రం నుంచి చింతూరు మండలం మీదుగా తరలిస్తుండగా పట్టుకున్నామని ఏఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి 95 డిటోనేటర్స్, 15 మీటర్ల ఫ్యూజ్ వైర్, 190 జెలిటిన్ స్టిక్స్, మావోయిస్టులు రాసి ఇచ్చిన పేలుడు సామగ్రి లిస్టు, రూ. 13 వేల నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

మావోయిస్టు పార్టీ దళ సభ్యుడి లొంగుబాటు

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసుల ఎదుట మావోయిస్టు పార్టీ దళ సభ్యుడితో పాటు మిలిషియా సభ్యుడు లొంగిపోయినట్టు చింతూరు ఏఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుక్మా జిల్లా, గచ్చనపల్లికి చెందిన పద్దం అడమయ్య 2014లో మావోయిస్టు విధానాలకు ఆకర్షితుడయ్యాడు. ప్రస్తుతం అడమయ్య గొల్లపల్లి ఎల్ఓఎస్ (లోకల్ ఆర్గనైజేషన్ స్క్వాడ్) సభ్యుడిగా క్రిష్టారం పరిధిలో పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన కణతి లచ్చ 2019 నుంచి 2021 వరకు మిలిషియా సభ్యుడిగా వ్యవహరించాడు. వివిధ కారణాలతో వీరిద్దరూ లొంగిపోవడంతో వారిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు.

టీటీడీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి

» అమిత్‌షాకు రామచంద్రయాదవ్ లేఖ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 21: టీటీడీలో జరుగుతున్న అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలని భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపీ) అధినేత బీ రామచంద్ర యాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ధార్మిక సంస్థ అయిన టీటీడీలో అక్రమాలు, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, తిరుమలలో అన్యమతం విస్తృతంగా వ్యాపించిందని, నిబంధనలకు విరుద్ధంగా చాలా మంది అన్యమతస్తులు పనిచేస్తున్నారని, శ్రీవారికి నైవేద్యం సరిగా పెట్టడంలేదని, గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నారని లేఖలో పేర్కొన్నారు.

డయేరియా మరణాలు ప్రభుత్వ హత్యలే

» టీడీపీ నిజనిర్ధారణ కమిటీ


డయేరియా మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న టీడీపీ నిజనిర్ధారణ కమిటీ

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): డయేరియా మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని టీడీపీ నిజనిర్ధారణ కమిటీ తేల్చి చెప్పింది. గుంటూరులోని డయేరియా ప్రభావిత ప్రాంతంలో బుధవారం టీడీపీ నిజనిర్ధారణ కమిటీ పర్యటించింది. కమిటీ సభ్యులైన మాజీ మంత్రులు నక్కా ఆనందబాబు, కన్నా లక్ష్మీనారాయణ, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ సహా పలువురు టీడీపీ నేతలు డయేరియా మృతుల బాధిత కుటుంబాలను పరామర్శించారు. తిరుమలాచారి కాలనీ చెందిన ఓబులు, రైలుపేటకు చెందిన షేక్ ఇక్బాల్, శ్రీనగర్‌కి చెందిన గాజుల సూర్యనారాయణ, మాలంపాటి శంకర్, మద్దెల పద్మ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బలవన్మరణాలకు పాల్పడవద్దు: వీఆర్‌ఓల సంఘం

విజయవాడ (వన్‌టౌన్), ఫిబ్రవరి 21 : ఉద్యోగ రీత్యా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఒత్తిడికి గురై వీఆర్‌ఓలు బలవన్మరణాలకు పాల్పడవద్దని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోన ఆంజనేయకుమార్, గుడిసె అనుపమ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. రీసర్వే, రిజిస్ట్రేషన్, బూత్‌లెవల్ అధికారుల పనులు, ఇంకా ఫ్రంట్ లైన్ వర్క్‌లు తదితరాలతో పాటు ప్రభుత్వ పథకాల అమలులో వీఆర్‌ఓలు నిత్యం ఎంతో ఒత్తిడికి గురవుతున్నారన్నారు.

జగన్‌ను చూస్తే గుర్తొచ్చేది గొడ్డలే

- అమర్నాథ్ నోరు అదుపులో పెట్టుకో ఎక్కువ మాట్లాడితే తాట తీస్తాం
- దమ్ముంటే ఏం పీకావో చర్చకు రా..!: పిల్లి మాణిక్యాలరావు

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబును చూస్తే అభివృద్ధి గుర్తుకు వస్తే సీఎం జగన్మోహన్‌రెడ్డిని చూస్తే గొడ్డలి గుర్తుకు వస్తుందని టీడీపీ అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు వ్యాఖ్యానించారు. జగన్ గొడ్డలి సంస్కృతికి నిదర్శనం అంటూ ఆయన బుధవారం ఇక్కడ ఒక గొడ్డలి తెచ్చి విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు. తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన ఈ సమావేశం నిర్వహించారు. 'జగన్‌ది గొడ్డలి సంస్కృతి. రక్తపు సంస్కృతి. సొంత నాన్నను పైన, చిన్నాన్నను కింద లేపేసిన మనుషులు వాళ్లు. తమ రక్తపు సంస్కృతిని ప్రతి రోజూ రాష్ట్రంలో ఏదో ఒక మూల ప్రదర్శిస్తూ ప్రజలను భయభ్రాంతులను చేయాలని చూస్తుంటారు. మా టీడీపీది ప్రేమ ఆప్యాయతల సంస్కృతి. కడుపుకు అన్నం పెట్టే సంస్కృతి' అని పిల్లి వ్యాఖ్యానించారు. టీడీపీ యువ నేత లోకేశ్‌పై మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలపై మాణిక్యాలరావు మండిపడ్డారు. 'అనకాపల్లిలో గుడివాడ అమర్‌నాథ్ గుడ్డు పగిలితే వేరే చోటకు మార్చేశారు. ఉన్నచోట గెలిచే దిక్కు లేనివాడు కూడా లోకేశ్ గురించి మాట్లాడేవాడా? లోకేశ్‌ను తిడితే కరకట్ట కమల్‌హాసన్‌ను తెచ్చుకొన్నట్లు తనను కూడా తెచ్చి మళ్లీ అనకాపల్లిలో పెడతాడని అమర్‌నాథ్ భ్రమ పడుతున్నాడు. కరకట్ట కమల్‌హాసన్ సొంత దొంగల ముఠాలో సభ్యుడు కాబట్టి జగన్ మళ్లీ తెచ్చుకొన్నాడు. నీకు అంత సీన్ లేదు. అమర్ నోరు అదుపులో పెట్టుకొంటే మంచిది. ఎక్కువ మాట్లాడితే తాట తీస్తాం. దమ్ముంటే నువ్వు ఏం పీకావో చర్చకు రా... మా పార్టీ నుంచి నేను వస్తాను. రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు మా హయాంలో ఏం తెచ్చానో చెబుతాను. నీ హయాంలో నువ్వు ఏం తెచ్చావో చేతనైతే చెప్పు' అని మాణిక్యాలరావు సవాల్ విసిరారు.

జగన్ సర్కారును బర్తరఫ్ చేయాలి: రఘురామ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జగన్ సర్కారును బర్తరఫ్ చేసి, గవర్నర్ పాలనను విధించాలని వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజు కోరారు. పాలకుల హింసాకాండ దిన దిన అభివృద్ధి కాదు.. క్షణక్షణం అభివృద్ధి చెందుతోందని ఆక్రోశించారు. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా రఘురామరాజు బుధవారం మీడియాతో మాట్లాడారు. నిజాయితీగా, శాంతియుత వాతావరణంలో జగన్ సర్కారు ఎన్నికలను నిర్వహించగలదన్న నమ్మకం తనకు లేదన్నారు. రాప్తాడులో వైసీపీ నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో కొంతమంది అల్లరిమూకలు ఫొటో జర్నలిస్టుపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. అలాగే, ఈనాడు దినపత్రిక రోజుకో నిజాన్ని ప్రజల దృష్టికి తీసుకువచ్చారన్న కక్షతోనే ఎమ్మెల్యే అనుచరులు ఆ పత్రిక కార్యాలయంపై దాడి చేశారని తెలిపారు. జగన్ సర్కారు స్పాన్సర్ చేయకపోతే ఇటువంటి దాడులు జరగవన్నారు. ఈ నేపథ్యంలో సజావుగా ఎన్నికలు నిర్వహించాలంటే, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఏపీ గవర్నర్‌కు ఒక లేఖ రాశారు.

మేనిఫెస్టోలో మహిళల సమస్యల్ని చేర్చండి

విజయవాడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి పరిష్కారాలను అన్ని రాజకీయ పక్షాలు ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచాలని మహిళా సంఘాలు కోరాయి. పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవానితోపాటు పలు మహిళా సంఘాల ప్రతినిధులు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలను బుధవారం కలిశారు. రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారాన్ని చూపిస్తూ మేనిఫెస్టోలో పొందుపరచాలని విజ్ఞప్తి చేశారు.

పేరే కబ్జాల కాటసాని: గురుమూర్తి

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కబ్జాలు, అవినీతి, దోపిడీకి పాల్పడలేదని యాగంటి క్షేత్రంలో ప్రమాణం చేయగలరా? అని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వీరంకి గురుమూర్తి సవాల్ చేశారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీసీల భూముల్ని చెరబట్టిన రామ్‌భూపాల్‌రెడ్డి పేరే కబ్జాల కాటసాని అని విమర్శించారు.

పల్స్ పోలియో మార్చి 3న

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 3వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు తెలిపారు. పల్స్‌పోలియో-2024పై స్టేట్ టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని బుధవారం వెలగపూడి సచివాలయంలో నిర్వహించారు. ఇందులో భాగస్వాములయ్యే వివిధ శాఖల అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు. కృష్ణబాబు మాట్లాడుతూ పిల్లల్ని పల్స్ పోలియో కేంద్రాలకు తీసుకువచ్చేందుకు ఆయా శాఖల అధికారులు వైద్య ఆరోగ్య శాఖకు సహకరించాలని కోరారు. రాష్ట్రంలో మొత్తం 53,35,519 లక్షల మంది పిల్లలున్నారని తెలిపారు. వీరి కోసం 67,76,100 డోసులు సిద్ధం చేసినట్లు వివరించారు. 1,68,660 మంది వ్యాక్సినేటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు.

వైద్య విద్యలో ఏఐ సాంకేతికత అమలు: సీఎస్

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య విద్యలో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను ప్రవేశపెట్టేందుకు తగిన ప్రాథమిక కసరత్తు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. వైద్యారోగ్యశాఖపై బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. వైద్యవిద్యలో మెరుగైన, సత్వర ప్రయోజనాలు పొందేందుకు వీలుగా ఏఐని ప్రవేశపెట్టాలనేది ప్రభుత్వం ఆలోచన అని, దీనిపై అధికారులు ఒక నివేదికను సిద్ధం చేయాలని సూచించారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం ద్వారా మరిన్ని ప్రయోజనాలు కల్పించేందుకు తీసుకున్న చర్యలపై జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు తెలియజేయాలని ఆదేశించారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలుకు తీసుకుంటున్న చర్యలను వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు వివరించారు.

అమ్మకోసం అన్వేషిస్తూ...

- నేలబావిలో పడి బాలుడు మృతి



వర్షిత్ (ఫైల్)

టెక్కలి, ఫిబ్రవరి 21: అమ్మ కోసం వెతుక్కుంటూ వెళ్లి నేలబావిలో పడి మూడున్నరేళ్ల బాలుడు మృతి చెందాడు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం పాలసింగి గ్రామానికి చెందిన జన్ని శ్రీనివాస్, సుభద్ర గిరిజన దంపతులకు ఏడో తరగతి చదువుతున్న పాప సౌజ, మూడున్నరేళ్ల వర్షిత్ ఉన్నారు. బుధవారం ఉదయం తండ్రి కూలిపనికి వెళ్లగా, తల్లి సుభద్ర ఉపాధి పనికి వెళ్తూ కొందరు గ్రామస్థులకు తన కుమారుడు వర్షిత్‌ను కూడా చూసుకోండని చెప్పింది. పిల్లలు ఆడుకుంటుండగా ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. వర్షిత్ మాత్రం అమ్మ పనికి వెళ్లడం గమనించి అటువైపుగా వెళ్లాడు. వర్షిత్ కనిపించకపోయే సరికి అక్కడ ఉన్నవారంతా ఆ ప్రాంతంలో వెదకసాగారు. కొంతసేపటి తరువాత ఉపాధి కూలీలు ఇంటికి తిరిగి వస్తూ నేలబావిలో పడిన వర్షిత్‌ను చూసి ఆందోళనకు గురయ్యారు. అప్పటికే వర్షిత్ మృతిచెందడంతో మృతదేహాన్ని ఒడ్డుకు తీశారు.

ఏసీబీ వలలో కొండాపురం ఎస్సై

కొండాపురం, ఫిబ్రవరి21: ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితుడి నుంచి లంచం తీసుకున్నందుకు నెల్లూరు జిల్లా కొండాపురం ఎస్సై ఖాజావలిని ఏసీబీ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసులు కథనం మేరకు.. కొండాపురం మండలం ఎర్రబొట్లపల్లి గ్రామానికి చెందిన కుక్కపల్లి చినహజరత్తయ్యపై 2023 జూలైలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. అదే సంవత్సరం ఆగస్టులో చినహజరత్తయ్య భార్య తనను హింసిస్తున్నాడంటూ కేసు పెట్టింది. కేసులు లేకుండా చూసేందుకు రూ.25 వేలకు ఒప్పుకున్నాడు. లంచం ఇచ్చేందుకు ఇష్టంలేక హజరత్తయ్య, అరిగెల శ్రీనివాసులు ఏసీబీని ఆశ్రయించారు. ఎస్సై ఖాజావలి ఫిల్లింగ్‌స్టేషన్ మేనేజర్ అకౌంటు ద్వారా 2023 జూన్ నుంచి లక్షల్లో లావాదేవీలు నిర్వహించినట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. కేసు నమోదుచేసి నెల్లూరు ఏసీబీకోర్టులో హాజరుపరుస్తామని ఆయన తెలిపారు.

'పాలిటెక్నిక్ లెక్చరర్' ఫలితాలు విడుదల

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజనీరింగ్, నాన్-ఇంజనీరింగ్ టీచింగ్ లెక్చరర్ల భర్తీకి నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు ఏపీపీఎస్సీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. అభ్యర్థులు ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఫలితాలు చూసుకోవచ్చని పేర్కొంది.

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో..

శాంతి, స్థిరత్వమే మా సంకల్పం

- మిలాన్-24 ప్రారంభోత్సవంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



మిలాన్ పారిశ్రామిక ప్రదర్శనలో తుపాకీ గురిపెట్టిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం ఉండాలనేదే భారత్ సంకల్పమని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మిలాన్-2024'ను సముద్రిక ఆడిటోరియంలో బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ మాట్లాడుతూ... హిందూ మహాసముద్రంలో ఎక్కడ ఏ విపత్తు జరిగినా మొదట భారతదేశమే స్పందిస్తుందన్నారు. ఆపదలో ఉన్నప్పుడు నౌకలు, వాటి చిహ్నాలు, అందులో ఉండేది ఏ దేశస్థులు అనే అంశాలను పరిగణనలోకి తీసుకోబోమని, రక్షణ కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. విస్తృత సామూహిక ప్రయోజనాల కోసం సముద్రపు దొంగలను మట్టుబెట్టడమే కాకుండా ఎటువంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉంటామన్నారు. పొరుగు దేశాలతో స్నేహ సంబంధాలు పెంచుకోవడానికి మిలాన్ వంటి అంతర్జాతీయ కార్యక్రమాలు చాలా అవసరమన్నారు. భారత నౌకాదళం చీఫ్ అడ్మిరల్ హరికుమార్ మాట్లాడుతూ.. మిలాన్ 1995లో ప్రారంభించినప్పుడు కేవలం ఐదు దేశాలే ముందుకు వచ్చాయని, నేడు ఆ సంఖ్య 50కి పెరిగిందన్నారు. ఇంటర్నేషనల్ మేరీటైమ్ సదస్సులో 'సముద్రంలో సవాళ్లు.. అవకాశాలు' అనే అంశంపై పరస్పరం ఆలోచనలు పంచుకోనున్నామన్నారు. మిలాన్ అనేది కేవలం నౌకాదళం విన్యాసాల ప్రదర్శన కాదని, సముద్ర దేశాల సామూహిక నైపుణ్యాన్ని, బలాన్ని ప్రపంచానికి చాటిచెప్పడమని అన్నారు. 'మిలాన్' గ్రామాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభించారు. అక్కడ భారతీయ వంటకాలతో పాటు శ్రీలంక, బంగ్లాదేశ్, వియత్నాం, ఇండోనేసియా తదితర దేశాల ఆహార పదార్థాలను ఉంచారు.

ఆర్టీసీనీ.. సిబ్బందినీ ముంచిన జగన్!



- ఈపీఎఫ్ ఖాతా తెలంగాణ పరం
- హైదరాబాద్ పీఎఫ్ అధికారుల లెక్కలేనితనం
- వైసీపీ సర్కారు నిర్లక్ష్యం.. సంస్థపై రూ.200 కోట్ల భారం
- పెన్షన్ రాక ఆర్టీసీ రిటైర్డ్ సిబ్బంది లబోదిబో
- కేంద్రంతో మాట్లాడాలని కోరిన అధికారులు
- జగన్ ప్రభుత్వంలో స్పందన శూన్యం

అమరావతి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చాక తాడేపల్లి ప్యాలెస్‌కు పరిమితమైన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్లక్ష్యంతో ప్రజా రవాణా సంస్థపై రూ.200 కోట్ల భారం పడబోతోంది. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీఎస్ఆర్టీసీ పేరుతో ఉన్న ఈపీఎఫ్ అకౌంట్‌ను తెలంగాణ ఆర్టీసీ చట్టవిరుద్ధంగా తీసుకోవడంతో ఇక్కడి సిబ్బందికి పెన్షన్ ఆగిపోయింది. ఇలా ఎలా చేస్తారంటూ ఏపీఎస్ఆర్టీసీ అధికారులు హైదరాబాద్(బల్కంపేట)లోని ఈపీఎఫ్ కార్యాలయానికి వెళ్లి అడగ్గా మీరు మరో కొత్త అకౌంట్ తీసుకోండి అని అధికారులు సూచించారు. అందుకు సర్వీస్ టాక్స్ రూ.200కోట్లు కట్టాల్సి ఉంటుందని చెప్పడంతో అవాక్కైన ఏపీఎస్ఆర్టీసీ అధికారులు విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికలు సమీపించడంతో నియోజకవర్గాల్లోని సమస్యలపై దృష్టి పెట్టిన పాలకులు ప్రభుత్వ వ్యవహారాలను పూర్తిగా వదిలేశారు. కేంద్ర ప్రభుత్వానికి ఒక లేఖ రాసినా ఉపయోగం ఉంటుందని మన ఆర్టీసీ అధికారులు కోరుతున్నా ఆ మాత్రం తీరిక కూడా జగన్ ప్రభుత్వానికి లేకపోవడంతో రూ.200కోట్లు చెల్లించాల్సిన కొత్త అకౌంట్ తీసుకోలేక ఏపీఎస్ఆర్టీసీ అధికారులు.. పీఎఫ్ పెన్షన్ పొందలేక రిటైర్డ్ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఈ వ్యవహారాన్ని కాస్త లోతుగా పరిశీలిస్తే... ఏపీఎస్ఆర్టీసీ కార్పొరేషన్‌గా ఏర్పడినప్పుడు అందులోని కార్మికులందరికీ ఈపీఎఫ్ ప్రతి నెలా చెల్లించేది. కార్మికుడి నుంచి తీసుకునే 12శాతానికి ఆర్టీసీ మరో 12శాతం చేర్చి ప్రతి నెలా ట్రస్టు అకౌంట్లో జమ చేసేది. అందులో పెన్షన్ స్కీమ్‌కు 8.33శాతం పోగా మరో 1.16శాతం సర్వీస్ టాక్స్ కింద చెల్లించాల్సి వచ్చేంది. ఆ తక్కువ సర్వీస్ పన్ను కోట్లాది రూపాయల్లో ఉండటంతో పీఎఫ్ మార్గదర్శకాలకు లోబడి తమకు తామే ట్రస్ట్ నిర్వహించుకుంటామని మినహాయింపు అవకాశాన్ని పొంది ఆ 1.16శాతం ఆర్టీసీ మిగుల్చుకుంది. పీఎఫ్ హోల్డర్‌కే ఆ లబ్ధి చేకూరుస్తూ ప్రతి నెలా రికవరీ సొమ్ముతోపాటు తన వాటా కలిపి చెల్లిస్తూ వస్తోంది. 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత వెయ్యి కోట్లకు పైగా విలువైన 14 ఉమ్మడి ఆస్తుల్లో ఎక్కడివి అక్కడే అనే పద్ధతిలో ఏపీకి ఒక్కటి, తెలంగాణకు 13దక్కాయి. అయితే ఏపీఎస్ఆర్టీసీ సింబల్, పేరు, బ్యాంకు అకౌంట్లు ఇతరత్రా వ్యవహారాలు ఏపీఎస్ఆర్టీసీకి దక్కగా తెలంగాణ పేరు, లోగోతోపాటు అకౌంట్లన్నీ కొత్తగా చేసుకుంది. ఇదిలా ఉండగా 2019లో ఏపీలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2020 జనవరి నుంచి ఏపీఎస్ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేసింది. ఉద్యోగులు పదవీ విరమణ చేస్తే చెల్లించేందుకు డబ్బుల్లేక రెండేళ్ల వయో పరిమితి పెంచింది. దీంతో గత నెల 31న 300మంది రిటైర్డ్ కాగా ఇకపై ఆ సంఖ్య ప్రతి నెలా 350నుంచి 400 వరకూ ఉంటుందని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. మరో వైపు వీఆర్ఎస్ తీసుకునే వారు, అనారోగ్య కారణాలతో సిక్ అయ్యే వారు కూడా 50నుంచి వంద మంది వరకూ ఉంటున్నారు. వీరికి ఇకపై ప్రతినెలా ఈపీఎఫ్ పెన్షన్ అందాల్సి ఉండగా రూపాయి కూడా రాలేదు. ప్రతి నెలా తమ నుంచి రికవరీ చేసే మొత్తంలో 8.33శాతం పెన్షన్ స్కీమ్‌కు చెల్లించినప్పుడు ఎందుకివ్వరని అడగ్గా అసలు విషయం బయట పడింది. గత ఏడాది చివర్లోనే ఏపీఎస్ఆర్టీసీ పీఎఫ్ అకౌంట్ తెలంగాణకు చట్ట విరుద్ధంగా ఇచ్చేసినట్లు తెలిసింది. ఇది నేరం అవుతుంది కదా? అని ఏపీ అధికారులు అడిగినా పీఎఫ్ కార్యాలయంలో కనీస స్పందన లేదు. 'ప్రతి నెలా ఏపీఎస్ఆర్టీసీ రూ.65కోట్లు జమ చేస్తుంటే తీసుకొంటున్న పీఎఫ్ అధికారులు ఇలా చేయడం కచ్చితంగా క్రైమ్ అవుతుంది. వాళ్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉత్తరాదికి చెందిన వాళ్లు కావడంతో వారికి చీమ కుట్టినట్లు కూడా లేదు' అని ఒక అధికారి వ్యాఖ్యానించారు. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసి పై స్థాయిలో మాట్లాడితే ఉపయోగం ఉంటుందని చెప్పినా తాడేపల్లి ప్యాలెస్ వినిపించుకోలేదు. సమస్యను ఎలా పరిష్కరించాలో తెలియక ఆర్టీసీ హౌస్ తల పట్టుకుంది.

> పొరుగు రాష్ట్రం మన ఈపీఎఫ్‌వో ఖాతాను చట్టవిరుద్ధంగా లాగేసుకుంటుంటే హైదరాబాద్‌లోని ఈపీఎఫ్‌వో అధికారులు లెక్కలేకుండా వ్యవహరించారు. ఆలస్యంగా గుర్తించిన ఏపీఎస్ఆర్టీసీ అధికారులు... ఇదేమని అడిగితే... మీరు కొత్త ఖాతా తెరుచుకోండంటూ ఉచిత సలహా పడేశారు. కొత్త ఖాతా తీయాలంటే సర్వీసు ట్యాక్స్ కింద రూ.200 చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. సమస్య ఇదీ... కొంచం కేంద్రంతో మాట్లాడండి... అని ఆర్టీసీ అధికారులు మొత్తుకుంటున్నా జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంపు నిద్ర వీడడం లేదు.

కవితకు మళ్లీ సీబీఐ నోటీసులు

- మాగుంట సమాచారం మేరకే జారీ
- ఇప్పటికే రెండు సార్లు విచారించిన సీబీఐ
- 26న విచారణకు రావాలని ఆదేశాలు
- ఈడీ నోటీసులు వచ్చిన నెలకే సీబీఐ తాఖీదు



హైదరాబాద్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బుధవారం సీబీఐ మరోసారి నోటీసులను జారీచేసింది. ఈ నెల 26న తమ ముందు హాజరు కావాలని ఈ-మెయిల్ ద్వారా పంపిన ఆ నోటీసుల్లో పేర్కొంది. సీబీఐ కవితను ఇప్పటికే రెండుసార్లు విచారించిన విషయం తెలిసిందే..! 2022 డిసెంబరులో బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. ఈడీ కూడా ఆమెకు గతంలో నోటీసులను జారీ చేసింది. అప్పట్లో ఢిల్లీలో సుదీర్ఘంగా విచారించింది. కవిత తాను వాడిన సెల్‌ఫోన్లను ఈడీకి అందజేశారు. కాగా, ఈ కేసులో అప్రూవర్‌గా మారిన మాగుంట రాఘవరెడ్డి ఇచ్చిన సమాచారం ఆధారంగానే సీబీఐ కవితకు మరోమారు నోటీసులను జారీ చేసినట్లు తెలిసింది. ఈ కేసులో సౌత్‌గ్రూప్ నుంచి నిందితుల్లో ఒకరైన విజయ్ నాయర్ ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) తరఫున రూ.100 కోట్ల మేరకు ముడుపులు స్వీకరించినట్లు ఈడీ ఆరోపించింది. సౌత్‌గ్రూప్‌లో కవిత, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శరత్‌చంద్రారెడ్డి తదితరులున్నారు. ఈడీ నోటీసులు జారీ అయిన నెలలోనే సీబీఐ తాఖీదులివ్వడం గమనార్హం..! ఈడీ నోటీసులపై కవిత సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టులో కేసు ఉన్నందున కవిత విచారణకు హాజరుకాలేదు. అయితే.. సీబీఐ నోటీసులకు స్పందించాలా? విచారణకు హాజరవ్వాలా? అనే అంశంపై న్యాయ నిపుణులను సంప్రదించిన తర్వాత కవిత తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. బీజేపీ-బీఆర్ఎస్ పొత్తుపై ప్రచారం జరుగుతున్న సమయంలో ఏడాది తర్వాత సీబీఐ అనూహ్యంగా సీబీఐ నోటీసులు రావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

ఎస్సై బ్యాక్‌లాగ్ భర్తీకి ఆదేశాలివ్వండి

- హైకోర్టులో పిల్.. రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీకి నోటీసులు

అమరావతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సై బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన పిల్‌పై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ, హోంశాఖ ముఖ్య కార్యదర్శులు, ఏపీ రాష్ట్రస్థాయి పోలీసు నియామక బోర్డు ఛైర్మన్, డీజీపీలకు నోటీసులు జారీచేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు చెందిన 246 ఎస్సై బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేలా అధికారులకు ఆదేశాలివ్వాలని కోరుతూ ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ సొసైటీ(ఐటీడీఎస్) కార్యనిర్వాహక సభ్యుడు అనుముల వంశీకృష్ణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా.. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎం.జయప్రకాశ్ వాదనలు వినిపించారు.



జంపన్న వాగు వద్ద భక్తుల పుణ్య స్నానాలు

నేడే సమ్మక్క తల్లి రాక!

- భక్తుల జయజయధ్వానాల మధ్య గద్దెపైకి చేరుకున్న సమక్క

హనుమకొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): డప్పు చప్పుళ్లు.. కోయల నృత్యాలు.. భక్తుల జయజయ ధ్వానాల మధ్య సారలమ్మ మేడారం గద్దెపైకి చేరుకుంది. ఫలితంగా మేడారం మహాజాతర లాంఛనంగా మొదలైంది. సారలమ్మను గద్దెకు తీసుకొచ్చే కార్యక్రమం ఉదయం ఆమె వెలసిన కన్నెపల్లి ఆలయం నుంచే ఆర్భాటంగా మొదలైంది. ఆలయాన్ని శుద్ధి చేసి.. ముగ్గులతో అలంకరించిన అనంతరం ఆదివాసీ పూజారులు సాయంత్రం ఏడుగంటల దాకా ప్రత్యేక పూజలు చేశారు. సారలమ్మ తల్లి రూపంలో ఆలయం నుంచి బయటకు వచ్చిన పూజారి సారయ్య.. భక్తుల మొక్కుల సమర్పణ నడుమ మేడారం దిశగా కదిలారు. కన్నెపల్లి నుంచి రెండు కిలోమీటర్ల దూరం దారిపొడవునా భక్తులు బారులుతీరి హారతులిచ్చారు. రాత్రి తొమ్మిదిగంటలు దాటాక సారలమ్మ గద్దెకు చేరుకుంది. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ నుంచి పగిడిద్ద రాజు, కొండాయి నుంచి గోవిందరాజును కూడా గద్దెలపైకి చేర్చారు. అంతకుముందు పగిడిద్దరాజు-సమక్క కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక మేడారం జాతర రెండో రోజు మరింత ప్రత్యేకం. సారలమ్మ గద్దెకు చేరుకోగా సమ్మక్క గురువారం గద్దెపైకి రానుంది. సమ్మక్క ఆగమనం కోసం ఉదయమే ఏర్పాట్లు మొదలవుతాయి. మేడారం జాతరకు ప్రముఖులు రానున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ తమిళిసై, తెలంగాణ సీఎం రేవంత్ రెండి శుక్రవారం మేడారానికి వచ్చి వనదేవతలను దర్శించుకోనున్నారు. రాష్ట్రపతి ముర్ము ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు చేరుకొని, అక్కడి నుంచి సైనిక హెలికాప్టర్‌లో మేడారానికి వస్తారు. మేడారానికి ఓ రాష్ట్రపతి రానుండం మహాజాతర చరిత్రలో ఇదేతొలిసారి. తల్లులను దర్శించుకునేందుకు గురువారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మేడారానికి రానున్నారు. మేడారాన్ని జాతీయ పండుగగా ప్రకటించాలన్న డిమాండ్ చాన్నాళ్లుగా ఉంది. అయితే మేడారం జాతరను జాతీయ పండుగగా ప్రకటించే విషయం ఆలోచిస్తామని తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ పేర్కొన్నారు ఈ క్రమంలో గురువారం ఈ విషయంలో కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేయొచ్చునన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఐటీ కంపెనీలను రప్పించడంలో

చంద్రబాబుదే కీలక పాత్ర

- హైదరాబాద్ అభివృద్ధికి ఆయనతోపాటు వైఎస్, కేసీఆర్ కూడా కృషి చేశారు
- అభివృద్ధి విధానాలను కొనసాగిస్తాం
- పెట్టుబడిదారులకు పూర్తి సహకారం
- సీఐఐ సదస్సులో తెలంగాణ సీఎం హామీ



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు ఐటీ కంపెనీలను తీసుకురావడంలో అప్పటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషించారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా విధానాలు మార్చబోమని స్పష్టం చేశారు. సీఐఐ, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారమిక్కడ నిర్వహించిన సదస్సులో సీఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ రావు రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా హైదరాబాద్ అభివృద్ధికి మంచి ప్రయత్నాలు చేశారని కొనియాడారు. వాటిని కొనసాగించడానికి తమ ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలూ లేవన్నారు. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు దేశంలో మొట్టమొదటిసారిగా ఒక ఐటీ కంపెనీకి మాదాపూర్‌లో శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అది ఆగిపోయినా చంద్రబాబు ముఖ్యమంత్రిగా వచ్చాక.. ఐటీ రంగాన్ని ముందుకు తీసుకెళ్లారు. ఐటీ ఇండస్ట్రీతో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంచడంతోపాటు, ఆర్థిక వ్యవస్థనూ ఉన్నత స్థితికి తీసుకెళ్లేందుకు దోహదపడుతుందని భావించి ప్రపంచంలో ఉన్న చాలా ఐటీ కంపెనీలను హైదరాబాద్‌కు తీసుకురావడానికి చంద్రబాబు కృషి చేశారు. తర్వాత ముఖ్యమంత్రి అయిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సైతం.. చంద్రబాబుతో రాజకీయ, సిద్ధాంతపరమైన విభేదాలే తప్ప అభివృద్ధిలో ఎలాంటి విభేదాలు లేవని చాటారు. ఓఆర్ఆర్, హైటెక్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, మెట్రోరైలు, కృష్ణా, గోదావరి జలాల విషయాల్లోనూ వారు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయలేదు. అప్పటికే సిద్ధమైన ప్రణాళికలను ఇంకా వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకే కృషి చేశారు. దాంతో హైదరాబాద్ నగరానికి ప్రపంచ చిత్రపటంలో మంచి స్థానం దక్కింది. అనేక ఐటీ, ఫార్మా కంపెనీలు తమ వ్యాపారాలు ఇక్కడ నెలకొల్పాయి. నేడు ఫార్మా రంగంలో టాప్-5 కంపెనీల్లో 4 నగరంలోనే ఉన్నాయి. ఓఆర్ఆర్ అవసరమా అని గతంలో విమర్శించారు. నేడు నగరానికి అదే లైఫ్ లైన్‌గా మారింది. పెట్టుబడులకు, అభివృద్ధికి హైదరాబాద్ చిరునామాగా మారింది. ప్రభుత్వం మారినందున విధానాలు మారుతాయన్న అపోహలు పెట్టుకోవద్దు. పెట్టుబడిదారులకు పూర్తి సహకారం ఉంటుంది' అని రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. హైదరాబాద్ లాంటి నగరం దేశంలో ఏ రాష్ట్రంలో లేదని, అన్ని ప్రాంతాలనూ సంస్కృతులనూ ఈ నగరం అక్కున చేర్చుకుంటుందని, 400 ఏళ్ల క్రితమే నిజాం ఏర్పర్చిన ఈ సమ్మిళిత సంస్కృతే నేటికీ కొనసాగుతోందని చెప్పారు.

జోడో యాత్రకు స్వల్ప విరామం

- ఈనెల 26 నుంచి మార్చి 1 వరకు బ్రేక్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రకు స్వల్ప విరామం ప్రకటించారు. ఈనెల 26 నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు యాత్రకు బ్రేక్ ఇస్తున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ బుధవారం వెల్లడించారు. రాహుల్ పలు ముఖ్యమైన సమావేశాల్లో పాల్గొనాల్సి ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. ఫిబ్రవరి 27, 28 తేదీల్లో యూకేలోని కేంబ్రిడ్జి యూనివర్సిటీలో రాహుల్ ప్రసంగించనున్నారని, అలాగే ఢిల్లీలో పలు కీలక సమావేశాలకు ఆయన హాజరు కావాల్సి ఉందని జైరాం వివరించారు. మార్చి 2న రాజస్థాన్‌లోని ధౌల్‌పూర్‌లో యాత్ర పునఃప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. కాగా, మోదీ రామరాజ్యంలో దళితులు, వెనుకబడిన వర్గాల వారికి ఉద్యోగాలు రావడం లేదని రాహుల్ గాంధీ విమర్శించారు. బుధవారం జోడో యాత్రలో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఆయన బహిరంగ సభలో మాట్లాడారు.

ఇకపై విదేశాల్లోనూ నీట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్- 2024)ను ఈ ఏడాది నుంచి విదేశాల్లోనూ నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీని కోసం ప్రపంచవ్యాప్తంగా 12 దేశాల్లో 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అధికారులు బుధవారం తెలిపారు. విదేశాల్లో నివసిస్తున్న అభ్యర్థుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ సీనియర్ డైరెక్టర్ సాధనా పరాశర్ చెప్పారు. అయితే ఈ నెల 9 నుంచి నీట్ దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఇప్పటికే దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థుల కోసం రిజిస్ట్రేషన్ తేదీ ముగిసిన తర్వాత ఎడిట్ ఆప్షన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది మే 4న నీట్ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

సరిహద్దుల్లో శాంతే లక్ష్యం: భారత్, చైనా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21: తూర్పు లద్దాఖ్‌లోని వాస్తవ నియంత్రణ రేఖ(ఎల్ఏసీ) వెంబడి శాంతియుత పరిస్థితులను నెలకొల్పాలని భారత్-చైనా అంగీకరించాయి. ఈ విషయాన్ని బుధవారం భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 21వ భారత్- చైనా కోర్ కమాండ్ స్థాయి సమావేశం ఫిబ్రవరి 19న చుషుల్-మోల్డో మీటింగ్ పాయింట్ వద్ద జరిగింది. "సోమవారం జరిగిన చర్చలు స్నేహపూర్వక వాతావరణంలో జరిగాయి. తూర్పు లద్దాఖ్‌లోని మిగిలిన సరిహద్దు ప్రాంతాలను చైనా వదిలి వెళాలని ఈ సందర్భంగా భారత్ పునరుద్ఘాటించింది. ఈ సమావేశంలో సైనిక, దౌత్య పరమైన విషయాల్లో సంప్రదింపులను కొనసాగించాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. ఆ సమయంలో క్షేత్రస్థాయిలో ప్రశాంతతను కొనసాగించడానికి రెండు దేశాలు నిర్ణయించాయి." అని విదేశాంగ శాఖ తెలిపింది.

భారీగా పట్టుబడిన 'మ్యావ్ మ్యావ్' డ్రగ్

- రూ.3500 కోట్ల విలువైన 1800 కిలోలు పట్టివేత
- పుణె, ఢిల్లీల్లోని ఫ్యాక్టరీల్లో సోదాలు.. ఆరుగురి అరెస్టు

ముంబై, ఫిబ్రవరి 21: అతి భారీ డ్రగ్ రాకెట్‌ను పుణె పోలీసులు ఛేదించారు. 'మ్యావ్ మ్యావ్' అని వ్యవహరించే మెఫెడ్రోన్ అనే మాదకద్రవ్యంపై భారతదేశంలో నిషేధం ఉంది. అలాంటిది రూ.3,500 కోట్ల విలువైన 1,800 కిలోల ఈ రకం డ్రగ్ పట్టుబడటం కలకలం రేపుతోంది. ఢిల్లీ పోలీసులతో కలిసి పుణె పోలీసులు జాయింట్ ఆపరేషన్ జరిపి భారీ డ్రగ్ నిల్వలను బుధవారం కనుగొన్నారు. ఈ సోదాల్లో ఆరుగురిని అదుపులోని తీసుకున్నారు. పుణెలోని విశ్రాంత్‌వాడీలోని ఓ ఫ్యాక్టరీలో 600 కిలోల డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ ముగ్గురిని అరెస్టు చేశారు. ఢిల్లీలోని పలు గోదాముల్లో తనిఖీలు జరిపి 1200 కిలోల మాదకద్రవ్యాన్ని పట్టుకున్నారు. ఇక్కడ మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరందరిపై ఎన్‌డీపీఎస్ చట్టం (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) కింద కేసు నమోదుచేసినట్టు పుణె కమిషనర్ అమితేశ్ కుమార్ తెలిపారు.

పాక్ ప్రధానిగా షాబాజ్.. అధ్యక్షుడిగా జర్దారీ!

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 21: పాకిస్థాన్‌లో రాజకీయ అస్థిరతకు ఎట్టకేలకు తెర పడింది. సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు పాకిస్థాన్ ముస్లిం లీగ్(నవాజ్), పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) నిర్ణయించాయి. ఈ పార్టీల అంగీకారం ప్రకారం.. పీఎంఎల్(నవాజ్) అధ్యక్షుడు, మాజీ ప్రధాని షాబాజ్ షరీఫ్ మరోసారి పాక్ ప్రధాని అవుతారు. పీపీపీ సహ అధ్యక్షుడు ఆసీఫ్ అలీ జర్దారీ దేశాధ్యక్ష పదవికి ఉమ్మడి అభ్యర్థిగా పోటీపడతారు. ఈ నెల 8న జాతీయ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఈ రెండు పార్టీల్లో దేనికీ మెజారిటీ రాలేదు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● గురువారం 22 ఫిబ్రవరి 2024
diksuchi@andhrajyothy.com

ఏపీ పాలిసెట్ నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్-మంగళగిరిలోని స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్(ఎస్‌బీటీఈటీ)- 'పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పాలిసెట్) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా ప్రభుత్వ/ప్రైవేట్/ఎయిడెడ్/అన్ ఎయిడెడ్ పాలిటెక్నిక్ కళాశాలలు; ప్రైవేట్ అన్ ఎయిడెడ్ ఇంజనీరింగ్ కాలేజీలు నిర్వహిస్తున్న సెకండ్ షిఫ్ట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా ప్రోగ్రామ్ వ్యవధి విభాగాన్ని అనుసరించి మూడు లేదా మూడున్నరేళ్లు ఉంటుంది. ఏపీ పాలిసెట్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఉంటాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



విభాగాలు

మూడేళ్ల కోర్సులు: సివిల్, ఆర్కిటెక్చరల్ అసిస్టెంట్‌షిప్, మెకానికల్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వెహికిల్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, 3 డీ యానిమేషన్ అండ్ గ్రాఫిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా, కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ నెట్ వర్కింగ్, మైనింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, అప్పారెల్ డిజైన్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మెటలర్జికల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ

మూడున్నరేళ్ల కోర్సులు: బయో మెడికల్, కెమికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్(ఆయిల్ టెక్నాలజీ/పెట్రో కెమికల్స్/ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్/షుగర్ టెక్నాలజీ), సిరామిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, ప్యాకేజింగ్ టెక్నాలజీ

అర్హత: తెలుగు రాష్ట్రాలకు చెందిన స్టేట్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(ఎస్ఎస్‌సీ), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ), ఇండియన్ కౌన్సిల్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్(ఐసీఎస్ఈ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్(ఎన్ఐఓఎస్), ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ(ఏపీఓఎస్ఎస్), ఇతర రాష్ట్రాల బోర్డుల నుంచి మేథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఏపీ పాలిసెట్ 2024 వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో మేథమెటిక్స్ నుంచి 50, ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 30 చొప్పున మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఏపీ స్టేట్ బోర్డు రూపొందించిన పదోతరగతి సిలబస్ ఆధారంగానే ఉంటాయి. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. లాగ్ టేబుల్స్, క్యాలిక్యులేటర్స్, పేజర్స్, సెల్ ఫోన్‌లను పరీక్ష హాల్‌లోకి అనుమతించరు. ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.400; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **ఏపీ పాలిసెట్ 2024 తేదీ:** ఏప్రిల్ 27
- **ఫలితాలు విడుదల:** మే 13
- **వెబ్‌సైట్:** polycetap.nic.in

ఐఐటీ హైదరాబాద్‌లో
స్యూర్ ఇంటర్న్‌షిప్

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- 'సమ్మర్ అండర్‌గ్రాడ్యుయేట్ రీసెర్చ్ ఎక్స్‌పోజర్(స్యూర్)' ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి కనిష్ఠంగా ఒక నెల, గరిష్ఠంగా రెండు నెలలు ఉంటుంది. అభ్యర్థులు ఫుల్ టైమ్ వర్క్ చేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్/ఆన్‌లైన్ విధానాలు లేవు. మొత్తం 200 సీట్లు ఉన్నాయి. వీటిలో 50 సీట్లను అమ్మాయిలకు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిగా ఉచితం. స్టయిపెండ్ కూడా ఇస్తారు. ఎంపికైనవారికి ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో వసతి సౌకర్యం కల్పిస్తారు. అభ్యర్థులు మెస్ ఛార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. బేసిక్ మెడికల్ సర్వీస్ అందిస్తారు.



విభాగాలు: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, లిబరల్ ఆర్ట్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, సస్టయినబిలిటీ, క్లయిమేట్ ఛేంజ్, హెరిటేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంటర్‌డిసిప్లినరీ ప్రోగ్రామ్, ఫిజిక్స్, మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాలు ఉన్నాయి. వీటికి నిర్దేశించిన పరిశోధనాంశాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

అర్హత: ఎమ్మెస్సీ(మేథ్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/బయాలజీ)/ఎంఏ మొదటి ఏడాది చదువుతున్నవారు; బీటెక్(అన్ని విభాగాలు)/బీడిజైన్‌కు సంబంధించి రెండో ఏడాది/మూడో ఏడాది చదువుతున్నవారు; ఇంటిగ్రేటెడ్ బీటెక్-ఎంటెక్ ప్రోగ్రామ్‌నకు సంబంధించి మూడో ఏడాది/నాలుగో ఏడాది చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు పూర్తయిన సెమిస్టర్ ఎగ్జామ్స్‌లో అభ్యర్థులు నిర్దేశిత సీజీపీఏ స్కోర్‌లో టాప్ 20 శాతం సాధించి ఉండాలి. ఫుల్ టైమ్/రెగ్యులర్ అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన అభ్యర్థులు ఈ ప్రోగ్రామ్‌నకు అనర్హులుగా ప్రకటించారు.

ఎంపిక: ప్రిలిమినరీ స్క్రీనింగ్ ద్వారా సెలెక్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అకడమిక్ మెరిట్; రెగ్యులర్ అకడమిక్ వర్క్‌తోపాటు అభ్యర్థులు పూర్తిచేసిన ప్రాజెక్ట్ వర్క్‌లు; ఒలింపియాడ్స్/నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్స్‌లో పార్టిసిపేషన్/పొందిన గుర్తింపు; ఇంటర్వ్యూ స్కోర్ తదితరాలను పరిగణనలోకి తీసుకొని సంబంధిత డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీ/మెంటార్ నిర్ణయం మేరకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థుల సమాచారాన్ని ఈ-మెయిల్ ద్వారా తెలియజేస్తారు. వెబ్‌సైట్‌లో కూడా ఉంచుతారు.

స్టయిపెండ్: అభ్యర్థులు ఒక నెల, నెలన్నర, రెండు నెలల వ్యవధిని ఎంచుకోవచ్చు. నెల ప్రోగ్రామ్‌నకు రూ.7,500; నెలన్నర ప్రోగ్రామ్‌నకు రూ.10,000; రెండు నెలల ప్రోగ్రామ్‌నకు రూ.15,000లను స్టయిపెండ్ కింద చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ వ్యవధి:** 2024 మే 15 నుంచి జూలై 14 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 10
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఏప్రిల్ 15
- **వెబ్‌సైట్:** iith.ac.in, https://iith.ac.in/research/SURE/

తెలంగాణ గురుకుల సైనిక పాఠశాలలో ప్రవేశాలు

కరీంనగర్ జిల్లా-రుక్మాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక పాఠశాలలో ప్రవేశానికి నోటిఫికేషన్‌లు విడుదలయ్యాయి. వీటి ద్వారా ఆరోతరగతి, పదకొండో తరగతి(ఎంపీసీ)లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. రాష్ట్రానికి చెందిన బాలురు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. సీబీఎస్ఈ కరిక్యులం ప్రకారం బోధన ఉంటుంది. మిలిటరీ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యం ఇస్తారు. యూపీఎస్సీ-ఎన్‌డీఏ పరీక్షలకు అవసరమైన శిక్షణ ఇస్తారు. మాక్ ఎస్ఎస్‌బీ టెస్ట్‌లు నిర్వహిస్తారు. డిబేట్స్, క్విజ్ కాంపిటేషన్స్, సెమినార్లు, సాఫ్ట్ స్కిల్స్ ట్రెయినింగ్, ప్రాజెక్ట్ వర్క్‌లు, స్కిట్స్, డ్రమటిక్స్, పిక్చర్ పర్సెప్షన్, స్టోరీ టెల్లింగ్ తదితర ప్రోగ్రామ్‌లు ఉంటాయి. ఫిజికల్ ట్రెయినింగ్, అబ్‌స్టాకిల్ కోర్స్ ట్రెయినింగ్, లాంగ్ డిస్టెన్స్ మార్చ్‌లు, డ్రిల్ ప్రాక్టీస్, ఎన్‌సీసీ ట్రెయినింగ్, బాక్సింగ్, రెజిలింగ్, కరాటే, ఆర్చరీ, సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, హార్టికల్చర్ వంటి ఔట్‌డోర్ యాక్టివిటీస్ కూడా ఉంటాయి. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ విభాగాల్లో ఆఫీసర్స్‌గా రాణించాలనుకొనే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు.



సీట్ల వివరాలు

- ఆరోతరగతిలో 80 సీట్లు ఉన్నాయి. ఎస్సీ విద్యార్థులకు 60, బీసీ-సీ విద్యార్థులకు 2, ఎస్టీ విద్యార్థులకు 5, బీసీ విద్యార్థులకు 10, ఓసీ/ఈబీసీ విద్యార్థులకు 1, మైనారిటీలకు 2 సీట్లు ప్రత్యేకించారు.
- పదకొండో తరగతి(ఎంపీసీ)లో 46 సీట్లు ఉన్నాయి. ఎస్సీ విద్యార్థులకు 32, ఓసీ/ఈబీసీ విద్యార్థులకు 1, మైనారిటీలకు 1, బీసీ-సీ విద్యార్థులకు 2, ఎస్టీ విద్యార్థులకు 3, బీసీ విద్యార్థులకు 7 సీట్లు ప్రత్యేకించారు.

అర్హత

- కుటుంబ వార్షిక ఆదాయం పట్టణాల్లో రూ.2,00,000; గ్రామాల్లో రూ.1,50,000 మించకూడదు. తెలుగు మీడియం విద్యార్థులు కూడా పరీక్ష రాయవచ్చు. నిర్దేశించిన మేరకు శారీరక ప్రమాణాలు(ఎత్తు, బరువు) ఉండాలి.
- ఆరోతరగతిలో చేరాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి అయిదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. విద్యార్థుల వయసు 2024 ఏప్రిల్ 1 నాటికి 11 ఏళ్లు మించకూడదు.
- పదకొండో తరగతిలో ప్రవేశానికి గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి ఉత్తీర్ణులు/ప్రస్తుతం పరీక్షలు రాసేవారు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల వయసు 2024 ఏప్రిల్ 1 నాటికి 16 ఏళ్లు మించకూడదు.

ఎంపిక ప్రక్రియ

- ఇందులో మూడు దశలు ఉంటాయి. మొదటి దశలో కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ఉంటుంది. రెండో దశలో ఫిజికల్ టెస్ట్, సైనిక్ స్కూల్ ఆప్టిట్యూడ్ టెస్ట్, కమ్యూనికేషన్ స్కిల్ టెస్ట్‌లు ఉంటాయి. మూడో దశలో మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్ ఉంటుంది.
- ఆరోతరగతి ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలను ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. మేథమెటిక్స్ నుంచి 40 ప్రశ్నలు; జనరల్ నాలెడ్జ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, ఇంటెలిజెన్స్/రీజనింగ్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 20 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ అయిదో తరగతి సిలబస్ ప్రకారమే ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. మేథ్స్‌కు ఒక గంట, మిగిలిన సబ్జెక్టులకు ఒక్కోదానికి అర్ధ గంట చొప్పున మొత్తం పరీక్ష సమయం రెండున్నర గంటలు.
- పదకొండో తరగతి ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు: మేథమెటిక్స్ నుంచి 40; ఇంగ్లీష్, రీజనింగ్ ఎబిలిటీ, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 15 చొప్పున మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పదోతరగతి సిలబస్ ఆధారంగా ఆంగ్ల మాధ్యమంలో ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. మేథ్స్‌కు ఒక గంట, మిగిలిన సబ్జెక్టులకు ఒక్కోదానికి అర్ధ గంట చొప్పున మొత్తం పరీక్ష సమయం మూడు గంటలు.
- ఎంట్రెన్స్ టెస్ట్‌లో అర్హత సాధించాలంటే ఒక్కో సబ్జెక్ట్‌లో కనీసం 25 శాతం మార్కులు, మొత్తమ్మీద కనీసం 40 శాతం మార్కులు రావాలి. ఇలా అర్హత సాధించినవారిని 1:10 నిష్పత్తిలో ఎంపికచేసి షార్ట్‌లిస్ట్ రూపొందిస్తారు. వీరిని మాత్రమే ఫిజికల్, ఆప్టిట్యూడ్, కమ్యూనికేషన్ స్కిల్ టెస్ట్‌లకు పిలుస్తారు.
- ఫిజికల్ టెస్ట్ 25 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్హత పొందాలంటే కనీసం 6 మార్కులు రావాలి. అభ్యర్థులు 20 నిమిషాల్లో నాలుగు కి.మీ.ల రన్నింగ్; 15 పుషప్‌లు, 20 సిటప్‌లు, 3 చిన్ అప్‌లు, మూడు మీటర్ల వర్టికల్ రోప్ పూర్తిచేయాల్సి ఉంటుంది.
- సైనిక్ స్కూల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 100 మార్కులకు ఉంటుంది. దీనిని ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తారు. ఇది సబ్జెక్టివ్ అండ్ డిస్క్రిప్టివ్ పేపర్. ఆరోతరగతి అభ్యర్థులకు లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లీష్ ఆప్టిట్యూడ్, మేథమెటికల్ ఆప్టిట్యూడ్, ఈవీఎస్ ఆప్టిట్యూడ్, సోషల్ సైన్స్ ఆప్టిట్యూడ్ అంశాల నుంచి ఒక్కోదానిలో 20 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. పదకొండో తరగతి అభ్యర్థులకు లాజికల్ రీజనింగ్ అండ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 10 మార్కులకు, ఇంగ్లీష్ ఆప్టిట్యూడ్ నుంచి 15 మార్కులకు, మేథమెటికల్ ఆప్టిట్యూడ్ నుంచి 30 మార్కులకు, సైన్స్ ఆప్టిట్యూడ్ నుంచి 30 మార్కులకు, సోషల్ సైన్స్ ఆప్టిట్యూడ్ నుంచి 15 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.
- కమ్యూనికేషన్ స్కిల్స్ టెస్ట్ 25 మార్కులు ఉంటుంది. దీనిని ఓరల్ మోడ్‌లో నిర్వహిస్తారు. తరవాత మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లు ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 1
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మార్చి 6 నుంచి
- **స్టేజ్-1 ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** మార్చి 10
- **స్టేజ్-2 స్క్రీనింగ్ టెస్ట్‌లు:** ఆరోతరగతిలో చేరే విద్యార్థులకు మార్చి 22, 23, 26, 27, 28; పదకొండోతరగతిలో చేరే విద్యార్థులకు ఏప్రిల్ 1, 3, 4, 6
- **వెబ్‌సైట్:** https://tswrplschools.cgg.gov.in

భారత రాజ్యాంగ పరిషత్

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

రాజ్యాంగ పరిషత్ ముఖ్య కమిటీలు (కమిటీ- ఛైర్మన్‌గా వ్యవహరించినవారు)

1. సలహాసంఘం - వల్లభబాయ్ పటేల్(అత్యంత పెద్ద కమిటీ)
2. సారథ్య కమిటీ - రాజేంద్రప్రసాద్
3. ప్రాథమిక హక్కుల కమిటీ - వల్లభబాయ్ పటేల్
4. ప్రాథమిక హక్కుల ఉపకమిటీ- జె.బి.కృపలాని
5. కేంద్ర అధికారాల కమిటీ - జవహర్‌లాల్ నెహ్రూ
6. కేంద్ర రాజ్యాంగ కమిటీ - జవహర్‌లాల్ నెహ్రూ
7. రాష్ట్రాల కమిటీ - జవహర్‌లాల్ నెహ్రూ
8. రూల్స్ కమిటీ - రాజేంద్రప్రసాద్
9. జాతీయ పతాకంపై తాత్కాలిక కమిటీ - రాజేంద్రప్రసాద్
10. మైనారిటీ సబ్ కమిటీ - హెచ్.సి.ముఖర్జీ
11. సుప్రీంకోర్టుపై తాత్కాలిక కమిటీ - వరదాచారి అయ్యర్(రాజ్యాంగ పరిషత్‌లో సభ్యుడు కాదు)
12. రాష్ట్ర రాజ్యాంగాలపై కమిటీ - వల్లభబాయ్ పటేల్
13. ఈశాన్య రాష్ట్రాల హక్కుల కమిటీ - గోపినాద్ బోర్డోలాయ్
14. హౌస్ కమిటీ - పట్టాభి సీతారామయ్య
15. రాజ్యాంగ పరిషత్ విధుల కమిటీ - జి.వి.మౌలాంకర్
16. సభా వ్యవహారాల కమిటీ - కె.ఎం.మున్షీ
17. రాజ్యాంగ ముసాయిదా ప్రత్యేక కమిటీ - కృష్ణస్వామి అయ్యర్

- రాజ్యాంగ ముసాయిదా 1948 ఫిబ్రవరి 21న ప్రచురించారు. రాజ్యాంగ ప్రతిపై 7,635 సవరణలు ప్రతిపాదించగా వాటిలో 2,473 చర్చకు వచ్చాయి. ముసాయిదాను రాజ్యాంగ పరిషత్ 1949 నవంబరు 26న ఆమోదించి చట్టంగా మార్చింది.
- రాజ్యాంగ రూపకల్పనకు రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజుల సమయం పట్టింది. రాజ్యాంగ పరిషత్ ముసాయిదాను 115 రోజుల్లో తయారుచేసింది. మొత్తం 12 సమావేశాలు జరిగాయి.
- భారత రాజ్యాంగ పరిషత్ చిట్టచివరి సమావేశం 1950 జనవరి 24న జరిగింది. ఈ సమావేశానికి 284 మంది సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో రాజ్యాంగ పరిషత్ నూతన రాజ్యాంగం ప్రకారం భారత గణతంత్ర ప్రథమ రాష్ట్రపతిగా(అధ్యక్షునిగా) రాజేంద్రప్రసాద్‌ను ఎన్నుకుంది.
- భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది. ఆ రోజునే గణతంత్ర దినోత్సవంగా జరుపుకొంటున్నాం.
- భారత రాజ్యాంగ పరిషత్ రాజ్యాంగ రచనతో పాటుగా, కొన్ని సాధారణ చట్టాలను కూడా రూపొందించి, ఆమోదించింది.
- భారత రాజ్యాంగ పరిషత్ చిహ్నంగా ఏనుగును గుర్తించారు.
- రాజ్యాంగ పరిషత్ కేంద్ర శాసనసభగా కూడా పనిచేసింది. స్వతంత్ర శాసనసభ 1947 నవంబరు 17న సమావేశమై మొదటి స్పీకర్‌గా జి.వి.మౌలంకర్‌ను ఎన్నుకున్నది.
- కామన్‌వెల్త్‌లో భారత సభ్యత్వాన్ని 1949 మేలో ధ్రువీకరించింది.
- 1947 జూలై 22న జాతీయ జెండాను, 1950 జనవరి 24న జాతీయ గీతాన్ని, జాతీయ గేయాన్ని ఆమోదించింది. రాజ్యాంగ పరిషత్ వివిధ అంశాల కోసం సుమారు 60 దేశాల రాజ్యాంగాలను పరిశీలించింది.
- రాజ్యాంగ నిర్మాణానికి అయిన మొత్తం ఖర్చు రూ.64 లక్షలు.

విమర్శలు

1. రాజ్యాంగ పరిషత్ దేశంలో ఒక ప్రధాన వర్గానికి మాత్రమే ప్రాతినిధ్యం వహించింది - విన్‌స్టన్ చర్చిల్
2. రాజ్యాంగ పరిషత్ హిందువుల సంస్థ- సైమన్
3. భారత రాజ్యాంగ పరిషత్ ఒకే పార్టీకి చెందిన సంస్థ, రాజ్యాంగ పరిషత్ అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే భారతదేశం - గ్రాన్‌విల్ ఆస్టిన్
4. భారత రాజ్యాంగం న్యాయవాదుల స్వర్గం, ఒక అతుకుల బొంత - ఐవర్ జెన్నింగ్స్
5. రాజ్యాంగం వైఫల్యం చెందితే రాజ్యాంగాన్ని నిందించరాదు. అమలు పరిచేవారిని నిందించాలి - డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
6. రాజ్యాంగ పరిషత్ నిర్మాణంలో ప్రజాభిప్రాయ ఛాయలు లేవు - కె.సంతానం
7. రాజ్యాంగ రచనలో సమన్వయ పద్ధతి కంటే సర్దుబాటు పద్ధతికే ప్రాధాన్యం ఇచ్చారు - ఓ.పి.గోయల్
8. రాజ్యాంగ రచనకు రాజ్యాంగ పరిషత్ సమన్వయ పద్ధతిని అనుసరించింది - గ్రాన్‌విల్ ఆస్టిన్
9. రాజ్యాంగ పరిషత్‌లో నెహ్రూ, పటేల్, రాజేంద్ర ప్రసాద్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఒక నియంత్రణ మండలిగా వ్యవహరించారని పేర్కొన్నది - గ్రాన్‌విల్ ఆస్టిన్
10. భారా రాజ్యాంగ పరిషత్ భారత ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల వ్యక్తీకరణకు ఒక అడ్డంకిగా మారింది - జయప్రకాశ్ నారాయణ్



వి.చైతన్యదేవ్
సీనియర్ ఫ్యాకల్టీ

లిటిల్స్




మీకు తెలుసా?

- ఈ చిన్న పక్షిని 'వైట్ బ్రోడ్ టిట్ వార్బలర్' అని పిలుస్తారు.
- పది సెం.మీ. పొడవు ఉంటుంది. కేవలం 8 గ్రాముల బరువుండే బుల్లి పక్షి ఇది. తోక ముడిస్తే బంతిలా కనపడుతుంది. మగపక్షినే కలర్‌ఫుల్‌గా ఉంటుంది. ఆడ పక్షి మాత్రం పిచ్చుక రంగులో ఉంటుంది.
- లేత పింక్, గ్రే, కొంచెం తెలుపు ఉండే ఈ పక్షి జాడను 1873లో కనుగొన్నారు.
- ఇవి మనదేశంలోని హిమాలయాలతో పాటు తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, కజకిస్తాన్, పాకిస్తాన్, నేపాల్, చైనాలో మాత్రమే ఉంటాయి.
- ఒక్కో గుంపులో కనీసం ఇరవై ఐదు పక్షులు ఉంటాయి.
- ఇవి నాలుగు నుంచి తొమ్మిది గుడ్లు పెడతాయి. ఇరవై ఒక్క రోజులు పొదుగుతాయి.
- ఈ పక్షులు పురుగులు, సాలె పురుగులను మాత్రమే తింటాయి.
- విచిత్రంగా ఆడపక్షి గుడ్లు పెట్టాక.. ఇతర ఆడపక్షులు అదే గూటిలోకి వస్తాయి. ఒక పక్షి గూటిలో పొదిగిన తర్వాత మరో పక్షి ఆహారం కోసం వెళ్తుంది.




- ఈ పక్షిని చేతిలోకి తీసుకుంటే కాటన్‌బాల్ పట్టుకున్నట్లు ఉంటుంది.
- వీటి జీవనకాలం కేవలం నాలుగేళ్లు.

ఏవి ఎన్ని?



10 తేడాలను గుర్తించండి





దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 236

			8		1			7
6	5							
		8				4	9	
	3				9	2		5
	9	6	2		5	1	3	
2		5	4				8	
	6	4				3		
							5	9
9			5		2			

సుడోకు - 235 సమాధానం

4	9	3	1	7	8	5	2	6
1	7	2	6	5	4	8	9	3
5	6	8	3	2	9	4	1	7
2	3	9	5	8	6	1	7	4
7	4	6	2	1	3	9	8	5
8	5	1	4	9	7	6	3	2
3	2	5	9	6	1	7	4	8
9	8	4	7	3	5	2	6	1
6	1	7	8	4	2	3	5	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.